C

SW425

మనకష్టమంచి

PRESENTED BY
Justice Avula Sambasiva Rao

సంపాదకులు
కొల్లూరి కోటేశ్వరరావు

5104

తెలుగు విద్యార్థి ప్రచురణలు
మచిలీపట్నం

తెలుగు విద్యార్థి ప్రచురణలు

ప్రథమముద్రణ 1983

ముద్రణ :

చంద్రకళా ప్రెస్

మచిలీపట్నం

వెల: రు. 30

NRRBOIB178

5425

ప్రస్తావన

బ్రిటిష్ వారి పాలనలో ఆంధ్రులకొక ప్రత్యేకతంటూ వుండేదికాదు. వారు ముద్రాసీలుగానే పరిగణింపబడేవారు. ఆంధ్రత్వ మన్నివిధాల అలక్ష్యం చేయబడింది. అణగద్రొక్కబడింది. అందుకొనాడు ఆంధ్రులందరు తమ గౌరవాస్పదమైన ఉనికి కొరకు తపించిపోయారు ఆనాటి మన పెద్ద తలలన్నీ ఏకమై ఆంధ్రోద్యమం నిర్వహించి ఆంధ్రుల ప్రతిష్ఠను నిలబెట్టాయి. మన ప్రస్తుత స్థితి ఆ ప్రతిష్ఠ తెచ్చిన పరువమే గదా!

ఆంధ్రోద్యమం ఆరంభింపబడిన దశాబ్దం నాటికే ఆంధ్రుల వ్యక్తిత్వాని కొక ఆమోద ముద్ర లభించింది. అదే ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంధ్ర విశ్వవిద్యాలయమనే మొక్క పెరిగి పెద్దదై పూవు పూసి పిందె వేసేవరకు విత్తు, నారు, నీరు, ఎరువు అన్నీ సమకూర్చి పెట్టింది డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి గారే. ఇది చరిత్రలో దాచినా దాగని సత్యం ఈ దృష్ట్యా మన కట్టమంచి నిజంగా కారణజన్ముడు. ఈ కారణజన్మునికి మూడు సంవత్సరాల పూర్వం ఆరుకోట్ల ఆంధ్రులు శతవార్షికాన్ని పర్వహించి నీరాజనాలనర్పించారు ఆ నీరాజనాలనతిర బద్ధంచేసి ధన్యత దక్కించుకొనాలని సంకల్పించింది 'తెలుగు విద్యార్థి'.

నిజంగా రామలింగారెడ్డిగారి జీవితం వ్యక్తిత్వ నిర్మాణంలో యువ జనుల కొక చక్కని పాఠ్యం. ఆ పాఠ్యాన్ని పాఠకుల కందివాటులో నుండేట్లు సమకూర్చిపెట్టడమే ఈ 'పరిచయ గ్రంథం' తలపెట్టిన ఎని. దీని లోని రచయితలందరు దాదాపు రాజకీయ-సాహిత్య-విద్యారంగాలలో పేరు ప్రఖ్యాతులార్జించిన ప్రముఖులే. అందులోను అధిక భాగం డాక్టర్ రెడ్డిగారికి సమకాలికులు, సహోద్యోగులు, సహజీవులు, రాజకీయ-విద్యారంగాలలో ఆయన వేసిన ప్రతి అడుగును శ్రద్ధతో గమనిస్తూ, ఆయన తీసికొన్న ప్రతి నిర్ణయాన్ని ఆకళి పుచ్చుకొంటూ ఆయా విషయాలలో ఎంతో స్ఫూర్తినిపొందిన మేధావులు. వీరందరు రెడ్డిగారితో తమకున్న అనుభవాలను అతిశయోక్తులకు

లోనుగా ఉండా తెలియజెప్పారు; అనేక సందర్భంలో పీరాయనతో సహకరించడమే కాక విభేదించే అవకాశం కూడ పొందగలిగిన విద్యార్థినులవడం విశేషం. కనుకనే ఈ పరిచయ గ్రంథానికి ప్రామాణికత అధికంగా సిద్ధించ గలగవచ్చు.

ఈ గ్రంథంలోని మొదటి 20 వ్యాసాలు రెడ్డిగారి వ్యక్తిత్వ విశేషాలను తెలియ జెప్పేవిగాను, చివరి 11 వ్యాసాలు ఆ వ్యక్తిత్వంతోపాటు కృతిత్వాన్ని పరిచయం చేస్తూ రెడ్డిగారి కవితాప్రతిభను, ఆయన రచనలలో దాగివున్న సాహిత్యపు విలువలను చర్చించేవిగాను విభజింపబడినాయి.

మేము కోరిన వెంటనే తమ అమూల్య కాలాన్ని వెచ్చించి వ్యాసాలు వ్రాసి పంపిన పెద్దలందరు యీ మహత్కార్యంలో భాగస్వాములే కదా. వారందరికి ప్రప్రథమంగా ధన్యవాదాలు చెప్పుకొనఁలసిన బాధ్యత మాపై వుంది. పీరితోపాటు కొందరి వ్యాసాలను తమ 'శత వార్షిక విశేష సంచిక' నుండి పునర్ముద్రణ కనుమతి నొవంగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం వారికి కూడ మా కృతజ్ఞతలు తెలియజేసికొంటున్నాం.

ఈ గ్రంథాన్ని ఆద్యంతం సమగ్ర పరిశీలన జరిపి అవసరమైన మార్పులతో, చేర్పులతో ప్రచురణకుపయుక్తమైన రీతిలో తీర్చిదిద్దేందుకు డాక్టర్ చలసాని సుబ్బారావుగారు విశేషించి శ్రద్ధతీసికొనడం ముదావహం. ఈ సహకారానికి ఆయనెంతగానో అభినందనీయులు. గ్రంథాన్ని అందంగా అచ్చు వేయడంలో శ్రమించిన చంద్రకళా ప్రెస్ అధినేత శ్రీ ఐ. వెంకటేశ్వర రావుగారికి, తదితర కళాకారులకు, కార్యకర్తలకు మా కృతజ్ఞతలు.

యువజనులు, విద్యార్థులు ఈ గ్రంథాన్ని పఠించి తమనుతాము సమర్థవంతులుగాను, సాహసోపేతులుగాను రూపొందించుకొని, జాతి నిర్మాణంలో భాగస్వామ్యాన్ని పంచుకొనేందుకు వలసిన ప్రేరణ పొందగలిగితే ఈ పరిచయాత్మక సంకలన గ్రంథోద్దేశ్యం నెరవేరినట్లే ఇదే మా ఆశ.

—సంపాదకులు

అనుక్రమణిక

1. మరపురాని మధుర స్మృతులు	—శ్రీ కె. వి. గోపాలస్వామి	1-21
2. ఆయనొక మహామనీషి	—ప్రొ. కె. ఆర్. శ్రీనివాస అయ్యంగార్	22-33
3. ఉదారచరితుడు	—ప్రొ. వి ముత్తుస్వామి	34-43
4. పరిణత ప్రజ్ఞా సంపన్నుడు	—ఆచార్య యస్.జి.రంగా	44-60
5. అఖండమేధావి : ఆంధ్ర విశ్వవిద్యాలయ నిర్మాత	—శ్రీ యం. ఏ. అప్పారావు	61-62
6. విజంగా ధన్యజీవి డా. రెడ్డి	—శ్రీ ఎ ఎల్. పాండ్య	63-70
7. అన్ని విధాల అయన శ్లాఘనీయుడు	—శ్రీ ఎం. హిదయతుల్లా	71-76
8. సాహసి నంఘ సంస్కర్తాభిలాషి	—జస్టిస్ శ్రీ ఆవుల సాంబశివరావు	77-81
9. సర్వతంత్రస్వతంత్రుడే కాని వివాదాస్పదుడు	—శ్రీ వంగరంగి రాజేశ్వరరావు	82-92
10. ఆ విశాల హృదయాన్ని మరువలేను	—ప్రొ వి. కె ఆర్ వి. రావు	93-94
11. స్వజనశీలుడు ఆలోచనాపరుడు	—డా. బెజవాడ గోపాలరెడ్డి	95-97
12. నేనెరిగిన రామలింగారెడ్డి	—ఆచార్య ఎం వెంకటరంగయ్య	98-105
13. మరపురాని మహనీయుడు	—ప్రొ. జి సుందరంరెడ్డి	106-109
14. పరిపాలనా దక్షుడు డాక్టర్ రెడ్డి	—శ్రీ వి. రామచంద్రన్	110-114
15. కాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు	—శ్రీ టి. పురుషోత్తం	115-118
16 ఓటమి నెఱుగని విద్యార్థి	—శ్రీ అట్లూరి పురిషోత్తం	119-125
17. రెడ్డిగారి సమయస్ఫూర్తి : సద్యోహాస్యం	—డా. డి. ఆంజనేయులు	126-133
18. డా. రెడ్డిగారితో నా పరిచయం	—ఆచార్య గంటి జోగి సోమయాజి	134-140

19. వరవైద్య ప్రిన్సిపాల్ డాక్టర్ పి. ఆర్. రెడ్డి	—ప్రొ. ఎ. సీతారామయ్య	141-150
20. కట్టమంచి-వల్లి వేదు సుహృచిత దాంధవ్యం	—శ్రీమతి వల్లి వేదు పర్యాంత	151-154
21. విజ్ఞత వీరవి రసజ్ఞత రెడ్డిగారి విశిష్టత	— డా. చంపావి సుబ్బారావు	155-167
22. రెడ్డిగారి ఆంగ్ల రచనా వైదుష్యం	—డా. యస్. సంజీవదేవ్	168-178
23. సాహితీ విప్లవ జోడులకు పెట్టవికోట	—పండిత గొల్లపాటి వెంకట సుబ్బయ్య	171-184
24. విలక్షణ విద్యాపారంగతుడు విదగ్ధ వాఙ్మయ విమర్శకుడు	—ప్రొ.యస్వీ జోగారావు	185-188
25. డా. రెడ్డిగారి సారస్వత ప్రతిభ	—ప్రొ. దివాకర్ల వెంకటావధాని	189-195
26 కట్టమంచివారి హాస్యధోరణి	—డా. కె వాసుదేవరావు	196-198
27. కట్టమంచివారి వేమన ప్రతిష్ఠ	— శ్రీ పోమనుందర్	199-205
28. మునలమ్మ మరణం	—శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	206-222



స్నాతకోత్సవ దుస్తులలో డాక్టర్ సి. ఆర్. రెడ్డి

మరపురాని మధుర స్మృతులు

శ్రీ కె. వి. గోపాలస్వామి

రామలింగారెడ్డిగారి పేరు వినగానే మనస్సులో ఎన్నో మధుర న్మృతులు ముంచుకొస్తాయి. కారణం నాకాయనతో సంవత్సరాల వర్యంతం సాహచర్యముంది, ఎన్నో సందర్భాలలో మేముభయులం కలసి వనిచేశాం, కలసి జీవించాం, ఆయనను గురించి చెప్పాలన్నా వ్రాయాలన్నా ఎంతో కాలాన్ని వ్యయవరచవలసి వుంటుంది.

డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి 1880 డిశంబరు 10వ తేదీన జన్మించి 70 సంవత్సరాల చరితార్థ జీవితంగడపి 1951 ఫిబ్రవరి 24వ తేదీన కన్ను మూశారు. ఆయన ఆభిజాత్యం, విద్య, పరిసరాలు ఆయన జీవికాన్ని సువ్యవస్థితం చేశాయి. ధనిక కర్షక కుటుంబంలో జన్మించటంచేత ఆయనకు, ఆయన తమ్మునికి చక్కని విద్యా బుద్ధులు అబ్బాయి. ఆయన అన్నగారు వ్యవసాయవనులు చూస్తూ వుండేవాడు. శ్రీ రెడ్డి మహామేధావి. ఉన్నత విద్యాదిశలో చిత్తూరులోని ఆయన ఉపాద్యాయులు ఆయన్ను ఎంతో అభిమానించేవారు. ఇక మద్రాస్ క్రిష్టియన్ కళాశాలలో డాక్టర్ మిల్లర్, డాక్టర్ స్కిన్నర్ వంటి ప్రతిభావంతులైన ఆచార్యుల ప్రోత్సాహం ఆయనకు యెంతగానో లభించినది. తన కార్మిక ప్రతిభకారణంగా ఆయన అచటి విద్యార్థులకు నాయకుడయ్యాడు.

అనంతరం ఆయనకు భారత ప్రభుత్వంవారి అఖిల భారతీయ విద్యార్థి వేతనం లభించింది. దాంతో ఆయన కేంబ్రిడ్జి వెళ్ళి సెంట్ జాన్స్ కాలేజీలో చేరాడు. ఆయన భవిష్యజ్జీవితానికి ఆ విద్యాలయమే చక్కని రూపురేఖలు దిద్దింది. అదే కళాశాలలో రెడ్డిగారి సమకాలికుడు, కవి, విమర్శకుడు అయిన సర్ జాన్

కాలింగ్స్ సైక్వర్ శ్రీ రెడ్డిని గూర్చి ప్రస్తావిస్తూ "కేంబ్రిడ్జిలో శ్రీ రెడ్డికి బర్క్ మేధావిత్వం వక్తృత్వం లభించాయి" అన్నాడు. అందుచేత ఆయన అక్కడి 'లిబరల్ క్లబ్'కు కార్యదర్శియై క్రమంగా కేంబ్రిడ్జి యూనియన్‌కు ఉపాధ్యక్షుడుగా, ఎన్ను కోబడడంలో ఆశ్చర్యమేమీలేదు. అయితే కేంబ్రిడ్జిలో శ్వేతజాతీయుల్లోనున్న వర్ణ విచక్షణ కారణంగా 1907లో ఆయన ఆ యూనియన్‌కు అధ్యక్షుడు కాలేకపోయారు.

అమెరికా సంయుక్తరాష్ట్రాల్లో పర్యటించి ఆయన భారతదేశం తిరిగిరాగానే బరోడా మహారాజువారి కళాశాలల్లో శ్రీ అరవిందఘోష్ రాజీనామావల్ల యేర్పడ్డ ఖాళీలో 1908లో ఆయన ఆచార్యులుగా నియుక్తులయ్యారు. ఆక్కడ కొద్దికాలం మాత్రమేవుండి మైసూరు వచ్చారు. అనంతరం ప్రపంచ పర్యటన చేసి తిరిగి వచ్చిన తర్వాత మైసూరులో మహారాజా కళాశాల ప్రధానాచార్య పదవి స్వీకరించాడు. రెండు సంవత్సరాల్లో ఆయన ఇంకా 40 యేండ్లయినా నిండకమునుపే Inspector General of Education అయ్యాడు. కాని యెందుచేతనో 1921లో ఆయన ఆ పదవి వదిలేశాడు.

అనంతరం అయిదు సంవత్సరాలపాటు రాజకీయాల్లో పాల్గొని 1926లో తిరిగి ఆయన విద్యారంగంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ ఫౌండేషన్ వైస్‌ఛాన్సలర్‌గా అడుగుపెట్టారు. కాని 1931లో ఆ పదవికి రాజీనామాచేసి తిరిగి రాజకీయాల్లో పాల్గొన్నారు. అయితే 1936లో ఆయన మళ్ళీ ఆంధ్రా యూనివర్సిటీ ఉపాధ్యక్షులుగా ఎన్నికై ఆ పదవిలో 1949 దాకా కొనసాగి అనంతరం మైసూరు ప్రోఛాన్సలర్‌గా వెళ్ళి మరణ వర్యంతం అక్కడే వున్నారు.

విద్యావేత్తగా ఆయన జీవితం మిక్కిలి గణనీయమైనది. బరోడాలోనూ, మైసూరులోనూ ఆయన చరిత్ర, రాజనీతి శాస్త్రం, ఆర్థిక శాస్త్రం బోధించడంలో అసాధారణమైన ప్రజ్ఞను ప్రదర్శించాడు. విషయాన్ని విశ్లేషించి విద్యార్థులకు బోధించడంలో ఆయనకు ఆయవేసాటి. కాని ఆచార్యుడుగాకాక, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా, వైస్‌ఛాన్సలర్‌గా, ప్రోఛాన్సలరుగా సాటిలేని అధికార నిర్వహణ దక్షుడుగా ఆయన అందరి స్మృతిపథంలోనూ యెక్కువగా మెలుగుతూ వుంటాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రూపురేఖలు తీర్చిదిద్దినవాడు శ్రీ రెడ్డి. యూనివర్సిటీ చట్టాన్ని రూపొందించింది ఆయనే. యూనివర్సిటీకి నామకరణం

చేసిందికూడా ఆయనే. శాసనసభలో యూనివర్శిటీపేరు విషయంలో కొంత వాగ్వివాదం జరిగింది. దాన్ని "తెలుగు యూనివర్శిటీ" అనాలని శ్రీ కూర్మా వెంకటరెడ్డి నాయుడు ఒక సవరణ తెచ్చాడు. కాని శ్రీ రెడ్డి "ఆంధ్ర విశ్వవిద్యాలయం" అనే పేరునే చరిత్ర కాధారాలతో సమర్థించాడు. కాని ఈ విషయంలో వాల్తేరులో తన చివరి రోజులలో శ్రీ రెడ్డికి పునరాలోచన కలుగకపోలేదు.

ఆంధ్రా యూనివర్శిటీ చట్టంలోని ఒక సెక్షను ప్రకారం రిజిష్ట్రారును ఎన్నుకోవాలి. మొత్తం బ్రిటిష్ కామన్‌వెల్తులో ఒక ఆంధ్రాలోనే రిజిష్ట్రారును ఎన్నుకునే పద్ధతి వుంది. ఇలా రిజిష్ట్రారును ఎన్నుకునే పద్ధతి ఎందుకు ప్రవేశపెట్టారని ప్రశ్నిస్తే శ్రీ రెడ్డి "ఇంగ్లండులోను, ఐర్లండులోను వున్న ద్వితీయశ్రేణి మేధావులతో ఇతర యూనివర్శిటీలులాగా ఆంధ్రాను కూడా నింపకుండా నిరోధించడానికి ఎన్నిక అనారు. తొలి రిజిష్ట్రారు శ్రీ సి. డి. యస్. చెట్టి ఆక్సుఫర్డులో వున్నారు. అయనకు బోధనా డిప్లమాకూడా వుంది. ఆయన 1931లో తిరిగి ఎన్నికై 1937 దాకా ఆ పదవిలో కొనసాగారు. 1939లో రిజిష్ట్రారుగా ఎన్నికైన శ్రీ వి. యస్. కృష్ణ కేంబ్రిడ్జి యూనివర్శిటీ ఆనర్సు గ్రాడ్యుయేటు. కాని ఆయన 1942లో తన పదవీకాలం ఇంకా రెండేళ్ళు పైచిలుకు వుండగానే ఆ పదవికి తిలోదకాలిచ్చి ఆచార్యపదవిని చేవట్టారు. 1942లో యీ విధంగా రిజిష్ట్రారు పదవి ఖాళీ అయినపుడు దానికి అదనంగా లా డిగ్రీని జోడించారు. కాని బార్‌లో అనుభవం లేని "లా" డిగ్రీ రిజిష్ట్రారు పదవికి నిరర్థకం. అనుభవం వున్న నావంటివాణ్ణి ఎనుకున్నా అదికూడా నిరుపయోగంగానే పరిణమించింది. ఫలితంగా ఆ ఎన్నిక విధానమే రద్దయిపోయింది. అయినా శ్రీ రెడ్డికి నాకూ మధ్యగల సంబధం మాత్రం సమరసంగానే వుంది.

1945లో శ్రీ పి. వి. రాజమన్నార్, శ్రీ వి. గోవిందరాజాచారి వంటి గొప్ప న్యాయశాస్త్రవేత్తలు సభ్యులుగాగల అపాయింట్‌మెంట్సు కమిటీ, నా ధరఖాస్తు లేకుండానే నన్ను ప్రొఫెసర్‌గా అపాయంట్ చేసినపుడు నేను వెంటనే అంగీకరించాను. శ్రీ రెడ్డి తెల్లబోయారు. ఆరోజు సాయంత్రం శ్రీ రెడ్డి ఇలా అన్నట్లు నా మిత్రులొకరన్నారు- "నేను నా చివరిరోజులు ఒక రిజిష్ట్రారు తర్వాత ఒకరికి ట్రయినింగ్ యిస్తూ గడపాలన్నమాట. పోనీ అలా చేసినా వారు ఏమాత్రం అవకాశం వచ్చినా తిరిగి ఆచార్య పదవినే వరిస్తారయ్యే". అందుకు నేను నా

మిత్రునితో నవ్వులాటకు ఏ రిజిష్టారుకైనా పదవీ స్వీకారం చేసిన మూడేళ్ళలోగా పిచ్చాసుపత్రిలో చేరవలసిన గతివట్టకుండా వుంటే ఆయనకు వైస్‌ఛాన్సలర్ ఎన్నికలో ఓటుచేసే అధికారంతో ఆచార్యపదవి చేపట్టే అవకాశం కల్పించవలసిందనీన్నీ, అలా అయితే ఆయన తన తుది జీవితంఅంతా పిచ్చెత్తేదాకా ఒక రిజిష్ట్రారు తర్వాత మరో రిజిష్ట్రారును వేధిస్తూ గడవవచ్చునని "శ్రీ రెడ్డికి చెప్పమని అన్నాను అయితే శ్రీ రెడ్డి నా యీ మాటలు హర్షించలేదనుకోండి"

కాని ఆ మరురోజున నేను ఇష్టంలేకపోయినా రిజిష్ట్రారుగానే నిశ్చయించుకున్నానని చెప్పినపుడు ఆయన నన్ను అభినందిస్తూ "అయితే ఇక నాకు రాబోయే రిజిష్ట్రార్లకు ట్రయినింగ్ యిచ్చుబాధ తప్పిందన్నమాట" అన్నారు. నేను గదిలో నుండి బయటకు వచ్చేటప్పటికి అక్కడ అనంతరం అపాయింట్ కానున్న అభ్యర్థి పిలుపుకోసం ఎదురుచూస్తున్నాడు. ఎదిరి మనోభావాలను బాగా సమర్థవంతంగా వినియోగించుకొనడం శ్రీ రెడ్డికి బాగా తెలుసు.

ఒక సంస్థయొక్క తొలిదశలో పటిష్టమైన పునాదులు పడడం అవసరమని శ్రీ రెడ్డికి తెలుసు. కనుక నన్ను లాకు ఫౌండేషన్ ప్రొఫెసర్‌గా వేస్తే కాలేజీ నా అనంతరం మరొకరిచేతిలో పెట్టినా సరిగా నడిచిపోతుందని ఆయనకు బాగాతెలుసు.

కేంబ్రిడ్జి హిస్టరీ ఆనర్సు ఆయనకు లభించిన ప్రథమ శ్రేణి ఆయన తన జీవితాన్ని విద్యారంగానికి అంకితం చేసుకొనడానికి కారణమైంది. కేంబ్రిడ్జి యూనియన్‌లో ఆయన సాధించిన అద్భుత విజయం ఆయన పార్లమెంటరీ నాయకత్వానికి బాటలు వేసింది. ఆయన మెలగిన సాంఘిక వాతావరణం జీవితంలో ఉత్తమ కార్యాచరణకు అభిరుచిని కల్పించింది. ఇండియా రాకముందు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఆయన చేసిన పర్యటన, పశ్చిమ యూరప్ : యు. ఎస్. ఎ, కెనడా, జపాన్, చైనా, ఫిలిప్పైన్సు, మలయా మొదలైన దేశాలుకూడా పర్యటించాలనే కోరికను ప్రవృద్ధంచేసింది. బరోడా మహారాజావారి కాలేజీలో శ్రీ అరవింద ఘోష్ స్థానే వైస్ ప్రిన్సిపాల్‌గా ఆయనకు లభించిన తొలి పదవి ఆయన జీవితానికి వన్నెతెచ్చిన విద్యారంగంలో ఆయనకు తొలి శిక్షణ యిచ్చింది. మైసూరు 'మహారాజా కాలేజి ప్రిన్సిపాల్ పదవి, ఇన్‌స్పెక్టర్-జనరల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా ఆయన చేసిన విశిష్టసేవ. ఆ రంగంలో ఆయన ప్రతిభను స్థిరీకృతంచేశాయి.

మైసూరు స్టేటులో నిర్బంధ ప్రాథమిక విద్యావిధానాన్ని ప్రవేశ పెట్టడం మూలంగా అస్పృశ్యులకు కూడా సెంకడరీ విద్యాలయాల్లో ప్రవేశం లభించటం అచట అగ్రవర్ణాల వారికి ఆగ్రహకారణ మైందనిన్నీ, అంచేతనే ఆయన విసుగెత్తి ఆ సంస్థానాన్ని వదలి వచ్చారని సామాన్యంగా అందరి నమ్మకం. కాని వాస్తవంగా ఆయన సంస్థానాన్ని విడిచి రావడానికి కారణం అదికాదు. కులీన బెంగాలీ బ్రాహ్మణుడైన ఆ సంస్థాన దివాన్‌కు, ఆయనకు మరో విషయం మీద వచ్చిన తగదా ఆయన నిర్గమనానికి కారణభూతమైంది. సంస్థానాధీశుణ్ణి తన గుప్పెట్లో పెట్టుకొని ఒక మహోన్నత పదవి నుండి తనను తొలగించిన ఆ సివిల్ సర్వెంట్ నుండి శ్రీ రెడ్డి గుణపాఠమేదీ నేర్చుకోలేక పోయారు. 1920లో మైసూరులో తన తుది రోజుల్లోని విషాదస్మృతులు తన జీవితం తుది రోజుల్లో అంటే 1949లో తాను తిరిగి మైసూరు వెళ్ళాలనే బెంగను తొక్కివేయలేక పోయాయి.

శ్రీ రెడ్డి జస్టిస్ పార్టీలోచేరిన ఘడియ మంచిది కాదు. ఆ పార్టీ నుండి ఆయన నిష్క్రమణం కూడా ప్రతిష్ట హేతుకం కాదు.

సాంఘిక న్యాయం కోసం డాక్టర్ టి యం. నాయర్ యిచ్చిన వేణునాదం లాంటి తియ్యని పిలుపు శ్రీ రెడ్డిని నిస్సంశయంగా ఆకర్షించిన మాట నిజం. కాని డాక్టర్ నాయర్ 1919 జులైలో లండన్‌లో చనిపోయాడు. 1920 డిసెంబరు 18వ తేదీన జస్టిస్‌పార్టి అధికారం ఉపగ్రహాలు చేపట్టినప్పుడు అప్పటి పార్టీ నాయకుడు పి. త్యాగరాయచెట్టి, తాను లెజిస్లేటివ్ కౌన్సిల్లో పార్టీ నాయకుడుగానే వుండిపోయి ఏస్. సుబ్బారాయులురెడ్డియార్‌ను మొదటి మంత్రిగా సి. రామారాయణింగార్‌ను రెండవ మంత్రిగా కె. వి. రెడ్డినాయుణ్ణి మూడవ మంత్రిగా నియోగించాడు. ఇంకా లెజిస్లేచర్‌లో అడుగు పెట్టని శ్రీ సి. ఆర్. రెడ్డి చిత్తూరు జిల్లాబోర్డు అధ్యక్షుడు కావాలనుకున్నాడు. కాని ముఖ్యమంత్రి తన చెప్పుచేతల్లో విశ్వాసపాత్రంగా వుండే బి. మునిస్వామి నాయుడికి ఆ పదవిని కట్టబెట్టాడు.

1923లో రెండవ దఫా ఎన్నికలు జరిగినపుడు శ్రీ రెడ్డి కౌన్సిలుకు ఎన్నికయ్యారు. కాని పునర్నూతనమైన జస్టిస్ పార్టీ రెండవ మంత్రివర్గంలో కె. వి. రెడ్డి నాయుడును తగ్గించి ఆ స్థానంలో రిటైర్డు డిప్యూటీ కలెక్టరు శివజ్ఞానంపిళ్లైను తీసుకున్నారుగాని శ్రీ రెడ్డికి స్థానం కల్పించలేదు. ఈ మంత్రి వర్గానికి శ్రీ రెడ్డి 'ఈకలు

పెరికిన వక్షులు' అని ఓ వెక్కిరింపు పేరు పెట్టారు. అందులో మూడో మంత్రిని 'పాడే పిట్టకాదు ఎగిరే పిట్టకాదు' అని హేళన చేశారు.

నామినేటెడ్ మెంబరును ప్రభుత్వపు మనుష్యులుగా చిత్రిస్తూ ఆయన వ్యంగ్యంగా మాట్లాడటంవల్ల ఆ తర్వాత ఆయన ప్రభుత్వం మీద తెచ్చిన అవిశ్వాస తీర్మానము వీగిపోయింది.

ఒకసారి డాక్టర్ రెడ్డి "నేను ఈ దేశపు'వాల్‌టైర్'ని కావాలని నా ఆకాంక్ష. కాని నేను విఫలమయ్యే మాట భాయం. అయినా అది యత్నించదగ్గ విషయం." అన్నాడు 'వాల్‌టైయిర్' 18వ శతాబ్దపు మహామేధావి. పిచ్చినమ్మకాలు హాస్యాస్పదాలని, ఆత్మ విశ్వాసం అనేది అర్థరహితమని, మూఢభక్తి బుద్ధివిహీనత అనీ, దమననీతి అప్రతిష్ఠకరమని, మూడు తరాలవారికి బోధించినవాడతడు. అనేక విషయాల్లో డాక్టర్ రెడ్డి 'వాల్‌టెయిర్' వంటివాడే. ప్రెంచి విప్లవ నాయకుడులాగా శ్రీ రెడ్డి వ్యంగ్య వాక్చతురుడేకాని హేతువుకు నిలబడే వేదాంతి కాదు - నిర్మాణాత్మకమైన శక్తిసామర్థ్యాలు కలవాడూ కాదు.

వాల్‌టెయిర్ లాగా గడించడానికి శ్రీ రెడ్డి మహాకావ్యాలుగాని నాటకాలుగాని ఏమీ వ్రాయలేదు. వాల్‌టెయిర్‌ను అనుకరిస్తూ ఆయన అడపా తడపా వ్రాసిన కవితలు ఆయన సమకాలీన మెప్పు పొందినమాట నిజం. ముఖ్యంగా కనుమూసిన తన స్వప్న సుందరికి అంకిత మిచ్చిన ఆయన 'అర్థశాస్త్రం', 'ముసలమ్మ మరణం' అనే కావ్యం ఆయనకు గొప్ప రచయితగా కవిగా పేరు తెచ్చిపెట్టాయి. వాల్‌టైర్ చారిత్రిక రచనలు ప్రెంచి గద్యకు మచ్చుతునకలుగా నిలిచిపోగా శ్రీరెడ్డి వివిధ విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవాల్లోఇచ్చిన మహోపన్యాసాలు ఆయన వక్తృత్వానికి చక్కని నమూనాలుగా నిలబడ్డాయి. డాక్టర్ వాల్‌టైర్ లాగావే శ్రీ రెడ్డి అగ్రశ్రేణికి చెందిన గొప్ప విమర్శకుడు, ఆయన "కవిత్వతత్త్వవిచారం"తెలుగులో తొలిసాహిత్య విమర్శ గ్రంధం. ఆయన సంభాషణ హాస్యభరితంగావుంటుంది. వాల్‌ట్రైర్ లాగానే అంతులేని ఆయన ఉత్తరప్రత్యుత్తరాలు ఆయనస్వభావ సారళ్యానికి, నిష్కపట్యానికి స్మృతిచిహ్నాలు, మద్రాసు రాష్ట్రంలో అందరినోటా ఆయనహాస్యోక్తులు, వ్యంగ్యోక్తులు వక్రోక్తులు ఈ నాడుకూడా వింటూ వుంటాం. వాలెట్రైర్ రాజనీతి సూక్తులుగాని, వేదాంత భాష్యాలుగాని సభ్య ప్రపంచం యొక్క ఆలోచనా ధోరణిని మార్చివేశాయి.

కాని శ్రీ రెడ్డి రాజకీయాలోచనభారతీయ ప్రజా జీవితాన్ని ఆయన కాలంలోనే ప్రభావితం చేయలేకపోయింది. రాజకీయ రంగంలోఆయన విసిరిన వ్యంగ్యోక్తులు ఆయనకే ఘోరంగా ఎదురయ్యాయి.

1921 సెప్టెంబరు 1వ తేదీన మహాత్మాగాంధి భారతదేశానికి 1922 సెప్టెంబరు 1వ తేదీన స్వరాజ్యం లభిస్తుందన్నారు. దీనికి సమాధానంగా శ్రీ రెడ్డి "మహాత్ముడు ఒక కొద్దిపాటి తప్పుడు జోస్యం చెప్పలా? తప్పకుండా ఆయన భావం ఏప్రిల్ ఒకటి అయి వుంటుంది" అన్నాడు. ఈ మాటలు వినగానే మద్రాసు వై. యం. సి. హాలులో విద్యార్థులంతా పిరగబడి నవ్వారు. ఎందుకంటే ఏప్రిల్ ఒకటి అనగా "ఆల్‌ఫూల్స్ డే" అని వారికి తెలుసు. 1937 ఏప్రిల్ 1వ తేదీన మా నాన్నగారి మంత్రివర్గ పదవీ స్వీకారం చేసినప్పుడు కూడా ఆయన అదే హాస్యం విసిరాడు. తానుకూడా అదేరోజున (అనగా ఒకటి ఏప్రిల్ తేదీన) లెజిస్లేచరుకు నామినేట్ చేయబడడం సవినయంగా గుర్తుకుతెచ్చాను. నేనూ అదేరోజున రిజిస్ట్రారుగా చేరానని కూడా ఆయన దృష్టికి తెచ్చాను. కాని కొద్ది కాలంలోనే నేను ఆ పదవి చేపట్టడం తెలివి తక్కువ పని అని గ్రహించాను.

1922లో గాంధీగారి రాట్నాన్ని గూర్చి మాట్లాడుతూ "ఆధునిక ఆయుధాలను మనం రాతియుగపు ఆయుధాలతో ఎదుర్కోలేం" అన్నాడు.

1924లో ఎగ్మూరులో ఉపన్యసిస్తున్నప్పుడు, వేదికమీద రాళ్ళుపడగా ఆయన "జస్టిస్ పార్టీ రాతియుగంలో తిరిగి అడుగు పెడుతోంది" అని చటుక్కున అన్నారు. వెంటనే ఒక ప్రేక్షకుడు "ఇప్పుడు మీరు కాంగ్రెసులోకి మారారుగనుక రాట్నాన్ని రక్షణాయుధంగాయత్నించిచూడండి" అని ఎదురు సమాధానం చెప్పాడు జస్టిస్ పార్టిలోని ప్రభుభక్తి వరాయణత్వాన్ని గూర్చి "ఆశలు అనుబంధానికి, నిరాశ నిస్సంగానికి దారితీస్తాయి". అని శ్రీ రెడ్డి అన్న మాటలు అందరూ ఎక్కువగా ఉదహరిస్తూ వుంటారు. పానగల్ రాజా శ్రీరెడ్డిని చిత్తూరు జిల్లా బోర్డు ప్రెసిడెంట్‌గా వెయ్యకపోవడం చేతనే శ్రీ రెడ్డి విశ్వాసరాహిత్య తీర్మానాన్ని ప్రతిపాదించాడనిన్నీ ఆయనపై మాటలనడానికి ఇదే దృష్టాంతమనిన్నీ, శ్రీ ఎ. రామస్వామి మొదలియార్ తర్వాత ఒక బహిరంగసభలో నృష్టీకరించారు. మరోసారి, సర్ కె. వి. రెడ్డివాయుడు ఆంధ్రరాష్ట్ర నిర్మాణాన్ని గూర్చి తీసుకొని వచ్చిన తీర్మానంపై శ్రీ రెడ్డి మాట్లాడు

తూండగా శ్రీ రాజాజీ (ఆయన్ను అప్పుడు అందరూ "ప్రధాని" అనేవారు) "నా మిత్రుడు గౌ॥ శ్రీ కె. వి. రెడ్డి నేను తిరిగి లేచి సమాధానం చెప్పాలని కోరుకోడనుకుంటా"నన్నాడు హఠాత్తుగా. శ్రీ రెడ్డి అమాంతంగా లేచి నేను "సర్. కె. వి. రెడ్డిని కాను. అయినా" అని అంటూవుండగానే, రాజాజీ తన తప్పును సరిదిద్దుకునేందుకు ముందుగానే, సర్ కె. వి. రెడ్డి లేచి, సార్వభౌముడికి చేసినట్లు వంగి నమస్కరించి "మీ అభినందనకు నా కృతజ్ఞత" అన్నాడు. కొప్పులు సభ్యులు అప్పుడు తమ ఆనందాన్ని అణచి పెట్టుకోలేకపోయారు. రాజాజీకూడా అమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నారు. శ్రీ రెడ్డి ఎత్తిపొడుపు తాను ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది.

జస్టిస్ పార్టీతో శ్రీ రెడ్డికి ఏర్పడిన కొద్దికాలపు సంబంధంకన్నా కాంగ్రెస్‌తో అయనకుగల అయిదు సంవత్సరాల సంబంధం ఒడుదుడుకులతో గూడినది, చాలా దురదృష్టకరమైనది. ఆయన మహామేధావి. వ్యక్తిత్వంగలవాడు. అంచేత కఠోరంగా వుండే ఏ పార్టీ చట్రంలోనూ ఇమిడేవాడుకాదు. రెండవ దఫా కూడా ఆయన రాజకీయాలతో విసిగిపోయి తిరిగి 1936లో వాల్తేరు వచ్చినపుడు - డాక్టరు రాధాకృష్ణన్‌కు వీడ్కోలు, అయనకు స్వాగతం ఇవ్వడానికి విద్యార్థులు ఏర్పాటు చేసిన సభలో నేను ప్రసంగిస్తూ రాల్ఫువాల్డో ఎమర్సన్ వాసిన "Essay on Self Reliance" నుంచి "వివేచనారహితంగా ఒకే దానిని పట్టుకు వ్రేలాడడం అల్ప బుద్ధులు చేసే పని" అని ఉదహరిస్తూ అయన్ను ప్రశంసించడానికి ప్రయత్నించాను. శ్రీ రెడ్డి తన సమాధానంలో 17వ శతాబ్దపు నాటకకారుడు సర్ ఛార్లెస్ సెడ్లే వ్రాసిన "Reasons of Conistency"లో నుంచి "కేవలం మార్పువల్ల ఏమీ ప్రయోజనం లేనపుడు సత్యసంధుడుగా వుండడం సులభం" అన్నాడు.

12 సంవత్సరాల తర్వాత 1948లో విద్యార్థులు ఏర్పాటు చేసిన మరో సమావేశంలో మేమిద్దరం మాట్లాడుతున్నప్పుడు ఆవడి కాంగ్రెస్ తీర్మానంలోని "పవిత్రత, నిర్దుష్టత" అనే సాంకేతిక పదాలను గూర్చి నేను ముచ్చటించగా శ్రీ రెడ్డి తన ముగ్గింపు మాటల్లో "నేను కాంగ్రేస్‌వారి పవిత్రతను చాలామటుకు చవిచూచాను. ఇక వారి నిర్దుష్టత్వాన్ని కొంతవరకు చూడవలసి వుంది" అన్నారు.

అయన నోటివెంట వచ్చే ఇటువంటి మాటలనుబట్టి డాక్టర్ రెడ్డికి మతిభ్రమణం ఉందనే ఊహ చాలా మందికి కలుగుతుంది. కాని యధార్థానికి అయన

నిష్కపటి. ఏ సభలోనైనా ఆయన లాంటి అధ్యక్షుడు మరొకడు కనబడడు. సెనెట్‌లోగాని ఎకడమిక్ కౌన్సిల్‌లో గాని అందరి అభిప్రాయాలూ వింటారు. కాని వక్తల ఎంపికలోనూ, ఎవరి తర్వాత ఎవరిని మాట్లాడించాలో అనే విషయాన్ని నిర్ణయించడంలోనూ ఆయన ఎంతో వివేచన చూపి తుదకు తన అభీష్టాన్ని నెరవేర్చుకుంటారు. 1938లో సర్వసత్తాక సమన్వితమైన సెనెట్ అధికారాలు కొన్ని కేవలం కార్య నిర్వాహధికారాలు మాత్రమేగల సిండికేటుకు దత్తంచేస్తూ సెనెట్‌లో ఒక చట్టాన్ని ప్రతిపాదించారు. మద్రాసు ప్రభుత్వ అర్థిక కార్యదర్శి, సిండికేటు గౌరవ సభ్యుడు అయిన మిస్టర్ జోన్సును సవరణలు ప్రతిపాదించమని కోరారు. ఇతర సంస్థలెన్నింటినుంచో తగిన ఆధారాలు అనేకం సేకరించి, చేయాలనుకున్న మార్పులకు మంచి కేసు రూపొందించారు జోన్సు. "తీవ్రవాదులు" ఈ ప్రతిపాదనలు వ్యతిరేకిస్తారని, వారు సహజముగా నామీద అధారపడి వుంటారని గ్రహించి శ్రీరెడ్డి తర్వాత నన్ను మాట్లాడమన్నారు. ప్రభుత్వం ప్రతిపాదించే చట్టాన్ని ఎవరూ సెకండు చేయనక్కరలేదని నాకు తెలుసు. అందుచేత అయన నన్ను అందుకు పిలుస్తాడని అనుకోలేదు. కాని నేను లేవడానికి సిద్ధంగా లేకపోయినా పిలిచారు. తర్వాత మాట్లాడటానికి అనుమతించమని నేను కోరాను. కాని సభ్యులు వా అశయం ఏమిటో తెలిసికోవడానికి కుతూహలం పడుతున్నారని చెప్పి నన్ను ఒత్తిడి చేశారు. ప్రసంశతో కూడిన ఆయన ఆహ్వానాన్ని వేను నిర్లక్ష్యం చేయలేకపోయాను. ఆక్సుఫర్డు ఉచ్చారణలో కాకుండా సిసలైన ఆక్సుఫర్డు శైలిలో మాట్లాడడం ప్రారంభించాను. వేను మాట్లాడడం మొదలు పెట్టిన కొద్ది సేపటికి జిల్లాకలెక్టరు మిస్టర్ కుక్ ఏదో హేళన చేసి నా ఉపన్యాసానికి అంతరాయం కల్పించారు. అయినా వేను లక్ష్యపెట్టలేదు. కాని కొంతసేపైన తర్వాత అతడు 'నాన్‌సెన్సు' అని వ్యాఖ్యానించగా వేను సహించలేక "నోర్ముయ్" అన్నాను. జిల్లాలో సార్వభౌమునకు ప్రాతినిధ్యం వహించే కలెక్టరును అలా ఎవరూ ఎదిరించియుండరు. అతడు నావంక చూస్తూ "ఏమన్నావ్?" అన్నాడు. నేను నిబ్బరంగానూ బిగ్గరగానూ "నోర్ముయ్" అన్నాను. మిస్టర్ జోన్సు కొక్కు చెయ్యి పట్టుకొని ఊరుకోమని అంటుండగా విన్నాను. ఈ తీవ్రవాదోపవాదాల పలితంగా సభ నిశ్శబ్దంగ వుండిపోయింది. వైస్ ఛాన్సలర్ జోక్యం కల్పించుకుని పరిస్థితులు సరిదిద్దుతాడేమో అని నేను రెండు నిముషాలపాటు నిరీక్షిస్తూ నిలబడ్డాను. కాని ఆయన ఊరికే "ఉపన్యాసం కొనసాగించండి" అన్నారు. పోలీసు బలగం వెంటలేని ఒక సివిల్ ఉద్యోగితో ఒక పొగరుబోతు

క్రిమినల్ లాయరు దెబ్బలాటకు దిగి రణరంగాన్ని సృష్టించడం శ్రీ రెడ్డికి ఇష్టం లేదవే విషయం స్పష్టం.

వ్యక్తిగత విషయాల్లో అందరితో లాగావే నాతోకూడా ఆయన ఎంతో మర్యాద వుండేవాడు. ఆయన ఇష్టంవచ్చిన ఏ కొద్దిమందితోనో ఆయన కలిసి మెలిసి వుండేవారు. అటువంటి వారిలో వేను కూడా ఒకణ్ణి. అభిరుచి, సామ్యం కలిగి జీవితంలో మంచిని మాత్రమే స్వీకరించి ఆభినందించే వారినే అయన అదరించేవారు.

ఆయన అద్భుతమైన వ్రాయసకాడు. ఆయన తనభావాలను ఎంతో మధుర మైన భాషలో వ్యక్తంచేసేవారు. ఆయన నన్నెంత మెచ్చుకునేవాడో చెప్పడానికి నా భార్య పేర ఆయన వ్రాసిన ఒక ఉత్తరాన్ని ఈ క్రింద వుదహరిస్తున్నాను.

చిత్తూరు
22-6-1945

డియర్ మిసెస్ గోపాలస్వామి,

మీ గోపాల్ మద్రాసులో సిండికేట్ నమావేశమైనప్పుడు తన జీతం కాక అదనంగా కొంత డబ్బు వచ్చే అవకాశమున్న ఆంధ్ర విశ్వవిద్యాలయ లా కళాశాల ప్రొఫెసర్ పదవిని కాలదన్నడంలో మీ గోపాల్ చూపిన ఉదాత్త వైఖరిని గురించి నేను మీకు ఎన్నాళ్ళుగానో వ్రాయాలనుకుంటున్నాను. ఆయన అలాచెయ్యడం అంత సామాన్య విషయం కాదు. ఆయనవంటి నిజాయితీ గల సహోద్యోగి మరెవరూ ఉండరు. బోర్డు అయనకు ఆ పదవిని ఇవ్వజూపినపుడు ఆయన వినమ్రంగా అలాగే అన్నాడు. ఆ రాత్రల్లా ఆయనకు కునుకు పట్టలేదు. నేను వుంటున్న క్లబ్బులోనే వున్నాడు. తాను లా కాలేజికి వెళ్ళడమే నా అభీష్టమైతే మటసీవట్టణం వెళతానని మాల్కొండా రెడ్డితో చెప్పాడు. మర్నాడు ఉదయం 8-30 లకు నన్ను చూచి "మీరు వట్టుపడితే నేను చెప్పలేను కాని నేను ఆ పదవిని ఎందుకు నిరాకరించ కూడదు" అన్నాడు. అయన నిరాకృతికి చెప్పిన కారణాలలో మీకుయిష్టం లేకపోవడం ఒకటి, ఆయన రిజిష్ట్రారుగానే వుండిపోవాలనే మీ నిర్ణయమట. భార్యముందు 'వి. సి.' ఏపాటి? నా హృదయం స్పందించింది. అయన అలా ధైర్యంగా గౌరవ

పురస్సరంగా తన భావాలను వ్యక్తం చేసినందుకు అయన్ను నేను అభినందించాను. మృత్యువు కోసం ఎదురుచూస్తున్న వృద్ధుణ్ణయిన నాకు మీ యిరువురి ప్రవర్తన ఎంతో ఆనందాన్ని చేకూర్చింది. అభినందనములతో

భవదీయుడు

(సం) సి. ఆర్. రెడ్డి

జమ్మూ మహారాజా శ్రీ విక్రమదేవవర్మ ప్రోచాన్సలర్‌గా, డాక్టరు సి. ఆర్. రెడ్డి వైస్ ఛాన్సలర్‌గ వున్న విద్యాలయంలో వారి మహోదాత్త సాంగత్యంలో నేను ఉండడం నా అదృష్టం. వారిద్దరు ఒక దశాబ్దంపాటు కలిసి మెలిసి వున్నారు. కొన్ని సమస్యల మీద ఎవరికుండే స్వతంత్రభావాలు వారికున్నా ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా ఒకరినొకరు ప్రశంసించుకుంటూ వుండేవారు. 1934 లగాయితూ ఏటా మహారాజావారు ఇస్తున్న లక్ష రూపాయిల భూరి విరాళంతో ఆయన పేర పెట్టబడిన సైన్సు విభాగాన్ని చక్కగా తీర్చిదిద్దే అవకాశం కలిగింది. కాని మహారాజావారు తన సుధీర జీవితంలోని తుది రోజుల్లో విరాళాన్ని సక్రమంగాని, పూర్తిగాని ఇవ్వలేకపోయేవారు. కాని వైస్ ఛాన్సలర్ రెడ్డి విశ్వవిద్యాలయం పట్ల తనకున్న ప్రగాఢమైన అభిమానం కొలది, మహారాజావారి దిగజారిన పరిస్థితులను సానుభూతితో గుర్తించకుండా బకాయి విరాళాలు వెంటనే చెల్లించవలసినదిగా ఆయన్ను ఒత్తిడిచేసేవారు. ఒకసారి వారునన్ను శాసిస్తున్నట్లు "మీరు జయపూర్ సంస్థానానికి న్యాయ సలహాదారులు గదా! ఆ వార్షిక విరాళం విధిగా చెల్లించవలసిన మొత్తమని న్యాయాలయాలద్వారా వసూలు చేసుకునే అధికారం మనకున్నదని మీరు సంస్థాన దివాన్‌కు గుర్తుచేయలేదా?" అని అన్నారు.

అప్పుడు నేను ఇలా సమాధానం చెప్పాను. "నేను ఇప్పుడు సంస్థాన న్యాయ సలహాదారునుకాను. రిజిస్ట్రారుగా ఎన్నిక కావడంతోనే నేను ఆ పదవికి స్వస్తి చెప్పాను. మహారాజావారి ప్రతినిధిగా మన సిండికేట్‌లో సభ్యుడుగావున్న దివాన్ సదరు విరాళం చెల్లించడానికి సర్వశక్తులు వినియోగిస్తున్నారని. వారెప్పుడూ కాదన లేదనిన్నీ స్పష్టంచేశాను. ఒరిస్సాలో క్రొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయోత్పత్తులమీద సంస్థానానికి 17 లక్షల రాబడి వన్ను విధించినందువల్ల సంస్థానం ఆర్థిక పరిస్థితి తారుమారైందనిన్నీ, సంస్థానం తన అటవీ ఉత్పత్తులనుండి వచ్చే

రాబడిని బట్టే తన ఆయవ్యయ పట్టికను నిర్ణయించుకుంటుదనినీ విక్రమదేవవర్మ గారి దానధర్మాలతో సంస్థానం తలమునకలవుతోందనినీ దివాను నాతోచెప్పినట్లు కూడా నేను వివరంగా చెప్పాను. మరో విషయం కూడ ఆయన దృష్టికి తెచ్చాను. దావావ్యయైక సాధ్యమని డిపెన్సు న్యాయవాది నాచేత క్రిందపెట్టి ఎంతకాలమైనా దావాను లాగించవచ్చునీ, మహారాజా జీవితకాలంలో అది తేలకపోవచ్చునీ, ఆయన యిచ్చివా దానాల చెల్లింపు బాధ్యత ఆయన వారసులకుండదనీ, కనుక దివాన్‌తో ఏదో మంచిగా రాజీ వడటం వాంఛనీయమని కూడా నేను గట్టిగా హెచ్చరించాను. కాని శ్రీ రెడ్డి వాదానికి లొంగేమనిషి కాదు. "మీ మాటల ధోరణిని బట్టి చూస్తే మీరు జయపూరు సంస్థాన వ్యాయసలహాదారుగా మానుకున్నట్లులేదు" అని తీవ్రంగా సమాధానమిచ్చారు.

నేను వెంటనే నా కార్యాలయానికి వెళ్ళి మహారాజావారి విరాళాన్ని వసూలు చేయడానికి వేను తీసుకున్న నమస్త చర్యలను సాక్ష్యాధారాలతో వివరిస్తూ నోటు పెట్టి వంపాను. ఆ మరునాడే నా రిజిష్ట్రారు వదవికి రాజీనామా సమర్పిస్తూ వెంటనే ఆమోదించవలసినదిగా శ్రీ రెడ్డిని కోరాను. నోటు అంగీకరించారు కాని నా రాజీనామాను అంగీకరించలేదు. ఆ రోజు సాయంత్రమే శ్రీ రెడ్డి మా యింటికి వచ్చారు. నా భార్యను కూడా పిలవమన్నారు. మా ఇద్దరి సమక్షంలో ఆయన తాను నా యెడల అనుచితంగా ప్రవర్తించినందుకు ఉదాత్తంగా క్షమాపణ కోరుతూ మా ఆవిణ్ణి ఉద్దేశించి ఈ వృద్ధాప్యంలో తనకు కోవం ఎక్కువవడమే కాక యువ లోకానికి కూడ కోవ తెప్పిస్తున్నదని, ఇక జయపూరు విరాళాన్ని గూర్చి యెత్తనని" అన్నారు.

ఆంధ్ర విశ్వ విద్యాలయ చరిత్రలో శ్రీ సి. ఆర్. రెడ్డి శ్రీ విక్రమదేవవర్మ వీరివుకు వున్న పేరు ప్రతిష్ఠలు మరి యెవ్వరికీలేవు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని విడిచి వెళ్ళిన తర్వాత శ్రీ రెడ్డికి మైసూరులో ప్రోఛాన్సలర్‌గా ఒక సంవత్సరకాలం మాత్రం వున్నారు. 1951 ఫిబ్రవరి 24వ తేదీన ఆయిన మద్రాసులోని ఒక నర్సింగ్ హెూమ్‌లో చనిపోయారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ రజతోత్సవాలు ఇంకా

వవ్వెండు రోజులున్నాయనగా శ్రీ రెడ్డి మరణించి రెండు నెలలైనా కాకముందే 1951 ఏప్రిల్ 14వ తేదీన శ్రీ విక్రమదేవ వర్మ కూడా కన్నుమూశారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయ చరిత్రలో ఒక శకం-14 సంవత్సరాలు ప్రోఛాన్స లర్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించిన ఒక మహోదార వ్యక్తి, 18 సంవత్సరాలు విశ్వవిద్యాలయ రూపురేఖలను తీర్చిదిద్దిన ఒక మహా మేధావి కలిసి మెలిసి వ్యవహరించిన - ఒక మహాశకం ఈరీతిగా ముగిసింది.

ఒక పుష్కర కాలం చిరస్మరణీయమైన వారివురి సమాగమం, శైశవ దశలో ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అనంతమైన మంగళ కానవాన్ని వలికింది.

ఆయనొక మహా మనీషి

ప్రొ॥ కె. ఆర్. శ్రీనివాస అయ్యంగార్

సి. ఆర్. రెడ్డివంటి అసాధారణ శేముషీ ధురంధరుని జీవిత స్మృతులను ఉల్లేఖించేటప్పుడు ఎవరైనా తనను గూర్చి కూడా వీలైనంత ఎక్కువగానే చెప్పుకోకుండా ఉండలేరు. ఏంచేతనంటే మధ్యందిన సూర్యుడు లాంటి ఆ మహామనీషి వెదజల్లిన దివ్య తేజఃకిరణాలలో ప్రకాశించాలనే ప్రలోభాన్ని ఎవరు నిగ్రహించుకోగలరు?

పూర్వపు మద్రాసు శాసన మండలి ప్రతిపక్షాసనాల్లో సత్యమూర్తితో పాటు సి. ఆర్. రెడ్డి చిచ్చుబ పిడుగులావున్న రోజుల్లో నేను యస్. యస్. ఎల్. సి ఇంటర్‌మీడియట్ క్లాసుల్లో చదువుతూ వుండేవాణ్ణి. ఈనాటి విద్యార్థులకున్నంత రాజకీయ పరిజ్ఞానం ఆనాడు మాకు లేకపోవడంచేత మాలో చాలా మంది రాజకీయ పక్షాల సుడిగుండంలో పడి పరిభ్రమించే వాళ్లుకాదు. కాని నాకో విషయం మాత్రం బాగా జ్ఞాపకం వుంది. రెండవ పానగల్ మంత్రి మండలిని 'ఈకెటు తీసిన పక్షుల గుంపుగానూ, వారిలో తొలగించబడ్డ ఒకరిని'పాడేపిట్టాకాదు ఎగిరేపిట్టాకాదు'అనినీ శ్రీ రెడ్డి అభివర్ణించాడు. ఆయన అద్భుతవాక్చాతురికి అదొక మచ్చుతునక.

పందొమ్మిదో శతాబ్దం రెండవ దశాబ్దం చివరలోనూ, మూడో దశాబ్దం ఆరంభంలోనూ, విద్యావేత్తగా, రాజనీతి చతురుడుగా ప్రఖ్యాతి గాంచిన శ్రీ రెడ్డి గారి కార్యకలాపాలను నేను అంత సన్నిహితంగా స్పష్టంగా కాకపోయినా, ఆకళింపు చేసుకుంటూ వుండేవాణ్ణి. ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసినపుడు నేను సిలన్‌లో అధ్యాపక వృత్తిలో వున్నాను. ఆయన

ఆ రాజీనామా వార్త నా హృదయం మీది చెరగని ముద్రవేసింది. ఆయన త్యాగ నిరతికి నేను జోహారులర్పించాను.

ఎందుకంటే భారతదేశంలో ఎటువంటి త్యాగానైనా, సాహసానికి, విశ్వాసానికి, ఉదారతకూ, ఉన్నతాంతఃకరణకూ,-ఒక సిద్ధాంతం కోసం, ఒక ఆదర్శం కోసం, ఒక విశిష్టదృక్పథం కోసం - కష్టాలు అనుభవించడానికి సంసిద్ధం కావడానికి చిహ్నంగా భావిస్తారు.

రెడ్డిగారి రెండో రాజకీయ జీవిత కార్యకలాపాలను గూర్చి - ఆయన మేధా పటిమకు ఏమాత్రమూ చాలని చిత్తూరు జిల్లాబోర్డు ప్రెసిడెంటు గిరితోసహా-పత్రికల్లో కాదాచిత్కంగా ఏవో వార్తలు, వ్యాఖ్యలు వస్తూవుండేవి. అప్పుడు నేను ఉపాధ్యాయుడుగా ఎక్కడో దూరంగా బెల్గాంలో వున్నా. ప్రజాసమస్యలకు సంబంధించి అప్పటికే కీర్తి శిఖరాలందుకున్న అగ్రశ్రేణి రచయితల్లో ఒకరైన రెడ్డిగారి మీద నా అభిమానం అలాగే నిలిచివుంది. అనంతరం ఆయన తిరిగి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రావడం నేను చాలా మంచిపనిగా భావించాను.

1941లో నేను తొలిసారిగా రెడ్డిగారిని బెల్గాంలో స్వయంగా కలిసికొనడం తటస్థించింది. ఆయన అధ్యక్షతను అప్పుడక్కడ ఒక సెకండరీ ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్సు జరిగింది. సభాకార్యకర్తలు "యుద్ధయత్నం-ఉన్నత విద్యాలయాలు" అనే అంశంమీద మాట్లాడమని నన్ను కోరారు. యూరపులో యుద్ధం చాలా గడ్డుగా ఉన్న వరిస్థితిలో ఒక విద్యా విషయిక సమావేశం కోసం ఇంతధనం వెచ్చించడం దుబారా అనీ, ఆ జటిల సమస్యను పట్టించుకోకుండా తప్పించుకువేందుకు చేసే యత్నమనీ భావించిన మండలాధికారులను సమాధాన వరచడానికి నన్ను ఆ విషయం మీద మాట్లాడమన్నారని నేను భావించాను. అలాగే నిర్ణీత విషయాన్ని గూర్చి నేచెప్పేదేదో చెప్పాను.

నా ఉపన్యాసానంతరం రెడ్డిగారు నన్ను అభినందిస్తూ, ఆయన బసచేసిన "గ్రీన్స్ హోటల్"లో మరునాడు ఉదయం నన్ను కలుసుకోమన్నారు. ఆవ్పటికి 'లిట్టన్‌స్ట్రాచే' మీదా, యస్. శ్రీనివాస అయ్యంగారి మీదా నేను వ్రాసిన పుస్తకాలు వెలువడ్డాయి. నేను రెడ్డిగారిని కనిసికొన్నప్పుడు వారికి ఆ రెండు పుస్తకాలు బహూక

రించాను. ఆయన ఆ పుస్తకాలు చూచి పుటలు తిరగవేస్తూ "ఓ నాప్రియ మిత్రుడు యస్. శ్రీనివాస అయ్యంగారు!! పావం పోయాడు. కేంబ్రిడ్జిలో నేను వున్న రోజుల్లో స్ట్రాచే అంటే మంచి పేరుంది. కాని మీరు ఈ పుస్తకాన్ని 'లెవెలిన్ పావెస్'కి అంకితం ఇచ్చారు. ఆయన మీ స్నేహితులా? అన్నారు.

నేను వారినెప్పుడూ కలిసికోలేదనిన్నీ, ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రం విరివిగా జరిపేవాణ్ణనీ అన్నాను. అప్పుడాయన పోవెస్ వంశస్థులు జాన్, థియోడోర్ లెవెలిన్, గెట్స్కిడే, ఫిలిపా - వీరందరిని గురించి మాట్లాడుతూ తాను ఇంగ్లాండులో వున్నప్పుడు వీరంతా తనకు పరమ మిత్రులని అన్నారు. అలాగ మా ఇద్దరిమధ్య అనుబంధం ఒక నరియైన పునాదిమీద ఏర్పడ్డది. నా పుస్తకాలను శ్రద్ధగా చదువుతానని వాకు మాట యిస్తూ నన్ను అభినందించారు. ఆ సమావేశం అలా ముగిసింది.

కాన్పరెన్సు తుది సమావేశానికి కూడా నేను హాజరయ్యాను. అధ్యక్షస్థానంలో వుండి రెడ్డిగారు నవ్వేదో వుదాహరిస్తూ ఎంతగానో పొగిడారు. వేదికదిగి వచ్చేటప్పుడు కూడా నాతో ఎంతో ప్రేమపూర్వకంగా మాట్లాడారు. మఱువాటి ఉదయం కొంతమంది మిత్రులతోపాటు నేను కూడా వారికి వీడ్కోలు చెప్పాను. కొన్ని రోజుల తర్వాత రెడ్డిగారి దగ్గర నుండి 5-11-1941 తేదీగల ఒక పెద్ద ఉత్తరం వచ్చింది. నిజంగా అది నా జీవితంలో ఒక ఆశ్చర్యకరమైన ఘటన. ఆ లేఖలో కొంత భాగం ఇది :-

"నాబెల్గాం వర్యటనవల్ల నాకు లభించిన ఒక ఉత్తమ ఫలం మీతోడి పరిచయం. మీ సారస్వత ప్రతిభ అసాధారణం, అకృత్రిమం. అతిదుష్కరమైన ఒక రంగంలో మీరు ప్రశంసనీయమైన కృషిచేశారు. మీరు అందుకే పుట్టినట్లున్నారు. లేకపోతే అది సాధ్యం కాదు. లిట్టన్స్ట్రాచే మీద మీరు వ్రాసిన పుస్తకం చదివాను. ప్రతిభాన్వితమైన మీ చక్కని భాషా శైలి నన్ను ముగ్ధుణ్ణి చేసింది. విషయాన్నిబట్టి రచనా సంవిధానాన్ని బట్టిఅది ఒక మహాకావ్యంగా నిలువగలదు."

ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థుల కోసం 'ఆంగ్లో ఇండియన్, ఇండో ఆంగ్లియన్' సారస్వత గద్య సంకలనాలు తయారుచేయమని ఆ వుత్తరం చివరి భాగంలో

వారునన్ను కోరారు. మన ఆంగ్లపాఠ్య గ్రంథాలకు అనుషంగికంగా చక్కని ఆంగ్ల భాషలో భారతీయులు వ్రాసిన గ్రంథాలూ, ఉత్తమ భారతీయ ఇతి వృత్తాలు గ్రహించి ఆంగ్లేయులు వ్రాసిన గ్రంథాలూ కూడా వుండాలని వారి వూహ.

అటువంటి పుస్తకాల ముద్రణ, వెల-వీటిని గురించి కూడా వివరణగా కొంత వ్రాశారు. ఈ విషయాన్ని గురించి మా యిరువురి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రం జరిగాయి. కాని ఫలితం మాత్రం మృగ్యమైంది. అయినా ఇండో ఆంగ్లియన్ సాహిత్యం మీద నేను రెండు పుస్తకాలు వ్రాశానని విని వారు చాలా ఆనందించడమే కాక 1943లో నా **P .E. N** గ్రంథానికి (broachure) వారు వ్రాసిన పీఠికలో నిర్ధారించారు :-

"ఇండో ఆంగ్లియన్ సాహిత్యం లక్షణ రీత్యా భారతీయ సాహిత్యానికి విభిన్నమైనదికాదు. అందులో ఒక భాగమే అది. వేదకాలం నుండి తన వరిణత కాంతిని ఒకప్పుడు అనల్పంగా, ఒకప్పుడు అల్పంగా, ఒడిదుడుకులతో గూడిన కాలానికీ చరిత్రకూ ఎదురొడ్డి, టాగూర్, ఇక్బాల్, అరవిందఘోష్‌ల కాలం దాకా వెదజల్లుతూ మానవజాతి భవిష్యత్తులో కూడా విస్తరించగల మన మహోజ్వల చరిత్ర యొక్క ఆధునిక రూపాంతరమే యిది.

రెండుసంవత్సరాల తర్వాత ఇంగ్లీషులో రీడర్‌గా ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రమ్మని ఆహ్వానిస్తూ వారు లేఖ వ్రాశారు. నేను అప్పుడు "బాగల్‌కోట"లో ఉపాధ్యాయుడుగా వున్నాను. వారి కోరికను నేను వినయ పూర్వకంగా నిరాకరించాను. అయినా వారేమీ కించపడకుండా మళ్లీ మైసూరులో ఆచార్య పదవికి దరఖాస్తు చేయమని వ్రాస్తూ పత్రికా ప్రకటన భాగాన్ని కత్తిరించి పంపారు. 1942లో ఆ విశ్వ విద్యాలయంవారు నన్ను ఎంపిక చేయలేదనిన్నీ, తిరిగి దరఖాస్తు చేయడంలో ఏం ఔచిత్యం వుంటుందనీ వ్రాశాను. దానికి వెంటనే రెడ్డిగారు ఇలా సమాధానం వ్రాశారు-

"వాళ్ళు ఎవ్వడు అవ్యక్తంగానే వుంటారని మీరు ఎందుకనుకోవాలి? బుఱ్ఱ లేకనో, గుండెలేకనో లేదా రెండూ లేకనో వారు చేసిన తెలివితక్కువ వనిని సరిదిద్దుకునేందుకు మీరు వారికి అవకాశం ఇవ్వరా? ఈ సరికి మీరు మైసూరుకంటే పెద్ద

దేశాల్లోనూ, అసాధరణ ప్రతిభావంతులైన విద్యావేత్తల దగ్గరా అఖండమైన పేరు గడించాడు గదా?'' అని వ్రాస్తూ తన లోగడ వుత్తరంలోని సంబంధిత భాగాలను కూడా ఉదాహరించమని వారు సూచించారు. ఎందుకంటే అప్పాంట్‌మెంట్సు బోర్డు తీర్మానం యొక్క సారాంశాన్ని మాత్రమే పునరుద్ఘాటించింది. అయితే నేను దరఖాస్తు చేయలేదనుకోండి. 1947లో రెడ్డిగారే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో క్రొత్తగా కల్పించ బడిన ఆంగ్లభాషా చార్య పదవికి నన్ను నియోగించారు. ఇది కసితో వారు నా యెడల చూపించిన ఔదర్యం-గుణగ్రహీణ పారీణమైన అమితౌదార్యం. వేను 1947 జూన్ 15వ తేదీన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పదవీ స్వీకారం చేశాను.

రెడ్డిగారు నాకావదవిని కల్పించడానికిగల ఇతర కారణాల్లో భారతదేశంలో విద్యా సంస్థ లన్నింటిలోనూ ఇండో ఆంగ్లియన్ సాహిత్యాన్ని బౌద్ధికశిక్షణ (Intellectual Discipline)గా అంగీకరింపజేయటానికి దోహదంచేసే అర్హత స్థాన మొకటి నాకు కల్పించాలనేది కూడా ఒకటి అని వ్రాశారు వి. కె. అయ్యప్పన్ పిళ్లై, అమరనాధ ఝా వంటి ఆరితేరిన పండితుల్ని ఆయన ఈ విషయంలో సంప్రదించక పోలేదు. కాని దీనికి బీజం వేసింది మాత్రం రెడ్డిగారే.

ఇదివరకే రంగంలోవున్న ''ఇండో ఆంగ్లియన్ సాహిత్యం'' ఆంగ్ల సాహితికి భారతీయ సహకారం అవే నా పుస్తకాలతో అంగ్లభాషలో భారతీయ రచనమీద విమర్శనాత్మకమైన అధ్యయనాన్ని వృద్ధి వరచడం నాకు సాధ్యం కాగలదని రెడ్డి గారి భావన. 1947 మార్చి 6వ తేదీన వారు ''నావూహలో భారతదేశంలో ఇటువంటి కార్యనిర్వహణకు వరిపూర్ణమైన అర్హత, అధికారమూగల వ్యక్తి మీ రొక్కరే'' అని వ్రాశారు.

ఒకసారి గతావలోకనం చేసుకొని రెడ్డిగారు నన్ను ఆంగ్లా చార్యునిగా ఎంపిక చేసినందుకు కనీసం ఈ విషయంలోనైనా న్యాయం చేకూర్చగలిగాననిపించింది. అయితే అందుకు వేను చాలాకాలం తీసుకోవలసివచ్చింది. చాలా శ్రమ వడవలసి వచ్చింది కూడాను. ఆంధ్ర ఇంటర్ మీడియట్ విద్యార్థులకోసం వేను చేసిన సంకలనాల్లో గద్య వద్యాత్మక భారతీయ రచనలు చేర్చాను.

బి. ఏ. స్థాయిలో శ్రీ అరవిందులు వ్రాసిన Perseus the Daliverer, హుమాయూన్ కబీర్ వ్రాసిన Men and Rivers అనే గ్రంథాలను పాఠ్య గ్రంథాలుగా

నిర్ణయించమని బోర్డు ఆఫ్ స్టడీస్‌ను అభ్యర్థించి కృతకృత్యుణ్ణి కాగలిగాను. ఆ తర్వాత 1959లో ఇండో ఆంగ్లియన్ లిటరేచర్ విజిటింగ్ ప్రొఫెసర్‌గా నేను 'లీడ్స్' వెళ్ళి అక్కడ కొంతకాలం వున్న తర్వాత 1962లో నా లీడ్స్ ఉపన్యాసాలు 'Indian Writing in English' అనే పేరుతో ప్రచురితమయ్యాయి. అవ్వాడది పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయిలో ఒక పూర్తి పేపరుగా రూపొందించడానికి సాధ్యపడింది. ఇవ్వాడు అంటే రెండు దశాబ్దాల అనంతరం భారతదేశం అంతటా యం. ఏ. పాఠ్య ప్రణాళికలో ఇది ఒక విడదీయరాని పాఠ్య భాగమైంది. ఇవ్వాడు ఈ నూతన రంగం పరిశోధకులెందరినో ఆకర్షిస్తోంది కూడా.

సునిశితమైన దృష్టి, అగాధమైన అవగాహన గల శ్రీ రెడ్డిగారికే ఈ ఖ్యాతిలో అధికాంశం దక్కాలి. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మేం కొద్దికాలం మాత్రమే కలిసివున్నాం. తర్వాత వారు మైసూరు వెళ్లిపోయారు. అయితే మా యిద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రం నిరంతరంగా నడుస్తూవే వుండేవి. వేను అప్పుడూ అప్పుడూ ప్రచురించిన పుస్తకాలు వారికి పంపుతూవుండేవాణ్ణి. అణు మాత్రం విలంబనంలేకుండా వచ్చేవి. వాటిపై వారి అభిప్రాయాలుకూడా ఉదాత్తంగా వుండేవి. 'హాప్‌కిన్స్' మీద నేను వ్రాసిన పుస్తకం చదివి 1948 మే 28 తేదీన ఇలా వ్రాశారు :

"దివ్యశక్తి సంపన్నుడైన అరవిందుని ధీశక్తికి, వ్యంగ్యరచనకు పేరొందిన స్ట్రాచేను, సంస్కర్త బసవేశ్వరుణ్ణి, సార్వజనీన ప్రతిభగల 'హాప్‌కిన్స్'ను అందటిని అర్థంచేసుకొని అందటిని మెచ్చుకోగలరు" మీ రచనల్లో స్వర్గమర్త్యాలు పూర్తిగామ, కొద్దిపాటి నరకము కలిసి వుంటాయనుకున్నాను.

ఆయన చమత్కారంగా అంటున్నాడో లేక నన్ను వంచిస్తున్నాడా ? కాని వా మీద ఆయనకు అనురాగం వున్నమాట నిజం. సాహిత్యరంగంలో ఇంకా వేను శ్రమించాలనికూడా అయన కోరిక.

చాలా సంవత్సరాలదాకా ఆయనకొక నిర్దిష్ట పథకంగాని, బౌతికాపేక్షగాని యేదీలేదు. ప్రఖ్యాత నవలాకారుడు, వ్యాస రచయిత అయిన ఆర్. యస్. వెంకట రమణి, వేను కలసి రెడ్డిగారి ముద్రిత వ్యాసాలు, ఉపవ్యాస సంగ్రహాలు,

స్నాతకోపన్యాసాలు, మద్రాసు శాసన సభలో ఆయన విరిసిన అడ్డుసవాళ్ళు వరికి లించి ఒక సంకలనం తయారుచేయడానికి పూనుకున్నాం.

అది జీవిత చరిత్ర మాత్రం కాదు. ఎందుకంటే 1930 జులై 18వ తేదీన వారో లేఖలో ఇలా వ్రాశారు :

"మరణించిన తర్వాత చాలా కాలం గడిచే వరకు జీవిత చరిత్ర వ్రాయాలనే లోకాన్ని వేను వీక్షించను. నా ఉపన్యాసాల నుండి, వ్రాతల నుండి కొన్ని భాగాలను మాత్రమే మీరు ప్రకటించాలని నాకోరిక - ప్రశాంతమైన నావార్ధక్యపు జీవితాన్ని అది ముగిసేదాకా అలా నాకు వదిలి వేయండి."

సంకలనానికి కావలసిన విషయంలో అధికాంశం చిత్తూరులోనే వుంది. మైసూరులో కొంత పార్టు వుంది. కాని అప్పటికి రెడ్డిగారి ఆరోగ్యం సరిగాలేదు. వెంకటరమణి, వేనూ కలిసి పరిశోధించడం సాధ్యపడలేదు. చిత్తూరులోగాని మైసూరులోగాని తనతోపాటు ఒక వారం రోజులుండి సంకలనానికి వలసిన విషయ సేకరణ చేసుకోవలసిందిగా రెడ్డిగారు నన్ను అడిగారు. కాని ఏమీ చేయలేక పోయాను. ఇంతలో వారు స్వర్గస్థులయ్యారు.

1966లో నేను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడుగా వున్నప్పుడు రెడ్డిగారి వ్యాసాలు, ఉపన్యాసాలు సేకరించి వ్రాసిన గ్రంథాన్ని యూనివర్సిటీవారు ప్రకటించారు. ఆ గ్రంథానికి నేను పీఠిక వ్రాశాను. ఆ సంవత్సరం డిసెంబరు నెలలో యూనివర్సిటీ సెనెట్ మీటింగు కాగానే దాన్ని ఆవిష్కరించడం జరిగింది.

చాలా సంవత్సరాలు ఏవ్యాసవృత్తి లేకుండా ఏకాంత జీవితం గడుపుతూ వుండగా రెడ్డిగారికి 1948 లో కామన్‌వెల్తు విశ్వ విద్యాలయాల కాన్ఫరెన్సుకు ఇంగ్లాండు తిరిగి దర్శించే అవకాశం వచ్చింది. బయలుదేరేముందు తనను గుర్తించి అక్కడ వున్న నా స్నేహితులకు వ్రాయమన్నారు. 'భావావేశాన్ని ఉద్దీప్తం చేయగల విద్యాధికుల సాహచర్యంలో ఆనందానుభూతికి తనకు అవకాశం కల్పించబడడాని కట! తనకంటె చిన్నవాడైన ఒక సయోద్యోగియెడ తన దయాగుణాన్ని వ్యక్తంచేసే రీతి యిది. ఈ ఇంగ్లాండు ప్రయాణం ఆయనకు చాలా ఆసక్తి జనకంగా వుంది. ఆయన అక్కడ పూర్వపు మిత్రుల నెందరినో కలిసికొన్నారు. ఆయన తిరిగి

వచ్చినపుడు అయవకళ్లల్లో క్రొత్తవెలుగు నిండుగా కనబడ్డది. తర్వాత కొన్నినెలలు వేను అవ్వడప్పుడు వారికి వంపే నా వ్యాసాల ముద్రిత ప్రతులకు సమాధానంగా నన్ను ప్రోత్సహిస్తూ, అభినందిస్తూ ఎవ్వుడూ వ్రాస్తూవే వుండేవారు.

"విక్టర్ హ్యూగో మొదలుకొని ఈనాటి దాకా పాశ్చాత్య కవితమీద మీరు వ్రాసిన వ్యాసం ఒక అద్భుత సమీక్ష."

"నేను మీ ఊర్వశి నిజంగా చదివాను. అది హృదయాకర్షంగా వుంది. నిరంతరానందాన్ని కలిగించేదిగా వుంది."

"మీ ధీశక్తిని గ్రహించగల అభిరుచిని మీరు నాలో కల్పించారు. కాని దాని నుండి వేను కోలుకోలేక పోతున్నాను."

పరమలోభియైన విమర్శకుడిలా ఆయన పొదుపుగా మాటలు ఆచి - తూచి వాడారు. దుబారా మనిషిలాగా ప్రశంసోక్తులు ఊరికే విరజిమ్మ్మకారు.

తానిచ్చిన ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోవన్యాసాన్ని గూర్చి అప్పటి గవర్నర్ జనరల్ శ్రీ రాజాజీ వ్రాసిన లేఖ ప్రతిని ఒకటి నాకు రెడ్డిగారు 1949 డిసెంబరు 11 వ తేదీన వంపారు. అందులో శ్రీ రాజాజీ యిలా అన్నారు :

"మీ ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోవన్యాసాన్ని వేను చదివాను. మీకు నాహార్థికాభివందనాలు. అందులోని ప్రతివదాన్ని వేను మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నాను. అమూల్యము, మహోజ్జ్వలము అయిన మహోవన్యాసమది."

మూడు వారాల అనంతరం మా నాయనగారు స్వర్గస్తులైనారని విని నన్ను పరామర్శిస్తూ, హృదయాన్ని స్పందింపజేసే ఈ లేఖ వ్రాశారు :

"వారు డెబ్బయ్యోయేట పోతేమాత్రంమేమి ? వాకు ఇప్పుడు డెబ్బయ్యో యేడు వచ్చింది. కాని చావుచావే. తండ్రి తండ్రే. జీవితంలోను, అంతరంగం లోను ఏర్పడే ఆ అగాధం ఎప్పుడూ నోరు తెరుచుకునే వుంటుంది. ఆ దుఃఖాన్ని నిర్మూలించగల చికిత్స యేదీలేదు. శంకరుని అష్టమూర్తులలో ఒకటయై ఈదృశ్య ప్రపంచంలో అభివ్యక్తమైన 'కాలం' ఒక్కటే దాన్ని ఉపశమింప చేయగలదు.

సరళంగా సాధువుగా నిర్దుష్టంగా గడిపిన జీవితమే నీతికి, నిజాయితీకి, అధ్యాత్మిక పరిణతికి దర్పణం కాగలదు. అంతిమ గడియల్లో ఆయన్ను సమాశ్వించడానికి మీరు దగ్గర లేకపోవడం ఘోరం. అయ్యో! నేను సమయానికి లేకపోతినే అనే వ్యధ మిమ్మల్ని మీ జీవిత శేషమంతా వెంటాడుతూనే వుంటుంది. కాలం కూడా దాన్ని తగ్గించలేదు.

మీ మనోవేదన నేను సానుభూతి పూర్వకంగా అర్థంచేసుకోగలను. కాని సృష్ట్యారంభంనుండి మానవునకు ఈ దురంతస్థితి వుండనే వుంది కదా! ఇప్పటికి కోటానుకోట్లు యెందరో ఈ వ్యధ అనుభవించారు. భవ్యత్తులో ఇంకా యెంతమంది ఇలా వ్యధలపాలు కావలసినవారున్నారో!

అపరిహార్యమైన మృత్యు వ్యధను దిగమిగండానికి మతాలు మనకు యెన్ని మత్తు మందులు, ఉపశమన క్రియలు కల్పించినా అవేవి శాశ్వత ప్రయోజనం చేకూర్చేవిగా నేను విశ్వసించలేను. అవి నీటిబుడుగల వంటివి. క్షణకాలం మాత్రం మెరిసి ఇట్టే విచ్ఛిన్నమై గాలిలో కలిసి కాల పరీవాహంలో కొట్టుకుపోతాయి. కాబట్టి మానవులంగా మనం పరస్పర సహవేదన తెలుపుకుందా".

అది చాలా పెద్ద వుత్తరం. కాని ఆయన ఆ వెను వెంటనే వ్రాసిన మరో వుత్తరంలో మళ్ళీ అదే విషయాన్ని స్పృశిస్తూ అన్నారు:

"మీ పితృ వియోగపు తాకిడిలో మీ జీవితం ఎలావుంది. ఇక పాపం మీ అమ్మగారు!!"

జనవరి 28 దాకా ఆయన మనస్థితి అలాగే వుందమ కుంటాను. ఆయన మళ్ళీ వ్రాశారు :

"విషాదభరితమైన నామనస్థితి అగాధంగా అంధకారబంధురంగా పెరుగుతూ ఇంకా అలాగే వుంది. దానికో అంతుగాని, మందు మాకులుగాని వున్నట్లు లేదు. నలువైపులా నల్లని నీడలు క్రమ్ముతున్నాయి. కాని నేను విషాదం గాని విస్మయం గాని అంతగా చెందడంలేదు.

స్వయంగా కలుసుకుని మాట్లాడుకునేందుకు అవకాశంగాని, శక్తిగాని లేని మాకు ప్రత్యామ్నాయంగా ఇలా వుత్తరాలు నడుస్తూవుండేవి. యం. యన్. రాయ్ దంపతులు ఆంధ్ర విశ్వవిద్యాలయం దర్శించిన సందర్భంగా నేను వ్రాసిన ఒక నివేదిక చదివి రెడ్డిగారు ఇలా వ్రాశారు.

"రాయ్ దంపతులు మీతో కలసివుండడం ఎంత అదృష్టం? అపూర్వ దంపతులు వారు. ఎలెన్ చాలా ఆకర్షణీయమైన వ్యక్తి, విండు హృదయం గలది. ఔదార్యానికి పెట్టిందిపేరు. ఇక యం. యన్. సరేసరి. ఈనాటి మహామేధావుల్లో ఆయన ఒకడు. విస్తృతమైన గ్రంథపఠనం, అగాధమైన ఆలోచన, సంస్కారంతో గూడిన అసాధారణ సాహితీ వేత్తృత్వంగల మహా వ్యక్తి ఆయన. ఆయనకుగాని నాకుగాని పదవివుంటే రాణిస్తామని పొరపాటుగా భావిస్తున్నారు. పదవి ఒక కొల పాత్రలాంటిది. దాన్ని దీపంమీద బోర్లిస్తే ఆ దీపంకాస్తా ఆరి వూరుకుంటుంది. కనుక పదవికంటె పలుకుబడి మేలు. మీకో పదవి వుందనుకోండి అప్పుడు మీకు పలుకుబడికూడా వుండవచ్చు. కాని అది ఆదర్శవంతమైనదికాదు. రాయ్ తన ఉదార హస్తాలతో అనుదినం అన్నివైపులా క్రొత్త ఆలోచనాబీజాలునాటుతున్నాడు. కాని మన నేల సారం అందుకు తగదేమో అని నా అనుమానం.

కొన్నాళ్ళ తర్వాత "భారతీయ సాహిత్య పునరుద్ధరణం అనే మీవ్యాసాన్ని నేను చదివాను. ఆసక్తిజనకంగా వుంది. అయితే మీరు 'పునరుద్ధరణం' అన్నారు. అది చచ్చిందెప్పుడు" అనిన్నీ.

"మీరు ఆంధ్ర విశ్వవిద్యాలయం మీద వ్రాసిన వ్యాసం చాలా పఠనయోగ్యంగావుంది. శ్రీ వి. యస్. కృష్ణగారికి మీరు పూర్తి సహకారం అందిస్తున్నందుకు సంతోషిస్తున్నాను. విషయాన్నిబట్టిగాని, లక్ష్యాన్నిబట్టిగాని అది పితృపూజకంటె కూడ ఎక్కువైనది" అనిన్నీ వ్రాశారు.

మఱుసటి నెలలో నేను వ్రాసిన అరవిందుని జీవితచరిత్ర మలిముద్రణ ప్రతిని చదివి రెడ్డిగారు వ్రాశారు.

'నేను ఆ గ్రంథాన్ని చదివాను. సాహితీ దృష్టితో గాక అధ్యాత్మిక పరవశత్వంతో చదివాను. ఆ మహామేధావిలోని అసంఖ్యాక తేజఃకిరణాలను, ఛాయలను వెలికితీసి ఒక మహనీయ రూపంలో వాటిని మలిచారు."

అనంతరం నేను ఒకసారి 'Illustrated weekly of India'లో వ్రాసిన 'Self obituary' (స్వచ్ఛంద మరణం) ని గూర్చి ఒకసారి ఢిల్లీలో సంచలనం కలిగించిన Morality and Malaria'అనే తన వ్యాసాన్ని గూర్చి, ఒక తడవ 'Democracy and contemporary India' అనే విషయం మీద మద్రాసు విశ్వవిద్యాలయంలో తానిచ్చిన ఉపన్యాసాల గూర్చి ఏదో తమాషాగా హాస్య భరితంగా వ్రాస్తు వుండేవారు. నేను వ్రాసిన ఉత్తరాలకు, వ్యాసాల ముద్రిత ప్రతులకు, అవి యెంత అసంబద్ధంగా వున్నా వెంటనే ఏదో సమాధానం వచ్చేది. అసాధారణ ప్రజానాయకుడనీ, వైస్ ఛాన్సర్లకు పితృతుల్యుడనీ, అప్రతిమాన ప్రతిభావంతుడైన ప్రోఛాన్సలరనీ, విద్యాధికుడైన అగ్ర రాజకీయ వాది అనినీ ఆయను పొగడడం ఆయన అసలు రూపాన్ని మరుగుపరచడమే అవుతుంది.

వాస్తవంగా చెప్పాలంటే ఆయన ఉడుకు రక్తంగల కార్యదీక్షావరుడు, మానవతావాది, ఇట్టే స్పందించే నిండైనమనస్సు, పరిణతమైన ఆత్మగల స్థితప్రజ్ఞుడు.

వయస్సులోను, అంతస్తులోను, లౌకిక స్థితి గతుల్లోను మాయిరువురి నడుమ గల భేదాన్ని, దూరాన్ని సులభంగా అయత్నంగా అధిగమించడానికి మామధ్య ధారావాహికంగా నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాలు వారధిగా ఉపకరించేవి. ఎప్పుడైనా అనుకోకుండా కలిసికొనడం తటస్థించివపుడు ఆ భేదమూ, ఆ దూరమూ ఆపిరిలా ఇట్టే హరించిపోయేవి. తోటి ఆనుచరునితోను, ఆత్మీయుడైన మిత్రునితోనూ, ప్రేమపాత్రుడైన బిడ్డతోనూ మాట్లాడినట్లు మాట్లాడేవారు నాతో.

ఆయన వాల్తేరును శాశ్వతంగా విడిచివెళ్లేటప్పుడు మా యిరువురి మధ్యా జరిగిన సంభాషణ నాస్మృతివీధిలో ఎప్పుడూ మెదలుతూ వుంటుంది. మేమిద్దరం వైస్ ఛాన్సలర్ భవనం మేడపైన ఒక గదిలో కూర్చునివున్నాం. తాను లోగడ బెంగుళూరు మైసూరులోవున్న రోజులను గుఱించి సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యతో తనకు తటస్థించిన వివాదాన్ని గూర్చి, స్థానిక ప్రజలు నిర్ధుష్టమైన కన్నడం అని భ్రమవడేటట్లు అక్కడ తానిచ్చిన సంస్కృత పదభూయిష్టమైన ఉపన్యాసాలను గూర్చి, ఏదో ఒక అసంపూర్ణ కార్యాన్ని పూర్తిచేయాలన్నట్లు మైసూరు తిరిగివెళ్లాలని తనకు గలిగిన వింతకోరికను గుఱించి మాట్లాడుతూ - అయితే కాల ప్రవాహాన్ని వెనక్కి మళ్లించడం అంత తెలివిగల పని అంటారా? అని ప్రశ్నించారు.

ఆయన ఆలోచనా లగ్నంగా వున్నారు. నేను మౌనంగా వున్నాను. మా సన్నిహితత్వం అపారం. నేను ఆయన్ను ఎంతో ప్రగాఢంగా ప్రేమించేవాణ్ణి, ప్రశంసించేవాణ్ణి. అయన వెళ్లిపోతున్నాడంటే వా హృదయం ద్రవించింది. నేను సెలవుతీసుకొనడానికి లేవగానే "అంతేనండి కెఅర్" అన్నారు. తుదిసారి ఆయన వైస్ చాన్సలర్ బంగళా విడిచివెళ్లేందుకు ఒక గంట ముందుగా వారిని మరోసారి దర్శించాను. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని విడిచిపోవడానికి ఆయన మనస్సు యెంత మెలి తిరిగిపోయిందో నేను గ్రహించ గలిగాను.

'స్మృతులు' - వీటికి ఒక అంతంటూ వుండదు. ఆయన యూనివర్సిటీ మీటింగులు నిర్వహించే తీరు అద్భుతంగా వుండేది. అవ్వటి కప్పుడు మాట్లాడినా లేక వ్రాసి చదివినా ఆయన ఉపన్యాసాలు ఒక మహోన్నత శక్తినుండి ఆవిర్భవించి వెల్లువలై జలజలా ప్రవహిస్తున్నట్లుండేవి. ఆయన గంభీరంగాలేచి నిలబడి మాట్లాడే టప్పుడు గుజ్జురూపం ఉవ్వెత్తుగా పెరిగినట్లు గోచరించేది. ఆయన కళ్లలో ఒక విధ మైన కాంతి రేఖ వెల్లివిరిసేది. ఒడలు జలదరింప జేసే ధీషణా వైభవాన్ని, జీవితా నందాన్ని తన శ్రోతులకు ఎలా అందియ్యాలో ఆయనకు బాగా తెలుసు.

ఆయన ఒక అసాధారణవ్యక్తి, మానవతావాది, ఆలోచనావరుడు, అనల్ప కల్పనా చతురుడు, హాస్యప్రియుడు, ఆదర్శవాది, విశ్వవిద్యాలయ నిర్మాతయైన ఒక చతురశిల్పి, వక్తృతావిహాయస విహారి, వాయకుడు, సహచరుడు, మిత్రుడు, బహుముఖ ప్రతిభాశాలి, సర్వజ్ఞుడు. అంతటి మహామనీషిని వేను ఇంతవరకు చూడలేదు.

ఉదారచరితుడు

ప్రొఫెసర్ బి॥ ముత్తుస్వామి

డాక్టర్ సి. ఆర్. రెడ్డిగారి జీవితాన్ని చిత్రించే గ్రంథాలు రెండు వున్నాయి. వాటిలో శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు రచించిన జీవిత చరిత్ర ప్రశంసనీయమైంది. అందులో డా॥ సి. ఆర్. రెడ్డిగారి సమగ్ర యథార్థ విషయాలు, వారి కుటుంబ స్థితిగతులు, వివిధ రచనలు, వాటిలోని వైశిష్ట్యాన్ని, ఆంధ్ర సారస్వత నూతన శకనిర్మాణానికి అవి ఏ విధంగా దోహదము చేశాయో వివి చక్కగ సుబ్బయ్యగారు నిరూపించారు. రాజకీయాలలోను సారస్వతములోను శ్రీ రెడ్డిగారు తమ అశేష శేముషీ విశేషం కారణముగ విశిష్ట వ్యక్తులుగను పృథక్కుగాను ఉండేవారు. ఇటువంటి వారు నూటికో కోటికో కాని వుండరు. వేమనను తప్పిస్తే శ్రీ రెడ్డిగారి వంటి వ్యక్తి ఆంధ్రులకు లభించలేదు. డా॥ రెడ్డిగారి మనస్తత్వాన్ని, వారి సమకాల పరిస్థితుల్ని సరిగ అవగాహన చేసుకొన్న శ్రీ వెంకట సుబ్బయ్యగారు విశ్లేషణాత్మకంగా వారి విశిష్ట వ్యక్తిత్వాన్ని వరనీయ జీవిత చరిత్ర గ్రంథముగ రూపొందించారు. నిస్సారంగా లేకుండా ఉత్సాహాన్ని రేకిత్తించేదిగా వుండిన ఈ పుస్తకంలో అచ్చు తప్పులు లేకుండా వుంటే ఎంతో బాగుండేది. ఇందులోని చక్కటి శైలి, విశ్లేషణతో కూడిన రచన, నిష్పక్షపాతమైన సమయముతో కూడిన తీర్పు మనల్ని ఆకట్టుకొంటాయి.

ఈ గ్రంథాన్ని పఠిస్తుండగా ఒకచోట నేను 1940 డిసెంబరు 10 నాడు డా॥ సి. ఆర్. రెడ్డి షష్టిపూర్త్యుత్సవ కార్యదర్శిగా నివేదిక సమర్పించిన విషయం సూచించబడినది. 40 సంవత్సరాలకు పూర్వము జరిగిన ఆనాటి సి. ఆర్. రెడ్డి షష్టిపూర్త్యుత్సవ మధుర సంఘటన నామదిలో మెదిలింది. ఈ సంఘటన గురించి

కొంచెం చెప్పవలసి వుంది. అప్పుడు రిజిష్ట్రారుగా ఉన్న డాక్టర్ వి. యస్. కృష్ణ గారు ఈ ఉత్సవాలను ఏర్పాటు చేయడానికి ప్రధాన కారకులు. డా॥ రెడ్డిగారి షష్టిపూర్తి ఉత్సవానికి పూర్వం రోజున స్నాతకోత్సవం జరిగింది ఆ రోజువే డా॥ కృష్ణగారు మర్నాటి ఉదయాన జరిగే ఉత్సవంలో డా॥ రామలింగ రెడ్డిగారి నిర్ణయాన్ని అనుసరించి నివేదికను సమర్పించవలసినదిగ నన్ను కోరారు. ఆరోజు సాయంకాలము నివేదికను తయారుచేసి మర్నాడు ఉదయం టైపుచేయించి రెండు కాపీలను డా॥ రెడ్డిగారికి డా॥ కృష్ణగారికి సమర్పించాను. జయపూరు మహారాజా శ్రీ విక్రమదేవ వర్మగారు గవర్నరు అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవ వేదికపైన డా॥ సి. ఆర్. రెడ్డిగారిని సన్మానించటానికి, తర్వాత సర్. సి. వి. రామన్‌గారు శ్రీ రెడ్డిగారిని అభినందించటానికి, డా॥ రెడ్డిగారి బస్టును ఆవిష్కరించటానికి నిర్ణయించడమైంది. ఆనాటి కార్యక్రమంలో నాదే ప్రారంభోపన్యాసము. మొదట కొంత వెనుకంజ వేసినా చివరకు నా ఉపన్యాసం బాగావే ముగిసింది. గవర్నరుగారి కార్యదర్శి, శ్రీ పి. వి. కృష్ణయ్య చౌదరి, సర్ సి. వి. రామన్ మొదలైనవారు నన్ను ప్రత్యక్షంగాను పరోక్షముగను అభినందించారు. నా జీవిత కాలంలో ఒకే మారు ఇచ్చిన ఈ షష్టిపూర్తి భాషణం నాకు నూతనానుభూతిని కలిగించింది. తర్వాత అనేకులు ఈవంథాను అనుసరించి ఎదో విధంగా షష్టిపూర్తి ఉత్సవాల్ని చేయించుకొంటున్నారు.

ఆంధ్ర విశ్వకళాపరిషత్ ప్రథమోపాధ్యక్షులుగా 1926లో సి. ఆర్. రెడ్డి గారు నియమించబడిన సందర్భంలో చిత్తూరు హైస్కూలువారు తమ పాత విద్యార్థిని నన్మానించటానికి, మద్రాసు ముఖ్యమంత్రి వదగీ బాధ్యతలను స్వీకరించనున్న శ్రీ మునిస్వామి నాయుడుగారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రథమ విద్యార్థినయిన నన్ను ప్రసంగించవలసిందిగా ప్రధానోపాధ్యాయులు ఆదేశించారు. నేను చిత్రించిన రెడ్డిగారి చిత్రాన్ని ఆనాడు అధ్యక్షులు ఆవిష్కరించారు. ఇప్పటికీ అది అక్కడ ఉన్నట్లు విన్నాను. శ్రీ సి. ఆర్. రెడ్డిగారు చదివిన చిత్తూరు ఉన్నత పాఠశాలలో నేనుకూడా విద్యనభ్యసించినందుకు గర్విస్తున్నాను. ఆనాటి గురుశిష్య సంబంధము నేడులుప్తమైపోయింది. ఏనాటికైనా ఆరోజులు వస్తాయో లేదో. నాటి సన్మాన సమావేశంలోని శ్రీ రెడ్డిగారి ఉపన్యాసం వాకు ఇప్పటికీ గుర్తుంది. ఆయన ప్రక్కన నిలబడి మాట్లాడటం అదే ప్రథమ పర్యాయమైనప్పటికీ అతఃపూర్వమే వాహ్యాళి వేళల్లో వారిని గమనించేవాణ్ణి. టోపీ పెట్టుకొని చేతికర్రను ఊపుకుంటూ

నెళ్ళేవారిని భయంతో దూరంగా చూస్తూ సి. ఆర్. రెడ్డి, సి. ఆర్. రెడ్డి అని ఎాలో మేము గుస గుసలాడే వాళ్ళం. 1923-24 నాటికే ఆయన ఐతిహాసిక పురుషుడు. జిల్లాపోటీలో తెలుగు సారస్వతంలోను భగవద్గీత, మతాల్లోను ప్రథముడిగా రెండు బహుమతుల్ని పొందటమే కాకుండా శ్రీ సి. ఆర్. రెడ్డిగారు అధ్యక్షతన జరిగే 'రెడ్డి జనసంఘం' వారి ఉపకార వేతనాన్ని పొందాను. కాని వారు మాత్రం నన్ను 1926 లోనే చూశారు.

పది సంవత్సరాల తర్వాత ఆంధ్ర విశ్వకళాపరిషత్తులోకి ప్రవేశించినప్పుడు నన్ను వారు గుర్తుపెట్టుకొని వుంటారని అనుకోను. "హిందూ" ఆఫీసు నుంచి మా ప్రిన్సిపాలుగారి ప్రశంసాపత్రం ఆధారంగా విశ్వవిద్యాలయంలో ప్రవేశించాను. చిత్తూరు వాణ్ణిగా నన్ను శ్రీ సి. ఆర్. రెడ్డిగారు గుర్తిస్తే నాకు ఆంధ్ర విశ్వ కళా పరిషత్తులో ప్రవేశం లభించి వుండేది కాదు. ప్రాంతీయ తత్త్వం కాని కులతత్త్వం కాని వారికి లేవు. వారు ఉపాధ్యక్షులుగా వున్న కాలంలో చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తిగాని, రెడ్డిగాని, విశ్వవిద్యాలయంలో చెప్పుకోదగ్గ ఉద్యోగంలో ఒక్కడు కూడా నియమించబడలేదు. ప్రాంతీయ తత్త్వమూ, కులమూ ప్రధాన ప్రాతిపదికగా జరిగే ఈనాటి ఉద్యోగ నియామకాల్ని చూస్తున్న మనకు ఆనాటి కాలంలోని విషయాలు యథార్థాలైనా వింతగా కనిపిస్తాయి. యోగ్యతను బట్టి మాత్రమే ఆనాడు ఉద్యోగాలు ఇవ్వబడేవి. అందువల్లవే ఈ విశ్వవిద్యాలయం ఈ విధంగా వర్ధిల్లింది. ప్రాంతీయ భేదాలు పాటించకుండా ఉపాధ్యాయుల విద్యార్థుల ఎంపిక జరిగేది. కార్డినల్ న్యూమన్ లాగు, తర్వాత వారికి ఆదర్శంగా డా॥ రెడ్డిగారు విశ్వవిద్యాలయంలో ఉత్తమ విలువల్ని నెలకొల్పారు.

1951 ఫిబ్రవరిలో డా॥ రెడ్డిగారు దిగవంతులైన తర్వాత దుఃఖోద్విగ్న మనస్సుతో మూడో ఉపన్యాసం ఇచ్చాను. విశ్వవిద్యాలయానికి, నాకు, వారి మరణం తీరనిలోటు. గద్గద కంఠంతో వారి మేధా సంపత్తిని గురించి హృదయ వైశాల్యాన్ని గూర్చి మాట్లాడాను. వారితో నాకున్న పరిచయ సాన్నిహిత్యాల వలన వారి సలహాలవల్ల, మొట్టమొదట విశ్వవిద్యాలయ మేగజైన్‌ను సుందరంగాను సమర్థవంతంగాను వడవగలిగాను. ఆవ్పటి వరకు శ్రీ కర్రా వెంకటరావుగారు నిర్వహించిన పరీక్షకమండలి అధ్యక్షపదవిని చేపట్టవలసిందిగ శ్రీ రెడ్డిగారు నన్ను ఆదేశించారు. "ఇంతకంటె పిన్న వయస్కునివద్ద ఇంతకటె సమర్థవంతుని దగ్గర నేవెవ్వడూ

పనిచెయ్యలేదు.'' అని ఒక వరిష్ఠాచార్యులు శ్రీ సి. ఆర్. రెడ్డిగారితోచెప్పగావారుచాలా సంతోషించిరి. ఆ పదవిలో నన్ను 12 సంవత్సరాలు కొనసాగించారు. ఫేకల్టిక్లబ్ కార్యదర్శిగా వారిని తరచు కలుసుకొని వారిఅమూల్యాలైన సూచనల్ని పొందుతూండే వాణ్ణి. వారు ఉదారంగా విరాళమిచ్చి ఫేకల్టిక్లబ్ నిర్మాణానికి కారకులయ్యారు.

ద్వితీయ ప్రపంచ సంగ్రామ కాలంలో విశ్వవిద్యాలయం గుంటూరుకు తరలించబడింది. అప్పుడు శ్రీ రెడ్డిగారు మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలో "జాతీయ యుద్ధాగ్రనాయకులు"గా పనిచేసేవారు. విశ్వవిద్యాలయంలో సైనిక సంయోజకాధికారిగా దక్షిణాది సైన్యానికి సాయంచేయటానికి నన్ను వారు నియమించారు. విశ్వ విద్యాలయ కళాశాలలలో అర్హులైన అభ్యర్థుల్ని కొందర్ని ఎంపికచేసి కమీషన్డ్ ఆఫీసర్సుగా పంపాను. తర్వాత వారిలో కొందరు సైనిక నౌకా విమానదళాలలో వున్నతాధికారులుగా పనిచేసి విశ్రాంతి తీసుకొన్నారు.

గుంటూరు నుంచి వాల్తేరు తిరిగి వచ్చింతర్వాత విద్యార్థి వసతి గృహాలు ఏర్పాటు చేయవలసినదిగ నన్ను కోరారు. వసతి గృహాలకు కావలసిన వనివాళ్ళు, వనిముట్లు, భవనాలు యేమీలేవు ఇన్ని యేర్పాట్లు 600 మంది విద్యార్థులకొరకు కొద్దికాలంలోవే చేయవలసివచ్చింది. అప్పటి ఆర్థిక శాఖాచార్యులైన డా॥ కృష్ణ గారు ఈ విషయాల్లో నాకు సాయం చేశారు. వంటవాళ్ళను తీసుకువచ్చే పెద్దసమస్య ఎదురైంది. ముప్పైమంది వంటవాళ్ళు అవసరమైవుండగ ఇద్దరు మాత్రమే అప్పుడు వున్నారు. స్నేహితులద్వారా నాయర్లను ఒరియా వారిని స్థానికులైన రెడ్లను మరి కొంత మందిని వంటవారిగ నమకూర్చుకో గలిగాను. బ్రాహ్మణేతరుల్ని వంట వాళ్ళుగా వేస్తే గొడవలు రావచ్చు అని 1940 ప్రాంతంలో వార్డెనుగ పనిచేసిన డా॥ కృష్ణగారు అనుభవపూర్వకముగ నన్ను హెచ్చరించారు. ఈ సమస్యను ఎట్లా ఎదుర్కోవాలో నాకు అంతువట్టలేదు. డా॥ రెడ్డిగారినుంచి సిఫారసు వుత్తరం తీసుకొని ఇద్దరు వ్యక్తులు ఆ సాయంకాలం నా దగ్గరకు వచ్చారు. ఇది అసాధారణ విషయం వారు ఎవరికీ ఎవ్వుడూ సిఫారసు చేసిన వారు కాని సిఫారసులను అంగీకరించినవారు కాని కాదు. 'ప్రియమైన బి. ఎమ్. ఈ ఇద్దరు వ్యక్తులు వెద వాల్తేరుకు చెందిన హరిజనులు నీకు అంగీకారమైతే వీళ్ళను మీ వసతి గృహాల్లో వంటవాళ్ళుగ నియమించుకోవచ్చు - మీ సి. ఆర్ ఆర్. ఇది నేను ఊహించని అభినందన. డా॥ కృష్ణగారు శ్రీ రెడ్డిగారితో నేను బ్రహ్మణేతరుల్ని వంటవాళ్ళుగ

నియమిస్తున్న విషయం చెప్పగ వారు 'అతనికి ఇష్టమైతే హరిజనుల్నికూడా నియమించ వచ్చు,' అని ఈ వుత్తరంలో ఇద్దరు హరిజనుల్ని నా దగ్గరకు వంపారు. ఈ విషయముగ డా॥ కృష్ణగారు నాతో తర్వాత చెప్పారు. నేను రెడ్డిగారి సిఫారసును అంగీకరించలేదు. వసతిగృహ నిర్వహణ నా ధ్యేయం కాని సంఘ సంస్కరణ నా వుద్దేశం కాదు. పని జరిగటం నా ముఖ్యోద్దేశం. సి. ఆర్. రెడ్డి గారికి అది వ్రతం. వారు తమ ఇంటి వంట వాళ్ళుగా హరిజనుల్ని నియమించారు. వారు హరిజన బాంధవులు. గాంధీగారి హరిజనోద్ధరణకు పూర్వమే 1918లో శ్రీ రెడ్డిగారు హరిజనులు గుళ్ళకు వెళ్ళటం కంటె పాఠశాలలకు వెళ్ళటం మంచిదని చెప్పి, మైసూరులో హరిజనులకు అందరికీ పాఠశాలల ద్వారాల్ని తెరిపించారు. వారికి బ్రాహ్మణులంటే చాలా ఇష్టం. ఎంతో మంది వారికి బ్రాహ్మణ స్నేహితులున్నారు. వారందరికీ డా॥ రెడ్డిగారెన్నో వుపకారాలు చేశారు. కాని వెనుక బడిన తరగతులవారికి పంచములకు వారు పరమాప్తులు. వారి వ్యక్తిత్వాన్ని సరిగా అర్థంచేసుకొన్న వారికి మాత్రమే వారి ద్వంద్వ ప్రవృత్తి, సాంఘిక సంబద్ధత సేవాభావం అర్థమౌతాయి.

డా॥ రెడ్డిగారి మేధాశక్తి సంపదను, ఉపన్యాస సామర్థ్యాన్ని, మద్రాసు రాష్ట్రంగాని కేంద్ర ప్రభుత్వంకాని, వినియోగించుకోలేదని వారి సంస్కృతి సమావేశంలో నేను చెప్పాను. కేంబ్రిడ్జిలో వుండగ శ్రీ రెడ్డిగారు 1905లో ఏబరల్ క్లబ్బు సెక్రటరీగ పార్లమెంటు ఎన్నికలలో పాల్గొని అనేకోపన్యాసాలు యిచ్చారు. ఆ వుపన్యాసాలు విన్న కొందరు ఆంగ్లేయులు బ్రిటిష్ పార్లమెంటులో అతని అత్యుత్తమ పబ్యుడుగ రాణించటమేకాక ప్రధాని అయ్యే అవకాశం వుందనీ, కాని శ్రీ రెడ్డిగారి జాతి విభిన్నత అందుకు అడ్డుపడిందనీ భావించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినవ్వుడు వీరు అత్యుత్తమ పదవి అలంకరించి ప్రజాసేవ చేయగలరని ఆనాటి ప్రముఖాంగ్లేయులు భావించారు. ఎందుకూ పనికిరాని మనుష్యులందరూ మంత్రి పదవుల్ని చేబట్టగ శ్రీ రెడ్డిగారి సేవల్ని మనదేశం స్వాతంత్ర్యానంతరం అందుకోలేక పోయింది. 1930కు పూర్వం ప్రభుత్వము నిర్వహించిన జస్టిస్ పార్టీ వీరిని చూచి భయపడింది. వర్ణవ్యవస్థను రాజకీయ సిద్ధాంతముగ వ్యతిరేకించిన శ్రీ రెడ్డిగారిని కాంగ్రెస్ పార్టీకూడా ఎప్పుడూ ఆదరించలేదు. శ్రీయుతులు ఎస్. శ్రీనివాస అయ్యంగార్, సి. రాజగోపాలాచారి, శ్రీ టి. ప్రకాశం వంతులు, శ్రీ బి. సాంబమూర్తిగార్లకు రామలింగారెడ్డిగారు కొరకురాని కొయ్య.

మద్రాసు ఉమ్మడిరాష్ట్రంలో కాంగ్రెసు నాయకులైన వీరికి డా॥ రెడ్డిగారి మేధా నంపద దుస్సహమైనది. పార్లమెంటుకుకాని. కాన్స్టిట్యూయెంట్ అసెంబ్లీకికాని డా॥ రెడ్డిగారు తీసుకోబడలేదు. ఆంధ్ర విశ్వకళా పరిషదుపాధ్యక్ష పదవికికూడా శ్రీ కడప కోటిరెడ్డిగారిని శ్రీ సి. ఆర్. రెడ్డిగారికి వ్యతిరేకముగ నిలబెట్టారు. స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాతకూడా ఏవర్ణం వ్యక్తినైనా ఓడించాలంటే అదే వర్ణం వ్యక్తిని వ్యతిరేకముగ నిలిబెట్టాలనే సిద్ధాంతం ఆచరణలోకి దురదృష్ట వశాత్తు వచ్చింది. ఇటువంటి వంచనా పూర్వ రాజకీయాలంటే శ్రీ రెడ్డిగారికి ఆగ్రహావేశాలు కలిగినాయి. కాంగ్రెస్ జస్టిస్ పార్టీలపట్ల వారికి నిరాశనిస్పృహలు కలిగినాయి. అందరూ వారి మేధానంపదను, రచనలను, మహోపన్యాసాలను మెచ్చుకొనేవారే, కాని దూరముగ వుంచేవారు. ఈ కారణముగనే ఆంధ్ర, మైసూరు విశ్వవిద్యాలయాలవంటి చిన్న సంస్థలలో పనిచేయవలసి వచ్చిందేకాని డా॥ సి. ఆర్. రెడ్డిగారి వంటి వరమహంసలు భారతమానస సరోవరాన్ని చేరలేక పోయారు. చర్చిల్ వంటి మహావక్త, రస్సెల్ వంటి మేధావి అయిన డా॥ రెడ్డి గారిని ఐక్యరాజ్య సమితికి భారతదేశ ప్రతినిధిగ వంపివుంటే మన కాశ్మీరు సమస్య సులభముగ పరిష్కారమై వుండేది. ప్రపంచానికి వారి రాజనీతిజ్ఞత తెలిసి వుండేది ప్రపంచ వేదికపైన వారి వక్తృత్వ పటిమ లోక ఖ్యాతమై వుండేది.

గాంధీ ఉద్యమంలోని సత్యాగ్రహులపై ఆంగ్లేయులు కావించిన అణచి వేత విధానాలకు నిరసనగ శ్రీ సి. ఆర్. రెడ్డిగారు ఆంధ్ర విశ్వకళా పరిషదుపాధ్యక్ష పదవికి రాజీనామా చేయటాన్ని మన మెరుగుదును. లార్డ్ విల్లింగ్డన్ గారికి 1930 లో సమర్పించిన రాజీనామా లేఖ చరిత్రాత్మకమైంది, రెడ్డిగారి స్థానానికి జరిగిన పోటీలో వారిమద్దతుతో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణగారు సర్ రఘుపతి వెంకటరత్నం నాయుడుగారిపై ఐదు ఓట్ల తేడాతో గెలిచారు. చిత్తూరు రాజకీయాలలో ప్రవేశించిన రెడ్డిగారికి నిరాశ నిస్పృహలు ఎదురయ్యాయి. తమ ఉపాధ్యక్ష పదవిని తృణ ప్రాయంగా వదలివేసిన రెడ్డిగారిని కాంగ్రెస్‌వారు ఎప్పుడూ గౌరవించలేదు. వారి సేవలను పొందలేదు. కేంబ్రిడ్జ్, జ్యోతిషం కులతత్త్వ భూయిష్టమైన భారతదేశంలో ఎప్పుడూ ఫలించడానికి అవకాశం లేదు. ఇవన్నీ 1951 నాటి స్మృతులు. 30 సంవత్సరాల తర్వాత ఇప్పుడు వారిని గూర్చి విని నిష్పక్ష పాతంగా స్థిత ప్రజ్ఞ త్వంతో చెప్పవచ్చు.

స్వాతంత్ర్య సముపార్జన విషయంలో డా॥ రెడ్డిగారికి కాంగ్రెస్‌వారికి భేదాభిప్రాయాలు ఉన్నాయి. బ్రిటిషు ఆధిపత్యంలోనే పూటూ మతసామరస్యాన్ని సాధించి వర్ణ విభేదాల్ని విస్మరించి, భాషాదురభిమానాల్ని మటుమాయం చేసుకొని, తదనంతరం స్వాతంత్ర్యాన్ని గురించి ప్రయత్నించాలని డా॥ రెడ్డిగారు భావించగ ఇవన్నీ అప్రధానాలనీ స్వాతంత్ర్య సిద్ధి ప్రధానమని కాంగ్రెస్ వారి భావం. దేశం విభక్తమై భారతదేశానికి 1947 ఆగష్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. ఆనాటి రాత్రి 12 గంటలకు విశ్వవిద్యాలయంలోని ఆర్ట్సు కాలేజి ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి నెహ్రూ ఉపన్యాసాన్ని విన్నాం. డా॥ రెడ్డిగారు ఆనాడు అక్కడలేరు. అనారోగ్యంతో "పద్మప్రభాస"లో వున్నారు. దేశం విభక్తమైనందుకు వారు చింతాక్రాంత చేతస్కులయ్యారు. గాంధీ జిన్నాలతో సన్నిహిత సంబంధాలు కలిగి వుండి, దేశ విభజనను పరిహరించ వలసిందిగాను, మతసామరస్యాన్ని సాధించ వలసిందిగాను పలుమార్లు శ్రీ రెడ్డిగారు వారికి విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్యానంతరం ముప్పై సంవత్సరాలు గడిచినా మతకల్లోలాలను, వర్ణవిభేదాలను, మనం గమనిస్తే డా॥ రెడ్డిగారి దూరదృష్టి మనకు అవగతమౌతుంది. 1907లో భారత దేశానికి వచ్చినప్పుడే రెడ్డిగారిని మహా విద్యావేత్తగా అందరూ గుర్తించారు. అప్పుడే వారు బరోడా కళాశాలలో ఉపన్యాస మిస్తుండగా తరగతులు విద్యార్థులతో క్రిక్కిరిసి వుండేవి. ఆయనశైలి, ఆలోచనా ధోరణి, హాస్యోక్తులు అందర్నీ అలరించాయి. విద్యాధికారిగా వుండి పాఠశాలలో వంచములకు ప్రవేశార్హతను కలిగించి ఉన్నత విద్యాప్రమాణాలను నెలకొల్పి రెడ్డిగారు మైసూరు విశ్వవిద్యాలయానికి మార్గమేర్పరచారు. తర్వాత వీరు విద్యామంత్రి కావాలనే కోరికతో మద్రాసు రాజకీయాలలో ప్రవేశించారు. కాని జస్టిస్ పార్టీవారు అడ్డుతగిలారు. మద్రాసు విశ్వవిద్యాలయములో కొన్ని మార్పులు తీసుకురావాలని కొన్ని సూచనల్ని చేయటమే కాకుండా ఆంధ్రులకు విశ్వవిద్యాలయం వేరుగా కావాలని వీరు కౌన్సిల్‌లో వాదించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేసి దానికి ఉత్తమ వ్యక్తిత్వమున్న శ్రీ సి. ఆర్. రెడ్డిగారిని ప్రథమోపాధ్యక్షులుగా వుండమని శ్రీ పానగల్లు రాజాగారు కోరారు. గుణగ్రహణ పారీణులయిన సి. ఆర్. రెడ్డిగారు సి. డి: యస్. చెట్టిగారిని విశ్వవిద్యాలయ రిజిష్ట్రారుగా నియమించారు. వీరిద్దరి కృషివల్ల విశ్వవిద్యాలయం సర్వతోముఖాభివృద్ధిని సాధించింది.

మద్రాసు విశ్వవిద్యాలయంలో లేని క్రొత్త కోర్సులను ఎన్నో రెడ్డిగారు ఆంధ్ర విశ్వకళావరిషత్తులో నెలకొల్పారు. వాణిజ్య సాంకేతికాది శాఖలను ఏర్పరచడంలోను వాణిజ్య విద్యార్థులకు హిందీ నిర్బంధ విద్యగా బోధింపించడంలోను వీరు చొరవ చూపారు. హిందీ ప్రాముఖ్యాన్ని 1930లోనే గుర్తించారు. అప్పటికీ హింది జాతీయభాషగా అనబడలేదు. సంస్కృతమే జాతీయభాష కాదగిందని రెడ్డిగారు భావించారు. అందరికీ అర్థమయ్యేటట్లుచేసి సంస్కృతభాషను నేర్పితే భాషాసమస్య లేకుండా భావసమైక్యత మనదేశంలో నెలకొంటుందని భావించటంలో తప్పులేదు. బోధనతోపాటు పరిశోధనను డా॥ రెడ్డిగారు ప్రాణంగ భావించేవారు. రష్యా అమెరికాల తర్వాత మన దేశంలోనే పరిశోధక విద్యార్థుల సంఖ్య అధికంగా వుంది. కాని పరిశోధనా ఫలితాలు ఫలవంతాలుగాలేవు. వారి కలలు కల్లలు కాని కాలం త్వరలోనే రాగలదని ఆశిద్దాం

డా॥ సి. ఆర్. రెడ్డిగారి వద్ద పనిచేసిన రిజిష్ట్రార్లు, ఆచార్యులు, ప్రిన్సిపాల్స్ వారిని ప్రశంసించేవారు, వారంటే కొంత భయపడేవారు కూడా, శ్రీ విస్సా అప్పా రావుగారు ప్రిన్సిపాలుగ వుండగా నేను వారి గదిలో వున్నప్పుడు ఒకసారి రామలింగా రెడ్డిగారి వద్ద నుంచి ఫోనుకాల్ రాగా అప్పారావుగారు వారి కంఠాన్ని గుర్తుపట్టి తొందరపాటుతో తప్పుగాను సరిచేసుకొన్నారు. అధికారికంగా వారినిచూసి భయపడ వచ్చునేమోకాని పార్టీలలో వారు సరదాగా వుండేవారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తులో సంవత్సరానికి రెండు మూడు సార్లు అందర్నీ ఉద్దేశించి, ఆలోచనా పూర్వకాలైన హాస్యపూరితోపన్యాసాలు యిచ్చేవారు, ఒక పర్యాయం సాంస్కృతీక దినోత్సవ సమా వేశంలో చారిత్రక పురుషుల పేర్లతో కొన్ని ద్వారాలు, వెలయింపచేశారు. వాటిలో "ఇక్ష్వాకుద్వారం" 'శ్రీ కృష్ణదేవరాయ ద్వారం' మొదలైనవి వున్నాయి, కాని రెడ్డి రాజుల పేర్లతో ఏ ఒక్క ద్వారమూలేదు. దీనికి కారణమేమిటని డా॥ రెడ్డిగారు అక్కడి వారిని అడిగారు. వెంటనే శేషావతారం అనే విద్యార్థి కార్యదర్శి: 'ప్రాచీ నాంధ్ర సామ్రాజ్య చక్రవర్తుల స్మృత్యంజలిగా ఈ ద్వారాల్ని ఏర్పాటు చేశామండి కాని రెడ్డి సామ్రాజ్యం ఇంకా మహోజ్జ్వలంగా వెలుగొందుతోంది కదా!" అని నద్యస్ఫూర్తితో చమత్కారముగ సమాధానము ఇవ్వగా శ్రీ రెడ్డిగారు విద్యార్థి తెలిపి తేటలకు సమయస్ఫూర్తికి చాలా సంతోషించారు.

పరీక్షల నుంచి డిటెన్షన్ నుంచి విద్యార్థుల్ని తప్పించటానికి 1946 లేదా

47లో తిక్కవరపు భవనానికి ఎదురుగ లింగారెడ్డి అనే వ్యక్తి సత్యాగ్రహం చేయ మొదలుపెట్టాడు. ఉపాధ్యక్షులను పరిస్థితులు విషమించకముందే వెంటనే చక్కపరచ వలసిందిగా అప్పుడు వార్డెనుగైన నేను కోరాను. రెండు రోజుల తర్వాత ఇప్పటి బ్యాంక్ బిల్డింగ్‌లో సిండికేట్ మీటింగ్ జరిగే సందర్భంలో శ్రీ రెడ్డిగారి కారుముందు విద్యార్థులు బైఠాయించారు. ఈ ప్రదర్శన పెద్దగా జరిగింది. వందలాది విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు తదితరులునిస్సహాయంగా చూస్తున్నారు. ఉపాధ్యక్షుల్ని ఈవిషమ పరిస్థితి నుంచి తప్పించటానికి ఏదో ఒకటి చేయాలని నాకు అనింపించింది అచట రోడ్డున పడుకొన్న ఒక్కొక్క విద్యార్థిని పేరుపెట్టి పిలిచాను. తాను గుర్తించ బడ్డానికి ఇష్టపడని ప్రతి విద్యార్థి లేచి జారుకున్నాడు. వసతి గృహాలలో వున్న 600 విద్యార్థులందరి పేర్లు వార్డెనుకు తెలుసునన్న ప్రతీతి ఒకటి వుండేది. ఆ విధంగా చేయకపోతే పోలీసులను పిలవవలసి వచ్చేది. డా॥ రెడ్డిగారు విశ్వవిద్యా లయాల్లో ఈ నూతన సత్యాగ్రహాది ఉద్యమాల్ని సహించే వారుకారు. సహాయ నిరాకరణోద్యమ సిద్ధాంత ఫలితంగా ఏర్పడిన దుష్పలితాలే ఇవి అని వారు భావించే వారు. వారి భావం సరి ఐనదే అని మనం ఇప్పుడు తెలుసుకొంటూ వున్నాము.

డా॥ సి. ఆర్. రెడ్డిగారి శక్తిసంపద రాజకీయాలలోను, విద్యా విషయంలోను కాకుండా వారి మౌలికాలోచనలోను శైలిలోనూ వుంది. శైలి మానవుడనీ, భాష పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుందనీ ఆంగ్లసూక్తి ఒకటి వుంది. డా॥ రెడ్డిగారి శైలి, 'వధసంయోజనరీతి' వాక్య విన్యాసం అనితరసాధ్యం. తమ గంభీర భావాల్ని సుందర శైలీవాక్య వస్త్రాలతో వారు అలంకరించేవారు. ఈ విషయాన్ని మనం వారి ఆంధ్రాంగ్ల గ్రంధాలలోనూ, ఉపన్యాసాలలోనూ గమనిస్తాం. శ్రోతలు పఠీతలు వారి భావ గాంభీర్యానికి శబ్ద చమత్కృతికి ముగ్ధులౌతారు. తిక్కన, వేమన, చిన్నయల శైలి, సిడ్నీ, షెల్లీల భావతత్త్వమూ మనకు 'కవిత్వతత్త్వవిచారము' అనే వారి కవితావిమర్శక గ్రంథంలోనూ, వారి పద్యాలలోనూ, ఇతర వచన రచనలలోనూ కన్పిస్తాయి. వారు రచించ తలపెట్టిన శ్రీ మదాంధ్ర మహాభారత విమర్శ పూర్తికాక పోవటమూ రానిన కొన్ని భాగాలూ అలభ్యాలు కావటమూ మన దురదృష్టం.

ఆంగ్ల రచనలలో వారిని బర్క్‌తో కొందరు పిలుస్తారు. డా॥ రెడ్డిగారి శైలి హాస్యభరితమై ఆనందదాయకముగ వుంటుంది. బర్క్ గొప్పమేధావి. ఆయన రచనలు కాని, ఉపన్యాసాలుకాని ఆలోచనా పూర్వకంగావుంటాయి. కాని ఆనందదాయకంగా

వుండక విసుగు పుట్టించేవిగా వుంటాయి. డా॥ రెడ్డిగారి శైలిని చర్చిల్ శైలితో కొంతవరకు పోల్చవచ్చు. వారి ఉపన్యాసాలను వినటానికి అందరూ వుత్సుకతను చూపేవారు. తెలుగు పండితులకంటె తెలుగులో బాగా మాట్లాడేవారు. ఆంగ్లేయ విద్వాంసుల్ని మించి ఆంగ్లంలో మహోపన్యాసం కావించేవారు. ఎమ్. ఎన్. రాయ్ ఎమ్. ఎ. జిన్నాలతో వుత్తర ప్రత్యుత్తరాలు జరిపి వారితో సాన్నిహిత్యం సంపాదించిన రాజకీయ విజ్ఞానవేత్త డా॥ రెడ్డిగారు, వీరు సర్ ఆశుతోష్ ముఖర్జీవంటి విద్వాంసుడు. ఆంధ్ర సారస్వత విమర్శకు నూతన శకారంభం కావించిన వారి 'కవిత్వతత్త్వ విచారము' పండిత మండలి ప్రశంసలను అందుకొన్నది. వారి అర్థశాస్త్ర గ్రంథం అవశ్యపఠనీయం. వారు తెలుగులో రచించిన కృతులు పరిణామంలో తక్కువగా వున్నా గుణంలో అత్యుత్తమంగా వున్నాయి. రాజకీయాలను పరిహరించి సారస్వత సేవను ధ్యేయంగా పెట్టుకొని వుంటే డా॥ రెడ్డిగారు ఆంధ్రాంగ్ల సారస్వతాలను మరింత సుసవన్నం చేయకలిగేవారు. రాజకీయాలలో వారి శక్తి సామర్థ్యాలు తక్కువైనవేమీకావు. కాని వారి పర్ణం వారికి అడ్డంవచ్చింది. ఇవ్వటి పార్టీ కులాభిమానాలలో కాళిదానుకూడా తగిన జాతికి, పార్టీకి చెంది వుండకపోతే రాణించేవాడు కాదు. డా॥ రెడ్డిగారు కులాలకు మతాలకు పార్టీలకు అతీతులయిన మహావ్యక్తి. ఈ పరిస్థితిని గుర్తించి వారు తమ దృష్టిని పూర్తిగా సారస్వతం వైపు మరలించేసరికి కాలాతీతమైంది. ఇప్పుడు వారు, వారి జీవితాన్ని దుర్భరం చేసిన ప్రత్యర్థులూ, ఎవరూ లేరు. అస్మృతులు విస్మృతం కాకుండా మనం ప్రయత్నిస్తున్నవ్వటికి చరిత్ర వాటిని మెల్లగా మరపిస్తున్నది. ఇది ప్రకృతి ధర్మం.

పరిణత ప్రజ్ఞాసంపన్నుడు

ఆచార్య ఎన్. జి. రంగా

కలకత్తా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులయిన శ్రీ అశుతోష్ ముఖర్జీగారి వలె ఆంధ్ర విశ్వకళా పరిషదుపాధ్యక్షులైన డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డిగారు విఖ్యాత విద్యావేత్త. డాక్టర్ రెడ్డిగారు ఆంధ్ర విశ్వకళాపరిషత్తుకు ప్రథమ ఉపాధ్యక్షులుగా ఉండటమే కాక ఈ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దిన స్రష్టకూడ, స్వాతంత్ర్య పూర్వపు దశాబ్దాలలో చదువరులను అధికంగా ప్రభావితం చేసే విశ్వవిద్యాలయ స్నాతకోపన్యాసాలలో సామ్రాజ్య వ్యతిరేక మేధావి వర్గ నాయకులయిన డా॥ రెడ్డిగారి ఉపన్యాసాలు నిష్కర్షగ వుండి బ్రిటిష్ పరిపాలనకు భీతిని కలిగించేవి. 1930లో ఆంగ్లేయుల ఉప్పు సత్యాగ్రహ దమనకాండకు నిరసనగా వీరు తమ ఉపాధ్యక్ష పదవికి సమర్పించిన రాజీనామా పత్రం వైసాయ్ ఇర్విన్‌కు గాంధీగారు వ్రాసిన తుదిగడువు ఉత్తరం వలె భయకారకమైనది దేశభక్తులు వీరిని తమ సాహసోపేతుడైన ప్రతినిధిగా ప్రస్తుతించారు.

దక్షిణాదిని తమతరం వారిలో శ్రీ రెడ్డిగారు అత్యంత మేధానంపన్నులు. ఈ శతాబ్దపు ప్రథమ దశకంలో వీరు కేంబ్రిడ్జి నుంచి పట్టాన్ని పొందారు. తెల్లవారి ఆధిక్యము అధికముగ వున్న ఆరోజుల్లో వీరు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ యూనియన్ నాయకత్వాన్ని చేపట్టారు. ఇంగ్లండుకు ఉన్నత విద్యకై వెళ్ళటానికి పూర్వమే శ్రీ రెడ్డిగారు తెలుగులో ప్రఖ్యాత కవిగా, పండితుడిగా, విమర్శకుడుగా పేరు పొందారు. ఆనాడు మద్రాసు ప్రెసిడెన్సీకి డా॥ రెడ్డిగారు తప్పక ముఖ్యమంత్రి కాగలరని పలువురు భావించారు. కాని దురదృష్టవశాత్తు శ్రీ రెడ్డిగారు ముఖ్యమంత్రి

కాదు సరికదా మంత్రికూడా కాలేదు. వీరు మంత్రి లేదా ముఖ్య మంత్రి ఐతే ఇంగ్లండులోని ఏస్క్విత్ వలె దక్షిణాదిని రాజాజీవలె ప్రజాసేవ చేసి వుండేవారు. మద్రాసులో స్వాతంత్ర వధం విషాదాంతం కావటానికి కారణం ఏమి? బాల్‌పుత్ ఎస్ క్విత్తులను తప్పించి స్వాతంత్ర్యం ఎవ్వడు తెలివైన వండితుల సేవలను గ్రహించింది ?

సంస్కరణాభిలాష - స్వరాజ్యకాంక్ష :

డాక్టర్ టి. ఎమ్. మణి, శ్రీ పిట్టి త్యాగరాయచెట్టిగార్లచే నిమ్న వర్గాలకు చెందిన బ్రాహ్మణేతరులకు సాంఘిక న్యాయాన్ని సమకూర్చటానికి స్థాపించబడ్డ జస్టిస్ పార్టీలో చేరివుంటే శ్రీరెడ్డిగారు 1921లోనే ముఖ్యమంత్రి అయివుండేవారు. బ్రాహ్మణేతర పక్షాన్ని ఆశ్రయించి తమ సమకాలీన మేధావి వర్గంలో శ్రేష్ఠతను సంపాదించుకోవాలని ఎప్పుడూ భావించలేదు. బ్రాహ్మణేతరులకు సహాయము చేయటానికి ఇటువంటి రాజకీయ వేదిక అవసరం అనికూడా వీరు అనుకోలేదు. అఖండ జాతీయతపై విశ్వాసముంచి కేంబ్రిడ్జి విద్యార్థిదశలోనే స్వాతంత్ర్యం కోసం విజ్ఞప్తి చేసిన వీరు బ్రాహ్మణేతరులకు సాంఘిక న్యాయం చేకూర్చే వరకు జాతీయ స్వాతంత్ర్య సమరాన్ని వాయిదా వేయటానికి అంగీకరించలేదు. కాబట్టి జస్టిస్ పార్టీవారి విజ్ఞప్తిని వీరు నిరాకరించారు.

స్త్రీలపై, బ్రాహ్మణేతరులపై హిందూ మతాధిపతులు విధించిన నిర్బంధాలను డా॥ రెడ్డిగారు నిజముగ అసహ్యించుకున్నారు స్వరాజ్యంవచ్చిన తర్వాతకూడా ఈ నిర్బంధాలు ఈ నిర్భాగ్యులపై కొనసాగవచ్చునని తలచికూడ స్వాతంత్ర్య సమరాన్ని వాయిదా వేయటానికి వీరు ఇచ్చగించలేదు. తమ వార్ధక్యంవల్ల అనారోగ్యంవల్ల శ్రీ త్యాగరాయచెట్టిగారు తిరస్కరించగా కడలూరు లాయరుగారైన శ్రీ వెంకట సుబ్బారెడ్డిగారి నానాడు ముఖ్యమంత్రిగా బ్రహ్మణేతర పక్షం ఎన్ను కొన్నది. ఆశకంలో భారతీయులకు అత్యున్నత పదవిగా భావించబడ్డ విద్యాశాఖ డైరెక్టరుగ మైసూరు రాష్ట్రంలో శ్రీ రెడ్డిగారు వుండేవారు.

రాజకీయరంగప్రవేశం :

1923 నాటి మద్రాసు కౌన్సిలులో జస్టిస్ పార్టీవారికి కొద్ది మెజారిటీ వున్నప్పటికీ వారు తమ బలం చాలావరకు కోల్పోయారు. అప్పుడు డా॥ రెడ్డి

గారు మైసూరు విద్యాధికారి పదవిని విడిచిపెట్టి మద్రాసు కౌన్సిలు సభ్యులుగా ఎన్నికయ్యారు. జాతీయవాదులతో కూడిన ప్రతిపక్షానికి వాయకులై వీరు చతురులయిన పానగల్లు రాజాగారి జస్టిస్ మంత్రివర్గానికి ముఖ్య విమర్శకులుగ వేరు పొందారు. ఆ సభలోని వాద ప్రతివాదాలు శ్రీ రెడ్డిగారి చతుర హాస్యోక్తులతో, పాండితీ విమర్శలతో వెలుగొందేవి. వాద ప్రతివాదాలకు అంతగా అలవాటువడని జస్టిస్ పార్టీ మిత్రులపై, మితభాషులైన పాలక సభ్యులపై వీరు కాపించే హాస్య వ్యంగ్యోక్తులు విద్యావంతులకానాడు విందుచేసేవి. ప్రభుత్వ వర్గాలకు భయ హేతువైన కాంగ్రెసువాది సత్యమూర్తి శ్రీ రెడ్డిగారికి వాద ప్రతివాదాలతో చేదోడు వాదోడుగ వుండేవాడు. రాజకీయ ధురంధరుడైన పానగల్లు రాజావారు శ్రీ రెడ్డి గారికి అత్యంత ప్రీతి పాత్రమైన ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఏర్పరచి దానికి తొలి ఉపాధ్యక్షులుగ వారినేనియమించి వారి విమర్శలబారినుంచి తప్పించుకున్నారు.

శ్రీ రెడ్డిగారు ఆ వలలో ఎలాచిక్కుకున్నారు? చిరకాలం పదవులలో వుండి ఇవ్వాడు ఏమంత్రిపదవి లేకుండా దీర్ఘకాలం వీరుబహుశః వుండలేకపోయి వుంటారు. జస్టిస్ పార్టీని కాంగ్రెసు పార్టీ ఓడించినప్పటికీ సుదీర్ఘకాలానికి కాని సాధ్యంకాని స్వరాజ్యసముపార్జన సాధిస్తేనేకాని పాలన యంత్రాంగాన్ని కాంగ్రెసు చేజిక్కించుకో లేదు అని వీరు తలచి వుంటారు. ఇంగ్లండు నుంచి ఇండియాకు తిరిగిరాగానే బరోడాలో ఆచార్య పదవిని అలంకరించి తర్వాత విద్యా పరిపాలనకు సంబంధించిన పదవులను పెక్కింటిని వీరు పొందారు. వ్యతిరేక రాజకీయ సంక్షోభాల నుంచి తప్పుకొన్నందుకు వీరు విచారించలేదు.

ఉదార చరితుడు - విద్యావేత్త :

ఆంధ్ర విశ్వకళావరిషత్తు అదృష్టరేఖలను తీర్చిదిద్ది దీనిని భారతదేశ విశ్వవిద్యాలయాలలో అగ్రగామిగా రూపొందించగల అవకాశము తమకు లభించినందుకు శ్రీ రామలింగారెడ్డిగారు ఆనందించారు. అత్యంత మేధావులైన శ్రీయుతులు వి. కె. ఆర్. రావు, నూరిభగవంతం, కీ॥శే॥ హుమయూన్ కబీర్ వంటి వారిని తమ చుట్టూ పరిభ్రమింపచేస్తూ విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలకు పునాదుల్ని వీరువేశారు. వివిధ రంగాలలో రత్నాల వంటి వ్యక్తుల్ని గుర్తించి పైకి తీయటంలో వీరు ఆశుతోష్ ముఖర్జీ వంటివారు. పండితుల సాహచర్యాన్ని వీరు సదా అభిలషించేవారు.

ఎక్కడో మైసూరులో ఆచార్యులుగా వున్న తత్త్వవేత్త రాధాకృష్ణను సర్

ఆశుతోష్ ముఖర్జీకి వీరు సిఫారసు చేశారు. ఆ కారణముగా కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవిని అధిష్ఠించిన రాధాకృష్ణ పండితులు పాశ్చాత్య ప్రపంచ దృష్టి నాకర్షించారు. ఇదే విధంగా ఐరిష్ కవి డాక్టర్ కజిన్స్‌కు పరిచయం చేయబడటం ద్వారా శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారు అంతర్జాతీయ ఖ్యాతి నార్జించారు. నా ఆక్స్‌ఫర్డ్ స్నేహితుడైన డాక్టర్ వి. యస్. కృష్ణకు లెక్చరర్ పదవినుంచి తన తదనంతరం ఉపాధ్యక్ష పదవి వచ్చేవరకు డాక్టర్ రెడ్డిగారు దోహదమిచ్చారు. ప్రఖ్యాత చరిత్ర పరిశోధకులు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు వీరి వల్లనే విఖ్యాతులయ్యారు. 'Economic organisation of Indian villages' అనే నా గ్రంథానికి వీరు వ్రాసిన పాండిత్య స్ఫోరకమైన పీఠిక నన్ను భారతీయ విద్యావీథులలో నిలబెట్టింది. ఎంతో శ్రమపడి తెలుగులో బౌద్ధ దర్శనంపై ఉద్గ్రంథాన్ని రచించిన కీ॥ శే॥ శ్రీ దుగ్గిరాల బలరామ కృష్ణయ్యగారి పాండిత్యమెంతగానో మెచ్చుకొన్నారు డాక్టర్ రెడ్డిగారు. అటువంటి మహత్తర గ్రంథం తెలుగులో, వెలువడినందుకెంతగానో సంబరపడి రచయిత బలరామకృష్ణయ్యగారిని 'బౌద్ధ వాఙ్మయ బ్రహ్మ' బిరుదుతో సత్కరించడం రెడ్డిగారి సాహితీ పాండిత్యాభిలాషకు ప్రమాణం.

చక్కని రచయిత, విమర్శకుడు :

పెక్స్పియరు సమకాలికుడైన పింగళి సూరన మహాకవి కవితా వైభవాన్ని ప్రతిభా ప్రభావాన్ని సూక్ష్మదృష్టితో విశ్లేషించి డా॥ రెడ్డిగారు ఈ శతాబ్ది ప్రజలకు సూరనను ప్రియపాత్రుని కావించారు. కళాపూర్ణోదయ ప్రబంధానికి వీరు వ్రాసిన పరిచయం ప్రబంధాలలో కళాపూర్ణోదయానికి నుస్థిర స్థానాన్ని ప్రసాదించడమే కాక తెలుగులో విమర్శకరచనలకు కొత్త ప్రమాణాలను కల్పించింది. వీరు తమ నూతన వచన కవితాస్వతంత్ర ధోరణులచే ఆధునిక రచయితలను ప్రభావితం చేశారనటంలో సందేహంలేదు.

శ్రీ రెడ్డి తెలుగు కవులకు, రచయితలకు నాలుగు దశాబ్దాలపాటు ఆశ్రయంగా ఉన్నారు. వీరు 1910 సంవత్సరంలో ప్రకటించిన 'కవిత్వతత్త్వ విచారము' వెలుగులో కవితారచనకు సూత్ర పరికల్పన చేసింది. ఆనాడు శ్రీ రెడ్డిగారి నుంచి పీఠికను, ఆముఖాన్ని, ప్రశంసను, పొందగలిగిన రచయిత తన్నుతాను ధన్యుడిగా భావించే వాడు. ఆధునిక తీరానికి చెందిన రచయితలను ఉదారముగ వీరు శ్లాఘించటమే

కాకుండా నిర్మాణాత్మక విమర్శలను, సూచనలను కావించి అవసరమైన వారికి ఆర్థిక సహాయాన్ని కూడా అందించేవారు. శ్రీ వీరేశలింగం గారు వచన రచనా విధానంలోను వివిధ ప్రక్రియలలోను ఆధునికాంధ్ర రచయితలకు మార్గదర్శకులైనట్లు డాక్టర్ రెడ్డిగారు ఆధునికాంధ్ర రచయితలందరికీ ఆచార్య వర్యులయ్యారు. మహాత్మా గాంధీ స్వీయ చరిత్రను కవితా రూపంలో వెలయించిన కళాప్రపూర్ణ శ్రీ తుమ్మల సీతారామ్మూర్తిగారు, సౌందరనంద రచయిత శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగారు, ఆంధ్ర నాయక కర్త శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు వీరిచే ప్రోత్సాహించబడిన వారిలో ప్రముఖులు ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో 'కళాప్రపూర్ణ' బిరుదును ఏర్పరచి నుప్రసిద్ధాంధ్ర సంస్కృత విద్వాంసులయిన శ్రీ వేదం వేంకటరాయ శాస్త్రిగారిని దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారిని ప్రథమ ద్వితీయ గ్రహీతలుగ ఆహ్వానించి ఆ మహోత్కృష్ట బిరుదు ప్రదానం కావించారు.

రసజ్ఞతగల జాతీయవాది :

తెలుగుద్వారా విద్యాబోధన జరపటానికి ఆంధ్రులకు ప్రత్యేక విశ్వవిద్యాలయం కావాలనే డా॥ రామలింగారెడ్డిగారి సంకల్పం వెరవేరలేదు. తెలుగుకు ఆంగ్లభాషతో సమాన ప్రతిపత్తి కలిగించాలని తెలుగు ఆచార్యులను ఆంగ్లాచార్యులతో సమానముగ గౌరవించాలని వీరు వాదిస్తూ వుండేవారు. మిగిలిన విశ్వవిద్యాలయాలవలె శ్రీ రెడ్డిగారి విశ్వవిద్యాలయంకూడా ఆంధ్ర సారస్వత గ్రంథాలయ భవనాది విపిధ విషయాలలోను వెనుకబడివుంది. డా॥ రెడ్డిగారు ఆంగ్లభాషా ప్రియులు. వీరికి ఆంగ్లభాషా విశిష్ట స్వరూప స్వభావాలు కరతలామలకం. విద్యాబోధనాది విషయాలలో ఆంగ్లభాషా స్థానభ్రంశాన్ని వీరు అంగీకరించలేదు. హిందూ దేశభాషలు విద్యాబోధన విషయంలో ఆంగ్లంతో సమాన ప్రతిపత్తిని పొందాలని అంతర్విశ్వవిద్యాలయ వివిధ వేదికలపై ప్రసంగించి తమ నిర్వ్యంద్యాధికారాన్ని వలుకుబడిని మాత్రం ఉపయోగించలేదు.

కాని అన్యాయమే జరిగింది :

ఆంధ్ర కాంగ్రెసు నాయకులు ఉదారముగను సర్వసమభావంతోను వ్యవహరించి వుంటే డా॥ సి. ఆర్. రెడ్డిగారు ప్రజ్ఞాధరుడైన మంత్రిగా రాణించివుండేవారు.

1936-37లో కాంగ్రెసు శాసన సభలలో ప్రవేశించటానికి, మంత్రులు కావటానికి నిర్ణయించినప్పుడు డా॥ రెడ్డిగారు ఉపాధ్యక్షులుగా వున్నప్పటి తమ దేశభక్తిని పరిగణించి తమను ఆహ్వానిస్తారని ఆశించారు. కాని సంకుచిత దృష్టి ఆధికార వ్యామోహ పూరితులయిన కాంగ్రెస్‌వారు "ప్రతి వ్యక్తి పార్టీ టికెట్టుకు దరఖాస్తు పెట్టుకోవాలి తర్వాత క్రమ నిర్ణయానికి అభ్యర్థులు బద్ధులై వుండాలి" అని తెలిపారు.

కాంగ్రెసు నాయకుల ఇటువంటి అహంకారపూరిత ధోరణి ఉత్తరప్రదేశ్‌లోని కలీఖుజ్జమాన్ తిరుగుబాటుకు తర్వాత ప్రత్యేక పాకిస్తాన్ పిలుపుకు దోహదంచేసింది. 1936-39 శాసన సభలో శ్రీ రెడ్డిగారు ప్రవేశించలేదు. ఎమ్. ఎల్. ఏ. లు కాని పలువురిని మంత్రులుగా తీసుకొన్న ముఖ్యమంత్రి రాజాజీకి శ్రీ రెడ్డిగారికి విధాన మండలి సభ్యులు కారన్నది నిజంగా ఒక కారణంకాజాలదు.ఆసందర్భంలో రెడ్డిగారికి జరిగిన అన్యాయాన్ని గమనించి రాజకీయవేత్తలు పలువురు ఆవేదన చెందారు. కాని ఆంధ్ర తమిళనాడు కాంగ్రెసు నాయకులు తమ రాజకీయాశలకు అడ్డుతగిలే శ్రీ రెడ్డిగారు విధానసభలో లేనందుకు సంతోషించి ఊపిరిపీల్చుకున్నారు. కాంగ్రెసు నాయకులు శ్రీ రామలింగారెడ్డిగారివే కాదు రైతుకుటుంబంలో పుట్టిన ప్రముఖ విద్యావేత్తలై దేశభక్తులై రాజకీయ దురంధరులైన శ్రీ కె. కోటిరెడ్డి, శ్రీ ఎమ్ బాపినీడుగార్లనుకూడా మంత్రివర్గంలోకి ఆహ్వానించలేదు. అటువంటి పరిస్థితులలో ఆత్మగౌరవంకల దక్షిణాదివారు కాంగ్రెసు వైఫల్యాలను గమనించి వారి సంకుచిత దృక్పధాన్ని తెగనాడటంలో ఆశ్చర్యంలేదు.

స్వతంత్ర వ్యక్తిత్వంగల మహావక్త :

ఈనాడు అమెరికా నీగ్రోలు కృష్ణచర్య సౌందర్య లావణ్యాలను తెలుసు కొంటున్నారు. వేల సంవత్సరాలకు పూర్వమే భారతీయులు ఈ విషయంగుర్తించి తమ శ్రీరామ శ్రీకృష్ణులను నీలమేఘశ్యాములుగా చిత్రించారు. శ్రీ రామలింగా రెడ్డిగారు కూడా నీలమేఘశ్యాములు. ఏ ప్రమాణంతోచూచినా వారు అందమైన వారు. అర్ధలలాటం ప్రకాశవంతమై వీరి వదనానికి వింత సొబగును చేకూర్చేది.

పరిసమానమైన ఎత్తుకలిగి సూటులో వీరు బాగుండేవారు. వంచెకట్టులో మిరింత బాగుండేవారు. వీరిపై దుస్తు ఆజన్మోపాధ్యక్షులు అనిపించేది: వీరి చిరునవ్వు ఆకర్షణీయముగ వుండేది. డా॥ రెడ్డిగారు మహావక్త. తిక్కన మహాభారత కవితారీతుల్ని ఉగ్గడించే వీరిశైలి అద్వితీయం. వీరి మర్యాదలకు విజయనగర రాజుల మన్ననలను తలపించచేసేవి.

నేను వీరితో కొన్నిరోజులు కలిసి మెలసి ఉండటమనేది ఒక అపూర్వానుభవం వీరు దేవతల్ని గౌరవించేవారు, పుష్పాలను ప్రేమించేవారు, అందులోనూ మాలతిని మరింత. వీరెక్కడున్నా కవి పండిత మండలి పరివేష్టితులై చుక్కల్లో చంద్రునివలె ప్రకాశించేవారు. మంచి వస్తువులను ఇష్టపడే వీరు తమ ఇష్టాలను నిస్సంకోచంగా వెల్లడించేవారు. డాక్టర్ రామలింగారెడ్డిగారు తమ ప్రథమ ప్రేమ విఫలమైన కారణంగా వివాహం చేసుకోలేదు. వీరు తమ ప్రేయసి జ్ఞాపకార్థం ప్రశంసా పద్యాలు రచించారు.



వైస్ ఛాన్సలర్‌గా డాక్టర్ సి. ఆర్. రెడ్డి

అఖండ మేధావి
ఆంధ్ర విశ్వవిద్యాలయ నిర్మాత

శ్రీ ఎమ్. ఆర్. అప్పారావు

భారతదేశంలోని పేరెన్నికగన్న విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులలో కలకత్తాకు చెందిన సర్ ఆశుతోష్ ముఖర్జీ, కాశీకిచెందిన పండిత మదన్ మోహనమాలవ్య, మైసూరుకు చెందిన బ్రజేంద్రనాథ్ శీక్, ఘనమైన కార్యములు సాధించి కీర్తి నార్జించారు. వీరందరిపట్ల డా॥ కట్టమంచి రామలింగారెడ్డిగారెంతో గౌరవం కలిగివుండేవారు. అంతేగాని ఆ మహనీయుల పేర్ల వరుసలో, తానుకూడా ఒకడనే భావం కనవరచేవారుకారు. అయినా, ఆంధ్ర రాష్ట్రంలోని విద్యారంగచరిత్ర - కాదు-భారతదేశ విద్యారంగంలో పైన చెప్పిన శ్రేణికి చెందినవారే డా॥ కట్టమంచి అని నిర్ధారణ చేసింది, విద్యారంగంలో భవిష్యత్తు ప్రగతికి ప్రణాళికలు వేసిన దిట్టలలో ఆ మహనీయు లొకరనడంలో సందేహంలేదు. మొదటనుండి, తన అభిరుచిలోను, తరిపిదులోనుకూడ ఆయన మంచి ఉపాధ్యాయుడు, విద్యావేత్త, రాజకీయ రంగంలో ఆయన సాధించినట తక్కువ కాకపోయినా, దానిని వదలి మరల విద్యారంగంలో ప్రవేశించటం ఆయన చేసిన సరైనపని. విద్యావేత్తగానే ముందు ఆంధ్రదేశంలోను తరువాత మైసూరులోని ఎక్కువ కాలం గడిపి, ఎన్నోతరాల వారికి, తనతరంలోను, తర్వాత తరాలలోగూడ, పాండిత్య ప్రతిభ లభించేటట్లు చేశారు.

డా॥ రామలింగా రెడ్డిగారు చిత్తూరుకు దగ్గరగా వున్న కుగ్రామం కట్టమంచిలో పుట్టారు. ఆ గ్రామీణ వాతావరణం, వారి పూర్వీకుల సాంప్రదాయ అలవాట్లువారికి పురాతన పద్ధతులపై మక్కువ, నిరాడంబర జీవిత విధానంపై ఆసక్తి కలిగించాయి.

ఎడిసన్ వ్రాసిన గ్రంథాలలో మనం చదివే ఇంగ్లీషు గ్రామీణ భూమంచులవంటివారే రాయలసీమ ప్రాంతంలోని రెడ్డివారు. వారు పెద్ద భూస్వాములు, గ్రామాలలోని పండితులు, అక్కడి తగాదాలను పరిష్కరించే న్యాయనిర్ణేతలు. మిగతాకులాల వారంత వారిని చాలా గౌరవమర్యాదలతో చూచేవారు. వారు చూపించే దయాదాక్షిణ్యాలవల్ల, న్యాయ ప్రవర్తనవల్ల, వారు ప్రజల పొగడ్తల నందుకొనేవారు. వారు అ ప్రాంత సాంప్రదాయాలను కాపాడ బదకంకణులుగా వుండేవారు. గ్రామ ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లటానికి అన్నివిధాల దోహదంచేసేవారు. బలా కలరాజులు, గొప్ప ప్రభుత్వాలు, పట్టణాలలో వుండి పరిపాలించి వుండచ్చు, గ్రామాలు మాత్రం రెడ్డివారు అభిమానించి పోషించే స్నేహపూరిత పంచాయితీల నీడలో హాయిగా జీవించేవి.

చిత్తూరు దగ్గల వున్న యీ కుగ్రామం, 100 సంల క్రిందట ఆ మాదిరి సుఖ సంతోషాలతో విరాజిల్లుతూ వుండేది. 19 వ శతాబ్దం చివరి భాగంలో జిల్లా ముఖ్యపట్టణంగా వున్న చిత్తూరులో హైస్కూలు విద్యా కేంద్రముండటమువల్ల, అనేక మార్పులొచ్చాయి. ప్రజలు క్రమంగా వారి హక్కులు, బాధ్యతలను గురించి తెలుసు కోసాగారు. అయినా, భాగ్యవంతులు. సాంప్రదాయంగా ఔదార్యవంతులు అయిన రెడ్డి కుటుంబాలవారు తమకు నాయకులుగా, వరవడి దిద్దేవారుగా, ప్రజలు చూచుకునే వారు.

రామలింగారెడ్డిగారు, సుబ్రహ్మణ్యరెడ్డిగారి రెండవ కుమారులు. సుబ్రహ్మణ్య రెడ్డిగారు మంచి ఆర్జన కలిగిన సుప్రసిద్ధ న్యాయవాది. గొప్ప నియమాలుకలిగిన వ్యక్తి. సచ్ఛీలము, న్యాయబుద్ధి కలవారు. తనకు న్యాయమని నమ్మకం కుదరనిదే ఏ వ్యాజ్యాన్ని చేపట్టేవారుకాదు. చిత్తూరు జిల్లాలోని అన్ని తాలూకాలలో అయన పేరు మారుమ్రోగేది. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి పార్టీలు వారికోసం వచ్చేవారు. వారందరికీ ఆయనపట్ల అపారగౌరవాభిమానాలుండేవి. అందువల్లనే, 30, 40 సంల తర్వాత సి. ఆర్. రెడ్డిగారు ఎన్నికలలో దిగి ఓట్లు అర్థించినప్పుడు, వారి తండ్రిగారిపైనగల గౌరవంతో అనేకమంది వారిని బలపరచటం జరిగింది.

విద్యార్థి దశ :

రామలింగారెడ్డిగారు 10, 11 సంల వయస్సులో 1890లో చిత్తూరు

హైస్కూలులో విద్యాభ్యాసానికి చేరారు. అప్పటికే ఇంటివద్ద రామాయణ, భారతాలు క్షుణ్ణంగా చదివారు. తండ్రి యీ గ్రంథాలలో నిష్ణాతులవటం వలన, వారి కుటుంబానికి చిత్తూరు హైస్కూలు ఉపాధ్యాయులు పండిత కుప్పానయ్యంగారు గొప్ప స్నేహితులవటం వలన, రెడ్డిగారికి యీ పురాణ పఠన బాగా సాగింది. స్కూలులో రామలింగ రెడ్డిగారి ప్రతిభావిశేషాలు అందరినీ ఆకర్షించాయి. ఉపాధ్యాయులందరికీ ఆయనవట్ల గొప్ప ప్రేమాభిమానాలుండేవి. ఆయన ప్రతిభను ఎంతగానో అభినందించేవారు. ముఖ్యముగ ఇంగ్లీషు తెలుగుభాషలలో ఆయనకున్న అద్భుత పాండిత్యం వారిని ముగ్ధులను చేసేది. 1896 సం॥లో ఆయన స్కూలు విద్య పూర్తిచేసుకుని, మరుసటి సంవత్సరం మద్రాసులోని క్రిష్టియన్ కళాశాలలో ఫైచదువులకు చేరారు. ఆయన చదివిన చిత్తూరు హైస్కూలు ఎట్లా ప్రతిష్ఠ కలిగినదో, అక్కడి ఉపాధ్యాయులు గొప్ప ఆదర్శాలకు, ప్రవర్తనకు ఎట్లా పేరు గడించారో, అట్లాగే మద్రాసు క్రిష్టియన్ కళాశాలగూడ రెడ్డిగారి జీవితాన్ని ప్రభావితంచేసి తీర్చిదిద్దింది. అప్పటికి ఆ కాలేజి ప్రిన్సిపాల్ డా॥ మిల్లర్, ఫిలాసఫీ ప్రొఫెసరు డా॥ స్కిన్నర్, ఇంగ్లీషు క్లాసులు ప్రొఫెసరు కెల్లెట్ తీసుకొనేవారు. వీరంతా రెడ్డిగారి తెలివితేటలకు, చదువు పట్ల ఆసక్తికి, మంచి అలవాట్లకు, సునిశితమేధా సంపత్తికి అచ్చెరువొందారు. పాఠ్య గ్రంధాలను ఆయన అవలీలగా చదవటం చూచి వారు ముగ్ధులయ్యారు. ఆయనకు తెలుగు చెప్పిన పండితుడు పామర్తి రంగయ్యచెట్టి, సంస్కృతం నేర్పినవారు శ్రీ వేదం వెంకటరాయశాస్త్రి. వీరియెడ అభిమానాన్ని రెడ్డిగారు చూరగొన్నారు. 1899 సం॥లో శ్రీ రంగయ్యచెట్టిగారు ఏర్పరచిన పోటీలో పాల్గొని, వచ్యములలో 'ముసలమ్మ మరణము" అన్న కథ వ్రాసి బహుమతిని అందుకున్నారు. సాంప్రదాయకమైన ప్రబంధ శైలికి భిన్నంగా ఈ వచ్యరచన సాగింది. వచ్య రచనలో ఒక నూతన ప్రమాణాన్ని ఈ రచన వెలకొల్పింది. రెడ్డిగారు 'కళాపూర్ణోదయానికి' ఒక క్రొత్త విమర్శ వ్రాశారు. పేరు "కవిత్వ తత్వ విచారము" ఇది విమర్శ గ్రంథముగ నూతన ప్రమాణాలు సృష్టించింది. ఆ తరువాత దీనిని తిరిగి పెద్ద గ్రంథంగా వ్రాసి ప్రకటించారు. తెలుగు సాహిత్యంలో యీ గ్రంథమొక ఆదర్శంగా నిలచింది.

1901 సం॥లో హిస్టరీ, ఫిలాసఫీ సబ్జక్టులతో వట్టభద్రుడై, అనేక విశ్వవిద్యాలయ బహుమానాల నందుకొన్నారు. ఆ వెంటనే భారత ప్రభుత్వ స్కాలర్‌షిప్పు సహాయంతో ఇంగ్లండుకుపయనమైవెళ్ళి, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలోచేరారు.

ఆ విశ్వవిద్యాలయంలోని సెంట్‌జాన్ విద్యాలయంలో, చిత్తూరు హైస్కూల్లులో, మద్రాసు కళాశాలలో మోస్తరే గొప్ప ప్రతిభావంతముగ రెడ్డిగారు పెలుగొందాడు. బహుశా అవ్వటికంటె ఇంకా ఎక్కువ ప్రతిభనే ప్రదర్శించారని చెప్పవచ్చు. అక్కడా ఆ తరంలోని అనేకమంది గొప్ప మేధావులతో పరిచయం పెంచుకున్నారు. కొద్ది కాలంలోనే గొప్పవక్తగా, వాదనాపటిమగల వ్యక్తిగా గుర్తించబడి, లిబరల్ క్లబ్ కార్యదర్శిగాను, యూనియన్ సంఘ ఉపాధ్యక్షుడుగను ఎన్నుకోబడ్డారు. బహుశా భారతీయుడు ఉపాధ్యక్ష పదవికి ఎన్నుకోబడటం అయనతోనే మొదలయింది.

మహావక్త :

1905లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో లిబరల్ పార్టీ తరపున రామలింగారెడ్డిగారు ప్రచారంచేసి నూటికి పైగా మీటింగులలో పాల్గొన్నారు. వీటిలో కొన్నిటికి అప్పటిలో ఇంగ్లడులో వుంటున్న శ్రీ గోపాలకృష్ణ గోఖలేగారు కూడా హాజరైనారు. రెడ్డిగారి బుద్ధి వైశిష్ట్యానికి, ఉపన్యాసధోరణికి అచ్చెరువొందిన ఇంగ్లీషు మిత్రులు వారికి గొప్ప భవిష్యత్ వుంటుందన్నారు. ఆయన నల్లగా వున్నాడు గనుక గాని, లేకపోతే, రెడ్డిగారు ఇంగ్లడు ప్రధానేకాగలడన్నారు కూడ. గోఖలే గారంటే రెడ్డిగారికి అమిత గౌరవముండేది. ఆయన సలహా మేరకు హిస్టరీ ట్రైపాస్‌పై దృష్టి కేంద్రీకరించి ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైనారు. ఇంగ్లండులో వున్న బరోడా గాయకవాడ్ మహారాజా మేధావంతులైన, ప్రతిభకల్గిన భారతీయులకై వెతుకుతూ, రెడ్డిగార్ని అమెరికా వెళ్ళవలసిందని, అక్కడి బోధనా పద్ధతులను అభ్యసించవలసినదనీ, ఆ తర్వాత భారతదేశానికి తిరిగివస్తే బరోడా కళాశాలలో వారిని నియమించగలననీ ప్రోత్సహించారు. ఆకారణంగా రెడ్డిగారు 1907లో అమెరికాలో వివిధ విద్యా సంస్థలలో గడిపారు. మరుసటి సంవత్సరం భారతదేశానికి తిరిగివచ్చి బరోడా కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గ శ్రీ అరవిందఘోష్ వదలి వెళ్ళిన స్థానాన్ని అలంకరించారు. అప్పటి విద్యార్థులు చెప్పేవారు- రెడ్డిగారి తరగతులు గొప్ప హాస్యంతో జ్ఞానంతో తొణకిసలాడేవని, ఇతర డిపార్టుమెంటులోని విద్యార్థులు ఆయన తరగతికి వచ్చి వారి అద్భుత ఉపన్యాసాలను చెవియొగ్గి వినేవారనీను.

ఆ మరుసటి సంవత్సరమే మైసూరునుండి వారికి పిలుపు వచ్చింది. వీరి ఉపన్యాసాలను యిదివరలో విన్న దివాన్, వీరిని ఆహ్వానించారు. మహారాజావారి

కళాశాలలో హిస్టరీ ప్రొఫెసరుగాచేరి విషయ వివరణలోను, పాండిత్యంలోను గొప్ప శక్తివంతుడుగ కీర్తిగాంచారు. 1913లో ఐరోపా పర్యటనకు మైసూరు యువరాజు బయలుదేరినప్పుడు, ఆయన వెంట వెళ్ళవలసినదిగ రెడ్డిగారు నియుక్తులైనారు. ఆ పర్యటనలో అనేక విద్యా సంస్థలను, పరిశ్రమలను చూచి, వాటి వివరాలను ఎప్పటికప్పుడు మైసూరు దివాను శ్రీ యం. విశ్వేశ్వరయ్యగారికి తెలియజేస్తూవచ్చారు. మైసూరులో విశ్వవిద్యాలయం స్థాపించాలని ఆలోచనరాగానే, సి. ఆర్. రెడ్డిగారు మరల కెనడా, జపాన్, ఇతర తూర్పుదేశాలను పర్యటించి, ఒక నివేదికను తయారు చేసి సమర్పించారు. దాని ఆధారంతోనే మైసూరు విశ్వవిద్యాలయం ఏర్పడింది. 1916లో మహారాజా కళాశాలకు ప్రిన్సిపాల్‌గా రెడ్డిగారు నియమితులైనారు. ఆ తరువాత ఇన్‌స్పెక్టరు జనరల్‌గా మైసూరు రాష్ట్రమంతటా అన్నిస్థాయిల విద్యాభ్యున్నతికి పనిచేసే అవకాశం వారికొచ్చింది. ఈ పదవిలో వున్నప్పుడే గొప్ప దూరదృష్టితో మైసూరు సంస్థానంలోని అన్ని పాఠశాలల్లో హరిజనుల ప్రవేశ సంస్కరణాన్ని ప్రవేశపెట్టారు. సనాతనుల వ్యతిరేకత వెదుర్కొనవలసి వచ్చింది. కాని త్వరలో పట్టువదలి వారుగూడ యీ సంస్కరణకు అనుకూలురయ్యారు. ఇది గాంధీగారి హరిజన దేవాలయ ప్రవేశాలకు ఎంతో ముందుగా జరిగినదని మనము గుర్తించుకుంటే రెడ్డిగారి అసామాన్య ప్రతిభ మనకు ద్యోతకమవుతుంది. హిందూ మతంలో అస్పృశ్యులుగ పరిగణింపబడిన పిల్లలకు, దేవాలయ ప్రవేశంకంటె గూడ పాఠశాల ప్రవేశం అత్యంత విలువైనదనేవారు శ్రీ రెడ్డిగారు. విద్యగరచినప్పుడే ఆర్థికంగ అభివృద్ధి అయి మిగతా కులాలతోబాటు సమానస్థాయికి రాగలరనేవాడు. రెడ్డిగారు ప్రవేశపెట్టిన యీ నవయుగ సంస్కరణకు మైసూరు ప్రజలు ఇప్పటికీ వారిని నిస్మరించరు.

రాజకీయరంగం:

1921లో రాజకీయరంగం ప్రవేశించదలచి రెడ్డిగారు మైసూరు వదలి, మద్రాసుకు వచ్చారు. అప్పుడు జస్టిస్‌పార్టీ అధికారంలోవుంది. గొప్ప విద్యావేత్తగా ఆయన విధాన సమితికి ఎన్నుకోబడ్డారు. కాని మంత్రిగా ఆయన్ని తీసుకోటానికి పార్టీ వెనుకాడింది. కారణం సునిశిత మేధాసంపత్తితో, అఖండమైన వ్యక్తిత్వంతో విరాజిల్లే రెడ్డిగార్ని పార్టీ హద్దులమధ్య వుంచటం కష్టమవుతుందని.

అప్పటిలో జస్టిస్ పార్టీ నాయకుడు. ముఖ్యమంత్రిగావున్న పానగల్ మహారాజా, రాజా రామరాయనంగపు వారు విజ్ఞానము, దూరదృష్టి కలవారు. ఆయన ఆంధ్రులకు వేరే విశ్వవిద్యాలయం వుండాలని, విశాఖపట్టణంలో వైద్య విద్యా కేంద్రం, మొదట పాఠశాలగా, తరువాత కళాశాలగా నెలకొల్పాలని నిశ్చయించారు. ఇప్పుడు విశాఖ మెడికల్ కళాశాల ఆంధ్రప్రదేశం అంతటికి మొదటి విద్యాసంస్థగ పెరొందింది. ఈ కళాశాల పాలకవర భవనాలకు ఆ సంసను సాపించినవారి స్మృతి చిహ్నంగ 'పానగల్ భవనాలు' అనే పేరు వుంది. పానగల్ మహారాజా వారికి సి. ఆర్. రెడ్డిగారితో అభిప్రాయ భేదాలుండేవి. అయినా వారిలోని గొప్పలక్షణాలను గుర్తించి, వారి సునిశిత హాస్యానికి, కౌన్సిల్‌లో వారి వాదనావటిమకు ముగ్ధులవుతూ వుండేవారు.

మద్రాసు విశ్వవిద్యాలయంలో తీసుకురావలసిన మార్పులను గురించి, వేరే ఆంధ్ర విశ్వవిద్యాలయం వుండాల్సిన అగత్యాన్ని గురించి కౌన్సిలు సభలలో జరిగే చర్చలలో సి. ఆర్. రెడ్డిగారి ఉపన్యాసాలు యెంతో దోహదకారులైనాయి. 1921లో ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపనగురించి నూత్రప్రాయంగా అంగీకరించి గోవిందరామవ అయ్యర్ నాయకత్వాన కమిటీని నియమించి, దానిస్థాపనకు ఆర్థిక వనరులు, ఇతర అవకాశాలను గురించి పరిశోధించమన్నారు. ఆంధ్రప్రాంతంలోని అనుబంధ కళాశాలలను వర్యవేక్షించటంలో దూరానవున్న మద్రాసు విశ్వవిద్యాలయానికి సాగే విషయం కాదనీ, 1923 నాటికి ప్రత్యేక విశ్వవిద్యాలయం ఆంధ్రులకు ఏర్పడాలనే నిర్ణయం తీసుకున్నారు. 1916లోనే మైసూరు విశ్వవిద్యాలయం ఏర్పడింది. 1918లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏర్పడింది. ఈ వాదనలతో ప్రత్యేక ఆంధ్ర విశ్వవిద్యాలయంకోసం అదరినీ నమ్మించేరీతిని సి. ఆర్. రెడ్డిగారు వాదించ గల్గినా, సర్కారుజిల్లాల రాయలసీమజిల్లాల ప్రతినిధులు ఒకరి అభిప్రాయాలతో మరొకరు ఏకీభవించ లేకపోవటం వలన, అది వెంటనే వెర వేరలేదు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం :

ఆ తరువాత మరొక సంఘమేర్పడింది. 1924లో విశ్వవిద్యాలయ స్థాపనను గురించి సాధక్ నివేదిక వచ్చింది. చివరకు 1925 ఆగస్టులో అప్పటి

విద్యామంత్రి శ్రీ ఎ. పి. పాత్రో, ఆంధ్ర విశ్వవిద్యాలయ బిల్లును ప్రవేశపెట్టారు. జస్టిస్ పార్టీలో ప్రముఖ మంత్రిగానున్న పాత్రోగారు, ఆయనమంత్రివదవి కాలమంతా ఆంధ్ర ప్రాంతంలోని ఉన్నత విద్యనుగురించి వాదిస్తూనే వున్నారు. ఆ బిల్లు రావటానికి యీ విధంగా 4 సంవత్సరాలు పట్టింది. అప్పటికే బిల్లుకు పెద్ద వ్యతిరేకత వుండనే వుంది. ముఖ్యముగా ఎక్కడ దాన్ని స్థాపించాలనే దానిపై వరస్పర వ్యతిరేకాభిప్రాయాలున్నాయి. ముందుగ మూడు విద్యా కేంద్రాలను గురించి ఆలోచించారు. ఒకటి విశాఖపట్నం, రెండు రాజమండ్రి, మూడు అనంత పూర్, విజయవాడలో వైస్‌ఛాన్సలర్ కార్యాలయం వుండాలన్నారు. ఈ ఏర్పాటు రాయలసీమ ప్రతినిధులకు నచ్చలేదు. బిల్లు ప్యాసవగానే వారు దానినుండి విడి పోయారు. విజయవాడ కేంద్రగా వుండిపోయింది. విశ్వవిద్యాలయాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం అనిగాక తెలుగు విశ్వవిద్యాలయం అని మార్చదలచారు. కాని సి. ఆర్. రెడ్డిగారు ఇందుకు వ్యతిరేకించటంతో దానిని మానుకున్నారు. చివరకు బిల్లు 1926లో ప్యాసయి, గెజిట్ పబ్లికేషన్ అయింది. సి. ఆర్. రెడ్డిగారిలోని విద్యాప్రతిభను గుర్తించిన పానగల్ మహారాజా ఆయన ప్రతిపక్షంలో వున్నప్పటికి ఖాతరు చెయ్యక, క్రొత్త విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడుగ అంగీకరించమని కోరగా రెడ్డిగారు అంగీకరించారు. నిజానికి 1915లో ఆంధ్ర మహాసభ చైర్మన్‌గా యీ కోరిక వెలిబుచ్చినప్పటినుండి విశ్వవిద్యాలయ స్థాపనకొరకై అహర్నిశలు పాటుపడిన వ్యక్తి సి. ఆర్. రెడ్డి. ఆయన ఉపాధ్యక్షుడైతే ఆపదవికి అర్హతకల్గిన వ్యక్తినినియమించి నట్లవుతుందని పానగల్ రాజాగారి అభిప్రాయం. సి. ఆర్. రెడ్డిగారు 1926 సంవత్సరం ఏప్రిల్ 26వ తేదీన ఉపాధ్యక్ష పదవి నధిష్టించారు. సెనెట్, సిండికేట్‌లు, అక్టోబరునెల నుండి విజయవాడలో పనిచేయ ప్రారంభించాయి. అనేక కోర్సులను, ప్రత్యేక శాఖలను ప్రారంభించే ప్రయత్నాలు జరిగాయి. అయినా ఎక్కడ ప్రారంభించాలో అర్థంకాలేదు- రాజమండ్రిలోనా, విశాఖపట్టణంలోనా, లేక అనంతపూర్‌లోనా? కొందరు విజయవాడలోనే ప్రారంభించాలనికూడ వాదించారు. చివరకు 1929లో విశాఖపట్నంలో అన్న నిర్ణయం జరిగింది. సిసిక్ హౌటలులో భవనాల సంఘం సమావేశమైంది. దానిలో ఉపాధ్యక్షుడు వుండేవారు. అదే రిజిష్ట్రారు ఆఫీసుగా తరువాత ఏర్పడింది. దానితోపాటు, 50 ఎకరాల స్థలాన్ని విశ్వవిద్యాలయంకోసం సేకరించారు. ఈ విధముగ విశాఖపట్నం ఆంధ్ర విశ్వ విద్యాలయ కేంద్రముగ స్థిరపడింది. ఉన్నత విద్యా కేంద్రముగ అనేక సైన్స-

ఆర్ట్స్ శాఖలలో పరిశోధనలకు నిలయముగ విలసిల్లి, గత 50 ఏళ్ళుగ అభివృద్ధి చెందుతూ వచ్చి, ఈనాడు ఆంధ్రులందరూ గర్వించదగిన గొప్ప సంస్థగా విరాజిల్లుతోంది.

పదవికి రాజీనామా :

అయితే, 1930 సం॥ చివరిలో సి. ఆర్. రెడ్డిగారు ఒక అసాధారణ నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ సత్యాగ్రహోద్యమ నాయకులను ప్రభుత్వం అరెస్టు చేయటం వట్టి నిరసనగా ఉపాధ్యక్ష పదవికి రాజీనామా యిచ్చారు. స్వతంత్ర సముపార్జనకు గాంధీజీ ప్రారంభించిన ఉద్యమం వారిని కదిలించివేసింది. ఆ వుద్యమంలోని అన్ని అంశాలతోను ఆయన కేకాభిప్రాయంలేదు. అయినా, సత్యాగ్రహులను బాధించి లాఠీలతో కొట్టినవ్వాడు, కారాగ్రహబద్ధులను చేసినవ్వాడు, ఆయనకు కలిగిన విచారమంతా యింతాకాదు. మద్రాసు గవర్నరుకు యీ సందర్భముగ రెడ్డిగారు చరిత్రాత్మక లేఖ వ్రాశారు. రాజకీయంగా అసమానత్వాన్ని అన్యాయాన్ని ప్రదర్శించి ప్రభుత్వానికి తన వ్యతిరేకతను, ఆగ్రహాన్ని నూటిగా వెలిబుచ్చి, తాను ఎంతగానో విలువయిచ్చిన ఇతరులందరూ తావే అందుకు అర్హుడనుకున్న, విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవిని త్యజించేశారు.

తదుపరి 5 సం॥లు ఆయన తిరిగి రాజకీయ రంగంలో గడిపారు. చిత్తూరు నుండి కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైనారు. చిత్తూరు జిల్లాబోర్డు అధ్యక్షులైనారు. అయితే యీ పదవులు, వారి గొప్ప సమర్థతకు, ఆశయాలకు అనువైనవి కాకపోయినాయి. 1930 సం॥లో రెడ్డిగారు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసిన తరువాత, డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆ పదవికి ఎన్నికైనారు. 1935 సం॥ నాటికి వాల్తేరులో భవన నిర్మాణం పూర్తయింది. కోర్సులన్నీ ప్రారంభమైనాయి. రాధాకృష్ణన్ ఆక్స్‌ఫర్డులో ప్రొఫెసరుగా పదవి తీసుకోవాలనుకున్నారు. అందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవికి సంవత్సరాంతానికి రాజీనామా చేశారు. ఆ వెంటనే చాలా మంది సెనెటర్లు సి. ఆర్. రెడ్డిగారికి, తిరిగి విద్యారంగం ప్రవేశించి, ఉపాధ్యక్షులుగా తమకు మార్గదర్శకత్వం వహించమని అర్థిస్తూ వుత్తరాలు వ్రాశారు. అందుకు రెడ్డిగారు అంగీకరించలేదు. 1936లో జరిగిన సెనెట్ మీటింగులో ఉపాధ్యక్షుడుగా ఎన్నికయి ప్రతిమూడు సంవత్సరాలకూ తిరిగి తిరిగి ఎన్నుకోబడుతూ 1949 సం॥ వరకు ఆపదవిని నిర్వహిస్తూ వచ్చారు. ఆ సంవత్సరంలో

మైసూరు ప్రభుత్వం వారిని మైసూరు విశ్వవిద్యాలయాన్ని పునర్మించ ఆహ్వానించగా అక్కడికి వెళ్లిపోయారు. కాని అక్కడ కొద్దికాలమే, రెండు సంవత్సరాలలోపే గడిపారు. అక్కడే అస్వస్థకుగురై, మద్రాసుకు వచ్చి ప్రయివేటు నర్సింగ్ హోమ్‌లో వైద్యం చేయించుకుంటూ 1951 సం॥ ఫిబ్రవరి 24వ తేదీన కన్నుమూసారు.

1936 నుండి 49 వరకూ 13 సం॥ల బాటు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎన్నో మార్పులకు సంక్షోభాలకు గురైంది. నాచురల్ సైన్స్‌స్‌లో జియాలజీ, జుయాలజీ, బోటనీలలో కొత్త కోర్సులు ప్రారంభమైనాయి. లా కాలేజీ ప్రారంభింపబడ్డది. ఫుడ్స్ అండ్ డగ్స్‌గా ఫార్మశీ కోర్సుకు శ్రీకారం చుట్టారు అప్లయిడ్ ఫిజిక్స్ శాఖగా ఇన్‌స్ట్రుమెంట్స్ విభాగం ఏర్పడింది. ఇట్లా నూతన శాఖల ప్రారంభంలో, సీట్లు పెంపకంతో, విశ్వవిద్యాలయ బడ్జెటు ఖర్చు పెరిగింది. కాని ప్రభుత్వ గ్రాంటు మాత్రం అట్లాగే వుండిపోయింది. అందుచే డా॥ సి. ఆర్. రెడ్డి ప్రజల నుండి విరాళాలు ప్రోగుచేయవలసి వచ్చింది. అందుకు వారు కృతకృత్యులయ్యారు. స్థానిక సంస్థలనుండేగాక, గొప్ప వదాన్యులనుండి, తిరువాన్కూర్, హైద్రాబాద్ సంస్థానాల నుండి కూడా విరాళాలు సేకరించగల్గారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి గొప్ప విరాళాల నిచ్చినవారిలో ప్రముఖంగా చెప్పుకోవలసిన వారు జయపూర్ మహారాజా విక్రమదేవవర్మగారు. వీరు 1933-34 సం॥లో రు 50,000 34-35లో రు 75,000లు యిచ్చి ఆ తరువాత ప్రతి సం॥ ఒక లక్ష చొప్పున 15 లక్షల వరకూ ఇచ్చారు. క్రొత్త విశ్వవిద్యాలయానికి ఇదొక "రాజ విరాళం". అప్పటికి ప్రభుత్వం ఇస్తున్నట సాలీనా రు 1.5 లక్షలు మాత్రమే. జయపూర్ మహారాజావారి విరాళంతో "యూనివర్సిటీ కాలేజి ఆఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ" అన్న విభాగం నిర్మించారు. రాజాగారిచ్చిన గొప్ప విరాళం జ్ఞాపకార్థం ఆ విభాగానికి జయపూర్ విక్రమదేవ్ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ" అని పేరు పెట్టారు. ఈ కాలేజి ముందు రాజావారి నిండైన శిలా విగ్రహం ప్రతిష్ఠించారు. విశ్వవిద్యాలయాలలో చదివి, పైకి వచ్చిన ప్రతి సైన్సు విద్యార్థి, మిగతా ఆర్ట్స్, హ్యుమానిటీస్ చదివిన ఇతర విద్యార్థులు కూడ, గొప్ప దాతగా జయపూర్ మహారాజావారిని తమ జీవిత వర్యంతం జ్ఞావక ముంచుకుంటారు.

యుద్ధకాలం :

రెండవ ప్రపంచ యుద్ధం గొప్ప సంక్షోభాన్ని తెచ్చిపెట్టింది. 1942 సం।లో జపాను వారి బాంబుదాడులకు విశాఖపట్టణం గురైంది. ఇష్టంలేకపోయినాసరే, తప్పనిసరిగా, విశ్వవిద్యాలయ భవనాలను డా। రెడ్డిగారు మిలిటరీవారి స్వాధీనం చేయవలసి వచ్చింది. క్షేమంగా వుండటానికి విశ్వవిద్యాలయ పరిపాలనా యంత్రాంగ మంతా గుంటూరుకు తరలించబడ్డది. ఇందువల్ల విశ్వవిద్యాలయ సామర్థ్యం చాలావరకు దెబ్బతినక తప్పలేదు. కొన్ని శాఖలను మద్రాసులో గూడ నాలుగు సంవత్సరాలు నిర్వహించాల్సి వచ్చింది. ఈ గందరగోళం ఎలన విశ్వ విద్యాలయం చాలా అస్తవ్యస్తమయింది. 1946లో యుద్ధ విరమణ తరువాత తిరిగి వాల్తేరుకు విశ్వవిద్యాలయం చేరింది. పరిపాలనా యంత్రాంగాన్ని, వివిధ శాఖలను, తిరిగి వాటి పూర్వస్థితికి అతిత్వరలో డా।। రెడ్డిగారు తీసుకురాగల్గారు. ఆ తరువాత అనేక విస్తరణ కార్యక్రమాలతో, ఉన్నతస్థాయి పరిశోధనలతో, అన్ని శాఖలు విరాజిల్లాయి.

డా। రెడ్డిగారికి అత్యంత సమర్థులైన ఉపాధ్యాయులు, పరిపాలకుల సహకారం లభించింది. డా।। ఎస్. భగవంతం, డా।। టి. ఆర్. శేషాద్రి, శ్రీ సి. డి. ఎస్. చెట్టి, శ్రీ విస్సా అప్పారావు, డా।। వి. ఎస్. కృష్ణ- మొదలగు వారంతా విశ్వవిద్యాలయంలో పనిచేసి, దానిని ఉన్నత విద్యారంగంలో డా।। రెడ్డిగారి నాయకత్వాన దేదీప్యమానంగా వెలుగొందే సంస్థగా తీర్చిదిద్దగల్గారు. రెడ్డిగారు మైసూరుకు వెళ్ళగానే విశ్వవిద్యాలయం డా। వి. ఎస్. కృష్ణగారి పరిపాలన క్రిందకు వచ్చింది. ఆయన 11 సంవత్సరాలు ఉపాధ్యక్షుడుగా పనిచేసి విశ్వవిద్యాలయ గ్రాంట్సు కమిషన్ అధ్యక్షులుగా ఢిల్లీకి వెళ్ళిపోయారు.

విమర్శకుడు - కవి

ఇక్కడ మద్రాసులోను, డా। రెడ్డిగారు గొప్ప విద్యావేత్తగా వెలుగొందటమే కాక, గొప్ప సలహాదారుగా మైసూరు, ఉస్మానియా, కలకత్తా విశ్వవిద్యాలయాలలో రాణించారు. గొప్ప వక్తగా పేరుగాంచారు. వారి ఉపన్యాసాలు కొన్ని ఇంగ్లీషులో ముద్రితము అయివున్నాయి. అవి వారి స్వీయ ఆలోచనాశక్తికి, చక్కని భాషా సరళికి, తార్కాణాలుగా నిలచి, భారతావనిలో అద్వితీయులుగా పేరికి కీర్తి తెచ్చి

పెట్టాయి. గొప్ప వక్తృత్వము ఉపన్యాసాలేగాక, తెలుగుభాషలో అసాధారణమైన రచనాశక్తిని డా।। రెడ్డిగారు ప్రదర్శించారు. వారి కవిత్వ శక్తికి అనేక తెలుగు పండితులు జే జే లు చెప్పారు. మహాభారతాన్ని ఆమూలాగ్రంగా క్షుణ్ణంగా చదివి, భారత పాత్రలు ఒక్కొక్కదానిని వివరించి, భారత సంఘటనలకు తన రచనలలో విపులీకరించి పేరుగాంచారు. వీటన్నిటికంటె చెప్పదగింది తెలుగు భాషలో 'విమర్శ'కు దారులేర్పరచి. సూత్రాలను రూపొందించిన ఖ్యాతి రెడ్డిగారికే దక్కినది. పద్య రచనలలో ప్రమాణాలెట్లా వుండాలో మొట్టమొదటిసారిగా నిర్వహించిన వారి అమూల్య గ్రంథం "కవిత్వ తత్వ విచారం" తెలుగు భాషకే అలంకార ప్రాయమైన గ్రంథరాజ మయింది. విమర్శలో ఒకకొత్త వర్ధతికి ఆయన మూల పురుషుడైనాడు. సిద్ధాంతకర్త అయినాడు. కందుకూరి వీరేశలింగం పంతులుగారి వంటి వచన రచయితగా, గురజాడ అప్పారావుగారి వంటి వినూత్న పద్యరచయితగా రెడ్డిగారు కీర్తింపబడ్డారు. కౌటిల్యుని అర్థశాస్త్రాధారంగా, మంచి అర్థశాస్త్ర పుస్తకాన్ని గూడా తెలుగులో రెడ్డిగారు రచించారు. ఆ విధంగా అధునాతన శాస్త్రాలను అభిప్రాయాలను చెప్పగలిగిన పదునును తెలుగు భాషకు సంతరింపచేసారు. ఆంధ్రాయూనివర్సిటీ కావాలని చేసిన వాదనలలో ఒకటి తెలుగు భాషను అత్యున్నత స్థాయి వరకు బోధనాభాషగా తీర్చిదిద్దాలని, అందు కవసరమైన సాహిత్యాన్ని సృష్టించాలని. 50 సంల తర్వాత గూడ ఇంకా ఈ ధ్యేయం అల్లంతదూరాన మాత్రమే వున్నదనే సత్యాన్ని మరువరాదు. కాని రెడ్డిగారు అప్పుడే అత్యంత క్లిష్టమైన అర్థశాస్త్రాన్ని తెలుగులో రచించి మార్గదర్శకుడైనారు. ఇక చరిత్రలో, తత్వశాస్త్రంలో తెలుగున చెప్పటం మరింత సుగమమని వేరే చెప్ప నక్కరలేదు. విశ్వవిద్యాలయం పెరుగుదలతోబాటే, తెలుగుభాష పెరుగుతోంది. విశ్వవిద్యాలయాన్ని 50, 60 సంల క్రిందట స్థాపించిన వారి మహదాశయం కూడఇదే. వారిలో అగ్రగణ్యులు డా।। సి. ఆర్. రెడ్డి. విద్యకు సాహిత్యానికి వారు చేసిన సేవ శాశ్వతంగా స్మృతిపథంలో నిలిచిపోతోంది.

వా విద్యార్థి దశలోనే డా: రెడ్డిగారిని నేనెరుగుదును. మా తండ్రిగారి స్నేహితులవటంవల్ల ఒకసారి వారు మా ఇంటికి వచ్చారు. మా తండ్రిగారి భాషాభిమానం, రెడ్డిగారి అభినందనలందుకొన్నది. నేను బి. ఏ. పూర్తిచేయగానే వారిని కలసి ముందు చదువులగురించి వారి సలహా అడిగాను. నన్ను "సహకార తనఖా బ్యాంకులవలన గ్రామీణ ప్రజల ఆర్థిక స్థితి గతులలో వచ్చిన మార్పులను

గురించి" పరిశోధన జరవవలసిండగ సలహా యిచ్చారు. ఆ విషయం మీదనే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధన జరిపి ఎం. ఏ. పట్టాన్ని పొందాను. నా పరిశోధనా వ్యాసాన్ని చదివి డా।। రెడ్డి చాలా సంతృప్తిని వ్యక్తపరచారు.

నేను సెనెట్‌కు, సెనెట్‌నుండి సిండికేట్‌కు ఎన్నుకోబడినప్పుడు డా। రెడ్డి గారి ఆనందానికి మేరలేదు. వారి ఆధ్వర్యాన జరిగిన సిండికేటు మీటింగులు విద్యా విషయిక ఔచిత్యానికి తార్కాణాలు. సిండికేట్‌లోని ప్రతి సభ్యునిపట్ల రెడ్డి గారు చూపించిన ఔదార్యము, వారి హృదయ వైశాల్యానికి నిదర్శనమేగాక, వారి సహచరులలోని ప్రతివారి శక్తి యుక్తులను గురించి రెడ్డిగారికున్న అవగాహనకు కూడ తార్కాణం. వారు మైసూరుకు వెళ్ళేటప్పుడు ఉపాధ్యక్ష పదవికి రాజీనామా లేఖను సిండికేటు ముందుంచుతూ రెడ్డిగారు కదిలిపోయారు. కొంతసేపటి వరకు వారి నోటివెంట మాటరాలేదు. అప్పుడు ఒక సభ్యుడు వారి నిర్గమనం వల్ల ఆంధ్ర విశ్వవిద్యాలయం తీర్చలేనిలోటు వెదురొక్కంటుందన్నప్పుడు, వారు గద్గదకంఠులైనారు. కళ్ళవెంట అశ్రుధారలు దొర్లాయి. అందరికళ్ళు చెమ్మగిల్లాయి. ప్రతి సభ్యునికి ఉపాధ్యక్షునిపైగల అభిమానంతో గౌరవంతో ఆ సమావేశం చరిత్రనే సృష్టించిందన వచ్చు. తరువాత కొద్దికాలంలోనే వాల్తేరు నుండి రెడ్డిగారు మైసూరు వెళ్ళారు. కాని దురదృష్టవశాత్తు అక్కడికి వెళ్లిన తరువాత వారి ఆరోగ్యం క్షీణించింది. అందుచే ఒక్క సంవత్సరమే అక్కడ వుండగల్గారు. 1951 సంవత్సర ప్రారంభంలో వారికి జబ్బు చేసింది. మద్రాసులోని మంచి నర్సింగ్ హోమ్‌లో చేరారు. 1951 ఫిబ్రవరి 24న విశ్వవిద్యాలయంలోని అభిమానులందరినీ దుఃఖ సాగరంలో ముంచి వారు దిగవంతులైనారు.

నిజంగా ధన్యజీవి డా॥ రెడ్డి

శ్రీ ఎ. ఎస్. పాండ్య

రామలింగారెడ్డి అసాధారణ ప్రజ్ఞా సంవన్నుడు. ఆయన సాధించిన వ్యక్తిత్వం నిజంగా అనితర సాధ్యమని చెప్పుకొంటాం. ఇది నిజమే. జీవితంలో మనిషి గొప్ప వాడు. కారణం స్వయంగా మనిషి లేనిదే మనిషి చేయగలిగినదంటూ ఏమీ వుండదు గనుక. కార్యం కారణంపై ఆధారపడి వుంటుందనేది యీరీత్యా స్పష్టమవుతుంది. నిజంగా బరోడా, మైసూరు, మద్రాసు రాష్ట్రాల విద్యారంగములకు న్యూనిధి నిచ్చి ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దిన ఘనత శ్రీ రెడ్డిగారికే దక్కిందనుకొంటే అతిశయోక్తి కానేరదు. ఈయన విద్యారంగంతోపాటు రాజకీయ రంగములోకూడ అసమాన ప్రజ్ఞాపాటవాన్ని ప్రదర్శించిన పాండితీవరుడు, కార్యశూరుడు, ఆలోచనా పరుడు. చేవట్టిన ప్రతిభాధ్యతను కూలంకషంగా అర్థంచేసుకొని విశ్లేషించగలిగిన నిశిత మేధస్సు ఆయనకుంది. కార్యరంగంలో కావలసిన క్రియానైపుణ్యం, క్రమ బద్ధత పట్టుదల అనేవి ఆయనలో పుష్కలంగా చోటుచేసుకొని వున్నాయి. ఏ విషయంలో ఎంతటివారినైనా సులభంగా ఒప్పించగల వాదనాసామర్థ్యం ఆయనకుండేది. ఆయన మాటల్లో వినోదం - విజ్ఞానం, ప్రేమ - పాండిత్యం, అభిమానం - ఆహ్లాదం శక్తి-యుక్తి సమపాళ్ళలో తొంగిచూస్తుండేవి. ఆకర్షనీయమైన వ్యక్తిత్వంతో పాటు మృదువైన మనస్తత్వం, వెరపులేని వాక్చాతుర్యం ఆయనకు నిజంగా తరగని సంపత్తులని చెప్పవచ్చు.

రెడ్డిగారిని అనేక సందర్భాలలో అతి సన్నిహితంగా చూడగల అవకాశం నాకు లభించింది కనుక చెపుతున్నాను. ఆయన కులీన సంప్రదాయాలలో పుట్టి పెరిగిన మేధావి. సామాజిక దృష్టికలిగి హుందాతనంతో జీవించ నేర్చిన ధీశాలి,

పెద్దమనిషి. ఆయన తన ప్రత్యర్థులపట్ల కూడ ఈర్ష్యాద్వేషాల కతీతమైన ఉదార వైఖరిని ప్రదర్శించగల భావసంపన్నుడు. ఇతరులను కించపరచక వారిని తనవైపుకు త్రిప్పుకొనగలిగిన రాజకీయచతురుడు కూడాను. అభివృద్ధి నిరోధకులను ఏ రూపంలో నున్నా అయన సహించేవాడుకాదు. ప్రతి విషయంలో ప్రగతిని మాత్రమే కాంక్షించు అభ్యుదయశీలి శ్రీ రెడ్డి.

ఈ సందర్భంలో మనమొక విషయాన్ని గమనించవలసి వుంది. రెడ్డిగారిపై వచ్చిన విమర్శలో దొర్లిన "నిలకడ" "మార్పు" అను శబ్దాలను మనం నింపాదిగ అర్థం చేసుకోవాలి. నిజంగా జీవితంలో అవసరమైన "మార్పు" అనేది ఆరోగ్యవంతమైన లక్షణమే. ఎట్టి పరిస్థితిలోను మార్పు కూడదను కోవడం అవివేకం, అది అల్పజ్ఞతకు నిదర్శనం. (A foolish consistency is the hobgoblin of little minds) రెడ్డిగారు విశేషజ్ఞుడు. "మార్పు"ను ఎలా వినియోగించాలో ఆయనకు తెలుసు. ఇతర రాజకీయ నాయకులవలె ఆయనది పార్టీ మనస్తత్వంకాదు. పార్టీ రాజకీయాల కతీతమైన ఆలోచనలలో పుండేవాడాయనెప్పుడూ. ప్రఖ్యాత పత్రికా రచయిత ఈశ్వరదత్తు రెడ్డిగారిని గురించి చెప్పిన మాటలీ సందర్భంలో గమనార్హం. "ఆయన అనుకరణలో కూడా ఆరిస్టోక్రటిక్, డమ్మో-డిటో యిష్టగా కూడ మరింత మేధావంతుడే. ఎవరినైనా అవుననడంలో ఏ విషయాన్నయినా సులభంగా అర్థంచేసుకొనడంలోకూడ ఆయనతన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ వుంటాడు. ఒక పార్టీ విధాన చట్రంలో మాత్రం ఆయన యిమడగలిగే వాడుకాదు. ఆయన జీవితం లక్ష్య హీనమైన యాత్రకాదు. తన దేశానికి, దేశ ప్రజలకు తానెంతవరకు వినియోగపడుతున్నాననే విషయాన్ని సదా యోచిస్తూ వుంటాడు. "నిజంగా యివి సామాన్యుల మస్తతత్వం కాదు, అసామాన్యుల మనోవైఖరి. కనుకనే శ్రీ రెడ్డి నిష్కళంక జాతీయవాది అంటాను నేను. ఇంతేకాదు ఆయన అంతర్జాతీయ వాదికూడాను. అంతర్జాతీయతకు విరుద్ధంకాని జాతీయ భావాన్ని పోషించాడాయన. ఇందుకవసరమైన స్వతంత్ర వ్యక్తిత్వం విద్వత్తు ధైర్యస్థయిర్యాలు ఆయనకున్నాయి. ఆయన చేతల్లో, వ్రాతల్లోకూడా ఇది ప్రస్ఫుటం చేయిబడింది.

ఆయన జస్టిస్‌పార్టీలో చేరాడు. కాని అందులో పెక్కుమంది అధికార వ్యామోహం మాత్రమే కలవారని తెలుసుకోగానే బయటకు నడచాడు. కాంగ్రెసులో

చేరాడు. అయితే ఆ వెంటనే అందులోని వారు ఆచరణసాధ్యమైన వాస్తవిక దృక్పథం లేనివారుగా గ్రహించగానే మరల దానిని విడిచిపెట్టాడు. ఆయన్ని సరిగా అర్థం చేసుకోనివారు నిలకడలేనివాడని నిందించారు. పార్టీల మార్పిడిచేసేవాడన్నారు. ఆయన విశ్వాసంలో వచ్చినట్లు కనిపించే మార్పులు, పరస్పర ఖండనలతో కూడిన ఆయన విధానము అత్యున్నతమైన ఆలోచనా ధోరణివల్ల ఏర్పడినవే. విజాని కంకిత మైన యదార్థవాది కావటంవలన వచ్చిన ఫలితాలే. ఆత్మవంచన చేసుకోక తాను నమ్మినది ఆచరించే దృఢనిశ్చయం వల్ల ఏర్పడిన పరిణామాలే.

విద్యారంగానికి నూతన జీవం పోసాడాయన. బూజుపట్టిన ధేయ్యాలను విడ నాడి, నూతన మార్గాల ఆలోచనలు చేశాడు. మద్రాసు విశ్వవిద్యాలయాన్ని గురించి నిర్మొహమాటంగా ఇట్లాఅన్నాడు. ''నవీనత అన్న సూర్యునకు అత్యంత దూరంలో వున్న గ్రహం లాంటిది'' విద్యావేత్తగా ఆయనార్జించుకున్న ఖ్యాతి ఆంధ్ర విశ్వ విద్యాలయ స్థాపక - ఉపాధ్యక్షుడుగా ఆయనకు స్థానమిప్పించింది. ఆ విశ్వ విద్యాలయాన్ని దేశంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయంగా ఆయన రూపొందించ గలిగాడు. ప్రఖ్యాత అర్థ శాస్త్రవేత్త జె. ఎమ్. కీన్స్ డా॥ కట్టమంచి రామలింగారెడ్డి గారిని ఇట్లా కీర్తించాడు :

"భారతీయ విద్యారంగంలో డా॥ రామలింగారెడ్డి నిర్వహించిన పాత్ర ప్రశంసనీయమైంది. ఆయన దానికి చేసిన సేవలు మరువరానివని చెప్పటకు సంతసించుచున్నాను. ఆయన నా పూర్వ స్నేహితుడు. 1905 నాటి కేంబ్రిడ్జి యూని వర్సిటీలో మేము సహాధ్యాయులం. అచ్చటి విద్యార్థి సంఘ కార్యకలాపాలలో మేము భయులం కలిసి మెలసి వనిచేసినవాళ్ళం. ఆనాడు ఎన్నో సందర్భాలలో డాక్టర్ రెడ్డి ప్రదర్శించిన ప్రజ్ఞాపాటవాలు, సమస్యలను పరిష్కరించడంలో ఆయన చూపిం చిన చురుకుదనం నాకివ్వటికి గుర్తున్నాయి. రాజకీయాలలోగాని, విద్యా విషయాలలో గాని ఆయన అవగాహనలు మా కాశ్చర్యాన్ని కలిగించేవి. ఈనాడు తన క్రియా నైపుణ్యం, నిర్మాణాత్మక ప్రజ్ఞ అనేవి ఏదో ఉద్యోగంలో లేక పార్టీలో ఆయనను నిలకడగా వుండనివ్వకపోయినా, అవి సంఘజీవితానికి శాశ్వత విలువ నందజేయు విద్యారంగానికి, స్వదేశీయుల విజ్ఞాన వికాసాలకు తన జీవితాన్నంకితం చేసుకొనే అవకాశం మాత్రం ఆయనకు ప్రసాదించగలిగినందుకు మనం సంతోషించాలి. నిజంగా మిస్టర్ సి. ఆర్. రెడ్డి ధన్యుడు.''

జీవితాంతం వరకు ఆయనలోని "యువకత్వం" చెక్కుచెదరకుండా వున్నా, వివాహ వ్యవస్థకు మాత్రం ఆయన దూరంగానే వున్నారు ఒక సనాతన ఆలోచనా పరుడు వెలిబుచ్చిన సున్నితమైన భావం ఈ సందర్భంగా గుర్తుకొస్తున్నది. 'జీవితంలో అన్యాయాత్మక విచక్షణ ఏమిటంటే, మగవానికి బ్రహ్మచర్యం ఆకర్షణనుసంతరించటం. అదే "బ్రహ్మచర్యత్వం" స్త్రీ బ్రహ్మచారిణిలోని ఆకర్షణను తరిమి వేయటం." దీనిని రెడ్డిగారు దృఢంగా నమ్మిన సద్బ్రహ్మచారి. ఆయన చమత్కారంగా ఇట్లా అన్నారు. "వివాహ మొక పంజరం. దాని బయటనున్నవారు పంజరం లోనికి పోవాలని ప్రయత్నిస్తుంటే, లోపలివారు బయటకు రావాలని ఆకాంక్షిస్తూ వుంటారు. నేను ఆ పంజరంలోనికి పోవడమెందుకు ? బయటకు రావాలని తపన చెందట మెందుకు? అందుకే ఆమరణాంతం ఆవివాహితుడుగానే వుండిపోదలచాను."

తెలుగు సాహిత్య సీమలో ఆయన అశేష కీర్తి ప్రతిష్టలనార్జించాడు. ఆంగ్ల భాషా పాండిత్యంలోను అంతటి కీర్తి స్థాపించుకున్నాడు. ఆంగ్లభాషా పాండిత్యంలో దిట్టఅయికూడ, తెలుగు సంస్కృతాలలో సమానమైన ప్రతిభను కలిగి వుండేవాడు. మహా పండితులతో కూడ సమాన స్థాయిలో వ్యవహరించేవారు. తెలుగు సీమలోకి నూతన సాహిత్య విమర్శ ప్రక్రియను ప్రవేశపెట్టాడు. సాహిత్య విలువ లకు నూతనార్థాల్ని కల్పించాడు.

ఆయన సర్వస్వతంత్రుడు. అవివేకుల నేమాత్రం సహించేవారుకాదు. సగర్వంతో తలను పైకెత్తి తిరగగలిగేవాడు. నిర్భయంగా రొమ్మును దిబాయించి విరుచుకు తిరిగేవాడు. స్వార్థచింతనతో, స్వలాభాపేక్షతో, ఎవ్వరికీ, ఎన్నడూ తల ఒగ్గలేదు. ఎవరినుండి ఏ అనుచిత సహాయాలను అపేక్షించలేదు. జీవితంలోని అన్ని సన్నివేశాలలోను. సంఘటనలలోను వెలుగునే, హాస్యాన్నే తిలకించేవారు. (Laughter held both his sides) అవసరాన్నిబట్టి ఉల్లాసంగాను, విసర్గగంభీరత తోను కూడ ప్రవర్తించేవాడు. చమత్కారాలతో, చెణుకులతో సంభాషించడం ఆయనకు ఆయనేసాటి. ఒకసారి ఒక వక్త గొంతు చించుకుంటూ "Political reform and religions reform" కావాలని అరుస్తుంటే, రెడ్డిగారు 'నాకు కావలసింది chloroform" అపేసరికి అందరూ ఫక్కున నవ్వటమూను, ఆ వక్త నోరు మూయడమూ ఒకేసారి జరిగాయి. మరొకసారి, ఒక స్త్రీ పట్టభద్రురాలికి, వందన సమర్పణచేస్తూ

రెడ్డిగారవ్వారు "ఆమె 'bachelor' అని కొంతసేపు ఊరుకున్నారు. అందరూ అభ్యంతరం చెపుతూ కేకలు వేసారు. అవి వినికూడ మరల రెడ్డిగారు "ఆమె bachelor"అవి మరల అన్నారు. మరిల కొంత వ్యవధితో ఆయన ఇట్లా ముగించారు "of arts" అని. అందరూ ముసి, ముసి, నవ్వులు నవ్వేసారు.

ఆ రోజులలో బ్రిటిమవారు ప్రవేశ పెట్టిన ద్వందప్రభుత్వ విధానాన్ని వెట కారంతో విమర్శిస్తూ ఇట్లా ప్రశ్నించారు. "Of the transferred half and the reserved half, which is the better half "తన దేశ ప్రజలను కూడ ఆయన నవ్వులాట పట్టిస్తూ వుండేవారు. "మనందరం కలసి సామూహికంగా ఏడ్వడం బాగా నేర్చుకున్నాం. కలసి పనిచేయడం మవకెప్పుడు చేతనుతుంది?" అని ప్రశ్నించేవారు.

1948 సంలో ఆవడి కాంగ్రెస్‌లో చేసిన "Purity and perfection" అన్న తీర్మానాన్ని విమర్శిస్తూ, వ్యంగ్యంగా ఇట్లా అన్నారు :

"ఇంతరకు వేను కాంగ్రెస్‌వారి 'ఆదర్శ శుద్ధి'ని చూస్తూవచ్చాను. కాని యిక వారి 'ఆచరణ శుద్ధి'ని మాత్రం చూడవలసి వుంది" అధికార వేటను అల వాటుగా కొనసాగిస్తున్న రాజకీయ వక్షులను దృష్టిలో పెట్టుకుని ఒక సందర్భంలో రెడ్డిగారు "నియమకాలన్నీ ప్రవృత్తి మార్గన్ని వదిలం చేస్తుంటే భంగపాట్లన్నీ విమృత్తి మార్గానికి దారి తీస్తుంటాయి', (Appointments lead to attachments, disappointments lead to detachments) అన్నాడు. ఈనాడు రెడ్డిగారు జీవించివుంటె "నియామకాలన్నీ మమకారాలతో రాగలుగుతూంటే, భంగపాట్లన్నీ భ్రష్టత్వాన్ని తేగలుగుతున్నాయి" Appointments result in affection, disappointments end in defection) అవే వాడేమో ననుకొంటాను.

ఒక జస్టిసుపార్టీ నేత ఎలుగెత్తి ఇట్లా అంటే "I stands for equality' fraternity, liberty and justice" రెడ్డిగారు బహిరంగంగా అతన్ని నిందిస్తూ "The trouble with you is that you always 'stand' for them; you never 'move' towards them."

ఏ రకమైన అన్యాయాన్ని ఆయన సహించేవాడు కాదు. కాంగ్రెసు నాయకులను అరెస్టుచేసిన నిర్బంధ విధానాన్ని బ్రిటిష వారు 1930లో సాగించివందుకు

నిరసనగా, డా॥ రెడ్డిగారు ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసారు. కులవైషమ్యాలు, మతదురహంకారాలు ఆయనకు గిట్టేవికావు. కుల భేధాలను పూర్తిగా విస్మరించి తనకు ఎండి పెట్టేందుకు హరిజనుడి నేర్పరచుకున్నాడు. హరిజనులందరికి ఆయన అత్యంత ఆప్తమిత్రుడు. గాంధీజీ హరిజన దేవాలయ ప్రవేశాన్ని గురించి చెప్పకముందే, హరిజనుల దుర్భర జీవన సమస్యలను గురించి డా॥ కట్టమంచి ప్రచారం చేశాడు. మైసూరులో ఆయన పనిచేస్తున్నప్పుడు, పంచమల పిల్లలందరికి పాఠశాలలో ప్రవేశమిచ్చి తీరాలన్న విధానాన్ని అమలుపరిచాడు.

భవిష్యత్తును స్పష్టంగా చూడగలిగిన మహిమాన్వితుడు శ్రీరెడ్డి. తాను అల్లరిపడి అపఖ్యాతి నార్జిస్తానని తెల్సి వుండికూడ, ఆయన కాలంలో వచ్చిన సవాలును ఎదుర్కొని మద్రాసు రాష్ట్ర జాతీయ యుద్ధ ప్రంటు నాయకుడుగా వ్యవహరించ సాగారు. హిట్లరే యుద్ధంలో జయిస్తే మన దేశ స్వాతంత్ర మన్నది అసాధ్యమయిపోతుందని గుర్తించాడు. అందుచేత పాశ్చాత్య మిత్ర రాజ్య బృందాన్ని అభిమానించి, వారి జయానికై ప్రచారం చేసాడు. నియంతృత్వానికి ఎదురుగా వారు పాగిస్తున్న యుద్ధానికి పూర్తి మద్దతు నిచ్చాడు. తాను నమ్మిన దానిని ఆచరణలో పెట్టే సాహస మాయనకుండేది. భవిష్యత్తులో జరుగుతుందని తాను విశ్వసించే పద్ధతిలో తన నడక సాగించేవాడు.

దేశ స్వాతంత్ర ప్రదానానికి ముందు షరకుగా బ్రిటిమ వారు నిర్మించిన దేశ విభజనను ఆయన సుతరాము అంగీకరించలేదు. గాంధిజీ, జిన్నాలను కలసికొని దేశాన్ని విభజించవద్దని తీవ్రంగా వాదించాడు. హిందూ ముస్లిము సమైక్యతను భగ్నంకాకుండా చూచి మాతృభూమి విభజనను నివారించమని ప్రాధేయ పూర్వకంగా వేడుకున్నాడు. అనేక స్వాతంత్ర దినోత్సవాలు ఎనము జరుపుకున్నాం. కుల వైషమ్యాలు, మతోన్మాద ద్వేషాలు అనేక సంవత్సరాలుగా దేశంలో చెలరేగటాన్ని చూస్తూనే వున్నాం. వీటన్నిటినిబట్టి, దేశ విభజన ఎంతటి ప్రమాద భూయిష్టమని డా॥ రెడ్డిగారు భావించి హెచ్చరించారో అది వాస్తవమని బుజువైంది. అయినా గతాన్ని గురించిన బాధను ఆశావాదిగా తన సహజ ధోరణిలో యిలా అన్నాడు: "మనం భౌగోళికంగా నష్టపోయిన దాన్నివ్వడు చరిత్ర గత అనుభవాల బలంతో పూరించుకొనవలసి వుంది." నిజంగా ఆలోచించ గలిగిన వారికిది సారగర్భితమైన సందేశంగా గోచరిస్తుంది.

ఆంధ్రులకొక 'అభతోష్' లభించాడు :

రెడ్డిగారికి సహజంగా అలవడిన 'సమయస్ఫూర్తి' అను దానికి సాహిత్యకంగా సరితూగ గలిగిన గుణం ఆయనలోని సృజనాత్మక సామర్థ్యం. ఇది ఆయన వాక్కులో వ్రాతలో కూడ రాణించింది. నిజంగా ఆయన తెలుగు పండితుల కంటె తేటగా తెలుగు మాట్లాడేవాడు. పూర్వ - పశ్చిమ సంస్కృతుల సమన్వయం ఆయనలో కాన వస్తుంది. స్వతంత్ర ఆలోచనలు కలిగిన రాజకీయ వేత్తలలో ఆయనొకడని చెప్పవచ్చు. ఇక పోతే విద్యావేత్తగా మనమాయనకు వంగదీయుడైన ఒక అభతోష్ ముఖర్జీతో మాత్రమే పోల్చగలమనేది నిర్వివాదాంశం. విమర్శకుడుగా, కవిగా, తెలుగు సాహిత్య లోకంలో చెరగని ముద్ర వేసాడాయన. ఆయన తెలుగులో వ్రాసిన "కవిత్వ తత్వ విచారము" "అర్థశాస్త్రము" తెలుగు పాండితీ లోకంలో నూతన బాటలను వేశాయి. నూతన వెలుగులను జిమ్మాయి. ఏదృక్కోణం నుంచి చూచినా, ఏ ప్రమాణాలనుబట్టి మాట్లాడినా, డా॥ రెడ్డిగారు అసామాన్య ప్రజ్ఞా ధురంధరులు. ఏ వృత్తి స్వీకరించినా దాని అత్యుత్తమ స్థాయిని జేరగల్లేవారు. ఆయన గొప్ప మానవతావాది. ఆలోచనా శాలి, భవిష్యత్తును గురించి సువర్ణమయకలలుకనే భావుకుడు, ప్రజాసామ్యవాది, సామ్యవాది, ఆదర్శవాది, చతురోక్తులసామ్రాట్, ప్రజ్ఞాప్రాభవాలు కల్గిన పరిపాలనా దక్షుడు, నాయకుడు, స్నేహితుడు, సహచరుడు, విశ్వవిద్యాలయ నిర్మాణ ధురం ధరుడు, కొద్దిమంది సరితూగగల గొప్ప వక్త, దృఢమైన గుండెబలం కలవాడు, సునిశిత మేధస్సు కలవాడు, ఆచరణదక్షుడు, కార్యాచరణశీలుడు. పదవుల ఆరాటం ఎన్నడూ లేనివాడు. అధికార వ్యామోహం ఎన్నడూ అతణ్ణి వశని చేసుకోలేదు. పొడవైన శరీరం కలిగి సూర్యరశ్మిలో వికశిస్తు, ప్రజాకర్తవ్య పరిపాలనలో ఆలోచనా విధానంలో ఏ మచ్చ లేకుండా నడచుకొన్నవాడు. తాను విశ్వసించిన విషయంలో ఎంత కొద్దిమందితోనైనా సహసరించగల సాహసి. తాను చూసిన జ్యోతి నాధారంగా గొని ముందుకుసాగాడు. అట ఎక్కడకు తీసుకువెళ్లినాసరే, ఏ పలితాలనిచ్చినాసరే వెరిచేవాడుకాదు.

ప్రాతఃస్మరణీయుడు శ్రీ కట్టమంచి

రెడ్డిగారు జీవించిన 70 సంలలో అనేక మార్పులను చూశాడు. అనేక అవకాశాలను జారవిడుచుకున్నాడు. అయినా పూర్వపు రామలింగా రెడ్డిగానే చివరకు మిగిలాడు. దయార్ద్రమైన ఆలోచనలతో, నిస్వార్థమైన సేవతో తన జీవితాన్ని

సఫలీకృతం చేసుకున్నాడు. హాయిగా జీవించాడు. భారతీయ సాంస్కృతీ చిహ్నంగా నిలచిన మన దేశ ప్రముఖులలో ఆయనొకరు. ఆయన కీర్తి అజరామరము. ఆయన మనకు అనేకమైన మంచి ఆలోచనలను ప్రసాదించాడు. అనేక గొప్పక కార్యములను సాధించి ఆదర్శముల నందించాడు. అపజయాలను పొందినా ఎట్లా సహించాలో నడచి చూపించాడు. ప్రతి తండ్రి తన కుమారుని వట్లు పెంచుకొనే ఆశలు - ఆకాంక్షలు శ్రీ రెడ్డిగారి జీవితంలో ప్రతిఫలించాయంటే అతిశయోక్తి కాదు. అంటే ప్రతి తండ్రి తన కుమారుడు ఆ రెడ్డిగారి వలె రూపొంది వెలుగొందవలెనని ముచ్చట వడుతూండగలడని తాత్పర్యం. ఆయన వారసులమైన మనందరి మనస్సులలో ఆయన జీవిస్తున్నాడీరోజున. అడుగడుగున ఆదర్శాలతో నిండియున్న ఆయన ఏడు దశాబ్దాల నిండు జీవితం ఆహ్లాదకరమైన స్మృతిగా మనకు స్ఫూర్తిని, శక్తిని ప్రసాదిస్తూంది. ఆయన ధన్యజీవి.

అన్ని విధాల ఆయన శ్లాఘనీయుడు

శ్రీ ఎం. హిదయతుల్లా

మానవజాతి చరిత్రలో మనకెందరో మహా పురుషులు గోచరిస్తారు. వారు తమ ప్రజ్ఞాపాటవాలతో త్యాగ-తితిక్షలతో జాతిజన్మత్యాని కెంతగానో తోడ్పడినారు. వారందరు పుణ్యాత్ములు. వివిధ రంగాలలో వారు సాగించిన కృషి యీనాటి మనం మరువరాని వారసత్వంగా నిలిచివుంది. గౌతమబుద్ధుడు, ప్లేటో, అరిస్టాటిల్, క్రీస్తు మైకేల్ అంగిలా, డాలిన్సీ, అలెగ్జాండర్ ప్లేమింగ్, రవీంద్రనాధఠాగూరు, మహాత్మా గాంధి, జవహర్లాల్‌నెహ్రూ మొదలగు వారీ కోవకు జెందినవారే. వీరందరు మనకు చిరస్మరణీయులు. అదేక్రమంలో మనం మానవ జాతి సుదీర్ఘ చరిత్రలోని భారతీయ అధ్యయానికి జెందిన ప్రస్తుత పుటలను తిరగవేస్తే అనేకమంది రాజకీయ రంగంలో గాని, సాహిత్య రంగంలోగాని, విద్యారంగంలోగాని అనితర సాధ్యమైన ఔన్నత్యాన్ని సాధించి స్వజాతికే ఆదర్శప్రాయంగా నిలచి నవారున్నట్లు గమనిస్తాం. అట్టి మహనీయులలో నిజంగా స్వనామధన్యుడు కీర్తిశేషుడు డాక్టర్ కట్టమంచి రామలింగా రెడ్డిగారిని మనం మరువలేము.

ఇప్పటికి నూరేండ్ల పూర్వం ఆంధ్రుడుగా చిత్తూరు జిల్లాలో జన్మించిన రామలింగారెడ్డి మద్రాసు క్రిష్టియన్ కాలేజిలో చదువుకొని, ఘనంగా డిగ్రీ పుచ్చుకొని తన ఇరువది 23వ ఏట యూనివర్సిటీ విద్యకై ఇంగ్లాండు వెళ్ళాడు. ఆరంభంనుండి కుశాగ్ర బుద్ధిగల శ్రీ రెడ్డి అచ్చట కేంబ్రిడ్జి యూనివర్సిటిచేరి ఎం. ఎ. లో చరిత్ర నధ్యయనంచేశాడు. మొదటినుండి రాజకీయ శాస్త్రంకూడ అభిమాన విషయమే.

స్టూడెంటుగా రాజకీయాలలో రాణిస్తూండేవాడు. ఇంగ్లండు, హాలెండు, ఐర్లండు, స్కాట్‌లాండ్ దేశీయుల పధ్య భారతీయ యువకుడైన యీ విద్యార్థి ఎంతో చురుకైన వాడనీ, ప్రజ్ఞావంతుడనీ (Active and inteligent) పేరు తెచ్చుకొన్నాడు. ఆనాడే రెడ్డిగారి మహోన్నతమైన వ్యక్తిత్వం, గురు గంభీరమైన భావగరిమ సహాధ్యాయులను గురువులను సైతం ముగ్ధులను జేసేవి. ఎం. ఏ. పరీక్షలో ప్రథమ శ్రేణి సాధించిన కారణంగా కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఈయన పొందిన రైట్సు స్కాలరుషిప్పు సార్థక మైంది. శ్రీ రెడ్డి స్నాతకోత్తర విద్యార్థిగా కేంబ్రిడ్జి యూనివర్సిటీ విద్యార్థి సంఘానికి ఉపాధ్యాయుడుగాను, కేంబ్రిడ్జిలోని లిబరల్ క్లబ్బుకు సెక్రటరీగాను పనిచేసి అచ్చటి వారి మన్ననలకు పాత్రుడైనాడు. ఆయన అచ్చట సభలలో సమర్థవంతంగాను, చాకచక్యంగాను ఉపన్యసించి మంచి వక్తగా ఖ్యాతి నార్జించాడు. రెడ్డిగారు ఆంధ్రాంగ్ల భాషలలో వీనులవిందుగా పాండితీ ప్రకర్షణతో, హాస్యచమత్కారయుతంగా మాట్లాడ గలిగినధీశాలి. ఆయన మహావక్త. ఆయన ఉపన్యాసాలలోని భాషా పటిమ, భావ గాంభీర్యం, వక్రోక్తి వైభవం, పాండిత్య గరిమ హాస పరిహాస ధోరణి, విషయ ప్రతిపాదన పండితులనేగాక పామరులనుకూడ ప్రభావితులను చేస్తుండేవట. కేంబ్రిడ్జి చదువు పూర్తిచేసికొన్న తదుపరి స్వదేశానికి తిరిగివచ్చే ముందు శ్రీ రెడ్డి అమెరికాలో పర్యటించి అచ్చటి వారి మనోఫలకాలపై కూడ తన వ్యక్తిత్వ ముద్రను వేసి వచ్చాడు.

శ్రీ రెడ్డి మైసూరు యువరాజుతో కలిసి యూరపు దేశాలలో పర్యటించినప్పుడు ఆ తరువాత కెనడా, జపాను దేశాలను సందర్శించినప్పుడు కూడ ఆయా సందర్భాలలో ఈయన ఉపన్యాసాలు ఆయా దేశాల పండితుల నెంతగానో ఆకట్టు కొన్నాయి. నిజంగా ఆనాడు రామలింగారెడ్డిగారు విదేశాలలో సైతం ఉపన్యాస కేసరిగా ఘనత నంపాదించాడంటే అతిశయోక్తికాదేమో! అచ్చటి వారాయనను 1892లో ఇంగ్లండును ప్రధాన మంత్రిగా పనిచేసిన W. E. గ్లాడ్‌స్టోన్‌తో పోల్చే వారంటే వారీయన సామార్థ్యాన్నెలా అంచనా వేశారో బోధపడుతుంది.

శ్రీ రెడ్డి పండితుడైన వక్త (Scholastic orator) మాత్రమేకాదు. చెప్పుకొన దగిన సాహసోపేతుడుకూడాను. కేంబ్రిడ్జి విద్యార్థి సంఘాన్ని నిర్వహించే రోజులలో ఆయన నిర్వహించిన వాగ్వర్ధినీ సభలు (Debates) యీ విషయాన్ని బుజువు చేస్తున్నాయి. 1904 నంలో "the present system of British Parliamentary Government ought to be allowed to die quickly and quietly"

అనుశీర్షికతో రాజకీయంగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిశిత విమర్శకు గురిచేస్తూ ఈయన నిర్వహించిన గోష్టి, అందులో ఈయన మాట్లాడిన తీరు నిశితమైన విమర్శనా దృష్టిని, ధైర్య సాహసాలను చాటి చెప్పుతున్నాయి.

ఆంధ్ర యూనివర్శిటీకి వైస్‌ఛాన్సలర్‌గా మనకు పరిచితుడు కాక పూర్వం శ్రీ రెడ్డి బరోడా, మైసూరు, మద్రాసు విద్యారంగములలో ఎంతో అనుభవ జ్ఞానాన్ని సంపాదించుకొన్నాడని చెప్పవచ్చు. బరోడా మహారాజా కళాశాలకు వైస్ ప్రిన్సిపాల్‌గాను, మైసూరు మహారాజా కళాశాలకు ప్రిన్సిపాల్‌గాను, మరియు 1916లో మైసూరు సంస్థాన విద్యాశాఖకు సర్వోచ్ఛ నిరీక్షణాధికారి (Inspector General of Education) గాను ఈయన ఆయా సంస్థానాల విద్యారంగాలకు ప్రశంసనీయ సేవలనందించాడు. రెడ్డిగారి ప్రజ్ఞా ప్రాభవాలు, ఆయన విదేశీ విజ్ఞాన గరిమ మైసూరు విద్యా నిర్వహణ శాఖను తీర్చి దిద్దడంలో సఫలీకృతమైనదంటే అతిశయోక్తి కాదంటాను.

1926లో ఆంధ్రులకు ప్రత్యేక విశ్వవిద్యాలయం సమకూరినప్పుడు దానికి ఉపాధ్యక్షుడుగా శ్రీ రెడ్డిగారే అన్నివిధాల అర్హుడని, సమర్థుడని నిర్ణయించినారు. 1926 నుండి 1930 వరకు నాల్గు సంవత్సరాలకాలం ఆయన దాని సంక్షేమం కొరకన్నివిధాల అహర్నిశలు శ్రమపడి చాలా కష్టాలనుండి కాపాడిన ఘనత దక్కించుకొన్నాడు. యూనివర్శిటీలో, అడ్మినిస్ట్రేషన్, రూల్స్, రెగ్యులేషన్స్, కోర్సు, కాండక్ట్స్, కోర్సుల టెక్స్ట్‌బుక్స్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్, ఎపాయింట్‌మెంట్స్, ఎక్జామినేషన్స్, డిపార్టుమెంట్స్, ఆఫీసు మెయింటెనెన్స్ మొదలగువాటి నిర్మాణ-నిర్వహణలకు రెడ్డిగారి పరిణతిజెందిన పాండిత్యం, అనుభవం, వ్యక్తిత్వం భాగా తోడ్పడినాయనుటకు మనం సందేహించ నవసరంలేదు. 1930 నాటి ఉప్ప సత్యాగ్రహ సందర్భంలో, ఎంత జస్టిస్ పార్టీ అభిమాని అయినా, ప్రభుత్వం సత్యాగ్రహులపట్ల ప్రదర్శించిన క్రౌర్యానికి కినుక వహించి అందుకు ప్రాయశ్చిత్తంగా శ్రీ రెడ్డి తన వైస్‌ఛాన్సలర్ పదవికి రాజీనామా యిచ్చారు. ఇది నిజంగా ఆయనలో సహజంగా వున్న దేశభక్తిని సూచిస్తుంది.

మరల రెండవతూరి 1936లో శ్రీ రెడ్డి ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవిని చేపట్టి 14 సంవత్సరాలపాటు దాదాపు మృత్యుపర్యంతం ఆ సంస్థ సర్వాంగ

వికాసానికి కృషిచేశాడు. తనకు లోగడమండి జస్టిస్ పార్టీ ప్రముఖులతోగల పరిచయాన్ని పురస్కరించుకొని, వారినుండి విరివిగా విరాళాలు సేకరించి యూని వర్సిటీకి ఆర్థిక పుష్టిని సమకూర్చాడు. యూనివర్సిటీలో వివిధములైన సైన్సుకోర్సులను ప్రవేశపెట్టి, ప్రతి డిపార్టుమెంటులోను పరిశోధనావకాశాల నినుమడింపజేసి యూని వర్సిటీని సరస్వతీ నిలయంగా రూపొందించి, దేశంలోని మిగతా యూనివర్సిటీల కేవిధంగాను తీసిపోని విధంగా ఆంధ్రుల యూనివర్సిటీని తీర్చిదిద్దిన ఘనత శ్రీ రెడ్డి తనకు తానుగా పొందగలిగాడు. నిజంగా ఆయన ఆనాడు ఏర్పరచిన విద్యా సంబంధిత సంప్రదాయాలే యీనాటికి ఆంధ్ర విశ్వవిద్యాలయం వారసత్వపు ఆస్తిగా పరిరక్షించుకొంటూ వస్తూంది. తాను మొదటిసారి ఉపాధ్యక్ష పదవిని చేపట్టిన నాటి రోజులు కాలక్రమంలో రెండవ ప్రపంచ యుద్ధం నాటికి పూర్తిగా మారిపోవడం ఆయన స్వయంగా గుర్తించాడు. మారిన జీవన విలువల అవగాహన చేసికొన్న శ్రీ రెడ్డి ఆందు కనుగుణమైన సంస్కరణల నెన్నిటినో ఆంధ్ర యూనివర్సిటీలో ప్రవేశపెట్టాడు. గాంధీజీ ప్రతిపాదించిన 'అహింసామూలకమైన నక్యాగ్రహ పోరాటమే భారతీయుల స్వతంత్ర జీవితానికి శ్రీరామరక్ష' అనేంతవరకు పరిణతిజెందాడు. 'లిబరేటర్' పత్రికకిచ్చిన సందేశంలో యిలా అన్నాడాయన 'But perhaps there was no other way of building up power in India excepting by Gandhism-'

శ్రీ రెడ్డి తన 40వ ఏట 1920 సం॥లో రాజకీయాలలో ప్రవేశించాడు. విద్యార్థి దశ నుండి ఆయన రాజకీయ పరిజ్ఞానమున్న విద్యావంతుడే. అయితే ఆనాటి దేశ పరిస్థితులను గమనిస్తు, ఆయన తన ప్రజ్ఞను పాండిత్యాన్ని సార్థకంచేసికొనేందుకు క్రీయాశీలక రాజకీయాలను చేపట్టారు. చిత్తూరు జిల్లాబోర్డు ప్రెసిడెంటుగా ప్రజాసేవ చేశారు. మద్రాసు యూనివర్సిటీ తరఫున రెండు పర్యాయములు శాసన సభకు సభ్యుడుగ వెళ్ళాడు. 1935లో చిత్తూరు జిల్లా ప్రతినిధిగా మద్రాసు రాష్ట్ర శాసన పరిషత్తులో ఈయన గణనీయమైన పాత్రను నిర్వహించారు. అటు పిమ్మట 1937లో ఈయన మద్రాసు గవర్నరు ద్వారా శాసన పరిషత్తుకు విద్యావేత్తల ప్రతినిధిగా నామినేటు చేయబడ్డాడు. ఏ రూపంలోనైనా, ఏ హోదాలోనైనా శ్రీ రెడ్డిగారికి మద్రాసు శాసన సభతో రెండు దశాబ్దాల సంబంధ బాంధవ్యాలున్నాయి. శాసన సభలో ఈయన ఉపన్యాసాలు ఎంతో విజ్ఞాన దాయకాలుగా నడిచేయి. సభలో తన అభిప్రాయాలను ప్రకటించడంలో, తన సిద్ధాంతాలను ప్రతిపాదించడంలో ఎంతో

ధైర్య స్థైర్యాలను ప్రదర్శించేవాడట. ఎటువంటి వానినీ లక్ష్యపెట్టేవాడు కాదట. ఆయన పాండిత్యం, ప్రతిష్ఠ, వాగ్ధాటి, వ్యక్తిత్వం అటువంటివి.

మనలో కొందరికి ఆశ్చర్యం కలిగించే విషయమేమంటే రామలింగారెడ్డిగారు రాజకీయాలలో కాంగ్రెసుమెన్‌గా చేరలేదు. జస్టిస్ పార్టీ సభ్యుడుగా చేరాడు. అంతటి విద్యావంతుడు, స్వరాజ్యోద్యమాన్ని కాదని ప్రభుభక్తి వరాయణతగల జస్టిస్ పార్టీలో చేరడం ఆనాడే కొందరి కాశ్చర్యం కలిగింది. అయితే ఆయన మొండివాడు. తానునుకొన్న దానికి తిరుగులేనట్లుగా వ్యవహరించేవాడు. అభిప్రాయ భేదాలు కలిగినప్పుడు రాజకీయాలలో ప్రకాశం, రాజాజీలనేకాదు గాంధీజీని సైతం నిర్భయముగ దుయ్యబట్టి గలిగేవాడు. ఆనాడు ప్రజానాయకులుగా ప్రసిద్ధిజెందిన కాంగ్రెసు పెద్దల ధోరణి విధానాలపట్ల ఆయనకు నమ్మకముండేదికాదు. పార్టీనాయకుల ప్రజాస్వామిక ధోరణి ఆయనకు నచ్చేదికాదు. ఒక విధంగా చెప్పాలంటే ఆయనానాడు ఏటికెదురీదే వాడన్నమాట. అంత సాహసుడు. జస్టిస్ పార్టి సభలలో ఆయన ప్రసంగిస్తున్నప్పుడు ప్రజలు నిరసనగా సభపై రాళ్ళు విసరేవారట. అయినా తన మొండితనంతో కూడిన చమత్కార ధోరణిలో తప్పించుకు పోతూండేవాడు. The Justice Party is ushering in the entry of the Stone age in our Politics అని సమర్థించుకొంటూండేవాడట. కాంగ్రెసు విధానాలపట్ల, అదికోరే స్వరాజ్యంపట్ల, దానివల్ల ఏర్పడే ప్రభుత్వాలపట్ల ఏమాత్రం నమ్మకంలేని శ్రీ రెడ్డి కాలక్రమంలో పరిస్థితులకు తలవంచక తప్పలేదు. కాంగ్రెసు నాయకత్వంలో ఆంతరంగిక ప్రభుత్వాలేర్పడినప్పుడు ఆయన తన అవగాహన నీవిధంగా ప్రకటించడం జరిగింది.

If it is ture that the Congress is the Country and the Country is the Congress, then as a non - Congress man, I am not an Indian but a foreigner and I apologise for the impertinence of this intrusion into the politics of the country from which I have been theoritically and metaphysically banished.

నిజంగా డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి గారిది విలక్షణమైన వ్యక్తిత్వం. ఆంధ్ర యూనివర్సిటీకి సంబంధించినంతవరకు ఆది రామలింగారెడ్డి యుగం అనుకొందాం. రాజకీయ పరిజ్ఞానం, విద్యావ్యాసంగం, పాండిత్యగరిమ, వరిపాలనా

దక్షత, నిర్వహణ కుశలత, ఏరీతిగా చూసినా ఆయన శ్లాఘనీయుడే. గ్రేట్ పొలిటీషియన్, గ్రేట్ ఆరేటర్, గ్రేట్ ఎడ్యుకేషనిష్టు, గ్రేట్ స్కాలర్, గ్రేట్ రైటర్, గ్రేట్ క్రిటిక్, గ్రేట్ అడ్మినిస్ట్రేటర్, గ్రేట్ వైస్ ఛాన్సలర్ - వీటిలో ప్రతి ఒక్కదానికి రెడ్డిగారు అర్హుడే. అన్ని లక్షణాలను ఆయన పుణికిపుచ్చుకొన్న మహనీయుడాయన. మనం వాటిలో కొన్నిటినయినా, కొంతవరకైనా కావాలని శ్రమించి పొందగలిగితే ఆయనవల్ల మనకున్న శ్రద్ధాభక్తులను సార్థకపరచుకొన్నట్లే. ఆయనఆదర్శాలను సాధ్యమైనంత వరకు ఆచరణలో చూపగలిగిన స్థితిని సంరక్షించుకొనడం మినహా మనమాయన పవిత్రస్మృతికి న్యాయం చేకూర్చలేము.

సాహసి
సంఘ సంస్కరణాభిలాషి

జస్టిస్ శ్రీ ఆవుల సాంబశివరావు

రామలింగారెడ్డిగారు ప్రతిభా వ్యుత్పత్తులకు వెలవు అనే సంగతి అందరూ అంగీకరించిందే. అయితే, వారి వ్యక్తిత్వానికీ, సామర్థ్యానికీ, పాండిత్యానికీ తుల తూగే కృషిని ఆయన చేసి వెళ్ళలేదని చాలామంది ఆరోపిస్తారు. తగినన్ని పుస్తకాలు రాయలేదని, అర్హతకు సరిపోయే పదవులు అనుభవించలేకపోయినారని వారిని గురించి అర్రోపిస్తూ వుంటారు.

వారి పుస్తకాలరాసి తక్కువే. నిండు పుస్తకాలు మరీతక్కువ. కవిత్వ తత్త్వ విచారము, అర్థశాస్త్రము ప్రధానంగా కనిపిస్తాయి ఈ కోవలో. మిగిలినవి ఉపన్యాసాలు, వ్యాసాల సంకలనాలు. వారి జీవితకాలంలోనే ప్రచురించబడినవి కొన్ని, వారి అనంతరం వెలికి వచ్చినవి మరికొన్ని. ముసలమ్మ మరణంలాంటి ఖండికలు కొద్దిగా వున్నాయి. రచనా వ్యాసంగం వారు వ్యాపకంగా పెట్టుకొని వుంటే, కట్టమంచివారి మేధకు, వారు జరిపిన పరిశోధనకు, పరిశీలనకు యివి యేపాటివి! ఈ రాసి వారి వాసికి తులతూగేది కాదు.

పదవులు, ఉద్యోగాలు కూడా అంతే. మైసూరు సంస్థానంలో విద్యా శాఖాధికారిగా కొంత కాలం వున్నారు. చిత్తూరు జిల్లాబోర్డు అధ్యక్షులుగా స్వల్ప కాలం వనిచేశారు. మద్రాసు శాసనసభ సభ్యులుగా కొన్నియేండ్లు వున్నారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు కులపతిగా రెండుతడవలు దాని నాయకత్వం వహించారు.

మొదట వాలుగేండ్లు, రెండవసారి పదమూడేండ్లు. రెడ్డిగారి పదవులలో ఎన్నిక చేయదగింది యీ చివరిదే.

రచనల మొత్తం, పదవుల సంఖ్య కొలమానాలుగా అంగీకరిస్తే, కట్టమంచి వారి కృషి స్వల్పంగానే అగుపిస్తుంది. అయితే మనం సమాధానం చెప్పుకోవలసిన ప్రశ్న ఒకటి వుంది. ఇవేనా నిజమైన కొలబద్దలు. ఇవే అయితే, వాటినిబట్టి ఓ మనిషి వ్యక్తిత్వపు విలువను మదింపు చెయ్యవలసివస్తే, గాంధీజీని ఏ కోవలో జేర్చాలి? లెనిన్‌ను ఏ తరగతిలో కలపాలి? వల్లభ్ భాయి పటేల్, అరబిందో ముఖర్జీలను ఎందులో జమకట్టాలి?

మనిషి విలువ, అందులోను నాయకుని విలువ కొలవడానికి ప్రమాణాలు ఇవికావు. ఆయనగారి ఆలోచనలు, ఆయన సమాజంమీద, సమాజ పరివర్తన మీద చూపిన ప్రభావం, వేసివెళ్ళిన ముద్ర - ప్రధానం. ఈ కోణం నుంచి పరిశీలిస్తే, కట్టమంచి రామలింగారెడ్డిగారు తెలుగువారిమీద, వారి వికాసంమీద కలిగించిన భావం ప్రగాఢమైనది.

ముందుగా విద్యారంగంలో ఆయనగారు నెరపిన కార్యక్రమం మైసూరులో విద్యాధికారిగా పుస్నవిషయం యిక్కడ పటంకించడంలేదు. ఆ అనుభవంతో తెలుగువారికి విద్యా విషయంలో వారు అందించిన నేతృత్వం, ప్రధానంగా ఆంధ్ర విశ్వకళాపరిషత్ ద్వారానే జరిగింది. 1926లో ఈ విజ్ఞానకేంద్రం ఉదయించింది. ఇందుకు కొన్ని రాజకీయ కారణాలు వుంటే వుండవచ్చు. కాని ఆంధ్రవిశ్వకళా పరిషత్తుకు జనకులు ఇద్దరు. పానగల్లు రాజాగారు, కట్టమంచివారు. రాజాగారు ఆనాటి ముఖ్యమంత్రి. తెలుగువారికి ఒక వైద్యకళాశాల వుండాలనీ విశాఖలోని ఆంధ్ర వైద్యకళాశాల ఏర్పాటుచేశారు. 1923లో నని నా జ్ఞాపకం. ఆ పిమ్మట ఆంధ్ర విశ్వకళావరిషత్తు వారిచేతుల్లోనుండి పుట్టుకొచ్చింది. బీజమైతే పానగల్లు వారు నాటారుగాని, దానికి రూపురేఖలు దిద్దినవారు రెడ్డిగారు. 1926-27 నుండి 1930-31 వరకు అది విజయవాడలో నుంది. అనాటి అనుబంధకళాశాలలే కాని బోధనా విభాగాలు, కార్యక్రమాలు విశ్వకళాపరిషత్తుకు లేవు.

బోధనాస్థాయిని పెంచడం, పరిశోధనా కార్యక్రమాన్ని పెంపొందించడం రామలింగారెడ్డిగారి ఆశయాలు. అందుకు ప్రశాంత వాతావరణం కావాలి.

సుందర ప్రదేశం అవసరం. సమశీతోష్ణాలుగల నెలవు వుపయోగకరం. నిరంతర వేసవితో అలమటించే తెలుగుదేశంలో ఇన్ని సౌకర్యాలు వున్నది వాల్తేరుమాత్రమే. అయితే అది సాగరసీమలో ఒకమూల వున్నది. తెలుగువారి కందరకు, అందునా రాయలసీమవారికి ముఖ్యముగా అందుబాటులోలేదు. అయినా విశ్వకళాపరిషత్తును 1931లో వాల్తేరుకు తరలించారు. రాయలసీమకు సహజంగానే కోపం వచ్చింది. ఆ కోపం సబబుకూడాను. వారికి అందుబాటులోలేని వాల్తేరులో విద్యానిలయం ఏర్పాటు ఎలా అనుకూలంగా వుంటుంది? అందుకని ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో రాయలసీమవారు నిక్కచ్చిగా చెప్పారు. రెడ్డిగారు చిత్తూరుజిల్లావారు. రాయలసీమ నివాసి. అయినా ఆయన జంకలేదు. సందేహించలేదు. పట్టు విడువలేదు. వాల్తేరుకు విద్యానగరం తరలి రానే వచ్చింది.

ఇది మూర్ఖత్వంకాదు. తెలుగుదేశం రెండు విద్యాఖండాలుగా ఏడిపోవడానికైనా ఒప్పుకొన్నారు గాని కట్టమంచివారు విద్యాభ్యాసానికి, పరిశోధనకు ఒక గురుకుల వాతావరణం కల్పించడంలో వెనుకాడలేదు. విశ్వవిద్యాలయాలు కోకొల్లలుగా పెరిగిపోతాయని ఆయనగారు అనాడే ఊహించగలిగారు. రాయలసీమకు మరో విశ్వవిద్యాలయం ఆవేళకాకపోతే, మరో రోజు వస్తుందని చూడగలద్రష్ట రామలింగారెడ్డిగారు. అందుచేత వాల్తేరు పయనం, వాల్తేరుకాపురం ఏర్పాటయింది.

నాగపూరునుండి లక్ష్మీనారాయణగారనే గొప్పదాత విశ్వవిద్యాలయానికి తన పేరు కలిపితే ఘనంగా దానం ఇస్తానన్నాడు. అప్పట్లో ప్రభుత్వంవారి ధన సహాయం బహుస్వల్పం. ధర్మాత్ముల ఈవి మీదనే విశ్వవిద్యాలయం నడవాలి. అట్టి పరిస్థితులలో విస్తారమైన ధనసహాయం ఇస్తానన్నా రెడ్డిగారు అంగీకరించలేదు. ఆంధ్రుల పేరుమాత్రమే వుండాలి విశ్వవిద్యాలయానికి. అది ఆంధ్రులది. అది ఆంధ్రులందరిదీ. ఒక వ్యక్తిపేరు-ఎంత మహాదాత అయినా - విశ్వకళాపరిషత్తుకు పెట్టకూడదు. అందుకని ఆ పెద్ద మొత్తాన్ని ఒదులుకున్నారు. విమర్శలు విరివిగా వచ్చినాయి. లెక్కచేయలేదు. విశ్వవిద్యాలయం ఆంధ్ర విశ్వవిద్యాలయంగానే నిలిచింది. ఆంధ్రులకు గర్వకారణమై పెరిగింది.

రామలింగారెడ్డిగారు, రాధాకృష్ణన్‌గారు, శ్రీకృష్ణగారు విశ్వవిద్యాలయాన్ని 1931 నుండి 1961 వరకు అతిజాగ్రత్తతో కాపాడారు బిడ్డను సాకినట్లు సాకారు.

వారి ముగ్గురి నేతృత్వంలో విద్యాపీఠం మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లింది. ఎన్నెన్నో శాఖలు కొత్తగా వచ్చినాయి. మరి ఏక్కడాలేనివి ఈవిద్యానిలయంలో స్థాపించబడ్డాయి. దీనిలో సాగరమధనం చేసినంతగా, సాగరశాస్త్రాలను ఎన్నింటినో ఈ ముగ్గురు విద్యావేత్తలు నెలకొల్పారు. శాస్త్రవేత్తలు, పండితులు ఎక్కడివారైనా ఎవరైనా పట్టింపులేదు. తెలుగు బిడ్డలకు చదువు సంధ్యలుకావాలి. వారు పరిశోధకులై, శాస్త్రజ్ఞులై, పండితులై విరాజిల్లాలి. అదే తపన. అదే ఆదర్శం. దానికి వుపయోగవడేవారు ఎక్కడ లభించినా ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఆహ్వానించబడ్డారు. ఆ రీతిగా విద్యకు, జ్ఞానానికి, శాస్త్రానికి, పరిశోధనకి నెలవుగా రూపొందింది వాల్తేరు. ఆంధ్ర యువతీ యువకులు బహుశాస్త్ర కోవిదులైనారు. దేశవ్యాప్తమేకాక, విశ్వవిఖ్యాతమైంది ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థుల ప్రతిభ. తెలుగువారి వికాసానికి కట్టమంచివారు ఈ రీతిగా పునాదులువేసి వెళ్ళినారు. రెండవతూరి జరిగిన వారి వదమూడేండ్ల నాయకత్వం ఇందుకుబాగా వుపకరించింది.

తెలుగు భాషకు, తెలుగు సంస్కృతికి ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని కేంద్రంగా రూపొందించారు రెడ్డిగారు. ఎన్ని కొత్త పుస్తకాలు అచ్చయినాయి ! ఎన్నెన్ని విషయాలమీద ఉపన్యాసాలు జరిగినాయి ! ఉదాహరణకు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు వేమనగారిమీద కావించిన ఉపన్యాసాలు తెలుగు సాహిత్యానికే అలంకరణలు. రామలింగారెడ్డిగారు తెలుగు సంస్కృతికి విశ్వకళాపరిషత్తును ఒక దీపస్తంభముగ తీర్చిదిద్ది వెళ్ళారు. తద్వారా తెలుగు వికాసం బలాన్ని పుంజుకొన్నది.

దేశంలోను, తెలుగువారిలోను కొత్తస్ఫూర్తి రావాలని, చెడు వున్నంతవరకు పాతను వదలి, కొత్త పుంతలు వెయ్యాలని రెడ్డిగారి ఆశయం. ఆ ఆశయ సిద్ధికొరకు వారు రాసిన వ్యాసావళి, చేసిన ఉపన్యాసాల రాసి చాలా విస్తారమైనది. ఇంగ్లీషులో, తెలుగులో కట్టమంచివారు విఖ్యాతుడైన వక్త. ప్రజ్ఞావంతుడైన భావుకుడు. ఉపజ్ఞాపూరితమైన చింతనావరుడు. సంభాషణా చతురుడు. ఇంగ్లీషు సాహిత్యంలో డాక్టర్ జాన్సన్ లాంటి చమత్కార సంభాషణా దురంధరుడు. మనుషులమీద, సమాజంమీద, వ్యవస్థమీద, వ్యవహారాలమీద రెడ్డిగారి చలోక్తులు లోకోక్తులు తెలుగు వారిని కదిలించినాయి. మత్తు వదలకొట్టినాయి. వారి వ్యాసాలు, ఉపన్యాసాలు భావసంపదను పంచిపెడితే, వారి చలోక్తులు, హాస్యోక్తులు

స్వయంగా కలుసుకుని మాట్లాడుకునేందుకు అవకాశంగాని, శక్తిగాని లేని మాకు ప్రత్యామ్నాయంగా ఇలా వుత్తరాలు నడుస్తూవుండేవి. యం. యన్. రాయ్ దంపతులు ఆంధ్ర విశ్వవిద్యాలయం దర్శించిన సందర్భంగా నేను వ్రాసిన ఒక నివేదిక చదివి శ్రీ రెడ్డిగారు ఇలా వ్రాశారు.

"రాయ్ దంపతులు మీతో కలసివుండడం ఎంత అదృష్టం? అపూర్వ దంపతులు వారు. ఎలెన్ చాలా ఆకర్షణీయమైన వ్యక్తి, నిండు హృదయం గలది. ఔదార్యానికి పెట్టిందిపేరు. ఇక యం. యన్. సరేసరి. ఈవాటి మహామేధావుల్లో ఆయన ఒకడు. విస్తృతమైన గ్రంథపఠనం, అగాధమైన ఆలోచన, సంస్కారంతో గూడిన అసాధారణ సాహితీ వేత్తృత్వంగల మహా వ్యక్తి ఆయన. ఆయనకుగాని వాకుగాని పదవివుంటే రాణిస్తామని పొరపాటుగా భావిస్తున్నారు. పదవి ఒక కొల పాత్రలాంటిది. దాన్ని దీపంమీద బోర్లిస్తే ఆ దీపంకాస్తా ఆరి వూరుకుంటుంది. కనుక పదవికంటె పలుకుబడి మేలు. మీకో పదవి వుందనుకోండి అప్పుడు మీకు పలుకుబడికూడా వుండవచ్చు. కాని అది ఆదర్శవంతమైనదికాదు. రాయ్ తన ఉదార హస్తాలతో అనుదినం అన్నివైపులా క్రొత్త ఆలోచనాబీజాలునాటుతున్నాడు. కాని మన నేల సారం అందుకు తగదేమో అని నా అనుమానం.

కొన్నాళ్ళ తర్వాత "భారతీయ సాహిత్య పునరుద్ధరణం అనే మీవ్యాసాన్ని నేను చదివాను. ఆసక్తిజనకంగా వుంది. అయితే మీరు 'పునరుద్ధరణం' అన్నారు. అది చచ్చిందెవ్వడు" అనిన్నీ.

"మీరు ఆంధ్ర విశ్వవిద్యాలయం మీద వ్రాసిన వ్యాసం చాలా వరన యోగ్యంగావుంది. శ్రీ వి. యస్. కృష్ణగారికి మీరు పూర్తి సహకారం అందిస్తున్నందుకు సంతోషిస్తున్నాను. విషయాన్నిబట్టిగాని, లక్ష్యాన్నిబట్టిగాని అది విత్త పూజకంటె కూడ ఎక్కువైనది" అనిన్నీ వ్రాశారు.

మఱుసటి నెలలో నేను వ్రాసిన అరవిందుని జీవితచరిత్ర మలిముద్రణ ప్రతిని చదివి రెడ్డిగారు వ్రాశారు.

'నేను ఆ గ్రంథాన్ని చదివాను. సాహితీ దృష్టికో గాక అధ్యాత్మిక పరవశత్వంతో చదివాను. ఆ మహామేధావిలోని అసంఖ్యాక తేజః కిరణాలను, ఛాయలను వెలికితీసి ఒక మహనీయ రూపంలో వాటిని మలిచారు."

అనంతరం నేను ఒకసారి 'Illustrated weekly of India'లో వ్రాసిన 'Self obituary' (స్వచ్ఛంద మరణం) ని గూర్చి ఒకసారి ఢిల్లీలో సంచలనం కలిగించిన Morality and Malaria'అనే తన వ్యాసాన్ని గూర్చి, ఒక తడవ 'Democracy and contemporary India' అనే విషయం మీద మద్రాసు విశ్వవిద్యాలయంలో తానిచ్చిన ఉపన్యాసాల గూర్చి ఏదో తమాషాగా హాస్య భరితంగా వ్రాస్తు వుండేవారు. నేను వ్రాసిన ఉత్తరాలకు, వ్యాసాల ముద్రిత ప్రతులకు, అవి యెంత అసంబద్ధంగా వున్నా వెంటనే ఏదో సమాధానం వచ్చేది. అసాధారణ ప్రజానాయకుడనీ, వైస్ ఛాన్సర్లకు పితృతుల్యుడనీ, అప్రతిమాన ప్రతిభావంతుడైన ప్రోఛాన్సలరనీ, విద్యాధికుడైన అగ్ర రాజకీయ వాది అనినీ ఆయన్ను పొగడడం ఆయన అసలు రూపాన్ని మరుగుపరచడమే అవుతుంది.

వాస్తవంగా చెప్పాలంటే ఆయన ఉడుకు రక్తంగల కార్యదీక్షావరుడు, మానవతావాది, ఇట్టే స్పందించే నిండైనమనస్సు, పరిణతమైన ఆత్మగల స్థితప్రజ్ఞుడు.

వయస్సులోను, అంతస్తులోను, లౌకిక స్థితి గతుల్లోను మాయిరువురి నడుమ గల భేదాన్నీ, దూరాన్ని సులభంగా అయత్నంగా అధిగమించడానికి మామధ్య ధారావాహికంగా నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాలు వారధిగా ఉపకరించేవి. ఎప్పుడైనా అనుకోకుండా కలిసికొనడం తటస్థించివపుడు ఆ భేదమూ, ఆ దూరమూ ఆపిరిలా ఇట్టే హరించిపోయేవి. తోటి ఆనుచరునితోను, ఆత్మీయుడైన మిత్రునితోనూ, ప్రేమపాత్రుడైన బిడ్డతోనూ మాట్లాడినట్లు మాట్లాడేవారు నాతో.

ఆయన వాల్తేరును శాశ్వతంగా విడిచివెళ్లేటప్పుడు మా యిరువురి మధ్యా జరిగిన సంభాషణ నాస్మృతిపీఠిలో ఎప్పుడూ మెదలుతూ వుంటుంది. మేమిద్దరం వైస్ ఛాన్సలర్ భవనం మేడపైన ఒక గదిలో కూర్చునివున్నాం. తాను లోగడ బెంగుళూరు మైసూరులోవున్న రోజులను గుఱించి సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యతో తనకు తటస్థించిన వివాదాన్ని గూర్చి, స్థానిక ప్రజలు నిర్దుష్టమైన కన్నడం అని భ్రమవడేటట్లు అక్కడ తానిచ్చిన సంస్కృత పదభూయిష్ఠమైన ఉపన్యాసాలను గూర్చి, ఏదో ఒక అసంపూర్ణ కార్యాన్ని పూర్తిచేయాలన్నట్లు మైసూరు తిరిగివెళ్లాలని తనకు గలిగిన వింతకోరికను గుఱించి మాట్లాడుతూ - అయితే కాల ప్రవాహాన్ని వెనక్కి మళ్లించడం అంత తెలివిగల పని అంటారా? అని ప్రశ్నించారు.

తెలుగు వారిని కొట్టి లేపినాయి. ఈనాటికి ఏ సమస్య వచ్చినా, ఏ ప్రస్తావన వచ్చినా రెడ్డిగారి ఉవాచలు ప్రస్తావించడం, వాటిని ఆధారముగ తీసుకోవడం తెలుగు వారి మేధాఫలకంపై ఈనాటికీ చెరగని, తరగని ముద్రవేసి వెళ్ళిన రామలింగారెడ్డిగారి పాత్ర అమోఘమైనది. రాజకీయాలలో, సాంఘిక విషయాలలో, సంప్రదాయాలలో, సాహిత్యంలో కట్టమంచివారు తెలుగు వికాసానికి చేసిన సేవ, దాని విలువ దీనినిబట్టి నిర్ణయం కావడంలేదా! ఆయన బాణి, ఆయన రీతి తెలుగువారికి ఈనాటికీ గిలిగింతలు పెడుతూనే వున్నాయి. వారిలో ఆలోచనలు రేకెత్తిస్తూవే వున్నాయి. ఎంతటి ప్రభావం అది!

తెలుగు సాహిత్యానికి కొత్త కాంతిని చూపించి వెళ్ళారు రెడ్డిగారు. వేమన్నను వెలికి తియ్యడానికి, బ్రౌను తరువాత ఆయనగారి కృషి పెద్ద కారణం. తెలుగులో సాహిత్య విమర్శకు ఒరవడిచుట్టింది ఆయన. కొత్తదారి తొక్కింది ఆయన. సాహిత్యం యెడల నూతన దృక్పథంతో చూడమని రామలింగారెడ్డిగారు చెప్పి వెళ్ళినారు. చూపించి మరీ వెళ్ళారు. కవిత్వతత్త్వ విచారం సరికొత్త విమర్శనా విధానం. తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చెయ్యడానికి వుపయోగించే మార్గం. అది ఒక కొత్త వెలుగు.

తెలుగులో శాస్త్రరచన చేయవచ్చునని రామలింగారెడ్డిగారు చూపించివెళ్లారు. వారి 'అర్థశాస్త్రం' అందుకు నిదర్శనం.

ఆంధ్రదేశమంతా తిరిగి విరివిగా తన సందేశాల్ని అందిస్తూ, మనుషుల్ని కదిలిస్తూ ఆలోచింపచేస్తూ రెడ్డిగారు జీవించారు. అందుకనే వారిని తెలుగువారు వేనోళ్ల ఈనాటికీ చెప్పుకుంటారు. ఆదే వారి వలుకుబడి, ప్రత్యేకత. తెలుగు వారిని చైతన్యవంతుల్ని చేసిన ప్రతిభాపంతులలో కట్టమంచి రామలింగారెడ్డిగారు అగ్రశ్రేణికి చెందివవారు. మనం వారికి చాలా రుణపడివున్నాము.

★

సర్వ తంత్ర స్వతంత్రుడే కాని వివాదాస్పదుడు

శ్రీ పండ్రంగి రాజేశ్వరరావు

ప్రతిభావంతులు స్వతః ఏకాకిగా వుండటానికి యిష్టపడతారు గాని మందితో ఎన్నడూ పూర్తిగా మిళితంకారు. మిళితం కాలేరు. వారిని అర్థంచేసుకొని అభిమానించే వారు సకృత్తుగా వుంటారు. ప్రజానీకం వారిని అనుమానించి దూరంగా వుంచుతుంది. అందువల్ల నష్టపడేది ప్రజలేకాని వారుకాదు. జవహర్‌లాల్ నెహ్రూ తమ ఆత్మ కథలో "నేను మందితో కలిసి మసలినా వ్యక్తిగా ఏకాకినే" అని వ్రాసుకున్నారు. ముఠాలస్థానాన్ని ముఠాలు, మఠాధిపతుల స్థానాన్ని మఠాధిపతులు ఆక్రమించినపుడు ప్రతిభ వికసించే అవకాశం సన్నగిలిటంలో ఆశ్చర్యంలేదు. అరుదైన ప్రజ్ఞానిధుల కోవకు చెందినవారు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు.

జాతీయ అంతర్జాతీయ విషయాలను పూర్తిగా ఆకళింపుచేసుకున్నా ఆయన రాష్ట్రస్థాయిలో మైలు రాయివలె వుండవలసి వచ్చింది. జ్యోతిషం తెలిసిన ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్యగారు అన్నారుట, "ఆంధ్రులలో వేను అద్వితీయ మైన మేధావినే కాని అల్పాయుష్కుడను. నాలాగే అద్వితీయుడైన రామలింగారెడ్డికి కుజ దోషం వుంది. వాక్ స్థానంలో బృహస్పతి వున్నా వెత్తిమీద శని వున్నాడు. అందుచేత మినుకు మినుకుమంటూ జీవితాన్ని వెళ్లబుచ్చుతారు. మాకోవకు చెందిన రాధాకృష్ణన్ జాతక చక్రంలోను గ్రహమాళిక వుంది. గొప్ప యోగజాతకుడు కాదా పథానికి వెడతారు."

అదేమి చిత్రమో ఈ జోస్యం అక్షరాల తు. చ. తప్పకుండా నిజమైనది. అశోక చక్రవర్తి జాతకం జవహర్‌లాల్ నెహ్రూ జాతకం ఒకే రకమైనవని ఒక కాశీ పండితులు అన్నారు. అందుచేత జాతకాలను పూర్తిగా కొట్టివెయ్యరాదు. కె. ఎమ్. మున్షి, పంపూర్ణానందలు జ్యోతిష్యంలో తమకు గట్టినమ్మకం వుందని ఘంటాపథంగా చెప్పారు. ఇట్టి నమ్మకాలు లేవని చెప్పుకున్న నెహ్రూ సహితం తన మనుమలకు ప్రకాశద్వారా సుప్రసిద్ధుడైన కాశీ పండితునిచేత జాతకాలు వ్రాయించారు.

సుప్రసిద్ధ అణుశాస్త్రవేత్త అయిన నీల్స్ బోర్, గది గోడలమీద వున్న గుర్రపు గిట్టను చూచి (గుర్రపుడెక్క శుభసూచకమనే నమ్మిక పాశ్చాత్యులలో వుంది) "ఏమిటి మీకుకూడా యిట్టి మూఢనమ్మకాలా?" అని ఒక మిత్రుడు ఆశ్చర్యపడగా ఆయన నవ్వి "నేను నమ్మినా నమ్మకపోయినా గుర్రపుగిట్ట అచట పెట్టినప్పటినుంచి నాకు సదాశుభం చేకూరుతోంది" అని సమాధానమిచ్చారు.

నేను తొలుత శ్రీ రెడ్డిని గురించి సుప్రసిద్ధ సంస్కృతాంధ్ర ఇంగ్లీషు పండితులు మదరాసు ప్రభుత్వానికి ప్రధాన తెలుగు అనువాదకులు, మదరాసు విశ్వవిద్యాలయ మందు తెలుగుపరీక్షకుల పరిషత్ అధ్యక్షులు, నా మేనమామగారైన శ్రీ చెన్నాప్రగడ భానుమూర్తిగారి ద్వారా విన్నాను. వీరువుభయులు తరుచు మదరాసులో మునగాల రాజా (శ్రీ నాయని రంగారావు)గారి బంగాళాలో కలుసుకుని సారస్వత విషయాలను నుదీర్ఘంగా చర్చించేవారు. తరువాత 1935వ సంవత్సర ప్రాంతమందు మదరాసు కాంగ్రెసు భవనంలో శ్రీ సత్యమూర్తి మాట్లాడిన సభకు వీరు అధ్యక్షత వహించారు. పరిహద్దు జిల్లా అయిన చిత్తూరు నివాసి అవటంచేత రెడ్డిగారికి తమిళం వచ్చు. సత్యమూర్తి తమిళంలో మాట్లాడగా వీరు ఇంగ్లీషులో ప్రసంగించారు. సభ ముగిశాక నేను దగ్గరకువెళ్లి "మీరు తెలుగులో మాట్లాడితే బాగుండేది" అన్నాను. "మనం అంతర్జాతీయ స్థాయిలో మసలాలి" అని సమాధాన మిచ్చారు.

నేను 1936లో విశాఖపట్నం వచ్చేసరికి వీరు తిరిగి ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవిని చేపట్టారు. సర్వతోముఖ పాండిత్యముగల పంచాప కేశయ్యరు (ఐ. సి. యస్) అచట జిల్లా జడ్జిగా వుండేవారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని బహిరంగముగా విమర్శిస్తూ వుండటంచేత స్వతంత్రం వచ్చాక కాని హైకోర్టు జడ్జి కాలేక పోయారు. ఈ సందర్భంలో ఒక ఉదంతం గుర్తుకు వస్తోంది. సివిల్ సర్వీసెస్

క్లబ్బులో సహవుద్యోగి అయిన, ఖుద్వా, అయ్యరుని పిల్లలెందరిని ప్రశ్నించారు. అయ్యరు ఆర్గురు అనిసమాధానమిచ్చి ఎంత ఎక్కువ మంది అయితే అంత మంచిది. బ్రిటిష్ పాలకులను త్వరగా దేశంనుంచి తరిమివేయవచ్చును- అని వ్యాఖ్యానించారు. అంతా వింటున్న బ్రిటిమ వుద్యోగి (పేరు గుర్తుకురావటంలేదు) "అయ్యరు నంతా నోత్పత్తి కార్యక్రమంలో నిమగ్నులైనపుడు జైహింద్ అని అరుస్తూ వుండాలి" అని చమత్కరించారు. అయ్యరుగారు మాట్లాడే ప్రతిసభకు శ్రీ రెడ్డి అధ్యక్షత వహించే వారు. అసలు వుపన్యాసం కంటె వీరి తొలివలుకు, తుదిపలుకు అమోఘంగా వుండేవి.

వీరిది పండిత వంశం. పంచమ వేదంగా పరిగణింపబడే మహాభారతం వీరికి ప్రీతిపాత్రం. పువ్వు పుట్టగానే పరిమళించునట్లు విద్యార్థి దశలోనే "కవిత్వ తత్వ విచారం" అనే విమర్శనా గ్రంథాన్ని వ్రాశారు. కేంబ్రిడ్జిలో అధ్యాపకుల మన్ననలను పొందటమేకాక అచటి విద్యార్థుల సంఘానికి వుపాధ్యక్షులయ్యారు. ఈ గౌరవాన్ని పొందిన ప్రధమ భారతీయులు వీరే. పార్లమెంటు ఎన్నికల సందర్భంలో లిబరల్ అభ్యర్థి తరపున ఉపన్యాసాలిచ్చి ప్రచారం చేశారు. "కేంబ్రిడ్జి లిబరల్ క్లబ్బు కార్యదర్శిగా" పనిచేశారు. అర్థశాస్త్రంలో వున్నత శ్రేణిలో వట్టభద్రులు కావటమేకాక బారిష్టరు చదువు పూర్తిచేశారు. శ్రీ గోపాలకృష్ణగోఖలే సలహాపై బారిష్టరు పట్టాను తీసుకోకుండా తమ జీవితాన్ని విద్యాభివృద్ధికి అంకితం చెయ్యటానికి నిర్ణయించుకున్నారు. వీరు న్యాయవాద వృత్తిని స్వీకరించివుంటే పుష్కలంగా సంపాదించి కావాలనుకుంటే సునాయాసంగా హైకోర్టు న్యాయమూర్తి అయ్యేవారు.

శ్రీ అరవిందహోమ బరోడా కాలేజి వైస్ ప్రిన్సిపాలు పదవిని విసర్జించి విప్లవోద్యమంలో చేరగాజే శ్రీ రెడ్డి ఆ పదవి నధిష్ఠించారు. పిమ్మట మైసూరు మహారాజా కాలేజి ప్రిన్సిపాలు అయి చివరకు అచట ప్రధాన విద్యా శాఖాధికారి పదవి నలంకరించారు. తమ హయాములో ప్రతిగ్రామంలోను స్కూలును పెట్టించి అందు హరిజనులకు ప్రవేశమిచ్చారు. వీరు అకస్మాత్తుగా మైసూరు సంస్థానాన్ని వదలి స్వస్థలానికి తిరిగి రావలసి వచ్చింది. ఇందును గురించి చాలా కట్టుకథలు వున్నాయి. వాటిలో కొంత యదార్థము లేకపోలేదు. ఇటీవల యీ విషయాన్ని గురించి మిత్రులు శ్రీ కూర్మా వేణుగోపాలస్వామిగారితో చర్చించినపుడు వ్యక్తిగత విషయాలకు ప్రాధాన్య మివ్వరాదనే నిర్ణయానికి వచ్చాను. పొరపాట్లు అంతా చేస్తారు, బ్రహ్మచారులు

తొందరపడటంలో ఆశ్చర్యములేదు. పొరపాట్లలో కొన్ని సర్దుకోకలవి కొన్ని సర్దుకోలేనివి వుంటాయి. గృహస్థాశ్ర మానుభవంలేని రెడ్డిగారు కొన్ని పరిణామాలకి గురి కావలసి వచ్చుట అనివార్యము. అందుకే పెద్దలు 'మోక్షయతే సంసారః' అన్నారు. ఇంతలో మాంటేగు - చెంమ్సుఫర్డు సంస్కరణల క్రింద మదరాసు శాసనసభకు ఎన్నిక అయ్యారు. బ్రిటిషు ప్రభుత్వము ఆశీర్వచనముతో విభజించి పాలించుట కేర్పడిన జస్టిసుపార్టీలో తొలుత చేరినా పొరపాటును వెంటనే గ్రహించి కులతత్వ ప్రాతిపదికను ఘాటుగా విమర్శించి పానగల్లు మంత్రి వర్గానికి పక్కలో బల్లెములా తయారయ్యారు. వీరి తాకిడికి తట్టుకోలేక పానగల్లు రాజా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఏర్పరచి వీరిని తొలిఉపాధ్యక్షులుగా ఎంపికచేశారు. ఇందువల్ల విద్యారంగానికి ఉపకారం జరిగినా రాజకీయాలకు అపకారమైంది. నిత్యజీవితంలో "కాని" అనేవదానికి తావులేదు. జీవితం నడవవలసినట్లు నడుస్తుంది.

ప్రతిభను విస్మరించి కులప్రాతిపదికపై విశ్వవిద్యాలయంలో ఉద్యోగాలివ్వవలసినదిగా ప్రభుత్వ మెంత వత్తిడిచేసినా లెక్కచేయక ప్రతిభకే ప్రథమ తాంబూలమిచ్చారు. ఇందుకు కారణం వీరి అసమాన ప్రతిభే. "ప్రతిభను విస్మరించేముందు నేను ఆత్మహత్య చేసుకోవాలి" అనేవారు. వీరు పండిత పక్షపాతులగుటచేత వీరి హయాములో ఆంధ్ర విశ్వవిద్యాలయమందు రత్నాలు పోగువడ్డాయి.

విశ్వవిద్యాలయానికి నిధులను సమకూర్చటంలో దీక్షా దక్షతలను ప్రదర్శింపలేకపోయారు. నాగపూరు నుండి దహగం లక్ష్మీనారాయణగారు భూరి విరాళం యిద్దామని విజయవాడ రాగా రెడ్డిగారు ఆయనను రైలుస్టేషను వద్దకు వెళ్లి స్వయంగా కలుసుకోక రిజిస్ట్రారు సి. డి. సుబ్రహ్మణ్య చెట్టిగార్ని పంపారు. అంతట ఆయన లైబ్రరీకి మాత్రము లక్ష రూపాయలిచ్చి సుమారు పలుబది లక్షలు నాగపూరు నందు టెక్నికల్ ఇన్స్టిట్యూటుకు విరాళంగా యిచ్చారు. ఇందుకు భిన్నంగా పండిత మదన మోహనమాళవ్యాకు, తొలుత వైజాగు నవాబు హిందూ విశ్వవిద్యాలయానికి విరాళమివ్వటానికి నిరాకరించగా అప్పుడు మాళవ్యా శుక్రవారం మసీదు వద్ద బిచ్చగాళ్లనడుమ నుంచున్నారు. నిజాము ఆదృశ్యమును చూడగావే పిలచి భూరి విరాళం యిచ్చి పంపారు. సంస్థానాలలో రాజకుమారులకు అక్షరాభ్యాసముచేసి సంభావనగా పెద్ద మొత్తాలు సేకరించేవారు. అందువల్ల గాంధిజీ మాళవ్యా పండితుడిని 'భిక్షుక చక్రవర్తి' అని సంబోధించేవారు.

1930వ సంవత్సరమందు ఉప్పుసత్యాగ్రహ సమయంలో బ్రిటిష ప్రభుత్వము అవలంభించిన దమన నీతి వీరి హృదయాన్ని కలచివేసింది. అందుకు అపమ్మతి తెలియచేస్తూ తమ పదవికి రాజీనామా చేశారు. తదువరి కాంగ్రెసు అభ్యర్థిగా రాష్ట్ర శాసనసభ సభ్యులుగాను, చిత్తూరు జిల్లాబోర్డు అధ్యక్షులుగాను వుండి సంకుచితమైన రాజకీయ వాతావరణం సరివడక తిరిగి 1936లో ఆంధ్ర విశ్వవిద్యాలయోపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

అపుడు జయపూరు దివాన్‌గా వుండిన ఓబుళంపల్లి పుల్లారెడ్డిగారు ఆక్స్‌ఫంగు వైను చాన్సలరుగా వుండిరి. వారు తమ ఆత్మకథలో సెవేటు సభ్యులంతా తమ్ము ఎన్నుకుంటామన్నా రానులింగారెడ్డిగారి అభ్యర్థనను పురస్కరించుకొని పోటీనుంచి తప్పుకున్నామని వ్రాశారు. వదలిన వదవికి చేయిచాచుటచే లోకువగుట సహజము. ఇందుకు విరుద్ధముగ రాధాకృష్ణగారు రెండవతూరి ఉపాధ్యక్షులుగ ఎన్నికైన పిదప ఆక్సఫర్డు విశ్వవిద్యాలయమందు ఆచార్య పీఠము రాగానే తమ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా యిచ్చారు. కాశీ హిందూవిశ్వవిద్యాలయమందు తమ మాట చెల్లుబడి కాని పరిస్థితి వుత్పన్నంకాగానే తమ వదవికి రాజీనామా యిచ్చిరి. డాక్టరు లక్ష్మణ స్వామి మొదలియారు. మదరాసు విశ్వవిద్యాలయాన్ని పాతికేళ్లపాటు అంటిపెట్టుకు వుండటంచేత జాగలా తయారయ్యారవే విమర్శ పచ్చింది. వదవుల యెడ నిర్లిప్తత నిష్కామము వున్నపుడే స్థాయి పెరుగుతుంది.

వీరి గ్రాంధిక భాషాభిమానులైనా, శ్రీ నండూరి సుబ్బారావు రచించిన ఎంకి పాటలను మెచ్చుకున్నారు. అట్లాగే శ్రీ పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి పాండవులకు రాజార్హత లేదని కౌరవులే హక్కుదారులనీ వ్రాసిన'భారత విమర్శను' వుగ్గడించారు. శ్రీ కందుకూరి వీరేశలింగం ఆక్రమముగ సనాతనులపై విరుచుకువడ్డ తీరుని వారి శతవార్షికోత్సవ సభకు అధ్యక్షత వహించినపుడు నిష్కర్షగా విమర్శించారు. కమ్యూనిజం ఎడగల వ్యతిరేకత వలన అందుకు సంబంధించిన గ్రంథాలు చదివితే యువకులు తప్పుత్రోవలు తొక్కుతారని ఆ గ్రంథాలను విశ్వవిద్యాలయ భాండాగారం నుంచి తొలగించినా శ్రీ ఎమ్. ఎన్. రాయి స్థాపించిన (Marxiam way) "మార్క్సు వథం"అనే త్రైమాసిక ఆంగ్ల పత్రికకు వ్యాసాలు వ్రాసేవారు. గాంధిజీయెడలఅఖండమైన గౌరవమున్నా ఆయన ప్రాతివదిక మౌలిక విద్యావిధానాన్ని ఘాటుగా విమర్శించి "శరీరశ్రమ హెచ్చినకొద్ది మెదడు విశ్రాంతి తీసుకుంటుంది, విద్యను స్వయం

పోషకం చెయ్య సమకట్టినవాడు పిల్ల శ్రమనుంచి ఆదాయం తీయడానికి ప్రయత్నిసారు అని విశదీకరించారు. ఉన్నవ లక్ష్మీనారాయణగారి ''మాలపల్లి''పై నిషేధాన్ని తొలగించమని నాటి రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వాహ సంఘ సభ్యులైన శ్రీ సి. వి. రామస్వామి అయ్యరుకు లేఖ వ్రాశారు. రెండవ ప్రపంచయుద్ధ కాలంలో యుద్ధ కృషిని బలపరచటమేకాక పాకిస్తాన్ వాదాన్ని సమర్థించారు. రాగద్వేష రహితంగా భేదామోదాలతో నిమిత్తం లేకుండా ధర్మా ధర్మ నిర్ణయం నిర్భయంగా చేసేవారు. వారి అభిప్రాయాలు వారితో ఏకీభవించని వారికి సహితం యుక్తి యుక్తంగాను దురభిమాన రహితంగాను గోచరించేవి. దాపరికం లేనందున అధికారంలో వుండేవారి ఆదరాభిమానాలను చూరగొనలేదు. 1937వ సంవత్సర మందేర్పడిన రాష్ట్ర మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రి కావటానికి తగినవారైనా వీరికి శాసన సభ్యత్వం సహితం లభించలేదు. వీరి విలువను గుర్తించి రాష్ట్ర గవర్నరు వీరిని ఎగువసభ సభ్యులుగా నియమించారు. 1946లో రాజ్యాంగ నిర్ణయ సభ ఏర్పడినపుడు వీరి కందు స్థానం లేకపోయింది. వీరిది రాజసస్వభావం అగుటచేత ఆశ్రయింపు కిట్టేది కాదు. "సర్" బిరుదు స్వీకరించాక ప్రజానీకానికి దూరమయ్యారు.

వీరి అభిమానము అపుడపుడు అవధులు దాటేది. వేమనను వుగ్గడించటం ఒక తార్కాణము. కులాన్ని విమర్శించిన వేమన రెడ్డి శోభాయుడన్నారు. ప్రముఖ సంఘ సంస్కర్త హేతువాది బ్రహ్మ సమాజస్థుడు అగు వీరేశలింగంగారు సహితము తమ ఆంధ్ర కవుల చరిత్రలో ఆ యా కవులు ఆర్వేల నియోగులని ఆపస్తంబ సూత్రులని వుటంకించారు. బ్రహ్మఋషి వెంకటరత్నం నాయుడుగారుకూడ కాపు మహాసభకు అధ్యక్షత వహించ తమ సంఘీయులు సైన్యంలోచేరి బ్రిటిషు సామ్రాజ్యానికి బాసటగా నిల్చారని ఎలుగెత్తి చాటారు. శాఖాభిమానము ప్రమాదభరితము. శాఖలను (చెట్టుకొమ్మలు) అంటిపెట్టుకు వుండేవారు నరులు కాదు వానరులు. వేమన కొమ్మలుతిరిగిన కవిని పండితుడిని కాకపోయినా 'వేమన బోధకుడుకాని కవి కాదు' (More a preacher than Poet) అనే పుట్టపర్తి నారాయణాచార్యులుగారి అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను. మతం మారినా కులాలు మారనందున చాలా మంది తమ అభిప్రాయాలమ నిర్భయంగా ప్రకటించలేకపోతున్నారు. విశ్వనాధ సత్యనారాయణగారు,రవీంద్రనాథ్ టాగూర్ నాసిరకపుకవి అధ్వాన్నపు గద్యరచయిత చౌకబారు నాటక కర్త,కాని మంచి కథకుడు (Poor Poet, Poorer Prose Writer, Poorest Dramatist but good short story writer) అని నిర్భయంగా చెప్పారు.

వీరికి జ్ఞాన సముపార్జనపై వున్న ధ్యాస వ్రాయంటలో కనిపించదు. తెలుగులో "మునలమ్మ మరణం" "ఆర్థికశాస్త్రం" అనే గ్రంథాలు వీరి పేరుమోదుగా వున్నాయి. వీరి విద్వత్తు ఉపోద్ఘాతాల మధ్య వువన్యాసాల సడుమ చెదురు మదురుగా నిక్షిప్తమై వుంది. వీరి ఆదర్శాలు వున్నతంగా వుండేవి. కొంతకాలం పాటు జీతంలో సగమే తీసుకొంటూ శేషించిన మొత్తంతో జాతీయ బహుమాననిధి నేర్పరచి సి. వి. రామను అరవింద ఘోష్, శాంతి స్వరూప్ భట్నగర్ ప్రభృతులను సత్కరించేవారు. తమకు ఏమాత్రము నచ్చినా వుదారముగ పోత్సహించేవారు. వీరిలో ఈర్ష్యా, అసూయలు లేవు.

వేను "భారతకళ" పై వ్రాసిన ఆంగ్ల గ్రంథాన్ని కళాయోగి ఆనంద కుమారస్వామి కంకితమివ్వగా "ఇంతకాలానికి ఆనంద కుమారస్వామి విలువను గ్రహించిన ఆంధ్రుడొకడున్నాడని బ్రహ్మానంద భరితుడవైవా" నని ఆప్యాయతతో వుత్తరం వ్రాశాడు. కుమారస్వామి సతి శ్రీమతి డోనా లూయిసా, వారి కుమారుడు రామ కుమారస్వామి అమెరికాలో వారి యింటిని విక్రయించి భారతదేశం వచ్చి స్థిరవడదామనుకుంటే వారికోసం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అనువైన వదవిని చూడాలని తహ తహ పడ్డారు. తిరా కుమారస్వామి సతివారి అస్థికలను కాశీయందు గంగలో నిమజ్జనముచేసి నాగార్జునకొండ చూడటానికి వచ్చేసరికి వీరు దివంగతులు కావటం విచారకరం. కళాకోవిదులైన ఇ. బి. హేవల్, ఆనంద కుమారస్వామి గార్లను గురించి కేంబ్రిడ్జిలో తాము విద్యార్థులుగా వున్నప్పటి స్మృతులను వుత్సాహంతో వివరించేవారు. వేను "భారత రాజ్యతంత్ర పరిణామము" అనే ఆంగ్ల గ్రంథాన్ని వ్రాసినపుడు అందు పై రాజ్యతంత్రానికి రాజ్యాంగానికి గల తారతమ్యాన్ని వివరించి పుస్తకం పేరునుగురించి చమత్కరిస్తూ "మీ పుస్తకానికి నామకరణం చేయడానికి వేను పురోహితుడను కానుకదా!" అని ఒక విసురు విసిరారు.

ఈ సందర్భంలో జార్జిబెర్నార్డుషా వాకు వ్రాసిన లేఖ గుర్తుకు వస్తోంది. పాట్నాలో ఓ సచ్చిదానందసింహా వనుపున 'హిందూస్థాన్ రివ్యూ'లో షాగ్రంథాన్ని సమీక్షించి ఆ పత్రికను వారికి పంపుతూ వారిగ్రంథాలన్నింటిని పంపితే పమీక్షించి ప్రత్యేకసంచికను ప్రచురింపగలమని కొంటెగా వుత్తరంవ్రాయగా వారు స్వదస్తూరితో సమాధానమిస్తూ 'మీ వ్యాసం చదివి ఆనందించాను. మీరు దీనిని లండను

'టైమ్సు'కు ఎందుకు పంపలేదు? పుస్తకాలు వుచితంగా ఎవ్వరికీ యివ్వరాదు. వుచితంగా వచ్చేవాటిని చదవరు' అని మార్దవంగా మందలించారు.

శ్రీ రెడ్డి వ్రాసే వృత్తరాలలో ఆప్యాయత ఒక ప్రత్యేకత వుండేది. సుదీర్ఘమైన కిష్ట విషయాలను సూటిగా క్లుప్తంగా సుస్పితంగా వివరించేవారు. వీరి వృత్తరాలను సేకరించి పుస్తకముగ ప్రచురిస్తే బాగుంటుంది. వీరి ఉపన్యాసాలను వ్యాసాలను కొన్నింటిని సేకరించి శ్రీ కె. ఆర్. శ్రీనివాస అయ్యంగారు చక్కటి వుపోద్ఘాతంతో ప్రకటించారు. శ్రీ డి. ఆంజనేయులు వీరి జీవితచరిత్రను ఆంగ్లంలో క్లుప్తంగా రచింవగా సాహిత్య అకాడమీ ప్రచురించింది. తక్రాపి జాతీయ పరిగణ లభించింది. ఇటీవల శ్రీ బండి గోపాలరెడ్డి (బంగోరె) చేస్తున్న కృషి గణనీయము. వీరి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖ పౌరులు తమ ధర్మాన్ని నిర్వర్తించారు.

వీరి సరసోక్తులు శాశ్వతత్వం సంపాదించుకున్నాయి. ఆజన్మ బ్రహ్మచారి అయినా విద్య తన ప్రధాన ప్రేయసి అనేవారు. ఒక సభలో తనను భీష్ముడు, హనుమంతుడు, వినాయకుడు అని ప్రస్తుతిస్తే "లేనిపోని విశేషణాలు యెందుకు దుర్వినియోగం చేస్తారు. అవివాహితుడనైనా స్త్రీల సంగతి వివాహితుల కంటె నాకు ఎక్కువ తెలుసు" అన్నారు. జాతీయోద్యమం ముమ్మరంగా వున్నపుడు విద్యార్థుల సమావేశంలో మాట్లాడటానికి అలహాబాదువెళ్ళి యూరోపియన్ సౌకర్యాలు వున్న హోటలులో మకాంచేశారు. జాతీయవాదులు విమర్శిస్తే నవ్వి కడుపు విదేశీ తినుబండారాలకు క్రాగు బండారాలకు తహ తహ వడ్డా హృదయం నూటికి నూరు పాళ్ళు స్వదేశీగావే వుంది అన్నారు. 1935వ సంవత్సరపు ఇండియా చట్టంలో స్వరాజ్యం తెచ్చే క్రిములున్నాయని జస్టిస్ పార్టీ నాయకుడైన శ్రీ కె. వి. రెడ్డినాయుడు గారు అనగా అవి ప్లేగువ్యాధిని తెచ్చే క్రిములని హెచ్చరించారు. రాష్ట్ర ఎగువ సభలో వామినేటెడు సభ్యులుగా వీరు వున్నపుడు ముఖ్యమంత్రి రాజాజీ తమది ఏ నియోజకవర్గమని ప్రశ్నిస్తే ఆంధ్ర ప్రాంతమంతా అని సమాధానమిచ్చారు.

మదరాసు రైలుస్టేషనులో వీరి వద్దకు ఒక వర్తికా రిపోర్టరు రాగా తనకు కావలసింది సామాను దింపే పోర్టర్ మాత్రమే అని చమత్కరించారు. పరధ్యానముగా స్త్రీల మరుగుదొడ్డివైపు తొందరగా వెడుతూవుంటే రైల్వే అధికారి అడ్డగించగా తాను స్త్రీల నిమిత్తమే సృష్టింపవడ్డానన్నారు. ప్రముఖ న్యాయవాదియగు

శ్రీ అల్లాడి కృష్ణస్వామి షష్టిపూర్తి సమావేశంలో మాట్లాడుతూ శారీరకంగ ఆయన వానరానికి, నరునికి నడుమ తెగినలింకు అని అందర్నీ నవ్వించారు. జస్టిసుపార్టీకి జాతీయగీతాలరావు, వచ్చింది హంసగీతం మాత్రమే అన్నారు. హంస కుయ్యగానే మరణిస్తుందని ప్రతీతి.

ఆంధ్రకేసరి ప్రకాశం, ఒమాండూరు రామస్వామిరెడ్డి మదరాను ముఖ్య మంత్రి వదవికి పోటీచేస్తున్నపుడు ఆ వదవిని పొందటానికి డాక్టర్ సుబ్బరాయన్ మంత్రాంగము వన్నగా "రెండు సింహాలు ముఖాముఖీ ఢీకొంటూవుంటే ఒక జిత్తుల మారి నక్క (సుబ్బరాయన్ రాజాజీ శిష్యులు) ఆ వదవిని నోటకరుచుకుపోవటానికి ప్రయత్నిస్తోంది" అని విమర్శించారు. భాషా కులతత్వ వివాదాలను గురించి అభిప్రాయం అడిగితే "నేను కులాలను భాషలను సృష్టించలేదు. ఈ ప్రశ్న సృష్టి కర్తకు వెయ్యండి" అన్నారు. అభిమానులు మేళతాళాలతో వూరేగిస్తామంటే. "వేను పెండ్లికొడుకును లేక ప్రేతను మరి దేవునికాదు" అని చమత్కరించారు. కాము వేసవి పువాదిరాళ్ళా లేక సమాధిరాళ్ళా అని ప్రశ్నించేవారు. గాంధీజీకి నికార్సయిన శిష్యులు లేరని, జవహర్‌లాల్ కలలుకంటూ వుంటారని, సుబాష్ చంద్ర బోసు బాధ్యత లేని తిరుగుబాటుదారని చెప్పేవారు. ప్రభుత్వ దృష్టిలో అణగి వుండటం చాకచక్యానికి గీటురాయి అనేవారు. భావకవిత్వం కీట్సు, షెల్లీ, ఠాకూరులద్వారా వచ్చుటచేత దేశీయంకాదనేవారు. ఆందోళనకారులు ప్రభుత్వా లను నడుపలేరని వీరి అభిప్రాయం. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు ఆస్థానకవిగా నియమింపబడినపుడు జరిగిన సన్మాన సభలో వీరు మాట్లాడుతూవుంటే శాస్త్రిగారు కూడా అందుకుని సన్నగా మాట్లాడటం ప్రారంభించగా 'శాస్త్రిగార్కి జంటకవిత్వం చెప్పే అలవాటు ఇంకా పోలేదు' అన్నారు. అప్పటికి తోటికవి దివాకరుని తిరువతి శాస్త్రిగారు గతించి మూడు దశాబ్దాలు అయింది. కాము ఉపాధ్యక్షులుగా వుండగానే ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ ఎందుకు తీసుకున్నా రని ప్రశ్నిస్తే "ఇతరులు మనలను ఖాతరు చేయనపుడు మనం మనలను గౌరవించు కోవద్దా" అన్నారు. ఇలాంటి వుదాహరణలు కోకొల్లలు.

వీరి సరసోక్తులు అపుడపుడు మోతాదు మించి మొరటుగా వుండేవి. ఉదాత్తమైన సరసోక్తులు తల్లి, సోదరి సహితము హర్షించేటట్లు వుండాలి. లేనిచో మేహశాంతి మాటలు మిగిలిపోతాయి. అస్లీలాలను ఇంగ్లీషులోను, సంస్కృతంలోను

వుచ్చరిస్తే తప్పులేదు. తెలుగులో చెపితే తంటా వస్తుంది. అందువల్లనే మన వాళ్ళు మార్వవంగా మందలించవలసి వచ్చినపుడు ''వీడు తెనుగు మీరుతున్నాడు'' అంటారు. రెడ్డిగారు తరచు ఇంగ్లీషులో మాట్లాడటచేత యిబ్బంది కలగలేదు. బీహారులో వీరిలాగే ఏ పార్టీలోను యిమడలేని డాక్టరు సచ్చిదానంద సింహా అనే ప్రముఖ వ్యక్తి వుండేవారు. వారు రాష్ట్ర శాసనసభకు పోటీచేసినపుడు దుక్కి టెద్దు వ్యవసాయానికి పనికివస్తాయిగాని, ఆంబోతులు పనికిరావని బాబు రాజేంద్ర ప్రసాద్ చమత్కరించారు. పశు సంతతి అభివృద్ధికి ఆంబోతులు అవసరంకాదా అని సమాధానమిచ్చారు. శ్రీ సింహా, రెడ్డిగారికి ఆప్తమిత్రులు. వేను పాట్నాలో వున్నపుడు శ్రీ రెడ్డి శ్రీ సింహాకు అతిధిగా వున్నారు.

ఆర్థిక శాస్త్రంలో జేమ్సుకేన్సుని, రాజకీయాలలో ఎడ్మండు బర్కుని, నిత్య జీవితంలో బెర్ట్రాండు రస్సెలును అనుకరించేవారు. శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ తమకు వారసులు ఆద్యులుకూడా అనేవారు (Succssor Predecssor) విమర్శపాలు ఎక్కువగుటచేత బ్రజేంద్రనాథ్ సీల్‌లాగ తక్కువ వ్రాసేవారు. వీరివల్ల ఎక్కువ ఆశించినా ఫలితం తక్కువగా వుండేది. వీరిజీవితం మెరవటమేకాని వెలగలేదు. డిగ్రి లేని మల్లంపల్లి సోమశేఖరశర్మగార్కి ప్రతిభను గుర్తించి అధ్యాపక పదవి నిచ్చారు. యమ్. యన్. రాయ్‌కి ఆచార్య పీఠాన్నిస్తానంటే రాయ్‌గారే తిరస్కరించారు.

వీరి యిష్టా అయిష్టాలవల్ల విశ్వవిద్యాలయానికి నష్టం వచ్చింది. ఆచార్య మామిడిపూడి వేంకటరంగయ్యగారు శ్రీమతి దుర్గాబాయమ్మగార్ని అభిమానించారని, ఉపాధ్యక్షుని ఎన్నికలో బులుసు సాంబమూర్తిగార్ని బలపరచారని, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో తమపలె వేషనల్‌వార్ ప్రంటును బలవరచలేదని వీరి ఆగ్రహానికి గురికావలసి వచ్చింది. తత్ఫలితం వారి పదవీకాలము పొడిగించనందున విద్యార్థులు నష్టపోయారు. తదువరి బొంబాయి విశ్వవిద్యాలయంవారు వేంకట రంగయ్యగార్ని సర్ ఫిరోజిషామెహతా ఆచార్య పీఠానికి నియమించి గౌరవించారు. ఆజన్మ మిత్రులు చాలాసార్లు తాత్కాలిక ఉపాధ్యక్షులుగ పనిచేసిన లక్కరాజు సుబ్బారావుగార్కి అన్యాయం చేశారనే విమర్శ కూడా వచ్చింది. విద్యార్థుల ఆదరాభిమానాలను పూర్తిగా చూరగొనలేకపోయారు. 10-12-1940 తేదీన జరిగిన వీరి షష్టిపూర్తి వుత్సవాన్ని విద్యార్థులు బహిష్కరించారు. ఇందుకు

భిన్నంగా రాధాకృష్ణగారు మైసూరు వదలి కలకత్తా వెళ్ళేటప్పుడు మహారాజావారు పంపిన వాలుగు గుర్రాల సార్టు గుర్రాలను విద్యార్థులు తొలగించి తామే ఆ బండిని జయ జయ ధ్వానాలతో స్టేషనుకు లాగుకు వెళ్ళారు.

చరమ దశలో మైసూరు విశ్వవిద్యాలయానికి ప్రోఛాన్సలరుగా వెడుతూ సౌమ్యుడైన ⸸ వాసిరెడ్డి ⸸కృష్ణ ఆంధ్ర విశ్వవిద్యాలయోపాధ్యక్షులు కావటంచూచి సంతోషించారు. ⸸ బెజవాడ గోపాలరెడ్డిని చాలా విషయాలలో తీర్చిదిద్దారు. ⸸ అశుతోష్ ముఖర్జీ, మదన మోహన మాళవ్యాల కోవకు చెందిన విద్యావేత్త స్వరాష్ట్రాన్ని అంటిపెట్టుకు వుండటంచేత సర్వ⸸ సర్వేపల్లి రాధాకృష్ణ, చిర్రావూరి యజ్ఞేశ్వ చంతామణి, ఈడ్పుగంటి రామచేంద్రరావు, జిడ్డు కృష్ణమూర్తి, మాల్కం ఆదిశేషయ్య ప్రభృతులుగా జాతీయ అంతర్జాతీయ పరిగణ లభించలేదు. ఆంధ్రుడు పైకిరావాలంటే స్వరాష్ట్రం వదలి వెళ్ళాలి లేక స్వర్గస్తుడవ్వాలి. మరోలా పేరు ప్రఖ్యాతులొచ్చేట్టులేవు. బైబిలు ప్రవచన ప్రకారం పూర్ణాయుర్దాయమైన డెబ్బది ఏళ్ళు జీవించారు. వీరి స్మృతి సమకాలిక హృదయంలో మెదులుతూవున్నా భవిష్యత్తులో ఎట్లావుంటుందో చెప్పలేము. మనం ఎంత గింజుకున్నా విధి బలీయం.

ఆ విశాల హృదయాన్ని మరువ లేను

ప్రొఫెసర్ వి. కె. ఆర్. వి. రావు

ధనాన్ని అప్పుగ ఇచ్చి సాయపడేవారు వుంటే కేంబ్రిడ్జికి వెళ్ళాలనుకుంటూ బోంబేలో చదువుకొనే మావంటి యువకులకు కీ॥శే॥ డా॥ సి. ఆర్. రెడ్డిగారు ఐతిహాసిక పురుషులుగా కన్పించే వారానాడు. చతురోక్తులతో కూడిన మహామేధావియైన వక్తగాను, ఆంగ్లేయులను కూడా వరిహాన భాజనులనుగా చేయగలిగినంత ఆంగ్లభాషా పాండితీ మండితులుగాను వారిని గురించి విన్నాం. కేంబ్రిడ్జి యూనియన్ సొసైటీలో గొప్పగా వాదించేవారు గాను, జాతి దురభిమానం కారణంగానే యూనియన్ అధ్యక్ష వదవికి ఎన్నుకోబడలేదనీ వారిని గురించి మేము విన్నాం.

డాక్టర్ రాధాకృష్ణగారి హయాంలో 1935 ఆగష్టు వెలలో ఆంధ్ర విశ్వకళా వరిషదార్థిక శాఖలో సీనియర్ ఉపన్యాసకునిగా ఉద్యోగాన్ని పొందాను. కాని వేను విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అడుగిడే నాటికి డాక్టర్ రాధాకృష్ణగారు విశ్వవిద్యాలయాన్ని వదలి వెళ్ళిపోయారు. నూతనోపాధ్యక్షులు డాక్టర్ సి. ఆర్. రెడ్డిగారు అవి తెలుసుకొన్నప్పుడు నేను ఆనంద పులకిత గాత్రుణ్ణి అయ్యాను. కళాశాల విద్యార్థి దశలో విన్న విఖ్యాత వ్యక్తిని వీక్షించటమే కాకుండా ఆయన దగ్గర పనిచేసే అదృష్టం కూడా నాకు కల్గింది కదా అవే ఆనందోద్రేకంతో కేంబ్రిడ్జి విద్యను పూర్తి చేసుకొన్న తర్వాత, వాల్తేరు చేరగానే, ఉద్యోగంలో చేరక పూర్వమే ఆయనకు నా గౌరవ పూర్వక నమస్సు మనస్సులను అర్పించాను.

డాక్టర్ సి. ఆర్. రెడ్డిగారిని కలుసుకోవటం ఆనందదాయకమైతే వారి వద్ద పనిచేయటం మహానందదాయకం. సరస్వతీ పదవులు వారి భుజస్కంధాలపై సుఖాసీనలై వుండేపు యువకులపై వారు దయచూపుతూ వుండేవారు. జీవిత ప్రారంభ పాదంలో ఎద్రాసు రాష్ట్రం బయట నివసించి ఈ రాష్ట్రంలో నిమ్నోన్నత వర్ణాలకు చెందిన హరిజనుల, బ్రాహ్మణుల స్థితిగతులు, వర్ణ వైషమ్యాల కారణంగా దుఃస్థితిలో వున్నాయని బ్రాహ్మణుడనైన నేను విన్నాను. బోంబేలో కాని, కేంబ్రిడ్జిలో కాని నేను నావర్ణం గురించి పట్టించుకోవటం కాని, పట్టించుకొనేటట్లు చేయబడటం కాని జరగ లేదు. మద్రాసు రాష్ట్ర గాథలను విని నేను భయపడ్డాను. వావర్ణం నా మార్గానికి అడ్డం వస్తుందా, భేద బుద్ధితో చూడబడితే నేను ఏవిధంగా ప్రతిస్పందిస్తాను- అనే విషయాలపై నాకు నిశ్చయాభిప్రాయాలు లేవు. ఆంధ్రాయూనివర్శిటిలో వర్ణ తత్త్వం లేదని తెలునుకొని సంతోషించాను. డాక్టర్ సి. ఆర్. రెడ్డిగారు ప్రేమాదరాలతో నన్ను చూడటమే కాకుండా, బయటివాణ్ణి అని కాని, ప్రముఖ వర్ణాలకు చెందనివాణ్ణి అని కాని తలచకుండా నన్ను రీడరుగ నియమించారు. 1936లో అహ్మదాబాదులో కళాశాల ప్రిన్సిపాలుగ నేను వెళ్ళదలపెట్టినపుడు ఆ విధంగా పోకుండా డాక్టర్ రెడ్డిగారు, శ్రీ సి. డి. ఎస్. చెట్టి (రిజిస్ట్రారు) గారు నన్ను బలవంతపెట్టిన నాటి సంఘటనల్ని నే నెవ్వటికీ విస్మరించలేను. డా॥ రెడ్డిగారితో వరిచయం వల్ల రెండు చెరవరాని శాశ్వతముద్రలు నాపై వడ్డాయి. 1. హైందవ సంఘమంతా ఒకటనీ వర్ణ వ్యవస్థ వ్యర్థమనీ నాకు పూర్తి నమ్మకమేర్పడింది. 2. విశ్వవిద్యాలయంలో భవనాలకంటే వ్యక్తులు ముఖ్యమనీ, సమర్థులైన ఉపాధ్యాయులను, వరిశోధకులను బైటకిపోకుండా ఉపాధ్యక్షుడు చూడవలసివుందనీ నాకు విశ్వాసమేర్పడింది. డాక్టర్ రెడ్డిగారితో నా వరిచయం చిరకాల మున్నది. కాకపోయినా వారియందు నా గౌరవాదరాలను జ్ఞప్తియందుంచుకొంటూ వారు నన్ను తదనంతర జీవిత కాలంలో మార్గదర్శకులుగా ప్రభావితం చేశారని చెప్పగలను. మన దేశమూ, ఆంధ్ర రాష్ట్రమూ వారి సేవలను అందుకోలేకపోవటం విచారించతగ్గ విషయం. ఇటువంటి సదాచార సంపన్నులైన మేధావుల అవసరం ప్రస్తుతం మనదేశానికి వుంది. ఆత్మ పరిశీలన, ఆత్మ విమర్శలద్వారాను ఇతరులకు సహాయ సానుభూతులను అందించటంవల్లనూ మనము ఆ మహానుభావుని స్మృతికి అంజలి ఘటించగలం.

★

సృజనశీలుడు ఆలోచనాపరుడు

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి

డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డి ఇప్పటికి దిగవంతులై మూడు దశాబ్దాలు దాటినా మన కాయన వదలిన సాహితీ విద్యా సంపద మాత్రం నిత్యనూతనత్వంతో మనకు ప్రేరణ నందిస్తూనే వుంది. శ్రీ రెడ్డి పరిహాసోక్తులతో, చతురోక్తులతో నిండిన ఆంధ్రాంగ్లోపన్యాసాలను ఇచ్చి మహావక్తగా ప్రసిద్ధి పొందారు. వారి మాటలలో రాతలలో ఆ చతుర హాసోక్తులు కన్పిస్తాయి. అవి కథలుగా, గాథలుగా ఏర్పడి ఒకరితో ఒకరు చెప్పుకొని ఆనందిస్తూంటాం.

డాక్టర్ సి. ఆర్. రెడ్డి ఎప్పుడూ స్వతంత్రంగా ఆలోచించి నడచుకొనే మహావ్యక్తి. ఆయన ముఠాకట్టి పార్టీని ఎప్పుడూ నడవలేదు. రాజకీయాలలో ఆయన కున్న సాన్నిహిత్యం కొద్దిపాటిదే అయినా ఏరాజకీయ పక్షాన్ని ఆయన అంటిపెట్టుకొని వుండలేదు. రాజకీయ పక్షంలో ప్రతి వ్యక్తి తన స్వతంత్రాలోచనల్ని కట్టిపెట్టుకొని అధిక సంఖ్యాక నిర్ణయానికి కట్టుబడి నడవవలసి వుంటుంది. కాని రెడ్డిగారు తమ స్వతంత్ర హక్కును ఏ పరిస్థితుల్లోనూ విడనాడలేదు. రాజకీయాలలో వుండటానికి కావలసిన పరిపూర్ణ వ్యక్తిత్వమూ, తెలివితేటలూ వున్నప్పటికీ ఆయనను ఏ పదవీ వరించలేదు. వారు కొంతకాలం జస్టిస్ పార్టీలోను, తర్వాత కాంగ్రెస్‌లోనూ వుండి ప్రభుత్వపు అణచివేత సిద్ధాంతానికి ప్రతిరేకంగా ఆంధ్ర విశ్వకళా పరిషదుపాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా యుద్ధ సమయంలో ఆంగ్లేయ ప్రభుత్వాన్ని సమర్థించడం సమంజసమని తలచి దానికై వారు ప్రచారం చేయగా బ్రిటిషు ప్రభుత్వంవారు సర్ బిరుదుతో డాక్టర్ రెడ్డిగారిని సత్కరించారు. ఏ పార్టీ

క్రమశిక్షణకు వారు లోబడి పుండేవారుకారు. బాల్యంలో సంపూర్ణ సంస్కరణాభిలాషి అయినా డాక్టర్ సి. ఆర్. రెడ్డిగారు రాను రాను యధాస్థితి వాదాన్ని, ఒక విధంగా మిత వాదాన్ని రూపొందించుకొని జీవితమంతా అనుసరించారు. మైసూరులో వెనుక బడిన తరగతుల వారిని, హరిజనులను ప్రోత్సహించి వారికి అవేక సౌకర్యాలను మాత్రం శ్రీ రెడ్డిగారు కల్పించారు.

తెలుగు సారస్వతంలో నూతన దృక్పథాన్ని వారు అవలంబించినట్లు కనబడుతుంది. తెలుగులో వారికి ప్రబంధ విమర్శ ఆంధ్ర రచయితలకు నూతన మార్గాన్ని ఆవిష్కరించి, తెనుగు విమర్శకులకు రాచబాటను ఏర్పరచింది. ఆంధ్రంలో వారు అసంఖ్యాక గ్రంథాలను రచించకపోయినా తెలుగులోని పలుచీకటి కోణాలను వారు వెలుగులోకి తీసుకువచ్చి, ఆంధ్ర సరస్వతికి ప్రయోజనకరమైన మహత్ సేవ చేశారు వీరు తాళపత్ర ప్రతులను రాత ప్రతులుగా వ్రాయించి అనేక గ్రంథాలను ముద్రింపించారు. అనేక యక్షగానాల ప్రచురణకు ప్రోత్సహించటమే కాకుండా ఆంధ్ర సారస్వత ఆవిర్భావానికి మూలకారణమైన జానపద వాఙ్మయ వికాసానికి శ్రీకట్టమంచి రామలింగా రెడ్డిగారు విశేష దోహదం చేశారు. స్వీయ ప్రతిభను ప్రకటించే అనేక పీఠికల్ని పలు గ్రంథాలకు వీరు వెలయించారు. వీరి "కవిత్వతత్త్వ విచారము" ఈ శతాబ్దంలో వెలువడిన గ్రంథాలలో విశిష్టమైన ఏకైకోత్తమ గ్రంథరాజం.

ఆంధ్ర విశ్వకళా పరిషత్తు శ్రీ సి. ఆర్. రెడ్డిగారు రచించిన బృహత్కావ్యం. విద్యావేత్తగా వారి నిర్మాణ దక్షతను అది ప్రతిబింబిస్తుంది. ముసాయిదా తీర్మానం వారిచే తయారుచేయబడి వారి రాజకీయ ప్రత్యర్థి అయిన శ్రీ పానగల్లు రాజావారిచే ప్రభుత్వానికి సమర్పింపబడింది. మొట్ట మొదటిసారిగా ఆంధ్ర పదం ప్రభుత్వం వారిచే గుర్తించబడటమే కాకుండా విధాన పరిషత్తులో వారి తీర్మానం చట్టంగా రూపొందింది. విజయవాడ తాత్కాలిక నివానంగా ఆంధ్ర విశ్వకళా పరిషత్తు పని చేయడం ప్రారంభమైంది. శ్రీ పానగల్లు రాజావారి సహాయ సంపదతో డాక్టర్ సి. ఆర్. రెడ్డిగారి వాల్తేరును స్థిర నివాసానికి గాను ఇష్టపడ్డారు. కాని శ్రీ ముని స్వామిగారు ప్రతిపాదించిన సవరణ ఫలితంగా దత్తమండలాలు చిత్తూరు ఆంధ్ర విశ్వకళా పరిషత్తు పరిధినుండి తొలగించబడ్డాయి. ఈ విధంగా ఐదు జిల్లాలను మద్రాసు విశ్వవిద్యాలయానికి అర్పించి ముక్కగాయి తుట్టతుదకు ఆంధ్రవిశ్వకళా పరిషత్తు విశాఖపట్టణ సుందర సముద్ర తీరాన ఆవిర్భవించింది.

ప్రస్తుతం ఆంధ్ర విశ్వకళా పరిషత్తు సాధించిన సర్వతో ముఖాభివృద్ధిని గమనించిన వారెవరైనాసరే విశాఖపట్టణాన్ని విశ్వవిద్యాలయానికి శాశ్వత నివాసంగా ఏర్పరచటంలో డాక్టర్ రెడ్డిగారు ప్రదర్శించిన దూరదృష్టిని, వివేకాన్ని ప్రశంసించ కుండా వుండలేరు. కాలానికేది అవసరమో అది డాక్టర్ రెడ్డిగారికి తెలుసు. అందుచేతవే వారు విజ్ఞాన శాస్త్రానికి, సాంకేతిక విద్యకు ప్రాధాన్య మిచ్చి వాటికే ఎక్కువ నిధుల్ని కేటాయించారు. వీరు విశ్వవిద్యాలయంలో వాణిజ్య విభాగాన్ని ఏర్పరచి దక్షిణ దేశానికే మార్గదర్శకులయ్యారు. దేశంలోని అనేక ప్రాంతాలనుండి ఉపాధ్యాయులు శాఖాధిపతులుగా ఆహ్వానించ బడ్డారు. పారస్వతాది శాఖలను ఆంధ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణ వీరిని గురించి కొందరు చేశారు. నాటి తరంవారు భారతదేశంలోని అత్యుత్తమోపాధ్యాయులచే శిక్షణ పొందాలి అని వారి ఆశంస. ఉద్యోగ నియామకాలలో ప్రాంతీయ తత్త్వాన్ని వారు ఎప్పుడూ దృష్టిలో పెట్టుకోలేదు. వారు పరిశోధనను గూర్చి నొక్కి చెప్పేవారు. సాంకేతిక విద్యకు సంబంధించిన అనేక నూతన శాఖలను ఏర్పరచటానికి వారు కారకులు. ఈ విషయంలో వారు దక్షిణ భారత దేశానికే మార్గదర్శకులు.

★

నేనెరిగిన రామలింగారెడ్డి

ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్య

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పడక పూర్వమే కట్టమంచి రామలింగా రెడ్డి గారితో నాకు వరోక్ష సంబంధాలున్నాయి. ఆయన నాకంటె 8 సంవత్సరాలు పెద్ద. నేను బి. ఏ. పూర్తిచేసి మద్రాసు పచ్చయప్ప కళాశాలలో ట్యూటరుగా పని చేస్తు న్నప్పుడు రెడ్డిగారిని గురించి ప్రథమంగా విన్నాను. వారు ఇంగ్లండులో పెద్ద చదువులు పూర్తిచేసుకొని ఆవాడే బరోడా మహారాజా కోరికపై అమెరికా పర్యటనకు వెళ్లారని చెప్పుకొనేవారు. నేను 1910లో ఎమ్. ఎ. డిగ్రీ పుచ్చుకొని కాకినాడ గవర్నమెంటు కళాశాలలో ఉపన్యాసకుడుగా చేరిన నాటికి వారు మైసూరు మహారాజా కళాశాలకు ప్రిన్సిపాలయినట్లు గుర్తు. అదే సంవత్సరం శ్రీ రెడ్డి "కవిత్వ తత్వ విచారం" అను తెలుగులో చక్కటి విమర్శ గ్రంథం వ్రాసి ప్రకటించారు. నేను విజయనగరం మహారాజా కళాశాలలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న నాటికి శ్రీ రెడ్డి గారు మద్రాసు శాసనమండలిలో ప్రవేశించి తన వచోవైభవాన్ని ప్రదర్శిస్తూండే వారు. వారి రాజకీయ కార్యకలాపాలను తరచుగా మేము చర్చిస్తూండేవాళ్ళం. మద్రాను లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఆంధ్ర యూనివర్శిటీ బిల్లురావడం, అందుకు డా॥ రెడ్డిగారి భగీరథయత్నం, 1926లో తాత్కాలికంగా విజయవాడలో యూనివర్శిటీ సంస్థాపన, దానికి మూడు సంవత్సరాల వరకు వి. సి. గా రెడ్డిగారి నియామకం- యివన్నీ మాకానాడు ప్రముఖ చర్చనీయాంశాలుగా వుండేవి. ఆంధ్రులకు ప్రత్యేంగా ఒక విశ్వవిద్యాలయ ముండవలెననియు, అది ఫలానావిధంగా రూపొందవలెననియు ఆనాడు సెలెక్టు కమిటీముందు సాక్ష్యమిచ్చినవారిలో నేనుకూడా వున్నాను. అందుకే సమర్థులు, విద్యావంతులు అయిన రామలింగారెడ్డిగారి పర్యవేక్షణాధికారంలో

ఆనాటి ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని చూసి నేను గర్విస్తూండేవాడిని. విజయనగరం మహారాజావారి కొలువులో దివాన్ పదవిని నిర్వహిస్తూ వేనానాడు ఆంధ్ర విశ్వ విద్యాలయాన్ని గురించి, దాని రథసారధిని గురించి తరచుగా ఆలోచిస్తూండేవాడిని, మహారాజాగారితో చర్చిస్తూండేవాడిని. ఆ హోదాలో వేనీ విషయాలను జయపుర మహారాజా విక్రమదేవవర్మగారితో కూడ చర్చించిన సందర్భాలున్నాయి. ఆనాడు మన రాష్ట్ర రాజకీయాలలో జమీందారులకు గట్టి మర్యాద మన్ననలుండేవి. వారి సహాయంతోనే ఆంధ్రులకొక విశ్వవిద్యాలయమంటూ ఏర్పడింది.

ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేటు సభకు మొదటిసారిగా ఎన్నికలొచ్చినపుడు వేను నెల్లూరు వెంకటగిరి రాజా వారి కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నాను. అప్పటికి విద్యారంగలో నాకున్న విస్తృత పరిచయాల కారణంగా వేను గ్రాడ్యుయేట్ల ప్రతినిధిగా సెనేటుకు సులభముగ ఎన్నికైనాను. ఉపాధ్యక్ష పదవికి నేను నా సహచరులతో కలసి శ్రీ రెడ్డిగారి ఎన్నికకు తోడ్పడినాము. కారణం ఆ నాటికి యూనివర్శిటీ భవిష్యత్తు అహర్నిశలు యూనివర్శిటీ అభివృద్ధికి కృషిచేస్తూ వస్తున్న శ్రీ రామలింగారెడ్డిగారి చేతులలో మాత్రమే పదిలముగ నుండగలదని నేను భావిం చడమే. ఆ భావనలో యీనాటికీ మార్పులేదు. కాని దురదృష్టవశాత్తు అనాటి నా భావన, వా కృషి శ్రీ రెడ్డిగారిచే మరొక విధంగా భావింపబడిందేమోననే అనుమానం నాకీనాటికీ వుంది.

బ్రహ్మర్షి శ్రీ రఘవతి వెంకటరత్నం నాయుడు గారితో 1910 నుండి నాకు సంబంధ బాంధవ్యాలున్నాయి. కాకినాడ కళాశాలలో వారి ప్రధానాచార్యత్వంలో వేను కొంతకాలం ఉపన్యాసకుడుగా పనిచేశాను. వారి సాన్నిధ్యంలో వేనెన్నో విషయాలు వేర్చుకొన గలిగాను. వారిపట్ల నాకున్న శ్రద్ధాశక్తుల కనుగుణంగా నాపట్ల వారికెంతో ఆదరాభిమానాలుండేవి. 1928-29 నాటి ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవికి నాయుడుగారు కూడ ఒక ప్రముఖ అభ్యర్థి. వారికున్న ప్రఖ్యాతి కారణంగా రామలింగారెడ్డిగారు తమ పదవి విషయంలో కొంత భయాందోళనకు గురైనారు. నాయుడు గారితో నాకున్న నికటస్థ పరిచయం కారణంగా శ్రీ రెడ్డిగారు నన్ను కూడ తమ విరోధి పర్గంలో జమకట్టుకొనడం నా దురదృష్టమనిచెప్పుకొనక తప్పదు.

డా॥ రామలింగారెడ్డిగారు కూడ డా॥ రాధాకృష్ణన్‌వలెవే గొప్ప మేధావులు, వక్తలు. వారి ఉపన్యాసాలలో అనర్గళధారతోపాటు హాస్యంకూడ పుష్కలంగా వుండేది. తెలుగులో వారి పాండిత్యం అసమానమైనట్టిది. కాని యింటా బయటా కూడ ఆయన - యితరులవట్ల రాజసగుణాన్నధికముగ ప్రదర్శించేవారు. రాజస గుణాధిక్యత ఆయన ఎనెన్నులోనేకాక మాటలలో చేతలలోకూడ గోచరిస్తూండేది. నేననుకొంటాను ఈ యిరువదవ శతాబ్దంలో కాక 4-5 శతాబ్దాలపూర్వం ఏ మధ్య యుగంలోనో వారు జన్మించి యుంటే కొండవీడులోనో, రాజమహేంద్రవరంలోనో ఒక రెడ్డిరాజుగా మంచి ప్రఖ్యాతిగాంచి వుండేవారు. ఈ శతాబ్దవారు గనుక అట్టి పదవికి అవకాశం లేకపోయింది. అయినా ఉపాధ్యక్షులుగ వారికి ఉన్నత పరిపాలనా పదవి లభించింది. వారిలోని క్షాత్రం ఆ పదవిని నిర్వహించడంలో స్పష్టంగా కనబడింది. రాజులవలెనే వారు కొందరివట్ల అభిమానం, కొందరివట్ల నిర్లక్ష్యం, మరి కొందరివట్ల శతృత్వం వహిస్తూ వుండేవారు. ఇతరులపట్ల, ముఖ్యంగా తన అధీనులతో వ్యవహరించడంలో చెప్పుడు మాటలను విని నిర్ణయాలు తీసికొనే అలవాటు వారికి బాగా వుండేది. ఇది పదవీ నిర్వహణలో రాజకీయ దృష్టి. దీనిలో తన వర్గాన్నికూడగట్టుకొనే మనస్తత్వం బలంగా వుంటుంది. ఇటువంటివారు ఎంత సమర్థులైనా అన్నివిధాల తన సాటివారివట్ల అసహన, అలక్ష్య వైఖరి నవలంబించడం పరిపాటి. దురదృష్టవశాత్తు సర్వశ్రీ రఘువతినాయుడు, రాధాకృష్ణన్‌ల సదభిమానాన్ని పొంది విశ్వవిద్యాలయంలోప్రవేశించిన వేను శ్రీ రెడ్డి గారి అభిమానాన్ని పొందలేక పోయాను సరికదా పైపెచ్చు వారి నిర్లక్ష్య వైఖరికి గురైనాను. ఈ నిర్హేతుకమైన నిర్లక్ష్యవైఖరివల్ల వేను ఆంధ్ర విశ్వవిద్యాలయ సర్వీసులో కొంత క్షతిని పొందానని చెప్పుకొనక తప్పుటలేదు.

డా॥ రామలింగారెడ్డి గారికి రాజకీయ దృక్పథం మెండుగా వుండేది. ప్రతి విషయంలోను తన మాట ఆఖరి మాటగా రాణించ వలయునవే రాజస వృత్తి బలంగా వుండేది. అకాడమిక్ కౌన్సిల్‌లో విద్యావిధానానికి సంబంధించిన విషయాలనేకం చర్చకు వచ్చేవి. చర్చల సందర్భంలో వేను నా అనుభవాలను, ఆదర్శాలను పురస్కరించుకొని స్వాభిప్రాయాలను వ్యక్తం చేస్తూండేవాడిని. కొన్నిసందర్భాలలో అవి రెడ్డిగారి అభిప్రాయాలకు విరుద్ధంగా వుండేవి. అది వారికి రుచించేదికాదు. కొంత తర్క వితర్కం జరిగేది. నన్ను లోబరచుకొనడం వారికవసరమైనది.

ఈకారణముగ నన్నుకొంతకాలము అకాడమిక్ కౌన్సిల్‌కు నాయకునిగా నియమించారు. పార్లమెంటరీ విధానంలో సభా నాయకుని కర్తవ్యం ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను సమర్థించడముగ వుండేవి. నేను కొంత యిరుకున పడినా తరువాత ఆ బాధ్యత నుండి తప్పుకొన్నాను. ఇందతా రెడ్డిగారి వ్యూహరచనా పాటవాన్ని తెలియజెప్పేందుకు మాత్రమే వ్రాస్తున్నాను.

మరొక సంఘటన - యూనివర్శిటీలోని వా శాఖ (Faculty)లో హీరేన్ ముఖర్జీ, డా॥ లంకా సుందరం, ఎస్. శ్రీనివాసన్, జి. వెంకట్రావు, డా॥ వి. కె. ఆర్. వి. రావు, ప్రొ. కొయాజీ, డా॥ వి. ఎస్. కృష్ణ వంటి మేధావంతులైన ప్రముఖులు పనిచేశారు. వారికి మార్గదర్శకత్వం వహించడం నాకొక విధంగా గర్వ కారణం. రామలింగారెడ్డిగారి రాజకీయ దక్షతతో కూడిన ప్రశాసనా వ్యవస్థలో నేను నా సహాధ్యాయులైన శ్రీ యస్. శ్రీనివాసన్‌గారు తప్ప మిగతా వారందరి సద్భావ సమాదర గౌరవాలను పొందగలగడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను.

వానిరెడ్డి శ్రీకృష్ణగారు అర్థశాస్త్రంలో ఆక్సఫర్డు యూనివర్సిటీ పట్టభద్రులై వా శాఖలో లెక్చరరుగ ప్రవేశించారు. ఆయన స్నేహపాత్రులు, శాంత స్వభావులు. డా॥రెడ్డిగారికి ఆరంభంలో ఆయన బోధనా సామర్థ్యం వట్ల సదభిప్రాయముండేదికాదు. మితభాషి కావడంవలన ఆయన ఉపన్యాసధోరణి ఆకర్షణీయం కాజాలక పోయింది. అయితే ఆయన అధ్యాపకత్వాన్ని వదలి యూనివర్సిటీ రిజిష్ట్రారుగ ఎన్నికయిన తదువరి రెడ్డిగారి కత్యంత సన్నిహితులు కాగలిగారు. కృష్ణగారు వర్గబలం కలవారు. సెనేటు సభ్యులలో ఆయనకున్న పలుకుబడి రెడ్డిగారి నాకట్టుకొంది. ఉపాధ్యక్షుడుగా తనకు కృష్ణగారి పలుకుబడి అవసరమైంది. కృష్ణగారి సహాయంతో రెడ్డిగారు అవసర మైన ఓట్ల బలం సంపాదిస్తూండేవారు. ఇందుకు తనకృతజ్ఞతను తెలియవర్చదలచి రెడ్డిగారు అర్థికశాఖను హిష్టరీ-పోలిటిక్సు నుండి విడీడసి ప్రత్యేకశాఖగా రూపొం దించి దానికి వి. ఎస్. కృష్ణగారిని ప్రొఫెసరుగా నియమించారు. ఆటువంటి కీలక సందర్భంలో నేను కూడా ప్రొఫెసరు పదవికి చేరుకొనక తప్పలేదు.

నేను 1944లో యూనివర్సిటీ ప్రొఫెసరు పదవి నుండి విరమణ పొంది నప్పుడు శ్రీ కృష్ణగారు నావట్ల శ్రద్ధాశక్తుల కారణముగ నా ఛాయాపటాన్ని చరిత్ర-రాజనీతి శాఖ హాలులో ప్రతిష్ఠింపకోరారు. అందుకు నా ఫొటో నొకదానిని పంపె

వలసినదిగ నాకొక లెటరు వ్రాశారు. వేను వారి కోరికను సందేహిస్తూవే వారి మాట పట్ల గౌరవంతో వా ఫొటో పంపాను. ఈ విషయం డా॥ రెడ్డిగారికి తెలిసింది. అప్పుడు వారు శ్రీ కృష్ణగారిని పిలిపించి నా ఫొటోను విశ్వవిద్యాలయంలో పెట్టే వ్రయత్నాన్ని విరమింవవలసిందిగా ఆదేశించారు. శ్రీకృష్ణ గారికా ఆదేశాన్ని పాటించక తప్పలేదు. అది మొదలు మా యిద్దరి మధ్య పెద్దగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరగలేదు. ఆ తరువాత వారు ఒక పర్యాయం మద్రాసు వచ్చినప్పుడు అడయారు బస్‌స్టాండు వద్ద వారిని అకస్మాత్తుగా కలుసు కొనడం జరిగింది. రెండే రెండు నిమిషాలపాటు వరస్పర యోగక్షేమాలను తెలియవరచుకొన్నాం. ఆ తరువాత 1949లో కృష్ణగారు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా ఎన్నికైనారు. వేను అదే సంవత్సరం బొంబాయి విశ్వవిద్యాలయములో ఆచార్య పదవిని పొందాను.

డా॥ రామలింగారెడ్డిగారి ఉపాధ్యక్ష వదవీ కాలంలో వేను కొంత కాలం యూనివర్శిటీ హాష్టల్సుకు వార్డెన్‌గా వుంటూ వుండేవాడిని. అచ్చట కూడ రెడ్డి గారి రాజస వృత్తిని చవిచూశాను. ఒకనాటి రాత్రి డా॥ రెడ్డి తన బనలో ప్రముఖులకు గొవ్ప విందు చేశారు. ఆ సందర్భంలో హాష్టలు నుండి తమ యింటికి పీటలు వంపలసినదిగా నాకు కబురు వంపారు. నేను వారి ఆదేశానుసారం పీటలు వంపించితిని. హాష్టలు విద్యార్థులు పీటలులేని కారణంగా వేలమోద కూర్చుని భోజనం చేసేందుకు నిరాకరించారు. మూడు రోజులపాటు నమ్మె చేసి భోజనం మానుకున్నారు. ఒక ఉపాధ్యక్షునిపట్ల మర్యాదతో ప్రవర్తించడం భావ్యమనియు, దీన్నింత ప్రముఖ సమస్యగా చిత్రించవలదనియు నేను వారికి బోధించాను, భయ పెట్టాను. ప్రయత్నం ఫలించలేదు. విద్యార్థులు దాన్ని వాఅసమర్థతగా చిత్రించారు. ఆఖరుకు రిజిష్ట్రారు శ్రీ ఎస్. చెట్టి, డా॥ సూరి భగవతంగారి సహాయంతో నమ్మెను పరిష్కరించు కోగలిగాను.

1930లో రామలింగారెడ్డిగారు కాంగ్రెసువట్ల, స్వరాజ్యోద్యమంవట్ల ఆంగ్లేయ ప్రభుత్వం అనుసరిస్తున్న దమన విధానానికి నిరసనగా తమ ఉపాధ్యక్ష వదవికి రాజీనామా ఇచ్చి వెళ్ళారు. అప్పట్లో వారికి ప్రభుభక్తికంటె దేశభక్తి అధికంగా వుండేది. ప్రజల స్వాతంత్ర్య కాంక్షపట్ల గౌరవ భావముండేది. తరువాత వది సంవత్సరాలలో వారి రాజకీయ దృక్పథం పూర్తిగా మారిపోయింది.

వారు ప్రభుభక్తి పరాయణులైనారు. ఈ విషయంలో జస్టిస్ పార్టీ మేధావులకు వీరికి దగ్గర పోలిక లేర్పడినాయి. బ్రిటిష్‌వారి యుద్ధనీతికి విరసనగా 1939లో కాంగ్రెసు మంత్రిపర్గాలు రాజీనామాలు సమర్పించగా దేశ రాజకీయ వాతావరణం స్తంభించిపోయింది. కాంగ్రెసువారు సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించడం, అది క్విట్ ఇండియా ఉద్యమంగా పరిణమించడం జరిగింది. ఆ సందర్భంలో ఉపాధ్యక్షులుగా వున్న రామలింగా రెడ్డిగారు ప్రభుభక్తిపరాయణత్వంతో వా వంటి అధ్యాపకులు యూనివర్సిటీ నుండి గ్రామసీమలకు వెళ్ళి కాంగ్రెసు ప్రజా ఉద్యమాలకు భిన్నంగా రాజభక్తిని ప్రబోధించవలసిన అవసరమున్నదనియు, అందుకు నన్ను పూనుకొనమనియు ఆనాడు ప్రిన్సిపాలుగా నున్న ⛵ విస్సా అప్పారావుగారి ద్వారా కబురు చేశారు. నేను అప్పారావుగారితో "అయ్యా యిటువంటి ప్రచారంచేయడం వావంటివానికి తగదు, నా తత్వానికి, నా ఆశయాలకు వరమ విరుద్ధం, నేను దేశ ద్రోహానికి తలపెట్టలేను" అని చెప్పుకొన్నాను. అంతటితో డా॥ రెడ్డిగారు తాము తలపెట్టిన ప్రచారోద్యమాన్ని విరమించుకొన్నారు.

ఆ తరువాత కొన్ని వారాలకు మద్రాసు గవర్నరు సర్ ఆర్థర్ హోప్ విశాఖపట్టణం వచ్చి విశ్వవిద్యాలయ హాలులో ప్రసంగించారు. ప్రసంగం ముగియుటకు కొలది నిముషముల ముందు కొందరు విద్యార్థులు 'Hope go back' అని కేకలు వేశారు. ఆ నినాదాలు విన్న గవర్నరు తన ప్రసంగం ముగియగానే వైస్‌ఛాన్సలర్ రెడ్డిగారినిపిలిపించి విద్యార్థులలో అటువంటి క్రమశిక్షణా రాహిత్యానికెవరు బాధ్యులో తెలియజేయనలసినదిగా ఆదేశించారు. కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థుల ప్రవర్తనకు బాధ్యుడని నిర్ణయించి తక్షణమే ⛵ అప్పారావుగారిని ప్రిన్సిపాల్ పదవి నుండి తప్పుకొనవలసినదిగా కోరారు. అప్పటి వరకు రెడ్డిగారి పట్ల భక్తి శ్రద్ధలు గల అప్పారావుగారు భిన్నుడైపోయాడు. చేసేది లేక పావమాయన రెడ్డిగారి కోరికను మన్నించి ప్రిన్సిపాల్ పదవికి త్యాగపత్రం సమర్పించి యూనివర్సిటీ నుండి వెళ్ళిపోయారు. కొన్ని సందర్భాలలో ఉచితానుచితాలను వివక్ష చేయక శ్రీ రెడ్డిగారు తమ ఉత్తర్వులను అమలులో పెడుతూండేవారు. ఆ పిడుగు నామీద పడుతుందనే భయం కొందరికి కలిగిందానాడు. కారణం నినాదాలు చేసిన విద్యార్థులలో అధిక భాగం హాస్టలు వాసులే. అది రెడ్డిగారా సందర్భంలో గమనించివుండరు. ఏమైనా విస్సా అప్పారావుగారి వంటి నిజాయితీ గల విద్వాంసులను నిర్హేతుకంగా

రాజీనామాలు చేయమని కోరడం నమ్మక ద్రోహంగా భావించవలసి వుంటుంది. ఉపాధ్యక్ష పదవిలో నున్న వారికిటువంటి నిర్ణయాత్మక చర్యలు తప్పవేమోమరి ! అందులోను నియంతృత్వ ధోరణి కలవాటుపడిన రెడ్డిగారి వంటి విదగ్ధ రాజకీయ వేత్తలకు మరింత సహజమేమో !

డా॥ రెడ్డిగారు సెలవు పెట్టినపుడల్లా ఆ రోజులలో శ్రీ లక్కరాజు సుబ్బారావు గారిని ఆ పదవిలో తాత్కాలిక ఉపాధ్యక్షుడుగ నియమించడం పరిపాటిగా వుండేది. అందుచేతనే శ్రీ సుబ్బారావుగారిని శాశ్వత తాత్కాలిక ఉపాధ్యక్షులని పేర్కొంటు వుండేవారు. ఆ దినాలలో 55 సం॥ల వయస్సు నిండిన అధ్యాపకుల సర్వీసు కాలాన్ని వారి వారి అర్హతలను బట్టి మరికొంత కాలం పొడిగించడం పరిపాటి. 1944 సం॥ జనవరి 8 వ రోజుతో నాకు 55 సంవత్సరాలు నిండినాయి. నా ఉద్యోగ కాలాన్ని పొడిగించవలసిన విషయం సిండికేట్‌లో చర్చకు వచ్చినప్పుడు సగం మంది నా కనుకూలంగాను, సగం మంది నాకు ప్రతికూలంగాను తమ అభిప్రాయాలను ప్రకటించారు. అధ్యక్ష స్థానంలోనున్న సుబ్బారావుగారు రెడ్డిగారి సలహా ననుసరించి నాకు ప్రతికూలంగా ఓటువేసి నా పదవీ విరమణకు తోడ్పడినారు. ఆ నాటితో యూనివర్సిటీతో నాకున్న 13 సంవత్సరాల అనుబంధం ముగిసింది. రామలింగారెడ్డిగారి మనోరథం వెరవేరింది. అధికార పదవులలో నున్న వారికి తమ అధీనంలో నున్నవారి వల్ల అటువంటి దృక్పథం సహజమేవేమో! తమ వ్యతిరేక వర్గంలోని వారనే సందేహం వారికి కలిగినప్పుడు వారినుపేక్షించడం రాజనీతి కాదు గదా !

అవును మరి, యిదే రాజనీతికి మరల స్వతః శ్రీ సుబ్బారావుగారే గురైనారని చెప్పటకు చింతిస్తున్నాను. లక్కరాజు సుబ్బారావుగారు రెడ్డిగారి అనంతరం ఉపాధ్యక్ష పదవిని కాంక్షించినవారు. రెడ్డిగారి సహాయంతో తానా పదవికి ఎన్నిక కావాలని అభిలషించారాయన. అయితే 1949లో శ్రీ రెడ్డిగారు రాజీనామా చేసి ఉపాధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగిన సందర్భంలో లక్కరాజు సుబ్బారావుగారికి సహాయంచేయక వి. ఎస్. కృష్ణగారికి సహాయంచేసి వారిని గెలిపించారు.

సుబ్బారావుగారెంతో ఆశాభంగంపొంది రెడ్డిగారి కాలంలోజరిగిన అనేక అవాంఛిత సంఘటనలను పేర్కొంటూ ఒక చిన్న పుస్తకాన్ని ప్రచురించినారుకూడ. శ్రీ రెడ్డి ఎంతటి దక్షుడైనా తనకు సంక్రమించిన అధికారాలను నిష్పక్షపాతంగా న్యాయమైన పద్ధతిలో నిర్వహించలేదనే ప్రతీతి బాగావుంది. ఆయన కాలంలో అధ్యాపకులలో ముఠా తత్వాలు పెచ్చుపెరిగి అనేకమంది విద్యావేత్తలకు విసుగు కలిగించేవి. అనేకులు విశ్వవిద్యాలయాన్ని వదలివెళ్ళి యితరత్రా గొప్ప ఉద్యోగాలను సంపాదించుకొన్నారు. ఎవరేమనుకొన్నా, ఎవరేమైనా వారి మార్గంపై అవరోధం లేదు. వారి జీవితంలో ఆద్యంతం రాజసం వెలిగింది.

మరపురాని మహనీయుడు

ప్రొఫెసర్ జి. సుందరరెడ్డి

కొందరిని విద్వత్తు పరిస్తుంది. మరికొందరిని కవిత కటాక్షిస్తుంది. ఇంకొందరిని పరిపాలనాదక్షత ప్రసిద్ధులను గావిస్తుంది. అయితే ఇన్ని సుగుణాలు ఒకే వ్యక్తిలో రాశీభూతమై విరాజిల్లటం పూర్వజన్మకృత పుణ్య పరిపాక విశేషమే. వివిధ రంగాలలో విశేష ఖ్యాతిని సముపార్జించుకొని కవిగా, విమర్శకుడుగా, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షునిగా, పరిపాలనా దక్షునిగా పలువురి ప్రశంసల నందుకున్న డా॥ కట్టమంచి రత్నగర్భ భారతావనిలో ప్రభవించిన మరపురాని మహామనిషి, మహామేధావి.

ఆంధ్ర దేశంలో పుట్టి ఆంగ్లావనిలో ఉన్నత విద్యనభ్యసించి బహుముఖ ప్రజ్ఞా ప్రాభవాలతో వేల నాలుగు చెరగులా తన వ్యక్తిత్వపు విజ్ఞానాన్ని వెదజల్లిన డా॥ రెడ్డి ఆంధ్రమాత యశస్సును ఇనుమడింపచేసిన అపార శేముషీధురంధరుడు. ఆచార్యునిగా తన వ్యాసంగమును ప్రారంభించిన డా॥ రామలింగారెడ్డి వృత్తిరీత్యా ఉపాధ్యక్షులు, వృత్తిరీత్యా సాహిత్యవేత్త, వ్యక్తిగా, నంఘ సంస్కర్తగా, సాహిత్య స్రష్టగా, ఆయన గడించిన కీర్తి చంద్రికలు విద్వాంసుల మనస్సీమలలో వెలసిన మణిదీపికలు. ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపనద్వారా అజ్ఞాన తిమిరావళిని పారద్రోలి విజ్ఞాన దీపావళిని వెలిగించిన విశేష ప్రజ్ఞ ఆయన విశిష్ట వ్యక్తిత్వానికి నిదర్శనం.

సామాన్యంగా కవ్వించేపే ప్రవృత్తి కవిది. విప్పిచెప్పే వర్ధతి విమర్శకునిది. ఇవి రెండూ విభిన్న దృక్పథాలు. రెడ్డిగారిలో ఈ ప్రవృత్తులు

రెండూ సమపాళ్ళలో పురులు విప్పి సాహిత్య నందనాన్ని రసప్లావితం చేశాయి. సాహిత్యవేత్తగా డా॥ కట్టమంచి ఆంధ్ర కవితోద్యానంలోఆధునిక కావ్యప్రసూనాలను ప్రభవింపచేసిన దిట్ట. "ముసలమ్మ మరణము." "నవయామిని" ఆయన కావ్య సంపుటాలు. కథా వస్తువులోను, కథనశైలిలోను ఆధునిక కవితా స్ఫూర్తిని, నవ్యకావ్య రచనా రక్తిని పెంపొందించటంలోను ఆయన చూపిన వైపుణ్యం అనన్య సామాన్యము. ఆంగ్ల కవితలోని నిగ్గులను పుణికి పుచ్చుకొని అద్యతన సామాజిక పరిస్థితులను ఆకళించుకొని ఆంధ్ర కవితా రంగంలో ఒక నవీన పంథాకు నాంది పలుకుతూ శ్రీ రెడ్డిగారు రచించిన రసవత్తర కావ్యమే ముసలమ్మ మరణము. రంగయ్య శ్రేష్ఠిగారిచే ఏర్పాటు చేయబడిన కవిత్వపు పోటీలలో ఈ కావ్యమునకు లభించిన బహుమతి ఏ తత్కావ్య వైశిష్ట్యానికి కారణము. సజీవమగు పాత్ర చిత్రణ, సరసమగు వర్ణన ఈ కావ్యానికి వన్నె తెచ్చిన ఆభరణాలు. కవిగానే గాక విమర్శకునిగా కూడా ఆయన ప్రతిభ విద్వాంసుల ప్రశంసల నందుకొన్నది. "కవిత్వ తత్వ విచారము", "పంచమి" "వ్యాసమంజరి" మొదలైన వ్యాస సంపుటాలలో ఆయన విమర్శనా పద్ధతి వినూత్న మార్గమున పయనించి ఆంధ్ర పారస్వత క్షేత్రంలో క్రొత్త పుంతలను ఆవిష్కరించింది. స్వయంగా కాను ప్రసిద్ధి పొందిన కవి. విమర్శకుడు అగుటయే కాక సమకాలీన రచయితలను ప్రోత్సహించటంలో ఆయన చూపిన సహృదయత ప్రత్యేకంగా ఉదహరించదగినది. వ్యక్తిగత రాగ ద్వేషాలకు అనుగుణంగా ఒక వ్యక్తిని పొగడటమో, మరొక వ్యక్తిని తెగడటమో పరిపాటిగా సాగుతున్న తాత్కాలీన విమర్శనా ధోరణికి స్వస్తిచెప్పి కేవలం కావ్య గతమైన గుణదోషాలపే పరిశీలించడం శ్రీ రెడ్డిగారి విలక్షణమైన వివేచనా విధానానికి అద్దం పడుతుంది. వ్యక్తిలోని ప్రతిభను గుర్తించే అందుకు తగిన ప్రోత్సాహాన్ని అందించడం ఆ మహనీయుని మరపురాని గుణాలలో ఒకటి. శ్రీయుతులు ఆచార్య పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు, రాళ్ళవల్లి ఆనంత కృష్ణశర్మ, ఖాసా సుబ్బారావు, దువ్వూరి రామిరెడ్డి, నండూరి సుబ్బారావు, అబ్బూరి రామకృష్ణారావు వంటి మహామహుల సర్వతోముఖ సాహిత్య వికాసానికి ఆయన అందించిన ప్రోత్సాహము అవిస్మరణీయ మైనది. ప్రతిభా సంపన్నులైన సాహిత్యారాధకులను వెన్ను తట్టి ముందుకు నడి పించడం ఆయన సహృదయతకు, సాహిత్యాభిరుచికి చక్కని ఉదాహరణ.

డా॥ కట్టమంచి ఆంధ్ర, ఆంగ్లభాషలలో సాటిలేని మేటివక్త. విద్యార్థి దశ లోవే తన అనర్గళ వచో రచనా విన్యాసంతో శ్రోతలను ఉర్రూతలూపిన ధిషణ

ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఆంగ్లభాషపై ఆయనకుగల సాధికారిక సామర్థ్యానికి పాశ్చాత్యులే వరవశించేవారు. భారతీయుడుగా కాక పాశ్చ్యాతునిగా జన్మించివుంటే శ్రీ రెడ్డి మాకు ప్రాధాన మంత్రిగా పరిఢ విల్లేవాడని వలికిన కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ సహాధ్యాయుల సంభాషణ అక్షరాలా నిజము. అదే విశ్వవిద్యాలయ విద్యార్థి పరిషత్‌కు ఉపాధ్యక్షునిగా ఎన్నిక కావటం చరిత్రలోనే యే భారతీయునికి లభించని అపూర్వ గౌరవము, చిరస్మరణీయమైన ఘట్టము. సామాన్య సంభాషణలో కూడా ఉక్తి చమత్కృతితో ఎంతటి ఉద్దండ పండితులనైనా మెప్పించగల మేధ ఆయనకు ఆజన్మసిద్ధం. ఉపాధ్యాయ విద్యార్థుల అనుబంధానికి ఆయన చూపిన ఆచరణ అనుసరణీయమైనది.

వివిధ సంస్థలను పరోక్షంగాను తీర్చిదిద్దిన ఆయన ప్రతిభ నాన్యతో దర్శనీయమైనది. ఒకవైపు గంభీరమైన సముద్రము, మరొకవైపు ఉన్నతమైన పర్వత పంక్తులు అగాధమైన జ్ఞానానికి అత్యున్నతమైన ఆదర్శానికి ప్రతీకలుగ విలసిల్లే విశాఖలో విశ్వవిద్యాలయ స్థాపన శ్రీ రెడ్డిగారి దూరదృష్టికీ, విజ్ఞాన తృష్ణకు ప్రత్యక్ష సాక్ష్యము.

కేవలం సాహిత్య రంగంలోనే కాక సంఘ సంస్కరణలోను, రాజకీయ రంగంలోను డా॥ రామలింగారెడ్డి వహించిన పాత్ర కీలకమైనది. ఏ రంగంలోనైనా ఎదురొచ్చిన అవాంతరాలను అధిగమిస్తూ తన లక్ష్యాలవైపు ధృఢ చిత్తంతో తరలిపోవటం ఆయన ఏకైక ఆదర్శం. అయితే రాజకీయ రంగంలో మాత్రం శ్రీ రెడ్డిగారు తన సామర్థ్యానికి తగిన ప్రతిఫలాన్ని పొందలేదనే చెప్పాలి. "రాజకీయ రంగంలో చతురులను మెచ్చుకుంటారేకాని పైకి రానివ్వరు", అని తనడైరీలో వ్రాసుకున్న ఆయన మాటలు పైనచెప్పిన విషయాన్నే బలపరుస్తున్నవి.

మంత్రి పదవుల్ని అలంకరించలేక పోయినా, ప్రతిపక్ష సభ్యునిగ, బాధ్యత గల వ్యక్తిగ ఆయన చేసిన ప్రసంగాలు ఎందరికో కనువిప్పు కల్గించాయి. సంఘ సంస్కర్తగా హరిజనోద్ధరణకు, అస్పృశ్యతా నివారణకు ఆయన చేసిన కృషి గణనీయమైనది. ప్రభుత్వ పాఠశాలలో అగ్రకులాల వారితో సమానముగ నిమ్నకులాల వారికి

చదువుకునే అవకాశం కల్పించటానికి ఆయన ఎంతో పూనికతో పనిచేసి విజయాన్ని సాధించారు. అర్హతను గుర్తించటం, అవకాశాలను అందరికి కలిగించడం ఆయన ప్రధాన ఆశయం.

ఒక్క మాటలో చెప్పాలంటే ఈనాడు మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి పొందుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయ వైభవానికానాడు ప్రజ్ఞాపాటవాల్ని కూర్చిన ఈ మహనీయుని నిరంతర కృషి ఎంతగానో దోహద మిచ్చియున్నదనుటలో సందేహం లేదు.

పరిపాలనాదక్షుడు డాక్టర్ రెడ్డి

శ్రీ వి. రామచంద్రన్

ఈ రోజున మనం కట్టమంచి వారిని ఎందుకు గుర్తుంచుకోవాలి? అని ఎవరైనా ప్రశ్నవేస్తే దానికి సూటియైన సమాధానం చెప్పటం కష్టం.

చిత్తూరు పట్టణానికి ఉత్తరాన ఒక కిలో మీటరు దూరములో నున్న ఒకచిన్న శివారు గ్రామం కట్టమంచి. శ్రీ రెడ్డిగారి కాలంలో అది పట్టణానికి బాగ ఎడంగావే వుండి ఉండవచ్చు. వారు ఈ గ్రామంలో ఒక వ్యవసాయ కుటుంబంలో 1880 డిసెంబరు 10న జన్మించారు. వారు చిన్నతనంలో అనేక పర్యాయాలు మహా భారతాన్ని చదివారు. దానితోపాటు వారు ఇతర ప్రఖ్యాతిచెందిన ఇతిహాసాలను చదివినట్లు, తండ్రిగారి పాండిత్యముతో ప్రభావితమైనట్లు కూడ తెలుస్తున్నది.

చిత్తూరుజిల్లా హైస్కూలులో విద్యార్థి దశలోనున్నప్పుడే వారి మేధాసంపత్తి బహిర్గతమైనది. "ఎల్లప్పుడు పైకి చూడుము-ఉన్నత ఆదర్శాలను కలిగియుండుము" అన్న పాఠశాల సూక్తులచే ప్రభావితులైన రెడ్డిగారు, జీవితంలో ఏనాడు ఒకరికి తల వంచి ఎరుగరు. హైస్కూలును వదలిన పిమ్మట వారు మద్రాసు క్రిష్టియన్ కళాశాలలో ప్రవేశించారు. అనంతరము వారికి ఇంగ్లండులో ఉన్నత విద్యాభ్యాసానికై భారత ప్రభుత్వము వారి ఉపకారవేతనము లభించినది. ఆవిధముగ వారు ఉత్సాహం ఉరకలు వేస్తున్న, సునిశితమైన బుద్ధి కుశలత గల విద్యార్థిగ ఇంగ్లండులోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అడుగు పెట్టారు.

వారు అక్కడనున్న కాలంలో అచటి సాంఘిక, సాంస్కృతిక రంగాలలో విశేషముగ సన్నిహితులై, కీన్స్‌సైక్కర్ మొదలగు ప్రముఖులతో పరిచయాన్ని కల్గించు కున్నారు. ఈ పరిచయం అనతికాలంలోనే శాశ్వత మైత్రికి దారితీసి, వారి ప్రతిభకు చక్కని పునాదులు వేసినది. ముఖ్యముగ కేంబ్రిడ్జి వాతావరణం, అక్కడి వ్యక్తులే వారియొక్క విజ్ఞాన పరిధులను విస్తృతం చేసినవి. ఆ వాతావరణమే వారి మనో కుసుమాన్ని పరిమళ భరితముగ వికసింపజేసినది.

చరిత్ర విద్యార్థిగ వారు ఎన్నో ప్రపంచ సామ్రాజ్యాల అభ్యున్నతిని, పతనాన్ని మరెన్నో విప్లవాలను దర్శించి, అనంతర జీవితంలో ఆదర్శ ప్రాయులైన అధ్యా పకుడుగ రాణించుటకు తగిన బాటను వేసుకున్నారు. చరిత్ర ట్రైపాస్ పరీక్షలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైన రెడ్డిగారు,భారత దేశానికి తిరిగి వచ్చేముందు అమెరికాలో విస్తృతముగ పర్యటన జరిపారు. అది పూర్తిగా ఒక విజ్ఞానయాత్ర

తిరిగివచ్చిన తోడనే వారు బరోడా కళాశాలకు వైస్-ప్రిన్సిపాల్‌గా విధి మితులైనారు. ఈ పదవిని అంతకు ముందు శ్రీ అరవిందులు నిర్వహించిరి. కొద్ది కాలం అనంతరం వారు తిరిగి ప్రపంచ పర్యటన జరిపి వచ్చారు. ఈ యాత్రలో వారు ఐరోపా ఖండము, అమెరికా, కెనడా, జపాన్, చైనా, ఫిలిప్పీన్స్, మలయా మొదలగు దేశాలను చుట్టి వచ్చారు. ఆ విధముగ వారు ప్రాచ్య పాశ్చాత్య దేశాల నుండి విశేషమైన విజ్ఞానాన్ని సముపార్జించుకున్నారు.

ఈవైన వేర్వేరున్న విశేషాలనుబట్టి మొట్టమొదటగ వేయబడిన ప్రశ్నకు కొంతవరకు సమాధానాన్ని పొందవచ్చు. వారి విజయవంతమైన విజ్ఞానసముపార్జనము సుప్రసిద్ధ విద్యావేత్తలతో వారి పరిచయము, బోధనపట్ల వారికిగల విశేషమైన ఆసక్తి వారిని అత్యుత్తమ అధ్యాపకునిగ, విద్యావేత్తగా తీర్చిదిద్దినవి. ఆ విధముగ వారు విశ్వవిద్యాలయ స్థాయిలో అధ్యాపకునిగానే కాక, విద్యారంగపు లక్ష్యాలను, విధా నాలను తీర్చిదిద్దుటకు కూడ తగిన అర్హతలను పొందడం జరిగింది.

1916 నుంచి 1918 వరకు మైసూరులోని మహారాజావారి కళాశాల ప్రిన్సిపాల్‌గాను, ఆ తరువాత 40 సంవత్సరాల వయస్సులోవలనే, మైసూరులో సంస్థానపు విద్యాశాఖలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌గాను అత్యంత సమర్థతతో, ప్రతిభతోను ఆ పదవులను నిర్వహించారు.

ఐరోపా చరిత్రపై వారిచ్చు ఉపన్యాసములు శ్రోతలను మంత్రముగ్ధులను కావించటమే కాక, వారిని కేవలము శ్రోతలుగకాక నాటి సంఘటనలకు ప్రత్యక్ష సాక్షులుగ భావించు నంతటి ఉత్తేజమును కలిగించెడివని చెప్పుకొందురు. విశ్వ విద్యాలయ వ్యవహారాల సంస్కరణపై వారు ఇచ్చిన ప్రసంగాలు కూడ విద్యావేత్తలను ఆకర్షించుటయేకాక, గార్డ్లర్ కమిటి రిపోర్టుపైకూడ వారి ప్రభావము కలదని చెప్ప వచ్చును. ఆనాటి వారి ప్రసంగాల వలన శ్రీ రెడ్డిగారు భవిష్యత్తులో విద్యావేత్తగా, విశ్వవిద్యాలయాల నిర్దేశకుడుగా నిర్ణయింపబడినట్లు భావించటం జరిగింది.

కాని 1920లో జరిగిన సంఘటనలు వారి మనస్సును కలసివేసిన కారణముగ వారు తమ ఇన్స్పెక్టర్ జనరల్ పదవికి రాజీనామా సమర్పించి, మహాత్మాగాంధి నిర్దేశించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనటం జరిగింది. నుద్రాసు లెజి స్లేటివ్ కౌన్సిల్లో జస్టిస్పార్టీ పక్షంలో చేరారు. వారు రాజకీయాలలోనికి ఎందుకు అడుగుపెట్టినట్లు? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పటం సాధ్యమైన పనికాదు. వారి హృదయాంతరాలలో చెలరేగిన ఎట్టి తుఫానుల పర్యవసానంగా వారు రాజకీయాలలో దిగినది ఊహించడం కష్టసాధ్యం. వారికి రాజకీయాలు కొత్తవే. అయినప్పటికి, వారికి అంతుపట్టని విషయం మాత్రంకాదు.

కేంబ్రిడ్జి యూనివర్సిటీ చర్చావేదికల ద్వారా వారికి లభించిన విశేషమైన వాదనా పటిమ శాసనమండలిలో వారికి చేదోడు అయినది. కాని జస్టిస్ పార్టీతో వారి అనుబంధం మూడు నాళ్ళముచ్చటే అయినది. జస్టిస్ పార్టీకి తిలోదకాలిచ్చి, యునైటెడ్ నేషనల్ పార్టీని స్థాపించారు. వారియొక్క హాస్యము, నిర్భీకత వారి వ్యక్తిత్వానికి వన్నె తెచ్చినవి. అంతేకాక ప్రతిపక్షంలో నుండుటచేత ఇవి మరింతగా రాణించినవి. ఆ విధంగా వారు కొద్దికాలం రాజకీయ ప్రపంచములో విహారయాత్ర జరిపి, అనంతరం 1926లో ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాపింపబడినపుడు దాని ఉపాధ్యక్ష పదవిని స్వీకరించారు.

విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షునిగా వారికి యూనివర్సిటీ పరిపాలనా యంత్రాం గంలో మొట్టమొదటగా పరిచయం కలిగింది. వీరికి ఆదిలోనే అనేక సమస్యలు ఎదురయినవి. ప్రప్రథమ ఉపాధ్యక్షులు కావటంవల్ల యూనివర్సిటీకి తగిన స్థలాన్ని ఎంపికచేసే బాధ్యతకూడ రెడ్డిగారి భుజస్కంధాలపైన పడినది. దీనికితోడు

యూనివర్శిటి కోడ్ తయారుచేయుట, అవసరమైన ఉత్తర్వులు జారీచేయుట, అధ్యాపక సిబ్బంది నియమాకము, అనుబంధ కళాశాలల పర్యవేక్షణ మొ। వివిధ సమస్యలు కూడ ఒక్కమ్మడిగా వారిని చుట్టుముట్టినవి. రాజమండ్రి, విశాఖపట్నం, అనంతపురం విజయవాడ మొదలగు స్థలముల అనుకూల్యతపై జరిగిన యుద్ధంలో విజయం చివరకు విశాఖపట్నంలోని వాల్తేరు అప్లాండ్సుకు దక్కినది. అవిధంగా "కాంవన్" నిర్ణయిక సమస్య పరిష్కారం కావటంతో శ్రీ రెడ్డిగారు తమ శక్తియుక్తులను యూనివర్సిటీ అభివృద్ధికి అంకితం చేశారు.

అయితే 5 సంల అనంతరం 1930లో కాంగ్రెస్ సత్యాగ్రహోద్యమ వాలంటీర్లపై బ్రిటిష్ ప్రభుత్వం జరిపిన దమన కాండకు, నాయకుల అరెస్టులకు నిరసనగా తమ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా సమర్పించారు. తిరిగి 'భూమి గుండ్రంగా వున్నదన్నట్లుగా' వారు రాజకీయ రంగ ప్రవేశం చేశారు. చివరకు వారు చిత్తూరు జిల్లాబోర్డు అధ్యక్ష పదవీ స్వీకరణను కూడ అంగీకరించటం జరిగింది. అటు తర్వాత వారు రాజకీయాలలో మరికొంత కాలం తిరిగి నప్పటికి, జిల్లాబోర్డు అధ్యక్షులుగా మాత్రం ఎక్కువ కాలం కొనసాగలేక పోయారు.

1936లో వారు తిరిగి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా ఎన్నుకో బడ్డారు. ఆ విధంగా వారు మరొకసారి వదలివేసిన స్థానాన్ని చేపట్టడం జరిగింది. అప్పటి నుంచి వారు వరుసగా 13 సంల కాలం ఉపాధ్యక్ష పదవిని నిర్వ హించారు. ఈకాలంలో యూనివర్సిటీ అనేక ఆర్థిక యిబ్బందులకు గురయినప్పటికి అనేక నూతన శాఖలను వారు ప్రారంభింపచేశారు. ఎందరో వదాన్యుల వద్దనుంచి వారు స్వయంగా విరాళాలు పోగుచేశారు. అంతేకాక దేశంలో అతిసమర్థులైన వారిని ఏరితెచ్చి యూనివర్సిటీ అధ్యాపకులుగా నియమించారు.

ఆ విధంగా వారు యూనివర్శిటీని సుస్థాపితం చేసి, వారి నాయకత్వంలో దీనిని దేశంలోని అత్యుత్తమ విద్యాకేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దారు. ఆ తర్వాత వారిని మైసూరు ప్రభుత్వం ఆహ్వానించింది. అయితే విధి మరొక విధంగా తలచ టంతో, వారు 1951 ఫిబ్రవరి నెలలో స్వర్గస్థులయిరి. ఆ విధంగా చక్కని సుగం ధాలను నలువైపుల విరజిమ్మిన ఒక మహావ్యక్తి జీవితము పరిసమాప్తమయినది.

పైన పేర్కొన్న వారి జయాపజయముల ద్వారా మనం వారిని గూర్చి అనేక విధములుగా నిర్ణయించుకొనవచ్చును. విద్య, రాజకీయాలు, సాహిత్య విమర్శ సాహితీ వ్యాసంగము, స్నేహసౌహార్ద్రములు వారియొక్క అభిరుచులు. అంధ్ర విశ్వ విద్యాలయ నిర్మాతగ వారు స్థాపించిన విజయం అపూర్వము, అనితర సాధ్యము. అట్టివే వారి అపజయాలు కూడ.

వారు రాజకీయరంగంలో పరాజితుడైనారంటే, అది సామాన్యం కాదు. ప్రజల మనసును హత్తుకునే రీతిలోనే అతి విలక్షణముగ వారు పరాజితులయ్యారు. అయితే వారు తమ అభిరుచులను విద్యారంగానికే పరిమితం చేసుకొని వున్నట్లయితే, వారు ఈ రంగంలో మరొక చరిత్రవే సృష్టించి వుండేవారనుటలో అతిశయోక్తి ఎంత మాత్రము లేదు.

ఈ రోజున మనము వారిని వారి విజయాలవే గాక, పరాజయాలనుకూడా స్మర్తపెట్టుకోవలసి యున్నది.

శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు

శ్రీ టి. పురుషోత్తం

స్వతంత్రంవచ్చి ముప్పయినాలుగేళ్ళయింది. మన కళ్ళముందు ప్రజాస్వామ్య మన్న పేరుతో అరాజకం పిచ్చలవిడిగా సాగుతోంది పరస్పర దూషణలు, పార్టీల విభేదాలు, వ్యక్తిగత ఆరోపణలు ప్రజాస్వామిక వ్యవస్థలను కలుషితం చేస్తున్నాయి. ఈనాడు ప్రజాస్వామిక ప్రమాణాలను నెలకొల్పుకోవటం అవసరం. ఈ సందర్భముగ చరిత్రపుటల నొకసారి వెనుకకు తిరగవేసి, శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి గారివంటి వ్యక్తుల ఉదాహరణలను తెలుసుకోవటం అవసరం. స్వాతంత్ర్యోదయంకాక పూర్వమే ప్రజాస్వామిక విత్తనాలను నాటిన మహనీయులు వారు. వారిలోని గొప్ప లక్షణాలను తెలుసుకుంటే, నేటి నాయకులు ప్రజా ప్రతినిధులు ఎంతో ఉత్తేజితులవుతారు. శ్రీ రెడ్డిగారు, వారి సమకాలిక నాయకులు ప్రజాసేవనే తమ జీవిత పరమావధిగా గుర్తించారు. అంతేగాని వ్యక్తిగత గౌరవము, ధనసముపార్జన, ఆడంబర జీవితములు వారి ధ్యేయాలు కానేకావు.

స్వాతంత్ర్యానికి పూర్వం, మొట్టమొదటి మద్రాసు లెజిస్లేటివ్ అసెంబ్లీలో ప్రతిపక్షంలో శ్రీ సి. ఆర్. రెడ్డిగారుండేవారు. అప్పటి ప్రభుత్వం రెండు భాగాలుగా వుండేది. ఒక భాగం మాత్రమే భారతీయులకు బదిలీ చేయబడింది. ఆసగంప్రభుత్వానికి పానగల్ రాజావారు ముఖ్యమంత్రిగా వ్యవహరించేవారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వానికే వారు ముఖ్యమంత్రి. సి. ఆర్. రెడ్డిగారు పానగల్ రాజాగారికి సన్ని హిత మిత్రుడు. ఇరువురు ఆంధ్రదేశ్‌కు చెందినవారే. కాని ఆ రోజులలో భాషా

దురాభిమానం వెర్రితలలు ఇంకా వేయలేదు. ఆవాటి మద్రాసు ప్రభుత్వ మంత్రులందరు తెలుగు జిల్లాలకు చెందినవారే. మద్రాసు రాష్ట్రం, తమిళ, తెలుగు, మళయాళ, కన్నడ ప్రజలతో కలిసి వుండేది. అయినా ఏరకమైన పొరపొచ్చాలు వుండేవికావు. పానగల్ రాజాగారు, ఆయన ప్రభుత్వంలోవి ఇద్దరు ఆంధ్రమంత్రులు రాష్ట్ర ప్రజలందరి అభిమానాన్ని చూరగొన్నారు. ఆనాటి లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో పానగల్ రాజాగారికి చెందిన అధికార పక్ష సభ్యులకన్న హెచ్చు సంఖ్యలో తెలుగు మళయాళ, కన్నడ సభ్యులుండేవారు. ముఖ్యమంత్రి తదితర మంత్రులతో ప్రతిపక్ష నాయకులకు అత్యంత స్నేహసంబంధాలుండేవి. ప్రతిపక్షానికి శ్రీ సి. ఆర్. రెడ్డి, శ్రీ ఎస్. సత్యమూర్తిగార్లు నాయకత్వం వహించి నడిపేవారు. వారుభయులు చరిత్రలో కని, వివి ఎరుగని నిశితమైన, లోతైన, విమర్శతో ప్రభుత్వాన్ని దుయ్యబట్టేవారు. శ్రీయుతులు మోచర్ల రామచంద్రరావు, ఎ. ఎస్ కృష్ణారావు పంతులు, బి. వి. నరసింహ అయ్యర్, సి. నరసింహా చార్యులు వంటి దిగ్గంతులయిన దేశ భక్తులు ఆ రోజులలో ప్రతిపక్షంలో వుండేవారు. అయినా వారు తరచుగా ముఖ్యమంత్రిని కలిసి సమస్యలన్నిటిని అత్యంత సౌహార్ద్ర వాతావరణంలో చర్చించేవారు. ప్రభుత్వాన్ని విమర్శలతో తూర్పారబట్టిన వెంటవే పానగల్ రాజాగారి శోభాయమానమైన కారులో ఎక్కి శ్రీ యస్. సత్యమూర్తి ఇంటికి వెళ్ళేవారు.

రామలింగారెడ్డిగారు తెలివైన రాజకీయ వేత్త. మంత్రులు చేసే తప్పులను, ఒప్పులను, ఏమాత్రం విన్మరించేవారుకారు. వారిని విమర్శించడంతో ఆగక, పరిపాలనను మెరుగువరచడానికి అనువైన సూచనలతో ముఖ్యమంత్రికి లేఖలు వ్రాసేవారు. విద్య, వ్యవసాయము, సహకారము, స్థానిక స్వపరిపాలన, ఆరోగ్యవ్రజారోగ్య శాఖలు, ఎక్సైజు, హింమామకాదాయ సంస్థలు వంటి అభివృద్ధి కవసరమయిన శాఖలను పరిపాలించే అవకాశాన్ని పొందిన నగం ప్రభుత్వము, దాన్ని సద్వినియోగ వరచుకువేందుకు అవసరమైన సలహాలనందించేవారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని గురించి మొట్టమొదటగా సూచించినవారు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు. తెలుగు సాహిత్య మభివృద్ధి చెందటానికి ఆంధ్ర సంస్కృతి పునరుజ్జీవం పొందటానికి, తెలుగు సాంప్రదాయాలు పరిరక్షింపబడడానికి యీ విశ్వవిద్యాలయ అవసరం గురించి నొక్కి వక్కాణించారు. మొదటి చర్యగా విశాఖపట్టణంలో ఆంధ్ర మెడికల్ కళాశాల స్థాపనను గురించి వట్టుపట్టారు.

స్నేహపూరితమైన చర్చలద్వారా, పరస్పర సమన్వయ పద్ధతులద్వారా అన్నిటిని సాధించారు. విధానాలతో, కార్యక్రమాలలో, మంత్రివర్గంలో ఎన్నో అభిప్రాయ భేదాలుండి కూడ, యీ విజయం ఆయన అందుకోగల్గారు.

ఆనాటి పాలకులు తమ చేతులతోనే రిజర్వుడుగా వుంచుకున్న ప్రభుత్వ భాగానికే పోలీసులు, న్యాయస్థానాలపై సర్వాధికారాలుండేవి. అందువల్ల బదలీఅయిన ప్రభుత్వ భాగంతో సంబంధాలు క్రమక్రమంగా క్షీణించాయి. ఆ విధంగ ఏర్పడే సమస్యల పరిష్కారానికి తనకున్న ఇబ్బందులన్నింటిని ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకులకు విన్నవించేవారు. వారి సహకారాన్ని అర్థించేవారు. తమకున్న పరిమిత అధికారాలతో, ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతిపక్ష సభ్యుల సహాయసహకారాలతో ప్రజలచే ఆనాటి ప్రభుత్వం మనుగడ సాగించవలసి వచ్చేది. అట్లా అని ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వలోపాలను, బలహీనమైన పరిపాలనను నిశితముగ విమర్శించటంలో ఏమాత్రం వెనుదీసేవారుకాదు. ఈ స్థితిగతులు శ్రీ సి. ఆర్. రెడ్డిగారి ప్రఖ్యాత విశ్వాసరాహిత్య తీర్మాన ప్రతిపాదన ద్వారా కారాస్థాయికి చేరాయి. పానగల్ రాజా గారి మంత్రివర్గంపై ఆయన చేపట్టిన యీ విశ్వాసరాహిత్య తీర్మానము దేశ చరిత్ర లోనే మొట్టమొదటిది. ప్రజాస్వామిక యంత్రాంగంలో ప్రభుత్వంవట్ల తమకున్న తీవ్ర అసంతృప్తిని తెలియవరచడానికి ప్రతిపక్షం వారు చేపట్టే అయుధమే విశ్వాసరాహిత్య తీర్మానము. . అయితే అప్పుడములులో వుండేది. పాక్షిక ప్రజాస్వామ్యమే. ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోబడి ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్న మంత్రులపై విశ్వాస రాహిత్యాన్ని ప్రకటించటం గడ్డు విషయమే. దీనిని చర్చించడంలో నిజ ప్రభుత్వాధి నేతలైన గవర్నరు, ఎక్జిక్యూటివు కౌన్సిలు సభ్యులను ఏమాత్రం ఉచ్చరించరాదు. ఆ సందర్భముగ శ్రీ రామలింగారెడ్డిగారు ప్రదర్శించిన అద్భుత ఉపన్యాస ధోరణి రాజకీయ ప్రమాణాలు, వాస్తవమైన ప్రజాస్వామిక ఆశయాలు, ఆ సంఘటన కెక్కడ లేని ప్రాముఖ్యాన్ని సంతరించి పెట్టాయి. శాసన సభలలో, అనధికార సంస్థలలో ప్రజా ప్రతినిధులకుండవలసిన నైతిక నడవడిక గీటురాయిగా విరాజిల్లింది.

శ్రీ రెడ్డిగారు తన అవిశ్వాస తీర్మాన ప్రతిపాదనపై రెండురోజులు ఆసక్తి కరముగ ఉపన్యసించారు. అన్ని కళాశాలలనుండి వేలాది విద్యార్థులు ప్రేక్షకుల గ్యాలరీలనిండా గుమిగూడారు. గవర్నరు, రాజకీయ పక్షాల నాయకులు, వారి వారి ప్రత్యేక 'బాక్సు'లలో ఆసీసులైనారు. అంతా నిశ్శబ్దం నిండుకున్నది.

అనాడు రెడ్డిగారిచ్చిన ఉపన్యానధోరణి, ఆహా! ఎంతని వర్ణించగలం? అదొక చారిత్రాత్మక సంఘటన. మంత్రులందరూ చకితులైపోయినారు. నిశ్చేష్టులై శిలాప్రతిమ వలే కూర్చుండిపోయారు. ఇంగ్లీషు సాహిత్యంలో బ్రూటస్‌కు వ్యతిరేకంగా ఆంటోనీ ఇచ్చిన ఉపన్యాసాన్ని మనం ఎరుగుదుము. బ్రిటిష్ పార్లమెంటు భవనములో వారన్ హేస్టింగ్స్‌ను దోషిగా నిరూపిస్తూ చేసిన గొప్ప ప్రసంగాలను గురించి విన్నాము. కాని ఆ సందర్భంలో సి. ఆర్. రెడ్డిగారు చేసిన మహోపన్యాసాన్ని ఇప్పుడు చదివినా, దానిముందు పైన చెప్పినవన్నీ తీసికట్టుగా వుంటాయని స్పష్టమవుతుంది. అత్యంతమైన హృదాంతనంతో చేసిన ఉపన్యాసమది. ఏ రకమైన వ్యక్తిగత ఆరోపణలు లేవు. తేలిక భావంతో చేసిన దూషణలులేవు. ఎటువంటి అగ్రహావేశాలులేవు. ఏ రకమైన చౌకబారు ఎత్తిపొడుపులులేవు. ఏ ప్రమాణాలతో చూచినా అభ్యంతరం పెట్టవలసిన మాట ఒక్కటిలేదు. అత్యున్నతమైన విమర్శ అది. ప్రజల వాస్తవ ప్రతినిధి, వారి అనుభవాలు, సాధక బాధకాలు, కష్టనిష్ఠూరాలను గురించి చేసిన ప్రసంగమది. ఏమద్భుతమైన వాక్చాతుర్యము? ఎటువంటి ఉపన్యాస ధోరణి! రాజకీయ శాస్త్రమభ్యసించే విద్యార్థులందరూ విధిగా చదవలసిన ఉపన్యాసమది. అందరూ అన్ని కాలాలలోను, విశ్వాసరాహిత్య తీర్మాన మెట్లావుండాలో, దానిపై ఉపన్యాసమెట్లా వుండాలో తెలుసుకోవాల్సిన ప్రమాణ సంఘటన అది. అది దేవతలు చూచి హర్షింపవలసిన సన్నివేశం. అత్యంత ఉన్నతమైన, గంభీరమైన మూర్తి శ్రీ సి. ఆర్. రెడ్డి. తెలివితేటలుట్టిపడే విండైనముఖముతో విరాజిల్లినాడు. శాసనసభా మందిరంలో నిలబడి ప్రజల బాధలను గురించి ధారావాహికంగా ఏకరువు పెడ్తున్నాడు. మంత్రివర్గానికి "ఆ బాధలను తీర్చినైనా తీర్చండి, లేదా రాజీనామా చేసి బయటకు రండి" అని ఎలుగెత్తి హెచ్చరిస్తున్నాడు". ఈ దృశ్యం ఎన్నటికి మరపురానిది.

ఇదీ రామలింగారెడ్డిగారు ప్రజలకు చేసిన సేవ. ప్రజల నిజసేవకుడందించిన సేవ. నిజమైన ప్రజాస్వామిక సూత్రాల వేర్వరచిన దిట్ట. మన ప్రజాస్వామిక వ్యవస్థలు, శ్రీ రామలింగారెడ్డిగారేర్వరచి పోయిన ప్రమాణాల బాసట చేసుకొని, సంస్కరింపబడతాయని మనసారా ఆశిద్దాం.

ఓటమి నెఱుగని విద్యార్థి

శ్రీ అట్లూరు పురుషోత్తం

ఇది ఒక శతాబ్దం నాటి మాట. అప్పుడు భారతదేశం పరాధీనంగానే వుంది. విక్టోరియా మహారాణి ఆనాడు భారతదేశమునకు కూడ రాణి.

ఆ నాటికి భారత జాతీయ కాంగ్రెసు పుట్టనేలేదు. బహుశా భారతదేశానికి స్వాతంత్ర్యము కావాలవే కోర్కె నాటికి ప్రజలలో బలపడలేదు. ప్రజలలో విద్యావంతులు తక్కువ. రాజకీయ చైతన్యం అంతంత మాత్రంగానే వుంది. భారతదేశం ఇటువంటి నిరుత్సాహ పరిస్థితిలో వుండగా ఆనాడు, ది 10-12-1880వ తేదీన తెలుగుదేశమందు రాయలసీమలో ఒక రత్నం ఆవిర్భవించింది. ఆ రత్నమే కట్టమంచి రామలింగారెడ్డి.

కట్టమంచి నాడొక శాంతిసౌభాగ్యములకు, ప్రకృతి సౌందర్యమునకు నిలయమైన చిన్న గ్రామం. ఇది ఆనాడు చిత్తూరునకు సుమారు ఒక కిలోమీటరు దూరములో వున్నది. ఈనాడు కట్టమంచి చిత్తూరులో ఒక భాగం.

ఆ గ్రామంలో సంపన్నులూ, విద్యావంతులూ అయిన కట్టమంచి సుబ్రహ్మణ్య రెడ్డి (1846-95) నారాయణమ్మగార్ల రెండవ కుమారుడు రామలింగారెడ్డి. సుబ్రహ్మణ్య రెడ్డిగారు తెలుగు, ఇంగ్లీషు భాషలలో పాండిత్యము గలవారు. గౌరవము గల వకీలు, మంచి పేరుగల పంచాయతీదారుకూడా. వీరి కాంత పెదరామలింగారెడ్డి గారు భాస్కరశతక గ్రంథకర్త. మన రామలింగారెడ్డికి ముత్తాత పేరు పెట్టబడినది.

రామలింగారెడ్డికి సాంప్రదాయ పద్ధతిలో అతని ఐదవ ఏట అక్షరాభ్యాసం జరిగింది. ఆనాడు "డాడీ, మమ్మీ" పాఠశాలలు విజృంభించలేదు. కాగా రామలింగా రెడ్డికి కట్టమంచిలోని పీఠి బడియే మొదటి పాఠశాల అయినది. అతని మొదటి ఉపాధ్యాయుడు మునుస్వాము మందిరి. రామలింగారెడ్డి మొదట అధ్యయపము చేసిన గ్రంథములు బాలరామాయణము, అమరము. మునుస్వామి మందిరిగారు కొంత కాల మునకు చనిపోగా, సుబ్రహ్మణ్య రెడ్డిగారే తన కుమారునకు భారత భాగవతములను చదువుట వేర్పి, ఆంగ్లములో ప్రవేశము కల్పించినారు.

రామలింగారెడ్డి గుండ్లవల్లెలో బంధువుల యింటిదగ్గర తన 10-12 సంల వయస్సులోవే నూటికి పైగా ఉకుడు ఠథలను నేర్చుకున్నాడు. కాగా అతనికి మారు కథల వాడవే పేరువచ్చినది. ఆ కథలు అతని జ్ఞావకశక్తిని, భావనాశక్తిని వృద్ధి పఅచినవి.

రామలింగారెడ్డి 1890న సంవత్సరములో చిత్తూరు ఉన్నత పాఠశాలయందు మొదటి ఫారములో ప్రవేశించాడు. అతనికి అక్కడ చదువు చెప్పిన కుప్పనయ్యం గారు అతనికి రెండవ గురువు. ఆయన పెద రామలింగారెడ్డిగారి శిష్యుడు. ఆయన తెలుగు పండితుడు. .వారి క్లాసులో ఇంగ్లీము వేమాత్రము పలుక(గూడదని యాజ్ఞ. ఎవరైన(దెలియక పలికిరో వారి తల్లియొక్క పాతివ్రత్యమునకు వచ్చిన భంగము జెప్పరాదు.

ఆయనవద్ద రామంలిగారెడ్డి నలోపాఖ్యానము, సర్వలక్షణ సారములను క్షుణముగ అధ్యయనము చేసాడు.

రామలింగారెడ్డి ఇంగ్లీములో అనర్గళముగా మాట్లాడుచూ, తెలుగులో పద్యాలు చెప్పుచూ అందరిని ఆకర్షించేడివాడు. ఆరవ ఫారములో దివ్యజ్ఞాన సమాజపు బోధనలు అతనిని ఆకర్షించాయి. కాగా పరీక్షలకు ముందొక నెలరోజులు మాత్రమే నిగ్రహముతో చదివి, 1896లో ఉన్నత పాఠశాలా పరీక్షయందుత్తీర్ణుడయ్యాడు. పరీక్షల కొరకు తనకు తెలిసీ తెలియని విషయాలను సంవత్సరమంతా కంఠస్థము చేసే అలవాటు రెడ్డికిలేదు. అయినప్పటికీ, అతడు పరీక్షలలో ఓటమి నెఱుగని విద్యార్థి.

1897లో చిత్తూరుజిల్లా విద్యార్థులకు లభించు విద్యార్థి వేతనము కొరకు మద్రాసు క్రైస్తవ కళాశాలలో ప్రవేశించాడు. మద్రాసులో ప్రవేశించుట రెడ్డిజీవితములో గొప్ప మలుపు.

మద్రాసు క్రైస్తవ కళాశాలలోని దొరల ఇంగ్లీషు వాతావరణం, విశ్వవిద్యాలయపు వాతావరణం, నాడు ఆ కళాశాలలో బోధించిన ప్రముఖ ఆచార్యుల ప్రభావము రెడ్డిని మరో ప్రపంచములో ప్రవేశపెట్టాయి.

ఒకనాడు రామలింగారెడ్డి వున్న వసతి గృహపు విద్యార్థి నాయకుడు రాజద్రోహపు నేరము క్రింద శిక్షింపబడిన (1897)బాలగంగాధర్ తిలక్ పటమును ఆ వసతి గృహములో వుంచారు. కోపోద్రిక్తుడైన ప్రిన్సిపల్ మిల్లర్ ఆ పటమును అక్కడ పెట్టినదెవరని ప్రశ్నించగా, దేశభక్తులయందు గౌరవము, ఆత్మాభిమానముగల రామలింగారెడ్డి ఆ పని తామందరు కలిసి చేసినదేనని చెప్పాడు. మరునాడు మిల్లర్ రెడ్డిని కళాశాలలో కొగిలించుకొని బుజ్జగించాడు. విద్యార్థులలో స్వయం కృషినీ, భావప్రకటనాశక్తిని, క్రమశిక్షణనూ, శ్రమించి పనిచేసే ధోరణిని పెంపొందించుటలో డాక్టర్ మిల్లర్ అగ్రగణ్యుడు. ఆయన వ్యక్తిత్వము రామలింగారెడ్డిని ఎంతో ప్రభావితుణ్ణి చేసింది.

చరిత్ర తరగతిలో ఒకసారి కులము ప్రసక్తి రాగా, తాను ఆదిమవాసిని (aborginee) అని చెప్పి తోటి విద్యార్థుల నాశ్చర్య చకితులను జేసాడు. ఆ సమాధానమునకు కారణమేమని అడుగగా, "వేలకొలది సంవత్సరాలనుండి సహస్రాధిక సంఘములు కలసి మెలసి జీవించుచున్నప్పుడు, రక్తము ఈ కృత్రిమ కులాలలోనే జీవించుచున్నదా?" అని ఎదురు ప్రశ్న వేశాడు. ఈ ప్రశ్న అతని హేతువాద దృక్పథమును తెలుపుచున్నది.

ఒకనాడు ఇంగ్లీషు తరగతిలో విద్యార్థులు ఇంటిదగ్గర వ్రాసి తెచ్చిన వ్యాసములను చదువుచున్నారు. తన పంతు వచ్చినపుడు రెడ్డి తన చిత్తు పుస్తకపు పేజీలను త్రిప్పకుండానే వ్యాసమును చదివినట్లు చదువుచున్నాడు. ఈ విషయమును గ్రహించిన ఉపాధ్యాయుడు డాక్టర్ కెల్లెట్ రెడ్డి శక్తి సామర్థ్యాలను ప్రశంసించాడు. రెడ్డి బహుశా తన నోట్సు ఆధారముతో ఉపన్యసించి వుండవచ్చును లేదా ఆసు కవిత్వమును

చెప్పినట్లు తన వంతురాగావే దత్తాంశముపై ఉపన్యసించి వుండవచ్చును. ఈ సంఘటన రెడ్డి ఆంగ్లమున దిట్ట యని మాత్రమే గాక, అతని విశ్లేషణా శక్తిని, ఆత్మ విశ్వాసమును స్వతంత్రముగా ఆలోచించగల శక్తిని తెలియజేయుచున్నది. ఇది తమ వ్యాసాలను కంఠస్థం చేసిన విద్యార్థులకే మంచి మార్కులను ప్రసాదించే ఉపాధ్యాయులకూ, తాము చెప్పిన నోట్సును వ్రాయని విద్యార్థులపై కన్నెఱ్ఱజేసే కళాశాల ఉపన్యాసకులకూ, గైడ్ల సహాయంతో పట్టాలను ప్రోగు చేసుకునే విద్యార్థులకూ కను విప్పు కలిగించగల సంఘటన.

ఇది రామలింగారెడ్డికి తన 19వ ఏట (1899లో) మద్రాసు క్రైస్తవ కళాశాల "ఆంధ్రభాషాభి రంజని' (తెలుగు సంఘము) ఉత్తమ కావ్యమునకు యిచ్చు బహుమతిని సంపాదించి పెట్టిన లఘు కావ్యము. ఆ కళాశాలలో సంస్కృతాధ్యాపకులైన వేదం వేంకటరామశాస్త్రులుగారు బహుమతి నిర్ణేతలలో ఒకరు.

ఆ కళాశాలలో రెడ్డి తెలుగును ద్వితీయభాషగా అభ్యసించారు. ఇంగ్లీషు, తెలుగు భాషలలో అనర్గళంగాను, హాస్యపూరితముగాను, ఉపన్యసించేవారు. రెడ్డి సంస్కృతమును తన అభిమాన విషయముగా అధ్యయనం చేయకపోయినప్పటికీ, అతనికి వెంకటశాస్త్రులుగారి సహాయము ఎప్పుడూ లభించుతూనే వుండేది.

1899లోనే రెడ్డి పింగళి సూరన్న వ్రాసిన 'కళాపూర్ణోదయము' యొక్క మంచి చెడులను బేరీజువేస్తూ ఒక సుదీర్ఘమైన వ్యాసమును వ్రాసి ఆంధ్ర భాషాభి రంజనిచే నిర్వహింపబడిన ఒక సభకు సమర్పించారు. ఆ వ్యాసమే తరువాత అతనికి సాహిత్య విమర్శనా ప్రపంచములో ప్రముఖ స్థానమును సంపాదించి పెట్టిన 'కవిత్వతత్త్వ విచారము'నకు పునాదియైనది.

రెడ్డి 1902వ సంవత్సరములో బి. ఏ. పరీక్షయందుత్తీర్ణుడై, అర్థశాస్త్రము లోను, తత్వశాస్త్రములోను, బైబిల్‌లో కూడ బంగారు పతకములను పొందాడు. డిగ్రీ కొరకు బైబిల్‌ను అధ్యయనం చేయవలసిన పనిలేదు. కాగా రెడ్డి క్రైస్తవమత గ్రంథమును అధ్యయనంచేసి, తన పరమత సహిష్ణుతను మాత్రమేకాక, విశ్వమానవ కళ్యాణము కొరకు ఎవరు ఏమి చెప్పారో తెలిసికోవలెనవే తనకోరికను కూడ వెల్లడించాడు.

ఆ కళాశాలలో రెడ్డిని ఆకర్షించిన ఉపాధ్యాయులలో డాక్టర్ స్కిన్నర్ ఒకరు. రెడ్డి ఆయన దగ్గర తత్త్వశాస్త్రమును అభ్యసించాడు. ఆయనయే రెడ్డిని విద్యార్థి వేతనముతో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయలో ప్రవేశించుటకు తోడ్పడ్డాడు.

కేంబ్రిడ్జిలో :

భారత ప్రభుత్వము యిచ్చిన రెండువందల పౌండ్ల వార్షిక విద్యావేతనముతో కేంబ్రిడ్జినందు సెయింట్ జాన్స్ కళాశాలలో ప్రవేశించాడు. ఆయనకు 1903లో రైట్ బహుమతి, 1904లో కళాశాల విద్వాంసుని పదవి, 1905లో కేంబ్రిడ్జి యూనియన్ లిబరల్‌క్లబ్ కార్యదర్శి పదవి, 1906లో కేంబ్రిడ్జి యూనియన్ ఉపాధ్యక్ష పదవి లభించాయి. కేంబ్రిడ్జి యూనియన్ ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన మొదటి భారతీయుడుగా రామలింగారెడ్డి కాగా, కొన్ని దశాబ్దముల తరువాత ఆ యూనియన్‌కు మొదటి భారతీయ అధ్యక్షుడుగా మోహన్‌కుమారమంగళం ఎన్నుకోబడ్డాడు.

కేంబ్రిడ్జి యూనివర్శిటి లిబరల్ క్లబ్ కార్యదర్శిగా రెడ్డి లజపతిరాయ్, గోఖలే వంటి భారత నాయకులను ఆ క్లబ్ సభలకు ఆహ్వానించేవాడు. గోఖలే రాజకీయ పరిణితి, మృదుమధురమైన హేతువాద దృష్టి, మితభాషణము, రెడ్డిని ఎంతగానో ప్రభావితుణ్ణి చేశాయి. గోఖలే సలహామీదనే బారిష్టరు కావాలనుకున్న రెడ్డి ఉపాధ్యాయవృత్తిని స్వీకరించాలనే నిర్ణయానికి వచ్చాడు.

తన అసమాన ప్రతిభను ప్రదర్శించి కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయములో భారత జాతికి వన్నె తెచ్చిన రామలింగారెడ్డి రాను న్న తరతరాల తెలుగు విద్యార్థులకు వేగుచుక్క, భారత జాతికి గర్వకారణం.

రెడ్డి 1906లో Historical Tripos (చారిత్రక విషయమున ఎమ్. ఏ. తో సమానము) పరీక్షకు కూర్చుని, ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణడయ్యాడు. ఆ పరీక్షకు రెడ్డి ఆర్థిక శాస్త్రమును, తత్త్వశాస్త్రమును కూడ అధ్యయనము చేసాడు.

నాటి వరకు ఏ భారతీయ విద్యార్థి పొందని బహుమతులను, పదవులను పొంది, భారతీయుల గౌరవప్రతిష్ఠలను పెంచి రెడ్డి ఇంగ్లీషు వారిని ఆశ్చర్య పరిచారు. తిరిగి భారతదేశమునకు రాకముందు రెడ్డి జర్మనీ, ఫ్రాన్సు, కెనడా,

చైనా, జపాన్ దేశములలోను, ఫీలిప్పైన్ దీవులలోను వర్యటించారు. 1907లో అతని ప్రతిభను గుర్తించిన ఒరోడా మహారాజు కోరికపై అమెరికాలో పర్యటించారు. ఈ విధముగా ఎన్నో విదేశాలలో పర్యటించి, ఆయా దేశాల సంస్కృతులను, విద్యా విధానములను, పారిశ్రామిక నాగరికతలను పరిశీలించి, ఆధునిక దృక్పథముగల విద్యావేత్తగా 1908లో స్వదేశమునకు వచ్చారు.

రెడ్డి మద్రాసులోను, కేంబ్రిడ్జిలోను తెలుగు సంస్కృతికి భిన్నమైన సంస్కృతిని అవగాహన చేసుకున్నాడు. యూరప్, అమెరికా ఖండములలోను, చైనా, జపానులలోను పర్యటించి ఆంగ్లదేశపు సాంప్రదాయ సంస్కృతికి భిన్నమైన సంస్కృతులను, ఆలోచనాధోరణులను గమనించాడు. దేశాంతరమున వున్నా ఆ రోజులలో రెడ్డి మహాభారతమును, కళాపూర్ణోదయమును అధ్యయనం చేస్తూనే వున్నాడు. ప్రపంచ విఖ్యాత విశ్వవిద్యాలయమైన కేంబ్రిడ్జిలో మహామేధావులైన ఉపాధ్యాయుల సహాధ్యాయుల మధ్య తన మేధస్సుకు పదును పెట్టుకుంటూ, ఐరోపా మేధావుల సహాయంతో నూతన భావప్రపంచములో విహరిస్తూ, తెలుగుతల్లి భారతిని మరువని ప్రజ్ఞానిధి రామలింగారెడ్డి.

మేధావంతుల నిలయం కేంబ్రిడ్జి :

రామలింగారెడ్డి యొక్క ఉపాధ్యాయులలోను, సహాధ్యాయులలోను ఎంతో మంది మహామేధావంతులుగా ఖ్యాతిని పొందారు. వారందరూ రెడ్డివలె స్వతంత్రముగ ఆలోచించగల దిట్టలే. వారిలో గోల్డ్స్‌వర్డీ లోవెజ్‌డికిన్‌సన్, డేవిడ్ మెక్‌టగార్ట్ అతని ఉపాధ్యాయులలో ముఖ్యులుకాగా, బెర్ట్రాండ్‌రస్సెల్, లిటస్ట్రాచి, లెయొనార్డ్ ఊల్ఫ్, క్లైవ్‌బెల్, ఇ. యం. పార్‌స్టర్, రోజర్‌ఫ్రై, ఆల్ఫ్రెడ్ వార్ట్‌వైట్‌హెడ్, డెస్మాంట్ మెకార్థీ, జాన్‌మెనార్డ్‌కీన్స్ అతని సహాధ్యాయులలో ముఖ్యులు. కీన్స్ అతని దగ్గర స్నేహితులలో ఒకడుకాగా, పొవిస్ సోదరులు (Brothers), జాన్‌కాపర్ లను రెడ్డి తరచుగా కలుస్తూ వుండేవాడు. ఆహా, ఎటువంటి మేధావంతుల కారావథం! ఈ యువ మేధావుల సంభాషణలలో ఎంత సమయస్ఫూర్తి, భావగర్భము, తెలివితేటలు, వెలుగు దాగివుండెడివో! ఆ మేధావుల ఎదుటనే రెడ్డియొక్క తార్కికశక్తి, సమయస్ఫూర్తి, వాక్చాతుర్యము, వాగ్ధాటి విజృంభించి, అవితరులకు సులభ సాధ్యముకాని కేంబ్రిడ్జి పదవులను రెడ్డికి లభింపజేసాయి.

ఆ మేధావుల మధ్యనే రెడ్డి నవ్వుతూ చమత్కరించేవాడు. సంఘజీవిగాను స్నేహితుడుగాను, దయా స్వభావుడుగాను వుండేవాడు. అతడు వక్తృత్వము, వివేకములకు మాత్రమేగాక, మానవత, ఓర్పు, ఆదర్శముల ద్వారా తోటి విద్యార్థుల మెప్పును, ఆదరాభిమానములను చూరగొన్నాడు.

భారతదేశమునకు వచ్చిన తరువాత రెడ్డి విద్యావేత్తగాను, సాహితీ విమర్శకుడుగాను, పార్లమెంటేరియన్‌గాను, రాజకీయ వేత్తగాను, రచయితగాను, ఉపన్యాసకుడుగాను పేరుప్రఖ్యాతుల నార్జించి,1951లో మద్రాసులో కన్నుమూసాడు. విద్యార్థిగా అసమాన ప్రతిభను ప్రదర్శించిన రెడ్డి విద్యార్థి జీవితము నేటి విద్యార్థులకు ఆదర్శ ప్రాయమగుగాక !

★

రెడ్డిగారి సమయస్ఫూర్తి - సద్యోహాస్యము

డా॥ వి. ఆంజనేయులు

1926వ సంవత్సరము మధ్యకాలంలో ఒకనాడు కలకత్తా మెయిలు పొగలు చిమ్ముకుంటూ వచ్చి బెజవాడ స్టేషన్‌లో ఆగింది ఫస్టుక్లాసు కంపార్టుమెంటు నుండి ఒక మధ్యవయస్కుడు దిగాడు. అతడు నల్లగావున్నా హుందాగా ఫాయాగా వున్నాడు. పొట్టికాదు, పొడుగూకాదు. జుట్టు నొక్కులు నొక్కులుగా వుంది. పాశ్చాత్యతరహా దుస్తుల్లో వున్నాడు.

వార్తలవేటకు అక్కడజేరిన కొద్దిమంది పత్రికా విలేఖరులదృష్టి ఆయనమీద వడ్డది. వార్తలలో కెక్కదగిన ఒక మహావ్యక్తిగా వారి దృష్టికి కనబడ్డాడాయన. వెంటనే ఆయన చుట్టూమూగి అన్నారు :

అయ్యా! మేం, రిపోర్టర్సం ఏమైనా వార్తలు చెపుతారా?

"లేదు. నేను పోర్టర్సుకోసం చూస్తున్నాను, రిపోర్టర్సుకోసం కాదు". అన్నాడు ఆయన వెంటనే.

'బెజవాడా, బెజవాడా' అని చెవులు చిల్లులు పడేటట్లు అరుస్తున్న పోర్టర్ల కేకలువిని ఆవ్యక్తి తన మిత్రులతో "బెజవాడా? బ్లేజ్‌వాడా? అన్నాడు (బ్లేజ్ అంటే నిప్పులు చెరిగే ఎండ అని అర్థం) బెజవాడకు విజయవాడ అని పునర్నామ కరణం చేసినా దాని వాతావరణంలో మాత్రం ఏమీ మార్పులేదు. నడివేసవిలో

114 డిగ్రీల వేడిమితో మంటలు చెరిగే ఆ నగరానికి వచ్చిన వారెవరైనా దాన్ని "బ్లేక్‌వాత" అని తప్పక అంగీకరిస్తారు.

ఆ వ్యక్తి మిఱెవరోకాదు డాక్టర్ సి. ఆర్. రెడ్డి.

అంధ్ర యూనివర్సిటీకి క్రొత్తగా పునాదులు వేసి తీర్చిదిద్దడానికి వైస్ ఛాన్సలర్‌గా నియుక్తుడై వచ్చాడు. దానికి నామకరణం మాత్రం జరిగింది. కాని ఇంకా ఎక్కడా స్థావరం చిక్కలేదు. అంతేకాదు విశ్వవిద్యాలయంగా వ్యవహరించడానికి కావలసిన సరింజామా దానికి ఏ ఒక్కటీ లేదు.

యూనివర్శిటీకి ఆఫీసు మాత్రం తెరవడానికి వచ్చారాయన. స్థలనిర్ణయం, విశ్వవిద్యాలయ నియమావళిని రూపొందించడం, విద్యాప్రణాళికలు విరచించడం, సిబ్బందిని నియమించడం, విశ్వవిద్యాలయ చిహ్నానికి రూపకల్పన చేయడంలాంటి నూరుపనులెన్నో ఆయన ముందున్నాయి.

అప్పుడు కాంపోజిట్ మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగావున్న పానగల్ రాజా, అంతకుముందు మైసూరులో గొప్ప విద్యావేత్తగా ప్రఖ్యాతిగాంచిన డాక్టరు సి. ఆర్. రెడ్డిగారికి ఆ కార్యభారం అంతా వప్పగించారు.

1909 నుండి 1912 వరకు మహారాజా కాలేజీ ప్రొఫెసర్‌గా, తర్వాత ప్రిన్సిపాలుగా, ఆ అనంతరం ఇన్‌స్పెక్టర్-జనరల్-ఆఫ్ ఎడ్యుకేషన్‌గా మైసూరు రాష్ట్రంలో శ్రీ రెడ్డి 12 ఏండ్లపాటు అపార సేవచేశాడు.

ఈ తుది పదవిలో ఆయన చేసినసేవ చిరస్మరణీయం. ఊరూరా స్కూలు పెట్టించాడు. ఆనాడు అస్పృశ్యులుగా వ్యవహరింపబడే హరిజన బాలబాలికలకు వీరు వాటిలో ప్రవేశం కల్పించాడు. జనసామాన్యంలో విద్యావ్యాప్తి చెయ్యాలనే తన ప్రధానాశయానికి అనుగుణంగా ఆయన చేసినపని ఇదంతా.

ఏకారణంచేతనో శ్రీ రెడ్డి 1921లో మైసూరు వదలి మద్రాసులో రాజకీయ రంగంలోకి దూకడానికి నిర్ణయించుకున్నాడు. ఎన్నో ఆశలు అల్లుకొని ఆనాడు జస్టిస్ పార్టీలో చేరి మద్రాసు విధానసభకు ఎన్నికయ్యారు. కాని ఆ పార్టీ వ్యవహారాలతీరు కులతత్వం ఆయన్ను విభ్రాంతుణ్ణి చేశాయి. వెంటనే ఆయన

పతిపక్షంలోకి మారి శ్రీ సత్యమూర్తి మొదలైన మేధావులతో యునైటెడ్ నేషనలిస్టు పార్టీని స్థాపించాడు. వెంటనే ప్రభుత్వపు లోటుపాట్లను దుష్కృత్యాలను ఎత్తి చూపిస్తూ మంత్రివర్గంమీద విశ్వాసరాహిత్య తీర్మానం ప్రవేశపెట్టాడు.

ప్రభుత్వం ఎప్పటికప్పుడు వబ్బంగడుపుకుపోయే ఆవకాశవాదుల సహకారం కోసం ప్రాకులాడే తీరుచూచి శ్రీ రెడ్డి ఇలా వ్యాఖ్యానించాడు. ఆశ (పదవుల యెడ) సంగానికీ, నిరాశ నిస్సంగానికీ దారితీస్తాయి.

ఈ మాటకు ముఖ్యమంత్రి రెచ్చిపోయాడు. "తనకు ఏదైనా ప్రభుత్వోద్యోగం ఇప్పించమని శ్రీ రెడ్డి స్వంతంగా వ్రాసిన ఉత్తరం ఒకటి ముఖ్యమంత్రి జేబులోవుంది. ముఖ్యమంత్రి దాన్ని బయటపెట్టడానికి జేబులోకి చెయ్యిపెట్టాడు. కాని శ్రీ రెడ్డి తొణకలేదు, బెణకలేదు ధీర్గంగా అన్నాడు :

"ఇంగ్లాండులో ప్రేమికులు కలహించుకున్నప్పుడు ఎవరి ఉత్తరాలు వారికి తిరిగి యిచ్చివేస్తారు" అన్న ఈ మాటకు సభ్యులందరు గొల్లుమని నవ్వారు.

అధికార జస్టిస్‌పక్షం రెడ్డిగారి హాస్యోక్తులను అలవోకగా ఎప్పుడూ తీసికొనే వాళ్ళుకాదు. సహజంగా మన భారతీయ రాజ్యాంగవేత్తలకు అటువంటి మనస్తత్వం వుండదు. పైపెచ్చు అధికారపక్షం రెడ్డిగారికి చికాకులు కల్పించడానికి కూడా సిద్ధపడ్డది. ఎగ్మూర్‌లో రెడ్డిగారు ఉపన్యసిస్తూవుండగా వేదికమీదకు రాళ్ళు విసిరారు. అపుడు రెడ్డిగారు నిబ్బరంగా అన్నారు: 'జస్టిస్ ప్రభుత్వం మన భారతీయ రాజకీయాల్లోకి రాతియుగాన్ని ప్రవేశపెట్టింది' అని.

డాక్టర్ శామ్యూల్ జాన్‌సన్‌లాగా, ఆస్కార్ వైల్డులాగా అయిన చేసిన కృషికంటె ఆయన వ్యక్తిత్వం గొప్పది. ఆయన అవివాహితుడు. మహాప్రతిభాశాలి. కాని చవల చిత్తుడని, అసహనశీలుడనీ అంటారు. ఆయన మహావక్త. శ్రోతలను ఇట్టే ఆకట్టుకుంటారు. సద్యోహాస్యం, సమయస్ఫూర్తి ఆయన భగవదత్తాలు.

ఈ శతాబ్దారంభంలో కేంబ్రిడ్జి కవితకు, లౌకికవిజ్ఞానానికీ, భౌతికాధ్యాత్మిక విషయాలకు నిలయం. సహజ వాక్చతురుడైన శ్రీ రెడ్డికి అచటి వాతావరణం బౌద్ధికంగా అత్యంతానుకూలంగా తోచింది. బ్రామ్స్‌బరీగ్రూపు బలంపుంజుకుంటున్న

రోజులవి. జె. మేనార్డుకీనెస్, జె. సి. స్క్వైర్, ఎం. ఫిలిప్స్, పౌసిస్ సోదరులు, లూయీ జాన్‌కీవర్, గాల్డుస్వర్డీ డికెన్‌సన్ లాంటి మహా మేధావులు శ్రీ రెడ్డి సమకాలికులు. వీరందరూ హాస్య వచోధోరణికి, సర్వతోముఖ ప్రజ్ఞకు పేరుపొందిన వారే. వీరికి ఎక్కడా ఏనిషేధమంటూలేదు - దేవుడయ్యేది, దయ్యమయ్యేది.

శ్రీ రెడ్డి ఒకచోట అంటారు: "దేవుడు సర్వాంతర్యామియా! శాశ్వతుడా! అయితే ఆయనకు ఆత్మహత్య చేసుకునే స్వాతంత్ర్యంకూడ లేదన్నమాట? హాస్య భరితమైన ఆయన ఈ తర్కం కేంబ్రిడ్జి వేదాంతి జాన్ మెటాగెర్డను ఉక్కిరి బిక్కిరి చేసింది.

శ్రీ రెడ్డి మైసూరులో విద్యాశాఖాధికారిగా వున్నప్పుడు ఆయన విద్యా పథకాలను గ్రామీణ ప్రజానీకానికి అందజేయాలని ఆయన సంకల్పించారు. సామాన్య ప్రజానీకంలో అసామాన్యమైన అవకాశాలను చూచానంటాడాయన.

1915వ సంవత్సరంలో శ్రీ రెడ్డి మద్రాసులో విశ్వవిద్యాలయ సంస్కరణం అనే విషయంమీద వరసగా ఉపన్యాసాలిస్తూ ఆనాడు విద్యాలయాలను కేవలం అనుబంధం చేసుకునే కార్యక్రమాన్ని చేపట్టిన మద్రాసు యూనివర్శిటీని 'పారపాటువ యూనివర్శిటీ అని పిలువబడుతున్న పరీక్షాసంస్థ' అని అభివర్ణించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అధ్యాపక వర్గాన్ని ఎన్నుకునేందుకు ఆయన సుదూరం వలపన్ని వివిధ ప్రాంతాల్లోవున్న మేధావులందరినీ ఆకర్షించారు. స్థానికులకది కొంత నిరాశాహేతువు కాగా శ్రీ రెడ్డి తాను అందరూ కాదని వదలివేసిన వారితో యూనివర్శిటీని తాను నింపదలచుకోలేదన్నారు.

యూనివర్శిటీ ఆవరణలో కొన్ని సమాధులను తొలగించకుండా చూడమని కొంతమంది మతాభిమానులు ఆయన దగ్గరకు రాయబారంగా వెళ్ళగా ఆయన వారికి సమాధానంగా వాఖ్యరూపంలో తన డైరీలో ఇలా వ్రాశారట: బ్రతికివున్న వారికోసం చనిపోయిన వారిని మేము ఎన్నడూ బలిపెట్టం. చనిపోయిన వారికోసం బ్రతికున్నవారినే ఎప్పుడూ బలిపెడతాం. ఎందుకంటే ఇది మతం. కళాశాలల కంటే కాటిపేలలతోవే మతానికి ఎక్కువ సంబంధం.

శ్రీ రెడ్డి మువ్వయ్యోవడిలో ఇంకా కాంగ్రెసులోనే వున్న రోజుల్లో తన స్నేహితుడు అలహాబాదు నుండి వెలువడే 'ట్వంటీయత్ సెంచరీ' అనే పత్రికకు సంపాదకుడు అయిన శ్రీ కుందుర్తి ఈశ్వరదత్తుకు ఒక లేఖ వ్రాస్తూ ఇలా అన్నాడు.

"వేను మీ పుణ్యతీర్థాన్ని నవంబరులో దర్శిస్తాను. అయితే ఎక్కడ వుండాలో నాకు తెలియకుండావుంది. నాకు యూరపియన్ సౌకర్యాలు కావాలి. నా ఆత్మ స్వదేశీ కాని పొట్టమాత్రం విదేశీ. అక్కడ మంచి హోటల్ ఏది ?

''రాష్ట్రాల్లో పరిపాలనా భారాన్ని వహించడానికి కాంగ్రెసు నిర్ణయించి నప్పుడు శ్రీ రెడ్డి కాంగ్రెసునుండి బయటకు వచ్చి తనడైరీలో ఇలా వ్రాసుకున్నారు"

"అధికార పదవులు నిడుపాటి చెవుల్లాంటివి. ప్రభుత్వాన్ని ఎదుర్కొనటంలో ప్రత్యక్ష చర్యకు పూనుకొనడానికి అవి కొమ్ములుగా మారవు.

ఆయన్ను వెల్లూరు రైల్వేస్టేషన్ నుండి టౌనుహాలుకు సన్మాయి మేళాలతోనూ బాకాలతోనూ వూరేగిస్తూ తీసుకొనిపోయినపు డన్నారు-

"మీరు నాకిలాంటి మర్యాదలు చెయ్యడానికి యెందుకు నిర్ణయించారో తెలియకుండావుంది. వేను మంత్రిసీకాదు, పెళ్లికొడుకునూకాదు. కడకు శనీసం శవాన్నీకాదే !"

రాజకీయ ప్రాపకాన్ని గూర్చి అంటారు-

మనకో పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఒక పోలిటెకల్ కాండిడేచర్ కమిషనూ వున్నాయి. వివిధ వ్యాపారాలతోపాటు రాజకీయపు నల్లబజార్లుకూడా వుండగలవని బహుశః మన రాజ్యాంగ రచనా ప్రవక్తలు గుర్తించి వుంటారు.

ఇండియాలోని 'ఇజమ్ను'ను వ్యాఖ్యానిస్తూ శ్రీ రెడ్డి అన్నమాటలు 'మన దేశంలో స్వాతంత్ర్యానికి ప్రమాదం తటస్థిస్తే దాని పర్యవసానం లెఫ్టిజమూకాదు, రైటిజమూకాదు. కేవలం 'రాంగిజమ్' అవుతుంది. ఇండియాలో ప్రాపకానికి సంబంధించి కుమ్ములాటను గూర్చి ఆయన ఒక చోట ఇలా వ్రాశాడు:

"ఇండియాలో ఎవడైనా ఏ విషయంలోనైనా పొలువంచుకొనడానికి సిద్ధపడతాడుకాని ఒకరికొరకు సాయవడడంలో మాత్రం భాగస్వామ్యం వహించడు. వ్యాస మహర్షి అన్నట్లు భార్యను వంచుకున్న పాండవులుకూడా వరస్పర సహకారంలో పాలువంచుకొనడానికి నిరాకరించారు.

ఆంగ పాలకులను గురించి, భారతీయ నాయకులను గురించి ఆయన తన డైరీలో ఇలా నోటుచేసుకున్నారు: వాళ్ళు సామ్రాజ్యాలను నిర్మిస్తారు. అతి సూక్ష్మ విషయాల్లోకూడ మనం విభేదాలు సృష్టిస్తాం. చారిత్రికమైన భౌతికవాదం వాస్తవంకాగా గాంధేయమైన అధ్యాత్మికవాదం భ్రమజనితం.

1930 ప్రాంతంలో కాంగ్రెసువాదుల ప్రవర్తనకు సంబంధించిన ధ్యేయాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ " ఈరోజున వారి హృదయాల్లో వున్నది రేపు వాళ్లతలలోకి ఎక్కుతుంది వారి ఆశయాలు వారి వుత్సాహానికి దోహదం చెయ్యవు. వారి వుత్సాహం వారి ఆశయాలకు పోగిది చేస్తుంది" అన్నారు. ఇదే విషయాన్ని ఇంకా విపులీకరిస్తూ అంటారు: " మేనకలను చూచినపుడు ఋషులకు విచ్చెక్కుతుంది. సత్యాగ్రహులకు అధికారంచేజిక్కితే వారికి అంతకంటె ఎక్కువ పిచ్చిపట్టుకుంటుంది'.

1937 లగాయతు 1946 వరకు శ్రీ రెడ్డి మహామేధావులైన రైట్ ఆనరబుల్ వి. యస్. శ్రీనివాసశాస్త్రి, శ్రీ కె. వి. రెడ్డి మొదలైన వారితోపాటు మద్రాను విధాన సభలో సభ్యులుగా వున్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి శ్రీ రాజాజీ మీదికి ఆయన ఎన్నోసార్లు కత్తులుదూశాడు. శ్రీ రెడ్డివేసే సంక్లిష్ట ప్రశ్నలకు రాజాజీ ఆగ్రహవడి (నామినేటెడ్ మెంబరయిన) రెడ్డిని ఉద్దేశించి-

సభలో శ్రీ రెడ్డి ఏ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడో నేను తెలుసుకోవచ్చునా అన్నాడు.

'రాయలసీమతో సహా మొత్తం ఆంధ్రరాష్ట్రానికి' అని వెంటనే సమాధానం వచ్చింది.

'ప్రధాని కనే కలలు ప్రెసిడెంటుకు పీడకలలు' అని ఇంకోచోట అంటారు. సాధువులు, పాపులు, సత్యాగ్రహులు-వీటిని గూర్చి శ్రీ రెడ్డి అభిప్రాయం:

"సాధువుల పరిపాలన సంస్కృతియొక్క వినాశానికి దారితీస్తుంది. వీరి వంచన పాము కాటుకంటె కూడ లోతుకుపోతుంది. పాపాత్ముని మూర్ఖత్వం తెరిచిన పుస్తకంలాగా తేటతెల్లంగా వుంటుంది. సత్యాగ్రహులు విడిపోతే నిజాయితీపరులు ప్రస్థలాలను ఆక్రమించుకుంటారు.

ప్రభుత్వం - ఎన్నికలు:

ప్రభుత్వం ప్రభుత్వమే. ఒక ప్రభుత్వం మఱో ప్రభుత్వంకి విభిన్నమైనది కాదు. ఎన్నికలు హిస్టరీకంటే హిస్టీరియాను సృజిస్తాయి.

స్త్రీ పురుషులు, ఇంకా ఇతర విషయాలను గూర్చి శ్రీ రెడ్డి వెలిబ్చిన అభిప్రాయాలు:

పురుషుడు దోషాలు (Blunders) చేయడానికి పుట్టాడు. స్త్రీ దోపిడీలు చేయ్యడానికి (Plunders) జన్మించింది.

భర్తలకు తప్పుచేసే దివ్యమైన హక్కువుంది. స్త్రీలకు ఆ తప్పులను క్షమించే మానవ సహజ దౌర్బల్యంవుంది.

స్త్రీ లేని సంస్కృతి నూనెలేని దీవంలాంటిది. క్రమంగా దానికాంతి ఆరిపోతుంది.

ఉత్పాదనం లేని ఉల్లాసం సంస్కృతికి సభ్యతకు చిహ్నం. విరుద్ధమైనవాటి కలయికలు అనుకూలమైన వాటి అనైక్యతలు.

ఇవీ భారతీయ మనస్తత్వానికి, తర్కానికి దురంతాలు. మనం దరిద్రులుం కావచ్చు. కాని శుద్ధ దరిద్రులం కానక్కరలేదు.

తన మరణశయ్యమీద వున్నప్పుడుకూడ శ్రీ రెడ్డిమాటల్లో వాడీవేడీ తగ్గలేదు. మాట్లాడే ఓపిక తగ్గగా ఆయన తన మేనకోడళ్లనూ ఇతర బంధువులను ఉద్దేశించి 'ఇక ఆశలేదు. ధైర్యంగా వుండండి' అని ఒక కాగితం మీద వ్రాశారు.

వ్యంగ్యభాషణలు, సూక్తులు, శ్లేషోక్తులు, వివరీతార్థద్యోతక వచోధోరణి-ఇంకా అనేకానేక వాక్చమత్కృతులు శ్రీ రెడ్డి వాసనాంచలంనుంచీ కలం నుంచీ ఇట్టే దొర్లుకుంటూవస్తాయి. వాటిల్లో కొన్ని ఆస్కార్‌వైల్డు సంభాషణలను, రివల్యూషనరీస్ హాండ్‌బుక్‌లో బెర్నార్డుషా ఉక్తులను జ్ఞప్తికి తెస్తాయి. అవి ఆయన నోటివెంట అప్రయత్నంగా వచ్చినంత నిర్దుష్టంగా వుండకపోవచ్చు. విరసంగా, ఒక్కొక్కప్పుడు చవుకబారుగాకూడా వుండవచ్చు. అయినా కౌన్సిల్ ఛాంబర్సులోనూ, విశ్రాంతి నిలయాల్లోనూ, పాఠకుల ప్రశాంత పఠన మందిరాల్లోను చదువుకునే ఒకేరీతిగా ఆనందించదగినట్లుగా వుంటాయి. అంకరించనున్న ఈ తరపు కనుమూస్తున్న స్మృతిపథంలోనూ, పాతవార్తా పత్రికల రంగు తగ్గిన పుటల్లోనూ వుండి క్రమంగా మరుగున పడిపోయే దానికన్న వాటికి ఒక శాశ్వతిక రూపకల్పన చెయ్యడం అవసరం.

డాక్టర్ రెడిగారితో నా పరిచయం

ఆచార్య శ్రీ గంటి జోగి సోమయాజి

శ్రీ రామలింగారెడ్డి విద్యావేత్త. రాజకీయాలలో నిపుణుడు. వచన రచనా విచక్షణుడు. అర్థశాస్త్ర నిష్ణాతుడు, కవి, విమర్శకుడు, అనేక గ్రంథ రచయిత! ఈడులేని నమర్థుడు, అని ప్రఖ్యాతిని పొందినవాడు. శతవర్ష స్మారక సంచికకు నన్ను వ్యాసరూపమున వారితో నాకుండిన పరిచయమును, అనుభవములను వ్రాయ వలెనని సంపాదకులు కోరిరి. రెడ్డిగారి కంటే నేను ఇరువది వర్షములు చిన్నవాడను. 16 సంవత్సరములు వారితో కలసి విశ్వకళాపరిషత్తున పనిచేసితిని. ఆయనకు సలక్షణమైన ఆంధ్ర భాషాజ్ఞానము, రామాయణ మహాభారత కళాపూర్ణోదయాద్యనేక గ్రంథములయందు పాండిత్యము ప్రసిద్ధములయి వారి వ్రాతలలో కనువట్టుచునే యున్నవి.

ఇక నా అనుభవాలు నేటి భాషలో రాయాలి. ఆయన ఈ రాత చూస్తే మెచ్చి వుండేవాడు కాడని నాకు తెలుసు. కాని ఇది యిప్పటివాళ్ళకోసం, అవి వాడుక భాషలోవే వ్రాస్తున్నాను. మైసూరులోవున్న కాలంలో రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారితో కలసి వారు వాఙ్మయ విచారం చేస్తూ ఒకరినొకరు మెచ్చుకుంటూ వుండే వారు. కాని కాలాంతరములో, స్థలాంతరంలో వారి భావాలు, క్రమక్రమం సుదూరంగా వేరయినాయి. రెడ్డిగారి స్వరూపం, ఆయన అధికారం, పాండిత్యం ప్రవృత్తి మొదలైన వానిని సమన్వయ వరచి చెప్పాలంటే కాళిదాసు రఘువంశంలో దిలీపుని గూర్చి చెప్పిన మూడు శ్లోకాల సారం జ్ఞప్తికి వస్తుంది. "అతడు తన చుట్టూ

వుండేవారి అందరికంటే అధికమయిన సామర్థ్యంతో, అందరి తేజస్సును మించిపోతూ తన పరిసరము లన్నింటిని అతిక్రమించి మేరుపర్వతంలాగా వుండేవాడు. ఆకారంతో సరిపోయిన ప్రజ్ఞా, ప్రజ్ఞకు సరివడిన కావ్యశాస్త్ర పరిశ్రమా, ఆ పరిశ్రమకు ఈయన ప్రయత్నమూ దానికి తగిన ఫలమూ కలిగినవాడు. భయంకరం, మనోహరము అయిన గుణసంపత్తితో తనఆశ్రితులకు సమీపించడానికిగాని తిరస్కరించడానికి వీలు కాకుండా, పెద్ద క్రూరజంతువులచేత భయంకరము, రత్నములచే ఆకర్షణీయము అయిన సముద్రమువలెను వుండేవాడు." నా అనుభవంలో, ఈ శ్లోకాలలోని వర్ణన చాలవరకు రెడ్డిగారి విషయములో సరిపోతుంది అనిపిస్తుంది.

ఆయన 26-4-1926 తేదీని ఆంధ్ర విశ్వకళాపరిషత్తు సృష్టికై విశ్వ కర్మవలె సన్నద్ధుడయి వెళ్ళకముందు రెడ్డిగారు మదరాసులో మంత్రిమండలిని (పానుగంటివారిని) విమర్శిస్తూ చేసిన ఉపన్యాసాన్ని విని అ శైలీ,యుక్తీ, సంకలన శక్తీ, భాషాచాతురీ తీరులకు చాలా ఆశ్చర్యపడ్డాను. అప్పుడు నేను ఆదవోని హైస్కూలులో రసాయనశాస్త్రము బోధిస్తూ ఎట్ టి అసిస్టెంటుగా వుండేవాణ్ణి. అది మొదటి దర్శనము. ఆ తరువాత నేను 'మతోద్ధారకుడు' అనే పేర బసవేశ్వరుని చరిత్రను పద్యంగా వ్రాసి, నాయందు వాత్సల్యంగల రంగనాథం మొదల్యార్ అనే సభ్యునిద్వారా నాలుగు మాటలు రాయండి అని రెడ్డిగారికి పంపినాను. ఆయన అలాగే నాలుగు మాటలే ఈ రీతిగా వ్రాసి పంపినారు. "Somayaji"s book is an excellent production - style good, matter of abosorbing interest and treatement in good taste and form' అని వ్రాసి చిత్తూరు 11-3-26 తేదీ వేసి నాకు పంపినారు. అంతేగాని వారిని నేను దగ్గర్నించి చూడలేదు. ఇదే గ్రంథము మరియొకసారి సంస్కృతాంధ్ర భాషలలో ఎమ్. ఎ. పట్టభద్రుడై మదరాసున ముఖ్య మంత్రిగా వుండి, కవులను, భాషలను ఆంధ్రజాతిని ఉద్ధరించిన మహానుభావుడు శ్రీ రాజా రామారాయణింగారికి ఆదవోని రైలు స్టేషనులో సమర్పించి వారి మెప్పు పొంది, వేసీపాటివాడనుగా వృద్ధికి వచ్చుటకు ఒక చిన్న బీజమును నాటుట కవకాశ మేర్పడినది. ఆ తరువాత నేను రెడ్డిగారిని ప్రత్యక్షంగా చూచుట కవకాశము 1936 ఏప్రిల్ నెలలో చిత్తూరులో సంభవించింది. నేను పానుగంటి రాజావారిని ఆదవోనిలో దర్శించిన మరి 8 ఏండ్లకు ఈ సంఘటన జరిగింది. 1929లో ఆదవోని విడచి మదరాసులో నాల్గేండ్లు వచ్చయప్ప కళాశాలలో ఆంధ్రభాషా శాఖాధ్యక్షునిగా

వనిచేసి ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో మూడేండ్లు ఉపన్యాసకునిగా నుంటిని. శ్రీ రాధా కృష్ణన్‌గారు విశ్వకళాపరిషత్తును వీడివెళ్ళి తర్వాత రెడ్డిగారు ఉపాధ్యక్ష పదవిని స్వీకరించుటకు కొంచెము రోజులు ముందు జరిగినదీ సంఘటన. వారి యిల్లు చిత్తూరులో 'పద్మప్రభాస'. అందులోసుమారు ఉదయం 8గంటలకు ఒక కుర్చీపైకూర్చొని యున్నారు. నన్ను వేవే పరిచయము చేసికొనవలసినచ్చినది. నా రచించిన "మతోద్ధారకుడు" అను కావ్యమును వారి అభిప్రాయమును జ్ఞప్తి చేసితిని. మీరెందుకు ఇంతదూరము వచ్చినారు. వేనే అక్కడకు వస్తానుగదా! అప్పుడే చూడవచ్చువే అనిరి. నన్ను కూర్చోమని గూడ చెప్పలేదు. అక్కడొక కుర్చీయుండగ నేనే కూర్చుంటిని. ఏవో కొన్ని మాటలాడి కొంచెము వాఙ్మయవిచారము చేసి శెలవు పుచ్చుకొని వచ్చివేసితిని. మదరాసులో కాశీనాధుని నాగేశ్వరరావుగారు, జస్టిస్ సుబ్బారావుగారు, శ్రీ వేపా రామేశంగారు మొదలైన వారితో నాకెంతో పరిచితి చనవు వుండినవి. విశాఖలో రాధాకృష్ణన్‌గారి సన్నిధానంలో ఎంతో ఆదరం పొంది వారివలన విశేషజ్ఞాన లాభ మును పొందితిని. రెడ్డిగారి దర్శనము నాకు ఆనందం కలిగింపలేదు. కాని తర్వాత వారు విశ్వకళాపరిషత్తు వదలి 1949లో వెళ్లేవరకు వారి ఆదరము పొందుతూ వుండేవాడినే. వారు తమదగ్గర వనిచేయువారిని గూర్చి కొన్నినియమాలు ఏర్పరచు కొన్నారు. వారి యనుమతి లేక చూడవీలులేదు. వెళ్లితే పనిమీదనే వెళ్ళాలి. ఆపని అయిపోయిన వెంటనే వచ్చివేయాలి. ఇతర ప్రసంగము జేయరాదు. ఆఫీసు వనిమీద వెళ్ళునపుడు స్వంతచరిత్రగాని, తన పరిస్థితులనుగాని చెప్పుకోరాదు. వారు పిలిస్తేనే వెళ్ళవలె. అందుచేత వారికి నాకు సన్నిహిత సంబంధము ఏర్పడడానికి అవకాశము కలుగలేదు. కాని నాయందు ఆదరము అప్పటప్పటి సంఘటన వలన కలిగినది. నేను సెనెట్ మెంబరుగా ఎన్నికగుట వలన సమావేశములలో నాయందు కొంత ఆదరము పెరిగినది.

తర్వాత 1940లో ఒక విచిత్రమైన సంఘటన ఏర్పడింది. తెలుగుభాషలో శాస్త్రవిషయాలు బోధించడానికి కావలసిన నియమాలు సమకూర్చడానికి గవర్నమెంటు ఒక కమిటీని వేసినది. అందులో నన్ను ఒక మెంబరుగా వేసేరు. రైట్ ఆనరబిల్ శ్రీనివాసశాస్త్రిగారు చైర్మను. రెడ్డిగారూ, స్టాదం (డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్స్ట్రక్షన్), అబ్దుల్ హక్ మొదలైనవారు అందులో మెంబర్లు. నన్ను అందులో మెంబరుగా వేయడము తమ్ము సంప్రదించకుండ చేసేరని, అది తప్పనీ, రెడ్డిగారు తర్వాత

నాతో చెప్పేరు. మొదటి మీటింగుకి వారు రాలేదు. రెండవ మీటింగుకు హాజరయి మొదటి మీటింగులోని నిర్ణయాలను వారు విమర్శించేరు. ఆ తొలి మీటింగులో వే నర్పించిన మెమోరాండమును మెచ్చుకొని దాని నంగీకరించినట్లు మినిట్స్‌లో వుండినది. మీటింగులో కొన్ని ప్రతి విమర్శనలు కూడ జరిగినవి. మీటింగు అయిన తర్వాత నన్ను చాలా గౌరవించి, ఆదరించి నీవు నర్వజ్ఞ సోమయాజివని పొగడి తమ కారులో కూర్చోబెట్టుకొనిరి. స్వభావముచే నేను చాలా భయస్థుడను. వారు చూపిన ఆదరముతో నేను చాలా తబ్బిబ్బు అయితిని. అక్కడనుండి తిరిగివచ్చిన తర్వాత నన్నుగురించి మెచ్చుమాటలు నా తోడివారితో చెప్పుచుండిరి. నన్ను సాధారణముగా పిలవడము, కావ్యవిమర్శన సలపడం మొదలైనవన్నీ తరచు అయి పోయినవి.

రెడ్డిగారికి తమ సిబ్బందిలోని వారిని ఇతరులు తన అనుమతి లేకుండ గౌరవించడము ఇష్టముండదు. ఈ విషయం నాతో వదే వదే చెపుతూండేవారు. దాని కితరుల రికమెండేషన్ వసికిరాదు. ప్రతీదీ రూలు ప్రకారము జరగవలెను. కాళిదాసు దిలీపుని గూర్చి "ఆ రాజు పాలనలో మను నిర్మితమయిన ప్రాచీన రథ మార్గములనే కొంచెమైనను తప్పకుండ ప్రజలనుసరింపవలసి యుండవలెను" అనినట్లు రెడ్డిగారు తమ పరిపాలన సూత్రములను అనుసరింపక తప్పదను నియమమును పాటించేవారు. విశ్వకళావరిషత్తునకు ప్రోఛాన్సలర్‌గా నుండిన శ్రీ మహారాజా విక్రమదేవవర్మగారి వాల్లభ్యము, కరుణాదృష్టి, ఆదరము నాకు వరి పూర్ణముగ నుండెండివి. "రెడ్డిగారి కెవరైన రికమెండు చేస్తే ఆ వని జరుగకపోవుట సరికదా పైగా నష్టం కూడా వస్తూంది" వారు అనేవారు. రెడ్డిగారి వరిపాలన క్రమము, దినచర్యలో బహుముఖముల నే నెఱుగకపోలేదు. వాటిలో ఈ క్రిందివి చాల ముఖ్యములు :

(1) వారికి సంస్థపై, సమాజముపై రక్షణ దృష్టిగాని వ్యక్తుల కొరకు వరిశ్రమించుట ఉపసర్జనమే.

(2) యూనివర్సిటీలో వారి శాసనమే చెల్లవలె. పైవారి జోక్యమును సహించరు. వారెట్టివారికైనను, భయపడరు. అనేక సమయములలో సెనేట్ మెంబర్లందరు రిక మెండ్ చేసినను వారి మాట వినలేదు. తాము చేసిన పనే సరియయినదని వాదించి

స్థాపించుకొనగలిగిన బలము, యుక్తి వారికుండుటచే అందరును వారి మార్గమువే యనుసరించెడివారు.

ఇట్టివారితో ఏవ్యసంగము చేయడానికైన క్రిందివారికి అనిధారావ్రత చర్యయే. వ్యక్తులుగా మేమిరువురము మాట్లాడునపుడు మాకిరువురికి విభేదమేర్పడుతూ వుండేది. నేను జంకులేకుండా సమాధానమిచ్చెవాడిని. అలాంటి వాటిని కూడ వారు దయతో అంగీకరించేవారు. కాని దృష్టి కోణములలోను అనుసరించవలసిన మార్గాలలోను భేదము కొన్నిచోట్ల అలాగే యుండిపోయినది. పరిపాలనలో మనుష్య స్వభావాన్ని గుర్తించి తన అదుపులో పెట్టుకోడంలోను, నియమాన్ని అనుసరించుటలో వారికీడైన వారు లేరు. ఒకసారి నేను హాస్టల్ వార్డెనుగా నుండినపుడు నా సిబ్బందిలోని ఒక వ్యక్తిని గూర్చి రికమెండేషన్ చేసేను. ఆయన అన్నారు: "ఏమయ్యా ఇతనికి ఎక్కువ గ్రేడు అదనపు జీతము కూడ రికమెండు చేస్తున్నావు. ఇదయిన తర్వాత వాడు నీమాట వినడుసుమా? ఈ ఉపకారము వాడికి చేయక తప్పదా!" అని అడిగేడు. "ఏమోనండి చాలకాలమునుంచి వెనుకపడ్డాడని రికమెండ్ చేసేను. ఆపైన మీ దయ" అన్నాను. "సరేలే నీ గొయ్యి నీవే తవ్వుకొంటున్నావు. ముందుముందు నీకు తెలుస్తుంద"న్నారు. మరి నెలరోజులలో నాకు వారి జోస్యము నిజమయినది. తర్వాత, "మీ మాటే నిజము బాబూ. నీవు పరిపాలనకోసం పుట్టేవు. అది నీ రక్తంలోవేయుంది. నేను మెత్తని గుండెవాడివే" అని భారతములోని

"నిండుమనంబు నవ్యనవనీత సమానము పల్కుదారుణా

ఖండల శత్రుతుల్యము జగన్మత! విప్రులయందు నిక్కమీ

రెండును రాజులందు విపరీతము".....అవే వద్యము జ్ఞాపకము చేసితిని. 'అవునులే బాగుంది. కాని రెండుగూడ నాయందు విపరీతము గాదు. ఫిట్టీ పర్సెంటే వే నంగీకరిస్తాను· నా వాక్కులో యథార్థతతో కూడిన కాఠిన్యము ఇంతో అంతో వుంటుంది. అట్లా నామాట మృదువని పొగడకు', అని అన్నారు. 'పై పద్య మంటె రాజులను గూర్చి చెప్పినది. మీరు రెడ్లయినారండీ. అందుకోసమే అన్నా వండీ' అని అన్నాను. 'గడుసువాడవు' అని నాతో చిన్ననవ్వుతో అన్నారు. ఎవ్వ రును వారితో చనవు తీసుకొనరాదు. వారు హాస్యము చేసినపుడు సమాధానము

చెప్పరాదు. ఒకప్పుడు తమ మనసులో నొచ్చిన ప్రతివాక్యమున్ననూ అనుచరులు వారికి చెప్పుటకు వీలులేదు. ఇవన్నీ నాకు బాగా తెలుసును. తెలిసినా నాచాపల్యము చేత అప్పుడప్పుడు ఇరుకైన సమాధానాలు చెప్పేవాడిని. మాట మాత్రమే దక్కేది గాని మూట ఏపాటి కలుగలేదు. ఇటువంటి హాస్యాలు, వాక్య ప్రతివాక్యాలు ఎన్నో ఉండిపోయాయి. రెడ్డిగారు మరపునకు రారు. ఆడ్మినిస్ట్రేషనులో మానవ స్వభావము తెలుసుకోవడానికి వారి దగ్గర పనిచేసియుంటే ఎన్నో విషయాలు తెలిసేవి అని నేను అనుకొంటూవుంటాను. పైరీతి సంభాషణలూ వాదప్రతివాదాలూ ఎన్నో వున్నాయి. అవి చూరస్మృతులై ధ్వనిస్తరంగాలవలె క్రమముగా శ్రమించిపోతాయి. రాగద్వేషాలూ పొగడితలూ తెగడితలూ కూడా అంతటిలోనివే.

నవయామిని రచించిన ధర్మబుద్ధి, కవిత్వతత్వ విచారము వ్రాసిన రసాభినివేశమూ, ఔచిత్యము తెలిసిన విమర్శకుడుగా భారత భాగవతాది గ్రంథములయందు గొప్ప పాండిత్యము గలిగి, తెలుగు భాషాభిమానియైన రెడ్డిగారి పాలనలో మా తెలుగు శాఖ అట్లె పెంపులేకుండుట విధివిధానమేగాని రెడ్డిగారి విధానము కాదు. కారణము ఆనాడు ప్రజలలో అధికారులలో నుండిన ఉదాసీనభావము మొదలగు పరిస్థితుల వలన మా శాఖ పెరుగలేదు. కాని ఆంగ్లభాషకు ఆదరము పూర్ణముగా నుండెడిది. ఆక్స్‌ఫర్డు యూనివర్సిటీవారు "మోడరన్ ఇండియా అండ్ ది వెస్ట్" అనే గ్రంథము లోని నా వ్యాసమునందలి విషయము చదివి, నా భాష భావము మెచ్చుకొని వారు వ్రాసిన లేఖ నాయొద్ద చాలాకాలము వరకు వుండినది.

రెడ్డిగారియందు గౌరవమర్యాదలు నాకేకాదు వందల మందికి దేశములో నేటికిని యున్నవి. వారివలన ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ఎంతో లాభము పొందినది. వారి దూరదృష్టి, వారి పరిశోధనాభిలాష, పాండిత్యమును వారికిగల అభిమానము విశ్వకళాపరిషత్‌ను ముందుకు తెచ్చినవి.

వారు పరిషత్తును విడిచి మైసూరు వెళ్ళి కొంచెము కాలములో తిరిగివచ్చిరి. వచ్చినపుడు ఆనాడు శ్రీ కృష్ణగారు వైస్ ఛాన్సులర్‌గా వని చూచుచుండిరి. నన్ను పిలిచినారు. రెడ్డిగారిని చూచి ఎంతో సంతోషించినాను. వారు "చూడండీ మైసూరులో తెలుగుకి ప్రాధాన్యము కల్పింపవలె. దానికి ఏదైనా ఒక ప్రణాళిక వ్రాసి యివ్వండి" అన్నారు. నేనన్నాను, "రెడ్డిగారూ! మీవి ఉదారమైన భావాలు, మీ పరిపాలనలో

మా కిక్కడేమి ఒలికింది? మైసూరువాళ్లను నే వేరుగుదును! పూర్వము మీరుండిన రోజులు గావు. మీరేమి చెప్పినా మా వైస్‌గారు దానిని ఆదరించి ఆచరణలో పెడతారా? ఎందుకు మీకీ శ్రమ? మీ ఆరోగ్యము బాగా చూచుకోండి'' అని చెప్పేను. అది వారికీ నాకూ కడసారి మాట. మరికొంచెం కాలములో వారు వరమ పదించిరి. వారు గతించిన తర్వాత, వైస్-ఛాన్సెల్లరయి నాకు సమకాలికులై మొట్టమొదట వాతో ఒకేసారి లెక్చరర్ పనికి దరఖాస్తుచేసిన శ్రీ వానిరెడ్డి కృష్ణగారు నాతో అన్నారు: ''ఏవండీ మీకు మనుష్యుల నాకట్టుకోడం తెలీదు. నేను మీరూ సమంగానే రెడ్డిగారితో పరిచయం గలవారమే. వారితో నేనెప్పుడూ వివాదము చేసే వాడిని కాను. వారు చెప్పిన మాట విని దాని ననుసరించేవాడివి. మీకూ వారికీ ఎప్పుడూ 'Battle of wits' అందుచే మీకేమీ లభించలే"దన్నారు. ఆ కృష్ణగారి కాలములో మా తెలుగుశాఖ అనేక విధముల పెరిగినది. ఆయనతో ఒకనాడన్నాను "ఇది మీవలని ఉపరమూ, చలువా", అని అంటే ఆయన "మీరన్నదీ తప్పు, నేను దానికి కారణముకాదు. కాలమే కారణము. మనందరికి దాని శక్తేమూలమండి' అని చెప్పేరు.

విశ్వకళావరిషత్తును అనేకవిధముల పెంపొందించిన శ్రీ రెడ్డిగారు చిరస్మరణీయులు. వారితో మరికొంత కలిసి పనిచేసివుంటే ఎలా వుంటుందో అనుకునేవాణ్ణి. ఇంతకు మానవుడు స్వార్థపరుడు. తనకు ఉపకారమైతే మంచి వారని లేకపోతే చెడ్డవారవే అంటూ తలంచుకొంటూ వుంటాడు.

''కాలోహ్యం నిరవధిర్విపులాచ పృథ్వీ" అన్నాడు భవభూతి. ఈనాడు వైస్ ఛాన్స్‌లర్‌గా పనిచేస్తూ నిరంతర అర్ద్రహృదయులైన శ్రీ అప్పారావుగారి యాజమాన్యమున జరుగు శతవార్షికోత్సవంలో, రెడ్డిగారి కీర్తి సరస్వతికి ఒక వాక్యమాల సమర్పింతము

ప్రెసిడెన్సీ ప్రిన్సిపాల్
డా॥ సి. ఆర్. రెడ్డి

ప్రొఫెసర్ వి. సీతారామయ్య

కాలేజి చేరాలని మేమున్న అగ్రహారంనుంచి ముక్కునూటిగా బయలుదేరాను. ఆరోజుల్లో మైసూరు నిండా అగ్రహారాలు ఉండేవి. కాలేజీ ప్రవేశించకోరే విద్యార్థులు ఉదయం 10-30 - 11-00 గంటల నుండి మధ్యాహ్నం 1-00 వరకు ప్రిన్సిపాలును చూడవచ్చుననే సంగతి తెలిసింది. అది 1917వ సంవత్సరపు జూలై నెల. ప్రొఫెసరు సి. ఆర్. రెడ్డిగారు మైసూరు మహారాజా కాలేజి ప్రిన్సిపాలుగా వుండేవారు. మెట్లుఎక్కి మేడమీదికి వెళ్ళగానే ఎడమవైపు వారి ఆఫీసు. వారు వుండే గది చిన్నదైనా, దాని ప్రక్కగది కొంచెం పెద్దది. ఆ గదిలో హెడ్‌గుమాస్తా భీమరావుగారు, ఆయన సహాయోద్యోగులు కూర్చొంటుండేవారు. ఇతర మరిద్దరు గుమాస్తాలు, ఒక టైపురైటరు. మహారాజా కాలేజి మెట్లు మొదటి దశలో ఒకేరకమైన పెద్ద మెట్లుండేవి; అక్కడినుంచి రెండువైపులా పైకి మరొక రకమైన మెట్లుండేవి - బెంగుళూరులోని విక్టోరియా ఆసుపత్రిలో లాగా. ఆ కాలంలో ఆ విధమైన చెక్కమెట్లు కట్టడం వాడుక. ఎన్నాళ్ళనుంచో కంటున్న కలలు ఫలించే దినం! కాలేజి విద్యార్థి కావాలనే ఆకాంక్ష, ఆదుర్దా అభిమానం! కాలేజి ముందున్న 'పోర్చ్' సమీపిస్తున్నప్పుడు కాళ్ళు తేలిపోతున్నట్లు అనిపించింది. పోర్టికోలోని మూడు నాలుగు రాతిమెట్లు ఎక్కి వరండా దాటేటప్పుడు ఒంటరిగానో, గుంపులుగానో తిరుగుతూ అవీ యివీ మాట్లాడుతూవున్న విద్యార్థులు కనవడ్డారు. బెంగుళూరులో నాతోపాటు చదివిన విద్యార్థులు కొందరు అక్కడ వుండటంచేత

వారిని మాట్లాడించేసరికి కొండంత ధైర్యం వచ్చింది. ఒక్కరొక్కరుగా వెళ్ళి ప్రిన్సిపాలును చూడాలి. అడుగడుక్కీ వణకు ; గగుర్పాటు. నేనేమీ తూకం లేకపోయినా, నా దేహం నాకే బరువనిపించింది. నాకంటే ముందు పోయినవారు వేరే వాకిలిద్వారా వెళ్లిపోయి వుండవచ్చు. గంట మ్రోగింది. జవాను నన్ను లోపికి పొమ్మన్నాడు. "Come in" అన్నారు. ఎదురుగా సి. ఆర్. రెడ్డిగారు కూర్చొనివున్నా వారి ఆకారం నాకు మనకమసకగా కనిపించింది. ధైర్యం ఉడిగి పోయింది తూకంలో, ఎత్తులో-జేనిలోను అంతగా ప్రస్ఫుటమయ్యే వ్యక్తిత్వం కాదు నాది. రేఖాగణితంలో రెండు బిందువుల మధ్య గీయబడ్డ సరళరేఖలాగా వున్న నన్ను చూసి "Bless me" అని "Sit down" అని అన్నారువారు. అంతటి వారి దగ్గరకు పోవడమంటేనే భయం. పైగా వారి ముందు పిల్లకాయ అయిన నేను కూర్చోవటమా ? "Sit down ; Don't be an ass; Learn to be a human being". రెడ్డిగారి ఈ మాటలు వినగానే ఉత్తరకుమారుని వరాక్రమంవలె నా ధైర్యం బెంగుళూరు క్రోవవట్టింది. తర్వాత రెండు నిముషాలు నా అప్లికేషను చదివి, "Right, so you want to join our College?" 'ఊ!' "You will have to gain greater height and poundage" అని అన్నారు. మాటలేమో జ్ఞాపకమున్నా అప్పుడవి నాకు సరిగ్గా అర్థం కాలేదు. "What would be your Optionals? Let us see? Economics and Political Science, Right; Philosophy, Philosophy I or II?" 'ఫిలాసఫీ' అన్న గంభీరమైన పదమేమో అప్లికేషనులో వ్రాసి వుంటిని కాని ఫిలాసఫీ I, II– అవేమో నాకు తెలిసివుండలేదు ఆరోజుల్లో. ఫిలాసఫీ మొదటిభాగం - శుద్ధతత్త్వశాస్త్రం (హ్యూర్ ఫిలాసఫీ). రెండవ భాగంలో మనస్తత్త్వశాస్త్రము, నీతిశాస్త్రము, సమాజశాస్త్రము మొదలగునవి వుండేవి. "ఊ! Philosophy – I చాలా కష్టమని అంటారు" అన్నాను వేను. "What are we here for? We will make it easy for you". ఈ మాటలు విద్యాధికారులు అర్థం చేసికొంటే? చేసికొని ఆచరణలో పెడితే ఎంత బాగుంటుందో ? కొంచెం గడువు ఇస్తే వేను ఆలోచించుకొని చెప్తాను అని అర్థం వచ్చేలా అర్థంబర్థంలేని ఇంగ్లీషులో బదులిచ్చాను. "You have to consult your grandfather, I suppose?" మరింత గాభరా కలిగింది. "Take a week's time and tell me; Good day," అని గంట కొట్టారు. 'గుడ్ డే' అవే మాటను అంతకుముందు వేను వినివుండలేదు. నేను బయటికి పోవటానికి మరొకరు లోనికి రావటానికి ఆ గంట గుర్తు. నేను బయటికి వచ్చాను.

* * *

కాలేజిలో నా మొదటి అనుభవమిది. ప్రిన్సిపాలు రెడ్డిగారంటే సామాన్యులు కారు. గొప్ప మేధావి, రసికులు, నిర్మొహమాటమైన విమర్శకులుగా ప్రసిద్ధి చెందినవారు. తెలుగులోకవి, విమర్శకులు, మద్రాసు, కేంబ్రిడ్జిలలో వారి విద్యార్థి జీవితం నాటి కథలు, వారి పాఠ ప్రవచనాల్లోని సార్వస్యమైన కథలు, ఇంకా వారి గురించి మూర్ఖుల కథలు వినియుండుటంవలన నేను తేరుకోవడానికి అర్ధగంటకుపైగా పట్టింది.

అయినా వారి మాటలు నాకు ధైర్యం కలిగించాయి. "What are we here for? We will make it easy for you" అన్న మాటలు నాకు అమృతసేచనం అయ్యాయి. మన దేశం తత్త్వశాస్త్రానికి పేరు మోసినది. ఆ తత్త్వశాస్త్ర స్వరూపం తెలుసుకోవాలన్నది వారి మొదటి ఆశయం. రాజకీయ, ఆర్థిక రంగాల్లో మన దుఃస్థితిని తెలుసుకోవాలి! దీన్ని తెలిపే శాస్త్రాలు చదవాలి అన్నది నా రెండవ ఆశయం. ఇవి కష్టమైన విషయాలు. కష్టపడడానికి వెనుకంజవేస్తే కాలేజిలో ఎందుకు చేరాలి ఉత్సాహం, ఆకాంక్షలు ఎలా నడిపిస్తాయో చూద్దాం అని అంతరాత్మ ప్రబోధించింది మరొక అర్ధగంటలో వెనుకకు వెళ్ళి వారికి చెప్పాలనిపించింది. ఏమంటారో అని భయం. ఏం చెయ్యాలి? ఆరోజే వద్దు! మరొక్క రోజు ఆగి వెళ్దామని మనస్సు మూలిగింది. విషయ నిర్ణయమేమో ముగిసింది. నేను ఆ దినం తీసికొనే నిర్ణయం, నా కాలేజి చదువును భవిష్యత్తును నిర్ణయించే జాతకమేకదా! అందువలన తొందర పడకూడదు. నిదానముగ నిర్ణయించుకుందామని మధ్యాహ్నం మూడు గంటలకు ఇల్లు చేరాను. రెండవరోజు మధ్యాహ్నం రెండున్నర గంటలనుండి సాయంకాలం ఐదు గంటలవరకు ప్రిన్సిపాల్‌గారిని విద్యార్థులు చూడొచ్చునని తెలిసింది. ఆ సమయంలోనే వారివద్దకు వెళ్ళాను. "Hallo, have you heard from your grand father?" అని అడిగారు. 'Yes, Sir' అన్నాను. 'That's not bad, what will you opt for?' ఇప్పుడు ఆ పదం అర్థమయినా అప్పుడు opt అనే పదానికి అర్థం తెలిసివుండలేదు. Optionals తీసికొని, మార్కులు సంపాదించి పాసయినాను. కాని 'Optionals' అనే పదానికి ధాతువు opt అనే సంగతి నాకు తెలిసివుండలేదు. ఆ పదాన్ని ఆ విధంగా ప్రయోగించివుండటం అంతవరకు నేను వినియుండలేదు. Philosophy I తీసికొంటాను, అన్నాను నేను. 'It will be all right; go' అన్నారు.

* * *

పాఠాలు ప్రారంభమయ్యాయి. ప్రఖ్యాత ఉపాధ్యాయులైన ప్రిన్సిపాల్ సి. ఆర్. రెడ్డి తర్కశాస్త్రాన్ని, ఎన్. ఎస్. సుబ్బారావు అర్థశాస్త్రాన్ని. ఎ. ఆర్. వాడియా తత్త్వశాస్త్రాన్ని, బి. ఎం. శ్రీ కంఠయ్య ఇంగ్లీషు సాహిత్యాన్ని, యమ్. హిరియణ్ణ సంస్కృతాన్ని బోధించేవారు. ప్రిన్సిపాల్ సి. ఆర్. రెడ్డిగారు తలలో నాలుకవంటివారు. ఈ పుణ్యం కొద్దీ వారు తరగతికి మాత్రమే పాఠం చెప్పేవారు. అంతేకాని మేమున్న కారణంవల్ల కాదు. మేము చేరిన తర్వాత మూడు నెలలు మాత్రమే వారు అక్కడ వున్నారు. అక్టోబరు నాటికి వారు ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఎజ్యుకేషనుగా బెంగుళూరికి వెళ్లిపోయారు.

కాలేజి నిర్వహణ కారణంగా వారికి ఎక్కువ తీరిక లభించేదికాదు. ఉత్తరం వైపు మేడమెట్లు ఎక్కగానే సందులో కుడివైపువున్న మొదటిగదిలో మా తరగతులు నడిచేవి. తరగతిలో ముప్పైమంది వుండేవారు. విద్యార్థుల్లో భయసంతోషాలు ముప్పిరిగొని వుండేవి. సి. ఆర్. రెడ్డిగారు ప్రిన్సిపాలు అయినందువల్ల భయం! అంతటివారు మాకు పాఠం చెపుతున్నారు కదా అని సంతోషం. ప్రొఫెసర్లందరు గౌన్లు, హుడ్‌లు ధరించి క్లాసులకు రావటం ఆనాటి సంప్రదాయం. రెడ్డిగారు అంతేమో భారీమనిషికాని, అంతమైనవారు కానీ కాదు అయినా వారి ముఖంలో కళ వుండేది గుండ్రని చిన్నముఖం. నుదుటిమీద తుప్పవట్టిన రాగిరంగుతో ఒక పెద్ద మచ్చ వుండేది. మెషిన్‌ద్వారా 'ట్రిమ్' చేయబడ్డ మీసాలు. ఆఫీసు గదిలోనుంచి టైపు చేయబడ్డ నోట్సు వున్న ఫైలు తిరగవేస్తూ తరగతికి రావటం వాడుక. ఆరోజు పాఠం ఏమి చెప్పాలో అప్పుడే గుర్తుపెట్టుకోసేవారో ఏమో? వారికి పాఠ్యం కానిదేముంది? ఒక్కొక్కప్పుడు రాజీవలోచనం అనే ట్యూటరు ఆ నోట్సును క్లుప్తీకరించి మూల సామాగ్రి తయారుచేసి ఇచ్చేవారిని ప్రతీతి. విషయమంతా కరతలామలకం కావటం వల్ల నోట్సు ఒక్కొడక్కడ తిరగవేస్తే చాలు. వారికి విషయం లోతుపాతులు సులభంగా తెలిసేవి.

కేంబ్రిడ్జిలో వుండగా బెర్ట్రండ్ రస్సెల్, జి. ఇ. మూర్ లాంటి హేమాహేమీలను చూసి, వారి ఉపన్యాసాలను విని, వారినుంచి సంస్కారం పొందే మహదవకాశము రెడ్డిగారికి లభించింది. ఆ కాలంలో 'Hegelians' అనబడే బ్రాడ్లే బోసన్‌క్వెట్, గ్రీన్ మొదలగువారు పోషించిన ఆదర్శవాదం (Idealism) అనే తాత్త్వికవిధానం అంతవరకూ వుండేది. వారి దర్పం వీగిపోయేలా ఇంగ్లండులో

రస్సెల్, మూర్.షిల్లర్ మొదలగువారు యథార్థానికి పునాది వేశారు. అమెరికాలో విలియమ్ జేమ్స్ 'Pragmatism' (ఉపయుక్త లేక ప్రయోజకతావాదము) వ్యాపింప చేస్తూండేవారు. అప్పుడప్పుడు త్రైమాసిక పత్రికల్లో Behaviourism గురించి వాట్సన్ గారి వ్యాసాలు వస్తూండేవి. ఫ్రాయడ్ పేరు ఆ రోజుల్లో ఎక్కువగా విన్నట్టు జ్ఞాపకం లేదు. బెర్ట్రండ్ రస్సెల్, వైట్‌హెడ్ ఇద్దరూ కలిసి వ్రాసిన 'Principia Mathematica' అచ్చయి వుండినది. కొన్నేళ్లక్రితం హోమ్ యూనివర్సిటీ లైబ్రరీ సీరీస్‌లో వెలువడిన Some Problems of Philosophy అనే పుస్తకం, ఇకమీదట తన అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించదని, దాన్ని తాను వాపసు తీసుకొంటానని రస్సెల్ విజ్ఞప్తి చేశారు. కాని ఆ గ్రంథమాలాధికారులు ఆ పుస్తకం ఆ గ్రంథమాలలో కొన సాగేలా వుండనివ్వమని రస్సెల్ అనుమతి పొందారట! రస్సెల్ మొదటి భార్య వారినుండి విడిపోయింది. ది ఇంటర్ నేషనల్ జనరల్ ఆఫ్ ఎథిక్స్" పత్రికలో 'A Free man's Worship' అనే వ్యాసాన్ని వ్రాసినందుకు గొప్పసంచలనం చెలరేగింది. అలాంటి రోజుల్లో కేంబ్రిడ్జిలో వుంటూ యథార్థవాద ప్రతిపాదకుల్లో ఒకరుగా రెడ్డిగారు తమ వ్యక్తిత్వం రూపొందించుకొన్నారు. I agree with Russel, I agree with Moore' మొదలగు మాటలు వారి నోట వినవస్తూ వుండేవి.

రస్సెల్ ఎవరో? మూర్ ఎవరో? మాకేమో ఆదర్శవాదానికి మన వేదాంత వాదాలకు సామ్యం ఉన్నందువల్ల రెడ్డిగారి యథార్థవాదం ఈ రెండింటికి విరుద్ధంగా వుండటం తోచేది. స్వతస్సిద్ధమైన విరోధ గుణము రెడ్డిగారి బౌద్ధిక విశిష్టతగా గోచరించేది. వారి మాటల్లో అది అప్పుడప్పుడు వ్యక్తమయ్యేది. ఏ విషయాన్ని తీసుకొనా, సులభముగ, ఖచ్చితముగ, గ్రుచ్చుకునేలా, కట్టి విరిచినట్లు మాట్లాడడం వారి పద్ధతి. వారి హాస్య, పరిహాస, వ్యంగ్యాలు నేను మరెవ్వరిలో చూడలేదు. ఒక్క చమత్కార వాక్యానికై, వ్యంగ్య వాక్యానికై మిత్రుల సన్నిహితుల స్నేహ విశ్వాసాలను కూడ లెక్కపెట్టని విలక్షణస్వభావం వారిది. అంటే, జిహ్వాచాపల్యం చంపుకోలేని వాళ్లేరు మార్గం అన్నమాట హాస్యోక్తి ఆడిన వెంటనే అలలు అలలుగా వారు నవ్వటం మరపురానిది. కిట్టనివారికి అది గుర్రపు సకిలింపులాగా వినవచ్చేది. అయితే వారి మాటలు ఎదుటివారికి చురుక్కుమనిపించేవి ఎంతో చమత్కారంగా సూక్తులను వ్యాఖ్యానించేవారు. ఇంతవరకు ఈ విషయం గురించి ఎన్నడూ తట్టని ఆలోచనలు తడుతున్నాయనిపించేది. ఎంత అద్భుతమైన, లోతైన దృష్టి వారిది అనిపించేది. ఒక ఉదాహరణ మనవిచేస్తాను.

హెచ్. డబ్ల్యు. బి. జోసెఫ్ వ్రాసిన "ఇంట్రడక్షన్ టు లాజిక్" మాకు పాఠ్యపుస్తకముగ వుండేది. జోసెఫ్ నూటికి నూరుపాళ్ళు ఆదర్శవాది. 'ఇంట్రడక్షన్ 600 పేజిలకు పైగా వున్న బ్రహత్ గ్రంథం. దానిలో వున్న 'లాజిక్' సూత్రాన్ని ఒకసారి చదివిన తర్వాత 'Look at this' అని తమ వ్యాఖ్యానం ప్రారంభించేవారు. తెలుగులో రామలింగారెడ్డిగారి పుస్తకాల్లో కూడ 'చూడుడు' అనే వాక్యం అక్కడక్కడ కనిపిస్తుంది. "The definition of Logic as given by Mr. Joseph is conspicuous by the non-mention of two of the most important features that ought to constitute any definition of Logic: Relevancy and Consistency," అంటూ "Do you catch me, eh?" అని బిగ్గరగా నవ్వారు. అప్పుడే "ఎంట్రెన్స్" పరీక్ష ప్యాసు అయి, బి. ఏ. మొదటి సంవత్సరములో చేరినవాళ్ళం మా తలకాయ మేము ఏం catch చేసేది? కాని ఆ వాక్యం మమ్మల్ని ఆశ్చర్య పరిచేది. బుద్ధిమంతులైన విద్యార్థులకు రోమాంచనం అయితే, మిగతావారికి దిగ్భ్రమ కలిగేది. బుద్ధిమంతులు కూడ ఎంతవరకు అర్థంచేసుకున్నారో ఏమో తెలయదు కాని ఆ వాక్యం మటుకు, నా స్మృతిపథంలో చెరగలేదు. నేను వ్రాసిపెట్టుకున్నానుకూడ ఆసూత్రానికి రెడ్డిగారు చేసిన ఉజ్జ్వల వ్యాఖ్యానం - వారు వాక్య నిర్మాణం మనలను ఆకట్టుకొట్టుంది. అందులో Relevancy మరియు Consistency లేదనే విషయము తెలిసినా conspicuous కానివ్వండి, by the nonmention కానివ్వండి, ought to coustitnte కానివ్వండి వీటిని పూర్తిగాఅర్థంచేసుకొనే శక్తి సామర్థ్యాలు మాకుండ లేదు. వెనుక ఒకసారి బి. ఏ. విద్యార్థులకు 'రైవల్స్' పాఠం చెప్పుతూ. షెరిడన్‌ను గూర్చి చెప్పినారన్న మరొక సూత్రం ఆ సాయంకాలం మరొకరిద్వారా విని ఇలాంటి దిగ్భ్రమే కలిగింది. Love, according to Sheridan is a specific spontaneous, irrational impulse of the heart." ప్రేమ అంటే ఎమిటో తెలునుకొన్నవారికి ఈ మాటలు ఎంత ఆశ్చర్యాన్ని కలిగిస్తాయో స్పష్టమవుతుందికదా!

వారి వాక్చమత్కారము, వాక్‌వైభవము, స్వరూపలక్షణాల వివరణలు అద్భుతంగా వుంటూ ఆలోచనలను ప్రేరేపించేవి.

* * *

200 పేజీల నోటుపుస్తకాలు తీసుకురండి, నేను చెప్పే నోట్సు కుడివైపు వ్రాసుకోండి. నేను ఎక్కువగా చదవండి అని చెప్పే పుస్తకాలు చదివి ఎడమవైపు

పేజీలలో వ్రాసుకోండి, అని మొదటి క్లాసులో సి. ఆర్. రెడ్డిగారు మాకు చెప్పారు వారు చెప్పిన సంప్రతింపు పుస్తకం చదవలేదని గ్రహచారం తక్కువైచెప్పారో వెంటవే Make a pilgrimage to the Library అని ఆజ్ఞాపించేవారు. అది ఆ కాలం నాటి-ముఖ్యంగా రెడ్డిగారి క్రమశిక్షణ. వారు చెప్పినదాన్ని ఎవరైనా సంపూర్ణం గానో, సంక్షిప్తంగానో వ్రాసుకోకపోతే వారికి విసుగు, కోపం కలిగేవి. "Why do you sit staring at my face, it is ugly" అని అనేవారు. ఒకరోజు ఖర్మం చాలి నేను "I have been following you, Sir" అన్నాను. "What have you been following?" అని ప్రశ్నించారు. దానికి నేను యేమి బదులు చెప్పానో యేమో! "Any way, make yourself surer on paper" అన్నారు రెడ్డిగారు గెలుపు మాత్రం వారిదే! మరోమారు బెర్కిలే (Berkeley) సిద్ధాంతములోని మాటను (Esse is percipi) the essence of a thing is in its perception. చాలా చక్కగా వివరిస్తూ ఒకదశలో with this single argument, I can blow off the entire position of our Vedantin అనే అర్థంవచ్చేలా మాట్లాడారు. "Not of all of them" అని నేను సిలిచి చెప్పాను. "Donkey" (వారు ass అనే పదాన్ని చాలా తక్కువగా ఉపయోగించేవారు. "డాంకి"లోని నాదమాధుర్యం ass లో లేదుకదా!). Do not take me too literally" ఆవులించిన నోటికి ఆవ్వళించినట్లు వారు సమాధాన మిచ్చారు

నారి కాలంలో కాలేజినుండి Irresponsible అనే పత్రిక వెలువడుతూండేది శ్రీ హెచ్. సుబ్బారావు సంపాదకులుగా వుండేవారు. వ్యంగ్యము, హాస్యము, అవ హాస్యము, విద్యార్థుల అధ్యాపకుల విషయాలు, పాఠప్రవచనాల సంగతులు, క్రమ శిక్షణ, ప్రపంచంలోని సమస్త విషయాలు ఆ పత్రికలో ప్రచురింపబడేవి ఒకమారు Reffections of a retirng journalist అనే వ్యాసం ఆ పత్రికలో వచ్చింది. ఎవరు వ్రాశారోకాని దానిశైలి, అంతఃసిత్వము విశిష్టంగా వుండేది. అది మైసూరులోని ప్రసిద్ధ సంఘ సేవాపరాయణులు, పత్రికా సంపాదకుడు ఐన ఎమ్. వేంకటకృష్ణయ్య గారి గురించి వ్రాయబడిన వ్యంగ్య, పరిహాస రచన. దాన్ని రెడ్డిగారు వ్రాసినారని వినికిడి. నిజం దేవుడికెరుక! వారిద్దరిమధ్య వ్యక్తిగతంగాను, సార్వజనిక స్థాయిలోను భిన్నాభిప్రాయాలు, విరసమూ వుండినమాట వాస్తవము. ఆ తర్వాత చాలాకాలం Irresponsible నడవలేదు.

మరొక పంగతి. కాలేజి ఫీజు కట్టేందుకు ప్రతి నెలా 5, 10, 15 తేదీలు నిర్ణయింపబడి వుండేవి. 15వ తేదీ నాటికి కట్టకపోతే దినానికి ఒక అణా చొప్పున జరిమానా విధింపబడేది. ఇలాగ వసూలైన డబ్బంతా విద్యార్థి సంఘనిధికి ఇవ్వ బడేది. ఇంకా 'ఫ్రీ షిప్పులు' ప్రకటింపబడనందున అందరూ ఫీజు కట్టవలసివచ్చింది నాకు ఒక్క రూపాయి రెండణాల జుల్మానా విధింపబడింది. వేను ప్రిన్సిపాలు రెడ్డిగారి వద్దకు వెళ్ళి, ఆ జుల్మానా కట్టలేనని విన్నవించుకొన్నాను' ఫీజు నెలకు ఆరు రూపాయిలు. అది కట్టడానికి గతిలేనందువల్లకదా ఇన్నాళ్ళు వుండిపోయాను. గతిలేనివాళ్ళకు జుల్మానా గుదిబండలాగా తయారగుతుందని నా కష్టం తోడిపోసుకున్నాను. నాకథ విని "నీవు చెప్పేది నిజమే. 40-50 మందికి జుల్మానా విధించాను. నీ వొక్కనికి తీసివేస్తే, అందరికి తీసివేయాల్సి వుంటుంది" అని రెడ్డిగారు అన్నారు. నానోట మాటరాలేదు. "I am sorry, sir" అని వేను ఆయన గురించి వెడలి ప్రక్కవే వున్న హెడ్ గుమాస్తా భీమరావుగారి ముందర నిలబడ్డాను. వారి బల్లమీద ఆకువచ్చ పెన్సిలుతో K. Iyengar's fine excused అని ప్రిన్సిపాల్‌గారిచే చీటి కనవడింది. నాకు భలే కోపం వచ్చింది. గబగబా వెళ్ళి ప్రిన్సిపాల్ రెడ్డిగారి ముందు నిలబడ్డాను. 'What is the new calamity?' అని అడిగారు. "మీరు కె. అయ్యంగారుకు విధించిన జుల్మానా మన్నించారు. నాకూ కట్టేందుకు గతిలేదు. దయచేసి నా జుల్మానాను కూడా మీరు తీసివేయాలి" అని అడిగాను. "Oh! you have seen that, have you? Bhima Rao' అని బిగ్గరగా పిలిచారు. భీమారావు గారు వచ్చారు. "Execuse this fellow's fine also" అని చెప్పి నావైపు తిరిగి "Are you satisfied?" అని అడిగారు, "మీ మేలు మరువలేను సార్" అని అన్నాను. 'Let me think of it again Bheema Rao; Don't levy any more of this fine this month" అని అన్నారు. భీమారావుగారు ముసిముసి నవ్వు నవ్వుతూ తమ గదిలోనికి వెళ్ళిపోయారు. "యు గెట్ యెవె నౌ" అని ప్రిన్సిపాలు నన్ను సాగనంపారు. అలాంటిది ఆ కాలం!

వారు విషయాన్ని వివరించే పద్ధతి విశిష్టమైనది. అద్వితీయమైనది. వేదిక మీద ఒకవైపునుంచి మరొకవైపుకు పొడుగ్గా తిరుగుతూ మొండి మీసాల రెండు కొనలను వైకితిప్పి సవరిస్తూ మాట్లాడేవారు. Form and Matter అనే ప్రాథమిక పాఠాన్ని బోధించేటప్పుడు "Let me make myself, clear with another

concrete example" అని సీమసున్నపు ముక్క, నాణ్యాల ఆకారము, వాటిని చేసిన సుధాంశ లోహాంశాలను ఉదాహరణముగ వారు చేసిన వివరణ వామన్య ఫలకంపై ఇప్పటికీ చెరిగిపోలేదు. వారి పాఠం ఎల్లప్పుడూ మనస్సును చైతన్యవంతంగా ఉంచి, విద్యార్థులలో ఆలోచనను రేకెత్తించేది. ఆ చురుకుదనం నాకు వేరెవ్వరిలోను కనపడలేదు. వారి అంగవిన్యాసం, వ్యంగ్య వైఖరి, ప్రత్యర్థుల వాదాన్ని ఖండించే విధానము - అద్భుతంగా ఏదో విషయాన్ని ప్రతిపాదించి Do you catch me, eh! అని నవ్వే అ నగుమోము వారి విద్యార్థుల హృదయాలపై శాశ్వత ముద్ర వేసేవి. వారు సుమారు అక్టోబరునాటికి మైసూరు మహారాజా కాలేజి వదలి వెళ్ళిపోయారు. అప్పటికి నా డిగ్రీ విద్యాభ్యాసంలోని మొదటి సంవత్సరపు ఒక భాగం ముగిసింది.

రెడ్డిగారు ఉత్తమ మేధావిగా, వాదినాలుక కలవారిగా, తీక్ష్ణవిమర్శకులుగా ఖ్యాతి గడించి వుండిరి. వారి హాస్యం, వ్యంగ్యం ఆ కాలంలో చాలా ప్రసిద్ధి కొంతమందికి అది కంటకప్రాయంగా వుండేది. వారి వాక్బాణాల బారినుండి తప్పించుకోవటం అందరికి చేతనయ్యే పనికాదు.

ఒకమారు బెంగుళూరులో మెజిస్టిక్ థియేటర్ ప్రారంభమైన తొలినాళ్ళలో ఒక ఆదివారం ఉదయం ప్రసిద్ధ రాజకీయవేత్త, ఉపన్యాసకులు అయిన శ్రీ ఎన్. సత్యమూర్తిగారి ఉపన్యాసం ఏర్పాటు చేయబడింది. ఆనాటి సభకు రెడ్డిగారు అధ్యక్షత వహించారు. సత్యమూర్తిగారి ఉపన్యాసకౌశలం అనన్య సామాన్యమైనది. వారు కాంగ్రెసువాదులు. వారు హోమ్‌రూల్ ఉద్యమంపరంగా గంటసేపు అనర్గళంగా మాట్లాడి సభ్యులను ఆశ్చర్యంలో ముంచివేశారు. రెడ్డిగారు కాంగ్రెసుకు ప్రతిపక్షంలోనివారు. స్వభావరీత్యా రెడ్డిగారు దేనికైనా ప్రతిపక్షమే. వారి సునిశితమైన బుద్ధికి యెటువంటి అడ్డు-ఆటంకాలు, హద్దూ-పద్దులు వుండేవి కావు.

సత్యమూర్తిగారి ఉపన్యాసంలో నాజూకు, కౌశలం వున్నా, బ్రిటిష్‌వారికి విరుద్ధంగా ప్రభుత్వాన్ని నడిపే తత్వాలకు విరుద్ధమైన, భారతీయ సంస్కృతివరమైన, ప్రశంసాత్మకమైన ఆత్మాభిమానం పొంగిపొర్లింది.

రెడ్డిగారుకూడా దేశభక్తులే. బ్రిటిషువారికి విరుద్ధంగా, స్వతంత్రంగా మాట్లాడగలవారే. శత్రుపక్షంలో వారిది మధ్యేమార్గం. రెడ్డిగారు గోఖలేగారి మార్గానికి చెందినవారు. అప్పటికి మద్రాసులో త్యాగరాజ చెట్టియార్, డాక్టర్ టి. ఎమ్. నాయర్ మొదలగువారు కాంగ్రెసుకు విరుద్ధంగా క్రొత్తపార్టీని స్థాపిస్తుండేవారు. రెడ్డిగారు ఆ పక్షంవైపు మొగ్గుచూపుతుండేవారు. ఇంకా చెప్పాలఁటే, ఆ క్రొత్తపార్టీ దక్షణ భారతదేశంలో బ్రాహ్మణాధిక్యానికి గొడ్డలిపెట్టుగా తయారు కానున్న పార్టీ అన్నమాట. స్వభావరీత్యా వాక్ వైశిత్యం, ప్రతివాది అన్నమాటలను ఖండించాలనే పట్టుదలగల రెడ్డిగారికి మరో రెండుకారణాలు ప్రేరకమయ్యాయి. సత్యమూర్తి కాంగ్రెసువాదియైన బ్రాహ్మణుడు-పైగా గంటసేపు సభ్యులను మంత్రముగ్ధులను చేయుటయేకాక ఉపన్యాసకుశలుడైన రెడ్డిగారినే బంధించినట్లు కూర్చుండబెట్టారు. రెడ్డిగారిలో ప్రబోధన యెక్కువయ్యిందేమో - 19, 20 నిముషాలు అధ్యక్షోపన్యాసం కావించారు. మిట్టమధ్యాహ్నంలో ఆ వేదబ్రాహ్మణుని వాదాన్ని అదరగొట్టడమే కాకుండా, అతని ముఖం మలమల మాడిపోయేలా చేశారు.

ఆనాడు రెడ్డిగారు చేసిన ఉపన్యాసంలోని వాక్‌వైభవం చాలా గొప్పది. వేర్వేరుచోట్ల వెనుక వారు చెప్పిన మాటలవే ఆనాడు చెప్పినట్లుగుర్తు.

"నిజమే. మన పూర్వీకులు సర్వజ్ఞులే; సర్వశక్తిమంతులు; అనుపమసత్వశాలులు. వేదు నాగరికులమని విర్రవీగే చాలా దేశాల్లోని ప్రాచీనులు అదిమానవుల వలె తిరిగే రోజుల్లో భరతఖండపు సంస్కృతి అత్యున్నత శిఖరాలను అధిరోహించింది. మనవారికంటె విద్వాంసులు, సంపూర్ణమానవులు ప్రపంచంలో మరెవ్వరు వుండలేదు. నిజమే. కాని వారొక తప్పుచేశారు. ఆ సంప్రదాయాన్ని కొనసాగించి, అభివృద్ధి పరచే యోగ్య సంతానాన్ని అంటే తరాన్ని గురించి మాత్రం వారు ఆలోచించలేదు: సృష్టించలేదు. Failed to create a proper progeny" అని అన్నారు.

ఈ కటువ్యంగ్యం గుండెల్లో గునపంలా గ్రుచ్చుకొనేది. సత్యమూర్తిగారి మాటలకు చప్పట్లు తట్టిన సభ్యులకు, సత్యమూర్తిగారికి, ప్రాచీన భారతీయ సంస్కృతికి ఒకేమారు గొడ్డలిపెట్టు పెట్టినట్లయింది.

ఎవరైనా కవ్వింపేచాలు, రెడ్డిగారి వాదనావటిమ గట్టుత్రెంచుకొని అందరినీ ముంచివేసే విధంగా వెలువడేది. ఆనాడు జరిగిందదే !

కట్టమంచి - వల్లివేడు
సురుచిర బాంధవ్యం

శ్రీమతి వల్లివేడు విద్యాలత

ప్రతి గొప్పవ్యక్తి జీవితం వెనుకా ఒక స్త్రీ ప్రభావం తప్పక వుంటుందని వెనకటికి ఒక మహనీయుడన్నారు. డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి వనితనంలో కథలు చెప్పి, అతని జ్ఞావకశక్తిని భావనాశక్తిని ప్రోదిచేసి, అతనిలోని కవికి. విమర్శకునికి జీవంపోసిన మహనీయురాలు, వరదరాజ శతక రచయిత్రి అయిన శ్రీమతి వల్లివేడు కాదాటి నరసమ్మ.

కట్టమంచి చిత్తూరునుండి ఒక మైలు దూరంలో వుంది. చిత్తూరునుండి కడప కెళ్ళేదారిలో వరుసగా వాయిల్తోట, పూతలపట్టు, గుండ్లవల్లి, దామల్‌చెరువు, వల్లివేడు గ్రామాలు, ఒకదానికొకటి దాదాపు ఆమడదూరంలో వున్నాయి. ఈ వల్లెల్లో రెడ్ల కుటుంబాలే వూరిపెద్దలు. వీళ్ళకందరికి ఆ రోజుల్లో సేద్యమూ, మామిడి తోటలూ జీవనాధారం.

రెడ్లకు బీరకాయపీచు చుట్టరికాలెక్కువని నలుగురూ పరిహసిస్తుంటారు. నిజంగావే క్షణంలో చుట్టరికాలు కలుపుకోటం, వరసలు కలిపి పిలుచుకోటం రెడ్లకు ఏ గురువూ వేర్పని విద్య. పై చెప్పిన వల్లెల్లోని రెడ్లకు తరతరాలుగా వియ్యమిచ్చి పుచ్చుకోటం అలవాటు. అందులోనూ కట్టమంచి, వల్లివేడు వాళ్ళకు నాకు తెలిసి మూడు తరాలుగా వియ్యముంది.

కట్టమంచి రామలింగారెడ్డిగారి మేనత్తను వళ్లివేడు కాదాటి వెంకటరెడ్డి వివాహమాడారు. వారి రెండో కొడుకు కాదాటి నరసింహారెడ్డి కట్టమంచి రామలింగారెడ్డిగారి అక్క సుందరమ్మను వివాహం చేసుకున్నారు. ఆమెకు పిల్లలేరు. కానీ నరసింహారెడ్డి సవతికొడుకు రాజారెడ్డి రామలింగారెడ్డి తమ్ముడైన కట్టమంచి వీర రాఘవరెడ్డి కూతురు లలితకుమారిని పెళ్ళాడారు. ఈ విధంగా కట్టమంచి ఆడ బడుచులకు వళ్ళివేడు మెట్టినిల్లు అని తెలుస్తూవుంది.

కట్టమంచి చిత్తూరుకు దగ్గర కాబట్టి, చిత్తూరులో మాత్రమే చెప్పుకోదగ్గ బడి వుండేది కాబట్టి దాదాపు పైఊళ్ళ పిల్లలందరూ కట్టమంచిలో వుంటూ, చిత్తూరుబోర్డు హైస్కూలులో చదువుకువేవాళ్ళు. ఆ రోజుల్లో అన్నీ పెద్ద కుటుంబాలు. సమిష్టి కుటుంబాలు. అంతమంది పిల్లల్తో కట్టమంచి యిళ్ళు పూటకూళ్ళ యిళ్ళల్లా వుండేవట. బడికి వేసవి సెలవలిచ్చారంటే కాళ్ళు కట్టేసినట్లయి పిల్లలకు తిక్కరేగేది. వాళ్ళు అల్లరితో, కీచులాటల్తో పెద్దలకు పిచ్చెకేది. అందుకని ఎద్దులబళ్ళు కట్టించి, తలారుల్ని తోడుపెట్టి, ఫలహారాల బుట్టల్తో, నీళ్ళ మరచెంబుల్తో బంధువుల యిళ్ళకు పిల్లల్ని ప్రయాణం చేయించేవారు.

పిల్లలకు ప్రయాణమంటే సరదా. తెల్లవారుజామున నాలుగు గంటలకు చద్దన్నం తిని బండెక్కితే, భోజనాలవేళకు వాయిల్తోట చేరుకునేవారు. అక్కడో వారం రోజులు మకాం. అదే విధంగా అక్కడనుండి బయల్దేరి వక్క బంధువుల వూరు. ఇట్లా వరుసగా వళ్ళివేడుదాకా మజిలీలు చేసుకుంటూ వెళ్లేవాళ్ళు. మళ్ళీ తిరుగు ప్రయాణం అలాగే చేసేవాళ్ళు. వెళ్ళిన చోటల్లా కోళ్ళు, పొట్టేళ్ళు వండిపెట్టి, పట్టు బట్టలూ, తలకొక రూపాయి యిచ్చేవాళ్ళు. అన్నీ దండుకొని కట్టమంచి చేరుకువేసరికి పిల్లలకు కొత్త ఉత్సాహం వచ్చేది. బళ్ళు తెరిచేవేళ దగ్గర కావటంచేత పెద్దలకూ ప్రాణాలు తెరిపినపడేవి.

ఈ ప్రమాణాలలో, గుండ్లవల్లిలోని అమ్మాయమ్మ పిల్లలకంటా పెద్ద ఆకర్షణ. కథలు చెప్పటంలో యీమెకున్న వైపుణ్యం, ఆమె తర్వాత మా వంశంలో ఎవరికీ రాలేదని చెప్పవచ్చు.

ఈమె పేరు నరసమ్మ. నరసమ్మ తల్లిదండ్రులు షోళింగూరు నరసింహస్వామి భక్తులు. అంచేత పిల్లలకు వరసగా పెదనరసింహారెడ్డి, చిననరసింహారెడ్డి, నరపమ్మ అని పేర్లు పెట్టుకొని, చిన్నవానికి పేరు తోచకవేమో రామలింగారెడ్డి అని పిలుచుకున్నారు. ఈ నరసమ్మకు ముద్దుపేరు అమ్మాయమ్మ. ఈమె పుట్టిల్లు గుండ్లపల్లి. మెట్టినిల్లు వళ్ళివేడు. కాదాటి వెంకటరెడ్డి పెద్దకుమారుడు అప్పాస్వామిరెడ్డి, యీమె భర్త. దురదృష్టంవల్ల అప్పాస్వామి పసిప్రాయంలోనే పరలోకగతుడయ్యాడు. మొగ్గ వికసించకనే ఎండిపోయినట్లు, ముక్కుపచ్చలారకముండే యీమె బ్రతుకు బండబారిపోయింది. ఆ తర్వాత ఆమె పుట్టిల్లు చేరుకుంది. అవి బాల్యవివాహాల రోజులేగానీ వితంతు పునర్వివాహపు రోజులు కావు. ఆనాడు విధివంచితులైన వారిని చూచి ఆప్తులు జాలివడగలరే గానీ, ఏ విధంగానూ ఆదుకోగలిగిన స్థితిలో లేరు. కానీ జాలిపడిమాత్రం వూరుకోక ఆదుకోవడానికి ప్రయత్నించినవారిలో ఆమె మరిది వళ్ళివేడు కాదాటి నరసింహారెడ్డి ఒకరు. చిత్తూరు జిల్లాలోకెల్లా వీరు ధనికులు. ఆ రోజుల్లోనే రెడ్డి జన సంఘానికి యిరవైవేల రూపాయిలు విరాళమిచ్చి మహాదాతగా ప్రసిద్ధి పొందారు. బర్మా-రంగూన్లతో, మలయా, సిలోను దేశాలతో మామిడిపళ్ళ వ్యాపారం చేసేవారు. విదేశీ యాత్రలో, వికసించిన విజ్ఞానంతోవున్న ఈయనకు వదినగారైన నరసమ్మను చూచినపుడల్లా తీరని దుఃఖం కలిగేది. మనదేశంలోని స్త్రీలు అనుభవిస్తున్న పరిస్థితులకు గుండె రగిలేది. అందుకే ఎవరేమనుకున్నా పరవాలేదని నరసమ్మ సోదరులతోపాటు, తానుకూడా ఆమె దుఃఖాన్ని మరిపింపచేయటానికి కంకణం కట్టుకున్నారు.

కాదాటి నరసింహారెడ్డి నరసమ్మకు పేకాట నేర్పారు కాలక్షేపం కోసం. చిన్నప్పటినుంచీ కళ్ళకు కట్టినట్లు కథలు చెప్పటంలో యీమెకీమె సాటి. రామాయణ భారత భాగవత కథలే కాక విక్రమార్కుని కథలు, కాశీమజిలీలు, అపూర్వచింతామణి పంచతంత్రము, కథాసరిత్సాగరం ఒకటేమిటి ప్రపంచ కథా సాహిత్యమంతా ఆమెకు కంఠస్థమే. వెన్నెలరాత్రులూ, వానలరోజుల్లో పిల్లలేకాక పెద్దలుకూడా ఆమె చెప్పే ఊకుడు కథలు వినడానికి చుట్టూ చేరేవాళ్ళు. కథలు అల్లటం ఒక గొప్ప శక్తి అయితే శ్రోతల్ని కదలనివ్వకుండా కళ్ళకు కట్టినట్లు కథలు చెప్పటం అంతకంటే గొప్ప విద్యకదా!

సాధారణంగా లక్ష్మీసరస్వతులు ఒకచోట చేరవన్నట్లే, అందమూ, తెలివి తేటలు ఒకచోట చేరటం కూడా అసాధారణమే. కాని యీ నరసమ్మకు అమితమైన అందముతోబాటు, అసాధారణమైన తెలివితేటలు. ఆమె గ్రాహకశక్తి, జ్ఞావకశక్తి అందర్నీ అబ్బురపరిచేవి. అందుకే ఆమె సోదరులు, మరిది కాదాటి నరసింహారెడ్డి ఆమెకు చదువు వేర్పటం మొదలెట్టారు. అలాగైనా ఆమె దుఃఖం మరిచిపోగలుగు తుందనుకున్నారు.

'తండ్రి సుబ్రహ్మణ్యరెడ్డి పుణ్యమా అని 13, 14 ఏళ్ళ ప్రాయంలోవే కట్టమంచి రామలింగారెడ్డికి భారత భాగవతాలను అర్థజ్ఞానంతో చదివే నేర్పు పట్టు బడింది. సెలవుల్లో గుండ్లపల్లెకు వెళ్ళినపుడల్లా యీ నరసమ్మ ఆయనచేత భారత భాగవతాలను రాగయుక్తంగా చదివించుకుని ఆనందించేది. దీనిమూలంగా పద్యాల లోని తాళ, లయలు గ్రహించగలిగింది.

"ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్" అన్నమాటలు అక్షరాలా నిరూపించింది నరసమ్మ. చందోవ్యాకరణాది శాస్త్రాలు వేర్వకపోయినా, ఆప్తులు నేర్పిన అక్షర జ్ఞానంతో, లయల వినికిడి జ్ఞానంతో పద్యాలు ఆల్లటం మొదలెట్టిన సహజవిదుషీమణి నరసమ్మ. తన జీవితంలో కలిగిన లోటువలన దుఃఖంతో తన మనసును భక్తివైరాగ్యాలవైపు మళ్ళించి "వరదరాజ శతకాన్ని" రచించింది.

వరదరాజ శతకం ఒక భక్తి శతకము. దీనిలో రచయిత్రి తన హృదయ పరివేదనను వరదరాజస్వామికి నివేదించుకొంది. ఈ వరదరాజస్వామి వళ్ళివేడు గ్రామంలో కాదాటిరెడ్లు కట్టించిన గుళ్ళో వెలిసిన దేవుడు (ఈ కాదాటిరెడ్లు క్రమేణా వంశనామాన్ని వదలి, గ్రామనామంతో వళ్ళివేడురెడ్లుగా వ్యవహరింప బడుతున్నారు)

ఈమె దిక్కులేని తనకు దేవుడేదిక్కని నమ్మి, తన భారాన్నంతటిని వరద రాజస్వామి మీద వేసి "పుడమి శ్రీ వళ్ళివేడు సత్పురనివాస వనిత నరసాంబ(బ్రోవుమా వరదరాజ" అన్న మకుటంతో రచించిన యీ కావ్యాన్ని స్వర్గస్థుడైన తన భర్త అప్పాస్వామికి అంకితం చేశారు. ఈ వరదరాజ శతకం పూర్తిగా సీస పద్యాలతో కూర్చబడింది. భగవంతుని దశావతార వర్ణనలు, నామ సంకీర్తన, ఆత్మ పరివేదన, నివేదనలతోపాటు చాల పద్యాలలో లోకధర్మం, నీతి న్యాయం, స్త్రీలకు

శీల సంరక్షణ ప్రాధాన్యత - మొదలైన వివిధ విషయాలపై పద్యాలున్నాయి. ఈ గ్రంథంలో "వరదరాజ కీర్తనలు", అను పేరుతో కొన్ని పాటలు కూడ చేర్చబడినాయి. ఈ శతకములోని అనేక పద్యాల భావాలు వేమన పద్యాలలో చెప్పబడిన హేతువాద ధోరణి కనుకూలంగా గోచరిస్తున్నాయి. ఈ విషయంలో రామలింగారెడ్డిగారు "రెడ్ల కులంలో పుట్టిన వారికి వేమన యొక్క గాలి కొంతవరకైనా తగులక మానదు కదా" అని వ్యాఖ్యానించారు.

అమ్మాయమ్మ (నరసమ్మ) తన వరదరాజ శతకానికి పీఠిక వ్రాయమని కోరినప్పుడు రామలింగారెడ్డిగారు పరమానంద భరితులయ్యారని చెప్పుట కంటె ఉక్కిరి బిక్కిరి అయ్యారని చెప్పటం సమంజసంగా వుంటుంది. కారణం అమ్మాయమ్మ అనబడే యీ నరసమ్మ దనకు అక్క, ఆత్మబంధువు మాత్రమే కాదు, చిన్ననాడు తనకు కథలు చెప్పి తన జ్ఞాపక శక్తిని, భావనాశక్తిని పెంపొందించిన గురువు. గురువుగారి గ్రంథాలకు శిష్యుడు పీఠికలు వ్రాయడం తన కిచ్చిన మహాభాగ్యంగాను అది ఆమెకు తానిచ్చే గురుదక్షిణగాను తలంచాడు రామలింగారెడ్డిగారు. ఈ పీఠికలో కట్టమంచి వారికి నరసమ్మవట్ల మున్న అప్యాయతే కాక ఆరాధన కూడ స్పష్టమవుతుంది.

వరదరాజ శతక పీఠిక ముగిస్తూ డా॥ రెడ్డిగారు "మా వంశమున కేదివచ్చిన రానిండు. తెలుగుభాష యొకటి మాత్రము అక్షయముగా నిలిచియుండిన చాలును" అన్నారు. ఆయన కోరిక ఫలించుగాక!

★

విజ్ఞత వీడని రసజ్ఞుడు

రామలింగారెడ్డి

డాక్టర్ చలసాని సుబ్బారావు

చదువది ఎంత కల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణసంయుతులెవ్వరు మెచ్చరెచ్చటన్
ఆదనుగ మంచి కూర వలపాకము చేసిన వైన వందు నిం
పొదవెడు నవ్వలేక రుచి వుట్టగ వేర్చునటయ్య భాస్కరా!

భాస్కర శతకారుడవ్వట్లు ఎంతపాండిత్యముతో బిగించిన చదువులు చదివిన బౌద్ధికంగా ఎంత అభివృద్ధిని సాధించినా నహృదయత్వంతో విండిన రసజ్ఞత లోపించి నట్లయితే ఆ చదువులన్నీ నిరర్థకాలేనన్న విషయం విజంగానే గమనించదగింది. హృదయాన్ని నిర్లక్ష్యం చేయని మేధస్సు, మేధస్సును గౌరవించు హృదయం; అలాగే ఆచరణ కందుబాటులోనున్న ఆదర్శం, ఆదర్శాలవనుకరించు ఆచరణ-వీటి మధ్య సమన్వయాన్ని సాధించడమే మన చదువుల చరమాదర్శం. అదే ఎద్యుకేషన్ మానవుని వికికి అంటే మానవత్వానికి సార్థక్యాన్నిస్తుందని నా ప్రగాఢ విశ్వాసం.

విజ్ఞుడు అంటే అధ్యయనం, ఆలోచన, విషయపరిజ్ఞానం గల వండితుడు. ఒక విషయంపై చురుకుగా యోచించి విర్ణయం తీసికొనగలిగిన సామర్థ్యమున్నవాడు మేధావంతుడు. అతను నిర్మాణాత్మకమైన ప్రజ్ఞతో సంఘాభ్యుదయానికి తోడ్పడగల

ధీశాలి (Intelligent). బుద్ధి వైశిష్ట్యం అతని సంపత్తి. అతను కర్తవ్యబుద్ధి (Sense of duty) కిచ్చినంత ప్రాధాన్యం భావవాసిద్ధి (Sense of devotion) కివ్వడు. మేధావంతుని మనోరథాలు (Intentions and emotions), మనోభావాలు (Feelings) బుద్ధిచే నియంత్రితం చేయబడుతూంటాయి. అందువలన మానవీయ సంబంధాలలో మేధావంతుడనబడువాడు సాధారణ మానవుడు లోనయ్యే అనేక బలహీనతలకు లోనుగాడు. కనుకవే ఒక జాతి నిర్మాణంలో మేధావంతుని పాత్ర అతి బలవత్తర మైనది. ప్రపంచములో ఏదేశ చరిత్ర పరిశీలించినా మనకీ సత్యం బోధపడుతుంది.

'రస్యతే ఆస్వాదతే యితి రసః' అస్వాదింపబడేదే రసం. తిన్నగా చెప్పాలంటే రసం (Flavour) అంటే ఆనందం, సహృదయత్వం.అదొక సాహితీ సౌందర్యం. రసజ్ఞుడు అంటే సులభంగా సంవేదనను, సాహానుభూతిని పొందువాడు. రసజ్ఞత (Poetical taste) గలవాడు సాహిత్యానందాన్ని పొందగలిగినవాడు. అతను సౌందర్య ద్రష్ట (Beauty appreciator) అయి వుంటాడు. సౌందర్యం అనేదెందులోవున్నా దృశ్యంలోగాని, శ్రవ్యంలోగాని, వస్తువులోగాని, భావంలోగాని, దాని కాకర్షించ బడతాడు. తన విషయంలోగాని, ఎదుటివారి విషయంలోగాని కష్టసుఖాలకుగాని, లాభ నష్టాలకుగాని, త్వరగా అతని మనస్సు చూరుబలుకుతుంది. వాటి కతడు ప్రభావితుడవుతాడు. సాంఘిక జీవితంలో ఇటువంటి భావుకుడు ఒక పని చేయవలెనని అనుకొన్నప్పుడు తన మనోకామనల (desires)కే ప్రాముఖ్య మిస్తాడు గాని సందేహాత్మకము, వ్యాకరణాత్మకము అయిన బుద్ధి (Ration)కి ప్రాముఖ్య మివ్వడు. కనుకనే కాల్పనికత (Fictitiosity) భావుకత (Sentimentality) ప్రధానంగా కలిగిన సాహిత్య ప్రక్రియలవల్ల ఆయనకు అభిరుచి మెండుగా వుంటుంది. ఈ కారణముగ అటువంటి వ్యక్తి సాహిత్యాభిలాషి (Man of poetic taste) తప్పక అయివుంటాడు. అతనే జీవికాన్ని అధ్యయనం చేసి రచయిత అవుతున్నాడు.

డా॥ కట్టమంచి రామలింగారెడ్డి రసజ్ఞుడైన మేధావి. రసజ్ఞత (Intentional mind) బౌద్ధికత (Intellectual mind) అనేవి రెండు పరస్పర విరుద్ధాశికాలైన ప్రవృత్తులు - తత్వాలు. అయినా కొందరిలో యీ భిన్న తత్వాలు తమ పరిధులలో పరిణత పొందుతూంటాయి. ప్రపంచ ప్రఖ్యాతి నార్జించిన శాస్త్రజ్ఞుడు ఆచార్య ఐన్‌స్టీన్ సంగీత - సాహిత్య శ్రవణాస్వాధికముగ కోరుతూండేవాడు. "ది థ్యోరీ ఆఫ్ ఇవెల్యూషన్" కర్త చార్లెస్ డార్విన్ తన జన్మ దినోత్సవాల సందర్భముగ కవులను, కళాకారులను సన్మానించేవాడట. భారత జాతి రత్న పండిట్ జవహర్లాల్ నెహ్రూ

వీలు దొరికినప్పుడల్లా గ్రంథావ్యయనానికి, గ్రంథ రచనకు పూనుకు వేవాడు. సమయ స్ఫూర్తి, సునిశిత బుద్ధి, పాండితీ గరిమ, పరిణత ప్రజ్ఞ, వరిపాలనాదక్షత మొదలగు వాటిని పూర్తిగ పుణికిపుచ్చుకున్న డా॥ కట్టమంచి రామలింగారెడ్డి గారిలో కూడా సాహిత్యాభిలాష, సాటివారి సమన్యలపట్ల సహానుభూతి, ఔదార్యం (generosity) సమదాదృష్టి, సహనశీలత, వరిహాసవృత్తి (Humoristic mind), భావుకత (Devotional mind) సౌందర్యదృష్టి (aesthetic view), రసజ్ఞత, రచనా సామర్థ్యం కూడ కలిగి వుండడం వలన శ్రీ రెడ్డిగారిని రసజ్ఞుడైన మేధావి అంటున్నారు.

శ్రీ రెడ్డిగారి మాటల ధోరణిలోకాని, రచనాశైలిలోకాని మనకొక ప్రత్యేకత గోచరిస్తుంది. కారణం ఆయన తన అధ్యయనం ద్వారా సాధించిన 'రేషన్' చుట్టూ రసజ్ఞత పరిభ్రమిస్తూ వుంటుంది. మానవునిలో ఔదార్యం వృత్తితో వికసించు ఉదాత్తత (Sublimity) అనేది లేకుండా రసజ్ఞత రాణించదు. అరిస్టాటిల్ తరువాత పాయిటిక్సు రంగంలో అంతటి పేరు ప్రఖ్యాతులార్జించిన లాంగినస్ (Longinus) అను గ్రీకు పండితుడు కావ్యరచనకు కావలసిన ప్రధాన లక్షణం యీ ఉదాత్తత లేక భవ్యత (Sublimity) అన్నాడు. ఆయన సిద్ధాతం ప్రకారం రచయితలోను, పాఠకునిలోకూడ యీ భవ్యత భావావేశం (Ecstasy) ద్వారా పోషించబడుతుంది. దీనివే ఆ గ్రీకు పండితుడు 'Sublimity lies in intensity' అంటున్నాడు. నిజంగా ఒక కవికికాని, రచయితకుగాని, వక్తకుగాని యిదొక ధాతు సంపత్తి అని చెప్పవచ్చు. డా॥ రామలింగారెడ్డి గారికీ సంపత్తి పుష్కలముగ వుంది. ఈ సబ్లిమిటీ అనే దాని ద్వారానే రెడ్డిగారి ఉపన్యాసాలలో, వాగ్ధోరణిలో, రచనలలో హుందాతనం మనోజ్ఞత మార్దవం (Magnanimity, Elegancy, Elevation and Excellence) చక్కగా చోటు చేసికొన్నాయి. సాహిత్యరచనకు మూలమైన ఉదాత్త మనస్తత్వం నిజంగా సంస్కార సంపన్నులైన ఆలోచనావరుల నుండే లోకానికి ప్రసరిస్తూ వుంటుంది. అసాధారణ ప్రజ్ఞాసంపన్నులైన వారి కలం నుండి రూపు దిద్దుకొంటున్న ప్రతి శబ్దం శ్రోతలను, పాఠకులను సంకీర్ణ ఆలోచనా వరిధులనుండి లేవనెత్తి వారికి భవ్యత్వాన్నిస్తుంది.

"Sublimity is the note that rings from a great mind. It is always an eminence and excellence in language and that from this and this alone the greatest writers of prose have attained the first place and have clothed their fame with immortality."

Longinus and Engilish Criticism, Page No. 12.

డాక్టర్ రెడ్డి ప్రజ్ఞగల మేధావంతుడుగా పలువురుకు పరిచితుడు. అలాగే రసజ్ఞుడైన సాహితీవేత్తగా కూడ ఇంటా బయట గణుతికెక్కాడు. ఆయన వ్యక్తిత్వంలో ఆలోచనా పరత్వం (Reflection) ఎంత ఉన్నతమైనదో భావుకత్వం (Sentimentality) కూడ అంత వున్నతమైనది. Intellectual personality తో పాటు Creative personality ని పోషించడం ఆయన శైక్షిక జీవితంలోని విశిష్టతగా గమనిస్తాం. రెడ్డిగారి రసజ్ఞత ప్రధానంగాగల యీ సమ్యక్ సాహిత్య తత్వాన్ని స్పర్శించడమే నా యీ లఘు రచనోద్దేశ్యం.

రసజ్ఞత పుష్కలంగా వుంది :

'Literature Is the thought of thinking souls'- అన్న కార్లాయిల్ సూత్రాధారంగా ఆలోచనా వరుల భావ వరంపర, అనుభవాత్మక సాహిత్య సంపత్తికి మూలమవుతుంటాయి. ఈ రీత్యా కట్టమంచి రామలింగారెడ్డి గణనీయుడైన సాహితీపరుడు. సాహిత్యానికి కావలసిన ముడిసరుకు ఆయనలో పుష్కలంగా వుంది. నిజంగా ఆయన రసజ్ఞుడైన మేధావి. ఆయనలో ప్రజ్ఞ పాండిత్యం కలిసి ప్రకాశించేవి. ఆయన బహు విధ వైదుష్యం కమనీయ కావ్యకళా కాంతులతో రాణించింది. చరిత్ర, రాజనీతి, విద్య-సంస్కృతి, అర్థశాస్త్రం, భాషా సాహిత్యాలు, విమర్శ, వక్తృత్వ కళ, ఎడ్మినిస్ట్రేషన్ మొదలగు వివిధ విషయాలలో రెడ్డిగారికి పాండిత్యంతో పాటు వ్యవహారజ్ఞత కూడ పుష్కలముగ లభించాయి. కనుకవే ఆనాడాయనను బ్రిటిష్ ప్రభుత్వం ''సర్'' బిరుదునిచ్చి సత్కరించింది.

'A powerful man is a powerful thinker' అన్న బొల్షివిక్ సూత్రం ప్రకారం అధికారంతో పాటు ఆత్మవిశ్వాసం బలంగానున్న వాడు బలంగానే ఆలోచించి బలమైన విధానాలకు నాంది పలుకుతాడు. మన రెడ్డిగారిది పవర్‌ఫుల్ వ్యక్తిత్వం, ఏక్టివ్‌మైండ్. మాట్లాడేవ్యక్తి ఆయన ప్రదర్శించు సమయస్ఫూర్తి, ప్రత్యర్థులకిచ్చు సమాధాన వైఖరి అత్యద్భుతమనిపించేవి. ప్రత్యర్థులు తమ వాదాన్ని సైతం విస్మరించి ఈయన మాట్లాడే తీరును గమనిస్తూండేవారట. ఆనాడు మద్రాసు అసెంబ్లీలో ఆంధ్రుల ప్రత్యేక రాష్ట్ర వాంఛను ప్రకటించడంలో ఈయన ప్రదర్శించిన భావ-భాషా నైపుణ్యం అనితరసాధ్యమని ప్రసిద్ధి మిగిలింది. ఆరోజులలో రాజకీయ దురంధరుడైన రాజాజీ సైతం నిరుత్తరుడైన ఘట్టాలెన్నో వున్నాయని ఈయన

సమకాలికులు అంటూ వుంటారు. ఆంధ్రరాష్ట్రోద్యమం ఆరంభమైన కొలది కాలానికే ఆంధ్రుల కొక ప్రత్యేక విశ్వవిద్యాలయ మేర్పడినదంటే అది యీ ఉత్సాహవంతుడైన ఉపాధ్యాయ మేధావి కృషి ఫలితమే.

Poetry is the art of uniting pleasure with truth by calling imagination to the help of reason. అన్నాడు డాక్టర్ జాన్సన్. నిజంగా కవిత్వ మనేది ఒక కళ. ఆ కళలో వాస్తవికత, ప్రసన్నత అనేవి రెండు ఒకదాని సరనన మరొకటిచేరి ప్రయోజనాన్ని సమకూరుస్తూంటాయి. ఆ కళలో మానవుని బుద్ధి రాణించేందుకు కల్పన సహాయ పడుతూంటుంది. ఈ జాన్సన్ అభిప్రాయం డా॥ కట్టమంచి రామలింగారెడ్డిగారి సాహిత్య సాధనలో మనకు తరచుగా సాక్షాత్కరిస్తుంది. డా॥ రెడ్డి సరసుడు, పాహితీపరుడు. కలం ద్వారా కార్యాన్ని సాధించవచ్చునవే నమ్మక మున్నవాడు. ముందు చూపుగల యోచనావరుడు. ఆయనలో Industrious personality కంటే Intellectual personality అధికంగా రాణించిందేమోనని పిస్తుంది. కావ్యాసక్తి, సాహితీ ప్రియత్వం, కళాప్రేమ, రచనాభిలాష అనేవి అయనలో విద్యార్థి దశలోనే ప్రేళ్ళూనాయి. తన 15 వ ఏటనుండి చెదురు మదురుగా కవితలల్లడం ప్రారంభించి తన 19 వ ఏట మద్రాసు క్రైస్తవ కళాశాలలో విద్యార్థిగా నున్నప్పుడే "ముసలమ్మ మరణం" అను 22 పేజీల ఖండకావ్యాన్ని ప్రాసి పండితులనుండి ప్రశంసలనందుకొన్నాడు. కథావస్తువులో కొంతవరకు సాధారణీకరణ (Generalisation) లోపించినా రస పోషణ, భావసిద్ధి, కావ్యరీతి, సంవేశాత్మకత, కళాత్మకత రీత్యా 'ముసలమ్మ మరణం' ఉత్తమ లఘు కావ్యంగా పింగళి లక్ష్మీకాంతం వంటి ఆనాటి ఆచార్యుల మన్ననల నందుకొంది. కావ్యంలో గ్రామీణ వాతావరణం, గ్రామీణుల మనస్తత్వాలు రసవత్తరముగ చిత్రించబడినాయి. పాత్ర చిత్రణలోను కథలో స్త్రీకి ప్రాధాన్య మివ్వడంలోను, కావ్యంలో శృంగారానికి కాక కరుణరసానికి ప్రాముఖ్య మివ్వడంలోను, దుఃఖాంత కావ్యంగా కథను మలచడంలోను శ్రీ రెడ్డి తన ప్రజ్ఞను ప్రదర్శించాడు. దుఃఖాంత కావ్యం (Tragedy) కనుక అది ఆనాటికి తెలుగు సాహిత్యంలోనే సరిక్రొత్త తీరును ప్రతిపాదించినదని చెప్పాలి. తెలుగు నాటక రంగానికి సంబంధించినంతవరకు యీ ప్రక్రియను చేపట్టిన ప్రముఖుడు 'ఆంధ్ర నాటక పితామహ' శ్రీ ధర్మవరం కృష్ణమాచార్యులుగారని చెపుకారు. ఆయన తన "విషాద సారంగధర", "చిత్రనళీయం" వంటి 30 నాటకాలు పాశ్చాత్య సిద్ధాంతాల నాధారముగ ట్రాజిడీలుగా రూపొందించాడు. పోతే ఆధునిక

తెలుగు కావ్యరచనకు సంబంధించినంత వరకు 'ముసలమ్మ మరణం' కావ్యం చిన్నదైనా విషాదాంతముగ మలచబడింది. ఈ విషాదాంత కావ్య రచనా ప్రక్రియను చేవట్టి శ్రీ రెడ్డి ఆధునిక తెలుగు కావ్య రచనలో నూతన మార్పు నొకదానిని ప్రవేశ పెట్టాడు. "ముసలమ్మ మరణం"లో రచయిత కథానాయిక ముసలమ్మ మనోభావాలను చిత్రించడంలో ఎంతో రసజ్ఞత, సుకుమార భావసంపద, శిల్ప విన్యాసం ప్రదర్శిం చాడని చెప్పవచ్చు.

కావ్యంలో బింబ విధానం :

కావ్య వస్తువు సామాన్య తర్కాల కతీతమైన ప్రత్యేక విలువలను కలిగి వుంటుంది. అది శ్రోతల మనఃచక్షువుల ముందొక దృశ్యాన్నో లేక వస్తువునో లేక వ్యక్తినో ప్రత్యక్షం చేస్తుంది గాని ఒక జాతినికాదు. అయితే ఆ వ్యక్తి ఒక జాతికి ప్రాతినిధ్యం వహించవచ్చు. అనేక మంది వ్యక్తుల స్వరూప - స్వభావాలను పరిశీలించి ఒక వర్గాన్నో, ఒక జాతినో స్థిరపర్చడం, అనేక సంఘటనలను వాటి పూర్వాపరాలతో సహా పరిశీలించి ఒక సిద్ధాంతాన్ని నిరూపించడం అనేది సాధారణముగ సంశయాత్మక మైన శాస్త్ర విజ్ఞానం (Logical Science) చేయవలసిన పని. అది నిశ్చయాల నందించగల బౌద్ధిక రంగానికి జెందిన విషయం. రసాను ప్రాణితమైన కావ్యం కల్పన ద్వారా భావానుభూతుల కొక మూర్తరూపాన్నివ్వడం పాఠకుని మనోవేత్రాల కొరకొక ప్రయోజనాత్మకమైన బింబాన్ని (Image) సృజించడం మాత్రం చేస్తుంది. కాని పాఠకునికి బౌద్ధికమైన ఆలోచనల (Conecpts) ను సరఫరా చేయదు. అలా బింబ ప్రేషణా సామర్థ్యం ద్వారా కావ్యం మనకొక సిద్ధాంత జ్ఞానాన్ని కాక ఒక అనుభూత్యాత్మక జ్ఞానా (Intuitive knowiedge) న్నంద జేస్తుంది. అభివ్యంజనా వాద (Expressionism) ప్రవక్త క్రోసే పండితుడు రసాత్మక వాక్యానికున్న సహజ తర్కాన్ని తులనాత్మక పద్ధతిలో బోధపరిచాడు.

"Intuitive knowledge, knowledge obtained through the imagination, knowledge of the individual or individual things. Logical knowledge, knowledge obtained through the intellect, knowledge of the universe knowledge of the relation between individual things." (Aesthetic)
ఈ విధంగా ఆయన రసజ్ఞత (Intuition) బౌద్ధికత (Intellect) లకున్న పార్థక్యాన్ని స్పష్టపరిచాడు. డా॥ రెడ్డి తన "ముసలమ్మ మరణం" అను కావ్యంలో ఇమేజరీ అనుదానిని సమర్థవంతముగ చిత్రించ గలిగాడు. అనంతపురం సమీపంలోని

బుక్కరాయ సముద్రమనే కుగ్రామ వరిసరాల యందున్న "ముసలమ్మ కట్ట" అను పేరుగల చెరువు కట్ట నిర్మాణ చరిత్ర యీ కావ్యానికి కథా వస్తువు. ఈ కావ్యం ద్వారా డా॥ రెడ్డి అచ్చటి ప్రాంతీయుల చరిత్రను, సంస్కృతివే కాక సేవ, త్యాగం బలిదానం, ఆత్మార్పణం అను మహత్తర మానవీ లక్షణాలుగల ఒక స్త్రీ మూర్తిని కళాత్మకముగా ప్రత్యక్షం చేసి ప్రదర్శించాడు. అంటే రసధాయకత్వం, భావ ప్రవేశ ణీయతగల ఉత్తమ కావ్యాన్ని కుండవలసిన "భావ బింబీకరణం" (Imageablization) ఆవేదీ కావ్యంలో చక్కగా అమర్చబడింది.

క్రోధం వల్ల మనిషి వివేకాన్ని కోల్పోతాడు; నీవు తీసికొన్న గొతిలో నీవే పడతావు; సంఘ ద్రోహి నరకానికి పోతాడు; పరుల కొరకు ప్రాణాలర్పించువాడు మోక్షానికర్హుడు - ఇటువంటి సూక్తి వాక్యాలు కావ్యాలు కావు. ఈ వాక్యాలు చెపుతున్న అర్థాన్ని - సందేశాన్ని పాఠకుడు లేక శ్రోత నిర్విశేషమైన శుద్ధ - ముక్త హృదయం (Impersonality & detachment) తో స్వీకరించి తదనుకూలమైన భావ బింబ గ్రహణం చేయగలిగేట్లుగా చిత్రించాలి, శబ్ద చిత్రాలు ప్రవేశ పెట్టాలి. అప్పుడే ఆ సందేశం కావ్యమవుతుంది. 'ముసలమ్మ మరణం'లో శ్రీ రెడ్డి యీ ప్రక్రియవే చేవట్టి విభిన్న పరిస్థితులనుండి, భావాలనుండి సౌందర్యాన్ని సాక్షాత్కరింప జేశాడు. ఇటువంటి కావ్యాన్ని మనం రసప్రధాన కావ్యం (Intuitional poetry) అంటున్నాం. పాశ్చత్య పండితుడైన థియొడర్ వాట్స్‌డంటన్ యిటువంటి రచనను శ్రోతల హృదయాలలో భావ స్పందన కలిగించి వారి అత్మబలాన్ని పదిలపర్చగల శక్తి కావ్యం (Energetical poetry) గా ఎర్రించాడు. కనుకనే రసజ్ఞుడైన రెడ్డిగారి ముసలమ్మ మరణం యీ శ్రేణికి చెందిన లఘు 'శక్తికావ్యం'గా వరిగణింవబడుతుంది.

'ముసలమ్మ మరణం' కాక శ్రీ రెడ్డి అనేక సందర్భాలలో ఆవేక విధాలుగా వద్య రచన సాగించాడు. ఏదో సంఘటనకు ప్రభావితుడై ఛందోబద్ధమైన పొయిట్రీ వ్రాస్తూ వచ్చాడు. ప్రతి పద్యంలోను రెడ్డిగారి రసజ్ఞత స్ఫురింవజేయు భావనాత్మక మైన రచనా కౌశలం, చమత్కార ధోరణి, లక్ష్యశుద్ధి ప్రస్ఫుటితమైనాయి. 'భారత ప్రశంస', 'అంవకాలు' 'నవయామిని' మొదలగు ఆయన రచించిన కావ్య ఖండికలీ విషయంలో చెప్పుకొనదగినవి. "నవయామిని"లో భిల్లాణుడు యామినీ కుమారికి తనమనోరథాన్ని తెలుపు యీ వద్యం రెడ్డిగారి కావ్యరచనా కౌశలాన్ని రసౌచిత్యాన్ని తెలుపుతూంది.

"సరస మధుర చమత్కార సౌమనస్య
భాసురములే భవద్రమ్య భాషణములు
మనసు రంజిల్ల జేయగా మమత పుట్టి
యెదుగుచున్నది; మితిలేద! యేమి సేతు!"

అధ్యయన శీలుడు :

Poetry is an interpretation of life though imagination and emotion కవిత్వం ఇమేజినేషన్ ద్వారా, ఇమొషన్‌ద్వారా మన జీవితాన్ని వ్యాఖ్యానిస్తుంటుందని హడ్సన్ పండితుని అభిప్రాయం. ఈ రీత్యా డా॥ రామలింగారెడ్డి కలానికున్న బాధ్యత గమనించదగినదే. శ్రీ రెడ్డి పరిశీలనాత్మక ప్రజ్ఞగల సాహితీపరుడు. ఆయన మాటలలో, చేలతలో, రచనలలో విమర్శ - విశ్లేషణ, ఇమొషన్ - ఇమేజివేషన్ అనేవి సమపాళ్ళలో చోటు చేసుకొన్నాయి. రెండు భాషల్లో - ఆంధ్ర ఆంగ్లేయులలో రసజ్ఞ రచన చేయగల సమర్థుడు, చక్కటి రచయిత. ఈ శతాబ్దపు ప్రథమ దశకంలో ఆయనకు ఇంగ్లండు ప్రజా జీవితంతో పరిచయం కలిగింది. అది ఆయన కధ్యయన కాలం. 1903 నుండి 1908 వరకు శ్రీ రెడ్డి ఇంగ్లండు తదితర ఐరోపా దేశాల లోని రాజకీయ, సాంఘిక ఉద్యమాలతో పాటు అచ్చటి సాహిత్య వ్యాసంగరీతులను కూడ క్షుణ్ణంగా పరిశీలించాడు, అవగాహన చేసుకున్నాడు. కవి హృదయం, కవి సంస్కారం అవేవి ఆయనకు బాల్యం నుండీ అలవడివున్నా సాహితీ రచనలోగాని, తత్సంబంధించిన ఊహలలోగాని ఔన్నత్యాన్ని సాధించి దాన్ని తన దేశీయుల ప్రయోజనాల కనుగుణంగా వినియోగించబూనుకొన్నది. ఆ తరువాతవే అందు కాయనకు ఇంగ్లండు జీవితం తగినంత ప్రేరణనందించింది స్వతః జన్మతోనే. సంతరించుకొన్న విలక్షణ ధైర్య - స్థైర్యాలు, విజిగీష అనేవి ఆ పాశ్చత్య సంస్కృతీ సంపర్కంతో మరింత బలపడి సాహితీ రంగంలో కూడ సుపీరియారిటీ కాంప్లెక్సుతో కృషి చేసేందుకు దోహదమిచ్చాయి.

ఇంగ్లండులో శ్రీ రెడ్డిగారికి ఆనాటి ప్రసిద్ధ రచయితలైన జాన్ గాల్స్‌వర్దీ, జి. కె. చెష్టర్‌టన్, వాల్టర్‌పెటర్, డి. హెచ్. లారెన్సు, జేమ్సు జ్వాయస్, ఏట్సు లిటర్‌స్ట్రాచీలతో స్నేహ సంబధాలేర్పడడం చెప్పుకొనదగిన విషయం. కేంబ్రిడ్జి, బెడ్‌పోర్డు, సాఫ్రాస్, బకింగ్‌హాం, లండన్ నగరాలలో వారిని తరచు కలుసుకొని శ్రీ రెడ్డి సాహిత్య విషయాలను, స్వదేశ విశేషాలను చర్చిస్తూండేవాడు. వైవారిలో

అందరు రెడ్డిగారికి సమవయస్కులైనా జాన్‌గాల్స్‌వర్దీ మాత్రం 13 సంవత్సరాలు పెద్ద. ఆయనను పెద్దగానే రెడ్డిగారు గౌరవించేవాడు. ఆయన నాటకాల నెంతో అభిమానిస్తూ ఆయన చేపట్టిన సాహిత్య మార్గంలో తానుకూడ నాటకాలు వ్రాయ వలెనని యత్నించడం కూడ జరిగిందట. గార్స్‌వర్దితోపాటు జాన్‌డ్రైడన్, జాన్‌సన్, కాల్‌రిజ్, జాన్‌రస్కిన్, మెథ్యూఆర్నాల్డు, థామస్‌మెకాలే, కిప్లింగ్, హెచ్. జి. వేల్సు ఎమ్. ఫాషర్ట్ మొదలగు ఆనాటి ప్రముఖ ఆంగ్ల సాహిత్య వేత్తలు శ్రీ రెడ్డిగారికి అభిమాన రచయితలని చెప్పవచ్చు. బర్ట్రాండ్ రస్సెల్, లిటన్‌స్ట్రాచీ, క్లైవ్‌బెల్ వంటి మేధావులు ఈయనకు సహాధ్యాయులు. మెకాలే రచించిన Past and Present; కాల్‌రిజ్ రచించిన 'Biographia literaria;బాస్వల్ జాన్సన్ రచించిన Life of Jhonson' హెచ్. జి. వేల్సు వ్రాసిన 'The invisible man, The Time Machine A modren utopia'; కిప్లింగ్ వ్రాసిన 'The light that failed' అను ఆంగ్ల గ్రంథాలు రెడ్డిగారి ఆలోచనలకు స్ఫూర్తినిచ్చాయి. ఈ సందర్భంలో శ్రీ రెడ్డి మరింత అభిమానించిన గ్రంథం డా॥ జాన్సన్ రచించిన The Journey to the western island of Scotland అని చెప్పుకొంటారు. భారతీయ జీవితాన్నభిమానిస్తూ ఫాష్టర్ (ఎమ్. ఫాష్టర్) వ్రాసిన 'A passage to India'; మానవీయ విలువలపై డి. హెచ్ లారెన్సు రచించిన 'Woman in love' హెచ్. జి. వేల్సు వైజ్ఞానిక ప్రయోగాలపై రూపొందించిన 'The first man in the moon' అను ఆంగ్ల గ్రంథాలు శ్రీ రెడ్డి నారోజుల్లో విశేషముగ ఆకట్టుకొన్నాయి. ఇంత విశదముగ జిజ్ఞాసతో ఆంగ్ల సాహిత్యాన్నధ్యయనం చేసి అందలి తత్వాల నర్థంచేసుకున్నవాడు కనుకనే ఆయన ఆంగ్లోపన్యాసాలు పాశ్చాత్య దేశాలలో సైతం విశేష మన్ననలు పొందాయి.

There is no true orator who is not a hero - ఎమర్సన్ మహాశయుడన్నట్లు సాహసం, చిత్తస్థైర్యం లోపించిన వాడెవ్వడూ వక్తగా రాణించలేడు. వీరత్వం (Heroic tendency) లేనిదే వక్తృత్వం (Oration) సిద్ధించదు. అలాగే రసజ్ఞత లోపిస్తే వీరత్వం రాణించదు. నిజంగా మహావక్తలు అనబడే పెద్దల ఉపన్యాసాల (Eloquent speaches)లో యీ రెండు తత్వాల మిశ్రమ రసాయన ముంటుంది. ఈ రసాయనం డా॥ రెడ్డిగారి వ్యక్తిత్వంలో సార్థక్యాన్ని పొందినదని చెప్పవచ్చు. రెడ్డిగారి ఉపన్యాసాలలో భాషా పాటవం, పాండిత్య గరిమ, వక్రోక్తి వైభవం, వ్యంగ్యాత్మకత అనేవి పండితులతో పాటు పామరులను సైతం ఆకట్టుకొనడం

ఇతరిక్రా అరుదైన విషయమనే చెప్పాలి. మనం చెప్పుకొనే రసజ్ఞత అవేని ఆయన ఉపన్యాసాలలో అడుగడుగున దొర్లుతూండేది. తెలుగు భాషలోగాని, ముఖ్యంగా ఇంగ్లీషు భాషలోగాని ఆయన చేసిన ప్రసంగాలన్నీ నిజంగా సాహితీమర్మజ్ఞతను సంతరించుకొని సాహిత్యాకాశంలో మణి తారలుగా వెలుగొందగలవమటలో అతిశయోక్తి లేదనుకొంటాను.

'The beautiful words are, in a real and special sense, the light of the thought', ఇది కళా ప్రక్రియకు వర్తించు సత్యం. వక్తృత్వం అనేది నిజంగా ఒక కళ. దాన్ని కళగా ఆరాధించువాడే వక్త. రెడ్డిగారు గొప్ప వక్త. వక్తగా రాణించాలంటే వ్యక్తికి కావలసిన ధీటైన విగ్రహం. ఘాటైన గొంతు, నీటైన భాష, పటువైన భావం ఆయనకున్నాయి. వీటితోపాటు పరిసరాలవల్ల ప్రతిపాద్యాలవల్ల విచక్షణ - వివేకం కోల్పోని అలక్ష్యవైఖరి, అహమ్మతి (Arrogance) అనేవి కూడ ఆయనలో వదిలపడినాయి.

నిజంగా సభ్యత ముసుగుతో నుండు సంకోచంగాని, వినయ విధేయతలు (Modesties) గాని అధికముగా చోటుచేసికొన్న మానవుని మనస్సు కళారంగములో కొంత క్షమతను కోల్పోతుంది. తాను భావించిన ప్రతిభావంలోను, తాను మాట్లాడిన ప్రతి మాటలోను అతనికేదో అల్పజ్ఞత స్ఫురించి ఆ సంకోచం వల్ల మానసిక శైథిల్యానికి లోనైన పక్షంలో అతని ఉపన్యాసం శ్రోతల మెప్పును పొందలేదు. దానిలో ఎలొక్వెన్సు అవేది రాదు. ఇన్ని వున్నా వక్తగా వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవాలంటే మరొక ప్రధాన లక్షణం అవసరమవుతుంది. అది ధారణామూలకమైన వున్నత భావాలతో పాటు రసాత్మకమైన భావోద్విగ్నత (Conceptional Ecstasy). దీనివల్ల వక్త అభిప్రాయాలను ప్రకాశింప జేసేందుకువయుక్తమైన పదజాలం (Diction) సిద్ధిస్తుంది. రామలింగా రెడ్డిగారి వాగ్ధోరణిలో అటువంటి పదజాలం యిమిడివుంటుంది కనుకనే ఆయనను మనం 'ఎలొక్వెంట్ స్పీకర్'గా గుర్తిస్తున్నాం. ఆయనలో వక్తృత్వ సిద్ధికి పటుత్వాన్నివ్వగల భావోద్విగ్నత లేక భావోద్వేగం బాగానే వుంది. ఆయన విద్యా విషయక సభలలో మాట్లాడినా, ప్రశాసనా పరిషత్తులలో మాట్లాడినా, సాంస్కృతిక పదస్సులలో మాట్లాడినా ఆ వాక్సరిలో భావోద్వేగంతోపాటు వున్నతమైన అభిప్రాయాలు (High conceptions) ఉదాత్తమైన పటిణత పదజాలం (Noble phraseology) పదచయన - పొందికలు (Choice and fitness of words), విషయ

ప్రతిపాదనలో హుందాతనం (Dignified composition) శైలిలో ఉత్తమత (Elevation of style), అందమైన అభివ్యక్తి (Excellent expression) అనేవి కూడ గోచరిస్తాయి. ఇదే రెడ్డిగారి సాహితీ సంపత్తి. ఇదే సంపత్తి రెడ్డిగారిని ఎలొక్వెంటు స్పీకరుగా తీర్చి దిద్దింది.

ఆంగ్లంలో వ్యాస చిత్రాలు :

రెడ్డిగారి రసజ్ఞత (Intuitive mind) ఉపన్యాసాలలోనే కాక ఆయన ఆంగ్ల రచనల్లో కూడ పుష్కలముగ గోచరిస్తుంది.ఆంగ్లంలో ఆయన రాజారామమోహనరాయి రామకృష్ణపరమహంస, స్వామి వివేకానంద, గోపాలకృష్ణ గోఖలే, అనిబిసెంటు, అరవింద, రవీంద్రనాథఠాగూరు, మహాత్మాగాంధీ, జవహర్లాల్‌నెహ్రూ, మానవేంద్ర నరేంద్రరాయి వంటి మహా మహుల జీవితాలలో ప్రస్ఫుటితమైన మహోన్నతా దార్శలను సమగ్రంగా కాకపోయినా, తాననుకొన్నవాటిని మాత్రం హేతు బద్ధంగా చిత్రించి లోకోపకారం చేశాడు. వారు స్వజాతికి, మానవ జాతికి చేసిన త్యాగ నిరతిగల సేవలనుటంకిస్తూ శ్రీ రెడ్డి ప్రస్తుత తరం వారికి సేవానురక్తిని, కష్ట సహిష్ణుతను, ఔదార్య సంపదను అలవరచుకొనవలసినదిగా సందేశాన్నందజేశాడు. ఆయన రచించిన ప్రతి వ్యాసం ఒక పరిచయ చిత్రం (Introductory portrait) గా పరిగణింపవచ్చు. ఆ ప్రతి చిత్రంలోను ఆ కథానాయకునితో పాటు అనేకమంది విశేషజ్ఞులైన పెద్దలు పరిచయం చేయబడినారు. చరిత్రకు సంబంధించిన అనేక సంఘటనలు ప్రవేశపెట్టబడినాయి. ఉదాహరణకు 'గోఖలే' వ్యాసంలో సురేంద్ర నాథ బెనర్జీ, దాదాభాయి నౌరోజీ, గోవిందరానడే, ఫిరోజిషామెహతా వంటి ఉద్దండ దేశ నాయకులు పరిచయం చేయబడినారు. "ఎం. ఎన్. రాయి" చిత్రంలో లెనిన్, ట్రాట్‌స్కీ, స్టాలిన్, డోరియట్, బ్రాండ్లర్ స్నిపిలిష్టు, బ్రూక్‌వే వంటి ప్రముఖ, ప్రపంచ విప్లవ నాయకులు, రస్సెల్, వైట్‌హెడ్, ఎడింగ్టన్, ఇన్‌స్టీన్, డిబ్రోగ్లీ వంటి తాత్వికులు; గాల్స్‌వర్దీ, హార్డీ, సిన్‌క్లాయర్, పెరల్‌బక్ వంటి అనేక సాహితీపరులు కూడ ప్రవేశం పొందారు. ఇలా ప్రతి స్యాస-చిత్రం తత్కాలీన సామాజిక, రాజకీయ పట్టాలతో నిండి పాఠకుల మనస్సుల నాకట్టుకొంటూంట. రెడ్డిగారి విషయ విజ్ఞతతో పాటు విలక్షణమైన రసజ్ఞత కూడ ఆవ్యాసాలలో పూర్తిగా గాణించిందని చెప్పవచ్చు.

ఇవి గాక యోగివేమన్న, వీరేశలింగం పంతులుగార్ల విశిష్ట వ్యక్తిత్వాలను గురించిన ఆంగ్ల వ్యాసాలు రెడ్డిగారి మతాతీతమైన మానవీయ దృక్పథాన్ని, సర్వ

జన సుఖమూలకమైన సాంఘిక సంస్కరణాభిలాషను తెలియజెపుతున్నాయి. వేమన్నను గురించి బ్రాస్తూ కులమతాల ప్రసక్తి విషయంలో 'Vemana is the poetic anticipation of Ramakrishna' అని చెప్పి పాఠకులను రామకృష్ణ పరమహంసతో వేమన్నను పోల్చుకొంటూ అధ్యయనం చేసేందుకు ప్రోత్సాహించాడు. ఇది జీవితం వట్ల రెడ్డిగారి అభ్యుదయ దృక్పథాన్ని తెలియజెపుతూంది. వేమన పద్యాలలోని నిజాయితీతో కూడిన విప్లవాత్మక ధోరణులీయన నెంత ఆకట్టుకొన్నాయంటే ఆయనపై ఈయనెన్నో వ్యాసాలు ఆంగ్లంలో రచించాడు. రచించడమే కాదు, ఆయన విధానాలకు, అభిప్రాయాలకు వమ్మకాలకు సంబంధించిన కొన్ని ఉద్యమాలకు ప్రవర్తకుడైనాడు. అందుకే ఈయన "మస్తిష్కం మరువని సాహితీపరుడు" "విజ్ఞత వీడని రసజ్ఞుడు" అంటువ్వాను.

"సంస్కార విష వృక్షస్య ద్వైఫలే అమృతోపమే
కావ్యామృత రసాస్వాదః సంగమ స్సజ్జనైసః"

అన్నాడు అనుభవజ్ఞుడైన శాస్త్రకారుడు. ఈ సృష్టి వికాస క్రమంలో రెండే రెండు చేతనా తత్వాలు పనిచేస్తుంటాయి. అవి ఒకటి తర్కం (Logic) రెండు విశ్వాసం (Faith). తర్కాన్ని ప్రతిపాదిస్తున్న బుద్ధి ఎంతగా బలపడినా మానవుని మనుగడ కొరకు విశ్వాసాన్ని సృజిస్తున్న హృదయం మాత్రం దానికి సహకరించడమవనరం. ఈ సంసారికి సమస్యల సంరంభం మధ్య మనకుండవలసిన సదవగాహన, సహానుభూతి, సహనశీలత, సహజత్వం అనేవి యీ హృదయ తత్వానికి మారుపాలే. కనుకనే మనకు శాస్త్రాలతో పాటు కళలు కూడ అవసరమవుతున్నాయి. ఈసత్యాన్ని గమనించిన శ్రీ రెడ్డి తన రసజ్ఞ హృదయాన్ని, కళాభిరుచిని హేతుమూలకమైన వైజ్ఞానిక దృక్పథాని కనుగుణంగా మలచి మాన్యుడైనాడు.

'ఓం సర్వేషాం సుజ్ఞాన - సుస్వభావ సిద్ధిర్భవతు'

రెడ్డిగారి ఆంగ్ల రచనా వైదుష్యం

డాక్టర్ సూర్యదేవర సంజీవదేవ్

కొందరు జీవించివుండగనే వారికి కీర్తి లభిస్తుంది. కాని కొందరు కీర్తిశేషులైతేనేకాని వారికి కీర్తి లభించదు. కొందరికి జీవించి వుండగాను కీర్తి లభిస్తుంది, మరణించిన తరువాతను కీర్తి లభిస్తుంది. ఇక నాలుగో వారుంటారు- వారికి జీవించి వుండగను కీర్తి లభించదు, మరణించిన తరువాతను కీర్తి లభించదు; ప్రజల్లో వీరిదే బాహుళ్యం.

డా॥ కట్టమంచి రామలింగారెడ్డికి జీవించి వుండగాను ఖ్యాతి లభించింది, మరణించిన తరువాతను ఖ్యాతి లభించింది. ఖ్యాతి జనించటం మాత్రమే గొప్ప మానవుణ్ణి కొలిచే కొలతబద్ద కాదు. గొప్పతనం లేనివారు కూడ అనేక ఉపాయాలతో ఖ్యాతిని ఆర్జించినవారు అనేక మంది వున్నారు. అందుకే ఖ్యాతిని రెండు విధాలుగా విభజించవచ్చు. మిథ్యాఖ్యాతి అని యథార్థఖ్యాతి అని. అనర్హులకు లభించే ఖ్యాతి మిథ్యాఖ్యాతి, అర్హులకు యథార్థఖ్యాతి.

డా॥ రామలింగారెడ్డిది యథార్థఖ్యాతి. ఆయనలోని అర్హతలు అనేకం. జీవితానికి సంబంధించిన వివిధరంగాల్లో ప్రత్యేకించి సాంస్కృతిక రంగాల్లో ఆయన ప్రతిభలు దీప్తివంతాలు. అందులో సాహిత్యరంగంలో ఆయన ప్రవీణుడు. ఆయన నిపుణ సాహితీసమీక్షకుడు, గొప్ప విద్వాంసుడు, ఉన్నతస్థాయికి చెందిన వక్త.

ఆయన వివిధ విషయాలమీద అసంఖ్యాక వ్యాసాలు, ఉపన్యాసాలుచేశాడు. వాటిలో చాలా భాగం అముద్రితాలుగా నిలచిపోయివాయి. రామలింగారెడ్డి శతవార్షికోత్సవ సందర్భముగ ఆయన రచన లన్నిటిని ప్రచురించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీ ఆవుల సాంబశివరావు అధ్యక్షత క్రింద ఒక ప్రచురణ సంస్థ ఏర్పడింది.

డా॥ రామలింగారెడ్డి రచించినట్టి, ప్రసంగించినట్టి పదహేనుమంది గొప్ప వ్యక్తుల జీవితాలను "Some Great Lives" Vol.I అనే శీర్షికతో Selected Writings of C R Reddy అనే గ్రంథమాల క్రింద ప్రచురించారు. ఇందులో ప్రచురించబడిన పదిహేను జీవితాలు; వేమన, రాజారామమోహనరాయ్, రామకృష్ణ పరమహంస, వివేకానంద, వీరేశలింగం, గోఖలే, అనిబిసెంట్, కృష్ణరాజవడయార్ టాగోర్, గాంధీ, శ్రీ అరవిందో, జవహర్‌లాల్ నెహ్రూ, ఎం. ఎన్. రాయ్, ఒమాండూర్ పెదరామస్వామిరెడ్డి, ఫాదర్‌కార్బీ. ఇవికాక నాటి మైసూర్ దివాన్ వి. పి. మాధవరావు వివేకానందమీద చేసిన ప్రసంగం, రామలింగారెడ్డి గోఖలేకు వ్రాసిన కొన్ని ఉత్తరాలు వున్నాయి యిందులో.

రామలింగారెడ్డి తెలుగులో, ఇంగ్లీషులోకూడ గొప్ప రచయిత, గొప్ప వక్త. తెలుగులోకంటే ఇంగ్లీషులో ఆయన ప్రతిభ విశిష్టంగా వుంటుంది. వున్నతమైన భావాలు, సుందరమైన, స్ఫుటమైన భాష. అవసరంలేని పదం ఒకటీ వుండదు. ఆయన ఇంగ్లీషు రచనలో నుడికారం దాని విలువను కలిగివున్నది భావాభివ్యక్తి నిర్దుష్టముగ ప్రస్ఫుటముగ ప్రత్యక్షమవుతుంది. తేలిక భావాభివ్యక్తికి బరువుపదాలు వాడితే ఎంత అవకతవకగా వుంటుందో గంభీరభావాభివ్యక్తికి తేలికపదాలను వాడినా ఆవిధంగానే వుంటుంది.

ఈ పుస్తకం వేమనతో ప్రారంభమవుతుంది. వేమన జీవితం మీద, వేమన రచనలమీద రామలింగారెడ్డికి అమిత అభిమానము. వేమనను గురించిన వ్యాసాన్ని ఆంధ్రదేశాన్ని పశ్చిమభాగముగా పూర్వ భాగముగ విభజనచేసి ప్రారంభిస్తారు. వేమన పశ్చిమాంధ్రుకు చెందినవాడని, ఆ పార్వత్యభాగము, కోస్తాభాగమంత సులభముగ ఉత్తరం నుండి వచ్చే దండయాత్రలకు అందుబాటులో లేనందువల్ల ఆ భాగము తన స్వతంత్రతను ఆర్యుల ప్రభావము నుండి కాపాడుకొన్నదనీ, సంస్కృత సాహిత్య

స్పర్శ కోస్తాప్రాంతాన్ని తాకినంతగా యీ పశ్చిమ ప్రాంతాన్ని తాకలేదనీ, అందువల్ల పశ్చిమ తెలుగు సాహిత్యములో కోస్తా ప్రాంతంలోవలె అనువాదకాలు కాక మౌలిక రచనలే ఎక్కువ అని గ్రంథకర్త వచిస్తాడు.

వేమన గొప్పతనం విషయములో భౌగోళిక విశిష్టత ప్రధానమంటూ ఆ విషయంమీద ఆయన ఎక్కువ నొక్కిచెపుతారు. అంటే సర్కార్ జిల్లాలకంటే రాయలసీమ జిల్లాలు బీదతనములో వున్నాయనీ, రాగులు, జొన్నలు మాత్రమే ఆ ప్రాంతీయుల ఆహారమనీ, నదులు వడమట మండి తూర్పుకు ప్రవహించాయనీ. ఇక్కడి సాహిత్యము ఎక్కువుగా జానపద సాహిత్యముగ వుండేదనీ, సర్కార్ ప్రాంతాల్లోవలె ప్రౌఢికీ ప్రదర్శన లేదనీ, సర్కార్ ప్రాంతాలుకూ మారిలభట్టు, తిక్కనలాంటి వారికి జన్మనివ్వగా రాయలసీమ కులమత తారతమ్యాలకు దూరుల్లైన ప్రజాకవుల్లైన వేమన, పోతులూరి వీరబ్రహ్మం లాంటివారికి జన్మనిచ్చిందనీ షేర్కొం టారు గ్రంథకర్త. ఇందులో ప్రాంతీయ ప్రత్యేకతలు విశదముగ చూపబడినాయి.

వేమనకు ఏకులం లేదనీ, అయినా ఆయన రెడ్డికులానికి చెందినవాడనీ రామలింగారెడ్డి చమత్కారముగ చెపుతారు. Vemana was a villager by birth, and if we could refer to the caste of a man who had discarded caste, a Reddy" వేమన తన కవిత్వానికి ప్రేరణనంతా ప్రజలనుండీ ప్రకృతినుండి పొందేడనిచెపుతూ గ్రంథకర్త చిత్రముగ అంటారు. He is both a Poet of nature and a natural poet" రామలింగారెడ్డి శైలి అందుకే విశిష్టముగా వుంటుంది.

వేమనను గురించిన యీ రేడియో ప్రసంగములో గ్రంథకర్త వేమన అనుస రించిన విశ్వ జనీన వంథాను గురించి ప్రత్యేక వివరిస్తూ ఆ వంథాలో మానవుడికీ మానవుడికి మధ్యవున్న, స్వార్థమానవులు సృష్టించిన అనేక విధాల వ్యత్యాసాలను ఖండిస్తారు.

వ్యక్తులను గురించి, వారి తత్వాలను గురించి వ్రాసేటప్పుడు రామలింగారెడ్డి వ్యక్తుల మనస్తత్వాలలోకి ప్రవేశించి అవగాహన చేసుకొని వారి మనస్తత్వాలను సూక్ష్మ విన్యాసం చేస్తారు. వ్యక్తుల్లోని గుణాలను ఎంత మనస్ఫూర్తిగా ప్రశంసిస్తారో అంత మనస్ఫూర్తిగానే నిర్మొగమాటముగ విమర్శిస్తారు వారి దోషాలను. ఎంత గొప్ప

వ్యక్తిలోనైనా కొన్ని లోపాలుంటవి. ఎంత సామాన్య వ్యక్తిలోనైనా కొన్ని సుగుణాలుంటాయి - అవే మనోవైజ్ఞానిక సత్యాన్ని గుర్తించి వుంటారు డా॥ రెడ్డి. అందువల్ల వారి రచనల్లో ఒక భారసామ్యం గోచరిస్తుంటుంది.

రాజారామమోహనరాయ్‌ను గురించిన రచనలో అనేక లౌకిక, ధార్మికత్యాలను సూత్రీకరించారు గ్రంథకర్త. ఈ పుస్తకములో కందుకూరి విరేశలింగం మీద ఒక ప్రత్యేక వ్యాసం వున్నప్పటికీ రామమోహనరాయ్‌మీద రచనలో రామమోహన్‌రాయ్‌ను విరేశలింగాన్ని పోల్చి కొన్ని సత్యాలు వెల్లడించారు. అవి ఎంతో సబబుగావున్నాయి. రామమోహనరాయ్‌లో లేని కొన్ని విశేషాలను వీరేశలింగంలో వున్నట్లు చూపేరు.

వీరేశలింగం రామమోహనరాయ్ ఆదర్శాల్లో నడచినప్పటికీ చాలా విషయాల్లో రామమోహనరాయ్ కంటే వీరేశలింగమే ముందడుగు వేసినట్లు వ్రాస్తూ అందుకు నిదర్శనముగ యీ క్రింది సత్యాలను ఉదాహరించారు. విరేశలింగం తన యజ్ఞోపవీతాన్ని ఏనాడో తీసివేశారు కాని రామమోహనరాయ్ తీసివేయలేదు. రామమోహనరాయ్ కులతత్వాన్ని వ్యతిరేకిస్తూనే తాను ఇంగ్లండు వెళ్ళేప్పుడు ఇద్దరు వంట బ్రాహ్మణులను, రెండు ఆవులను వెంట తీసుకువెళ్ళారు. ఇటువంటి విషయాల్లో రామమోహనరాయ్ కంటే వీరేశలింగమే ముందడుగులోవున్నా రామమోసరాయ్ అడుగు జాడల్లోనే వీరేశలింగం ఎక్కువగా సంచరించా రనటంలో వివాదంలేదు.

వీరిద్దరి సమాజ సంస్కారములోకూడ పురాణాలకు ముందున్న హిందూ సమాజాన్నుండే ప్రేరణ పొందేరు. వర్తమాన సమాజంలోని చెడును పోగొట్టడానికి ప్రాచీన హిందూ ఆదర్శాలనే సాధనగా స్వీకరించి అమలుజరిపేరు. అంటే పురాణ కాలంనుండి మాత్రమే హిందూ సమాజం పతితమైపోయింది. కాని అంతకు పూర్వపు వైదిక, ఉపనిషత్ కాలపు హిందూ సమాజం ఉజ్వలముగ వుండేది కనుక ఆనాటి వర్ధతులను అవలంబించటం అంటే వర్తమాన హిందూ సమాజాన్ని సంస్కరించటమే అని వారుభయుల అభిమతం. అంటే తాము నాటి సమాజంలో ప్రవేశపెడుతున్న సంస్కరణలన్నీ సనాతన కాలములో వున్నవేకానీ తాము నూతనంగా ప్రవేశపెడుతున్నవి కావనీ, రామమోహనరాయ్, వీరేశలింగం. ఉభయులూ కూడా తాము స్వయంగా క్రైస్తవ మతంలో ప్రవేశించకపోయినాకూడ వ్యక్తిగతంగా ఏసుక్రీస్తు అంటే వారుభయులకు ఎంతో అభిమానము.

ఇటువంటి విషయాలెన్నిటినో రామలింగారెడ్డి యీ గ్రంథములో వెల్లడించారు. డా॥ రెడ్డి కొన్ని సిద్ధాంతాల్లో ఎంతగా రాజీపడని మొండిగా వుంటారో, మరికొన్నిటిలో వ్యతిరేకాలను సమకూర్చుకువే సమన్వయవాది. ఈ విషయము యీ పుస్తకములో వెలువడిన ఇద్దరు వరస్పర వ్యతిరేకుల జీవితాలద్వారా వెల్లడవుతుంది. గొప్ప ఆధ్యాత్మిక మహా మహుడుగా విఖ్యాతుడైన రామకృష్ణ పరమహంసను ఎంత హృదయపూర్వకముగ మెచ్చుకున్నారో రామకృష్ణ వరమహంసను వ్యతిరేకముగ విపర్శించిన ఎం. ఎన్. రాయ్‌ను కూడ అంత హృదయపూర్వకముగ మెచ్చుకొన్నారు. ఎమ్. ఎన్. రాయ్ గొప్ప హేతువాది. ఇంద్రియాల కందేది మాత్రమే సత్యమని రాయ్ నమ్మితే అతీంద్రియమైంది మాత్రమే సత్యమని నమ్మేవారు వరమహంస. కనుక వీరిద్దరి దృష్టలూ సత్యమే అని నమ్మేవారు డా॥ రెడ్డి. ఆయన దృక్పథం సమన్వయ దృక్పథం, సమగ్ర దృక్పథం. జీవితములో యీ రెండు దృక్పథాలుకూడ సత్యమైనవే భౌతిక జగత్తూ ఆనత్యంకాదు. అధ్యాత్మిక జగత్తూ అసత్యంకాదు. ఒకదాన్ని వున్నదనటానికి రెండవదాన్ని లేదన అవసరములేదు.

అధ్యాత్మిక రంగంలో రామకృష్ణ వరమహంస ఎంత ఘనుడో భౌతిక రంగములో ఎమ్. ఎన్. రాయ్ అంత ఘనుడు. ఒకరిని ఘనుడుగా అంగీకరించడానికి రెండవ వారివి ఘనుడు కాదని అంగీరించ అవసములేదు. రామకృష్ణ వరమహంసను గురించి వ్రాసి దాన్ని చదువుతున్నప్పుడు అనిపిస్తుంది - డా॥ రెడ్డి ఇంతగా అధ్యాత్మికులా అని. అదే మాదిరి అనిపిస్తుంది ఎమ్. ఎన్. రాయను గురించి వ్రాసిన వ్యాసము చదువుతున్నప్పుడు డా॥ రెడ్డి ఇంతగా హేతువాదా అని.

ఈ జీవితాల్లోని వివేకానంద జీవితములో గ్రంథకర్త విశాలమైన సమన్వయాన్ని స్థాపించారు. వివేకానందలో పార్శ్వ అపార్శ్వ తత్వాలను, ప్రాచ్య పాశ్చాత్య తత్వాలను, నైజ్ఞానిక, మర్మవాదపు (Mystic) దృక్పథాలను దర్శించి వాటిని సంశ్లేషణ చేశారు. వివేకానంద పాశ్చాత్య దేశాల్లో బోధించిన ఆధ్యాత్మిక దృక్పథం, భారత దేశములో నొక్కి చెప్పిన భౌతిక దృక్పథం, యీ రెండూకూడ రామలింగారెడ్డి మన్ననలను అందుకొన్నవి.

రామలింగారెడ్డి చమత్కార ప్రీతి వీలున్నపుడల్లా ప్రతిచోట చోటుచేసుకొంటూనే వస్తుంటుంది. వివేకానంద ఇతర్లకు వ్రాసిన ఉత్తరాల సంకలనం

"Epistles of Swami Vivekananda" అనే దాన్ని ఒక మిత్రుడు తనకు మైసూరులో చదవమని ఇవ్వటం జరిగిందట దాన్ని గురించి ఆయన సూక్ష్మముగ చమత్కరిస్తారు: "He gave it to me so that I might utilise it for my leisure study, but in point of fact, over since I had that book, I had no leisure at all" ఆ మిత్రుడు తనకా పుస్తకాన్ని తీరిక సమయాల్లో చదువుకోమని ఇచ్చాడట, కాని జరిగిందేమిటంటే తనకా పుస్తకం అందినప్పటి నుండి అసలు తీరిక అనేదే లేకుండా పోయిందట. డా॥ రెడ్డికి ఆ పుస్తకము అందినప్పటినుండి నిజంగానే తీరికవుండి వుండక పోవచ్చు. అయినా ఆ విషయాన్ని చెప్పే విధానము చమత్కారముగ వుంటుంది.

రామలింగారెడ్డి పాశ్చాత్య సంస్కృతిని ఎంతగా ఇష్టపడతారో ప్రాచ్య సంస్కృతిని కూడ అంతకంటె తక్కువగా ఇష్టపడరు. అందువల్ల ఆయన రెండు వర్గాలవారికీ విమర్శ ప్రాతుడయే ప్రమాదంవుడేదట. పాశ్చాత్య సంస్కృతిని మెచ్చుకొంటున్నప్పుడు భారత జాతీయవాదులు ఆయన్ను దేశభక్తిలేని వానిగా విమర్శిస్తే భారతీయ సంస్కృతిని మెచ్చుకొంటున్నప్పుడు ఆధునికులు ఆయన్ను సనాతనుడని విమర్శించేవారట!

రామలింగారెడ్డి 1907లో ఇంగ్లండు నుండి తిరిగి రాకముందే వివేకానంద చాలా ఏళ్ళ క్రితమే మరణించాడని విచారము వెలిబుచ్చుతూ ఆయన ఇంకా అంటాడు: తన మొదటి ఉపన్యాసము వివేకానందను గురించి ఇవ్వటముజరిగిందట. తాను ఆ సమయములో అచ్చారట భారతదేశం ఉత్పత్తి చేసిన వారిలో వివేకానంద గొప్ప విశ్లేషణాత్మక చింతాశీలి అని. గోఖలే. నౌరోజి. ఫిరోజ్‌షా మెహతా, మాలవ్యా మొదలైనవారంతా గొప్ప రాజనీతిజ్ఞులు. అశుతోష్ ముఖర్జీ, మాలవ్యా గొప్ప విద్యా వేత్తలు. దయానంద వైదిక సంస్కృతిని తిరిగి వ్యాపింపచేయుటములో దక్షుడు. రామకృష్ణ పరమహంస గొప్ప అధ్యాత్మిక మహామహుడు. అన్ని మతాలుకూడ సమానముగ గొప్పవని ఆయన చాటటం మాత్రమే కాక ఒక్కొక్క మతాన్ని కొన్నేసి రోజులు ఆయన ఆచరించాడు. ఇక వివేకానంద పైన చెప్పబడిన వారందరి సమ్మేళనము. ఆర్థిక విద్యా విషయిక, సామాజిక, రాజనైతి మొదలైన విషయాలన్నిటిని ధార్మిక జీవితములో సమన్వయపరచాడు అంటారు డా॥ రెడ్డి.

రామలింగారెడ్డికి గోఖ్లేతో సన్నిహిత పరిచయం వుంది. ఆయనతో వైయక్తిక మైన ఉత్తర ప్రత్యుత్తరాలుకూడ నడిచేయి. తాను గోఖ్లేకు వ్రాసిన ఉత్తరాలు యీ

పుస్తకం చివరిలో ముద్రించబడినాయి. వాటిలో ఎన్నో ఆసక్తికర విషయాలు గోచరిస్తాయి. ఈ పుస్తకములో డా॥ రెడ్డి కూర్చిన గోఖ్లే జీవితం భారతదేశపు రాజకీయ చరిత్రకు ఒక నిర్మలమైన దర్పణం. గోఖ్లేమ గురించి గ్రంథకర్త వ్రాసిన విషయాలు లోతు, వెడల్పు, నిడివిని మాత్రమే కాక ఎంతో ఎత్తునుకూడ కలిగివున్నాయి.

రామలింగారెడ్డి దృష్టిలో భారతీయ రాజకీయ నాయకులు ఇద్దరు మాత్రమే ఘనులు - దాదాభాయి నౌరోజీ, గోఖ్లే. భారత జాతీయ జీవితానికి గోఖ్లే ప్రసాదించింది మేధాశక్తినికాదు (అది ఆయనలో ఎంతగా వున్నవటికీ), అద్భుతమైన వక్తృత్వ ప్రతిభాకాదు (అదికూడ ఆయనలో బహుళముగ వుంది), తనలోవున్న రాజనైతిక ప్రజ్ఞాకాదు. మరి ఆయన భారతరాజకీయాలకు ప్రసాదించింది ఏమిటంటే నైతిక బలాన్ని అంటారు గ్రంథకర్త.

తాను ప్రథమంగా గోఖ్లేను ఇంగ్లండ్‌లో ఏ విధముగ ఏ సందర్భములో కలుసుకొన్నదీ మొదలైన వివరాలన్నిటినీ ఇందులో ఇచ్చారు. రామలింగారెడ్డి జీవితం ఆలోచనలకూ, ఆవేశాలకూ కొంత అస్థిర స్వభావానికీ నిలయం. గోఖ్లే జీవితం ఇందుకు విరుద్ధము. ఆయనలో ఆలోచన ఎక్కువ, ఆవేశం తక్కువ. స్థిరత్వం ఎక్కువ, అస్థిరత్వం తక్కువ. అనుకూల స్వభావాల వ్యక్తుల మధ్యకంటే ప్రతికూల స్వభావాల వ్యక్తుల మధ్య ఆకర్షణ ఆధికముగ వుంటుంది. కనుకనే రామలింగారెడ్డికి గోఖ్లే అంటే అంత అధిక ఆకర్షణ! గోఖ్లే జీవితాన్ని మహోజ్వల జీవితముగ చిత్రించారు డా॥ రెడ్డి.

గోఖ్లే వక్తృత్వ కళను గురించి గ్రంథకర్త అంటారు: He had much of gravity and seriousness of the early Victorian orators. His speaches were weighty, serious in tone, dignified in manner and lached the ease and conversational tone which characterise contemporary European oratory. He often lamented that he had no sense of humour, which was not ture..." తొలి విక్టోరియన్ వక్తల్లోవున్న ఆకర్షణ, గాంభీర్యము మొదలైన వెంతగానో గోఖ్లేలో వుండేయట. అయన ఉపన్యాసాల్లో బరువుండేది, గంభీరమైన ధ్వనివుండేది, ఘరానా అయిన వర్ధతి పుండేది. కాని ఆయన వక్తృత్వములో లోపించింది ఏమంటే సౌలభ్యం, సంభాషణోచితమైన వైఖరి. ఇవి సమకాలీన యూరపియన్ వక్తృత్వానికి లక్షణాలు. తనలో హాస్యం అవేది లేదని గోఖ్లే విచారించే వాడట. కాని అది నిజంకాదంటారు రామలింగారెడ్డి.

టాగోర్‌ను గురించి, గాంధీని గురించి వ్రాసిన జీవితాలు అంతగా విశిష్టంగా ఏమీలేవు. అవి సామాన్యముగ మాత్రమే వున్నాయి. టాగూర్ సాహితీ జీవితము మీద కాని, గాంధీ ధార్మికమైన రాజకీయ జీవితము మీద కాని విశిష్టమైన దృష్టి కోణాన్ని ఏమీ వ్రవరింపచేయలేదు. వారి విషయములో అందరికీ తెలిసిన వాటినే రామలింగారెడ్డికూడ పేర్కొన్నారు. వారిని గురించిన నూతన కాంతులేమీ సృష్టించ బడలేదు. ఒకే వ్యక్తి రచించినవన్నీకాని, వ్రసంగించిన వన్నీ కాని ఒకే స్థాయిలో వుండని మాట నిజం.

జవహర్‌లాల్ నెహ్రూను గురించి వ్రాస్తూ రామలింగారెడ్డి ఎన్నెన్నో జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలను చర్చించారు. జవహరలాల్ మీది తన అభిమానానికి కారణం జవహర్‌లాల్ రాజకీయాలు, చేసిన త్యాగాలవరకు మాత్రమే సంబంధించి లేదని అంటూ ఆయన గొప్ప విద్వాంసుడు, చరిత్రమ క్ష్ణ్ణంగా తెలుసుకొన్న వ్యక్తి అనీ, చరిత్రలోని వివిధ దశలను ఆయన సంశ్లేషించి తన గ్రంథాల్లోని ఒకదానిలో దానికి ఉజ్వలరూపాన్ని వ్రసాదించాడని డా॥ రెడ్డి శ్లాఘించారు. ఆంగ్ల గద్య రచయితగా నెహ్రూ గొప్పగా రాణించాడనీ, ఆయన ఆత్మకథ అధునిక కాలపు ఉత్తమ రచనల్లో ఒకటనీ అంటారు గ్రంథకర్త.

ఇందులో డా॥ అనిబిసెంట్‌ను గురించి రచించిన వ్యాసం ఒక విశిష్టమైంది. ఆమెతో రామలింగారెడ్డికి తన పదహారవ ఏటనే వరిచయం ఏర్పడింది. ఆ వయస్సులో ఆయనలో ఎన్నో మానసిక అసంతృప్తులు, అశాంతులు, తుఫానులు లేవసాగినయి. ఈ భౌతిక జగత్తుమీద విరక్తి, అంతర్ జగత్తుమీద అనురక్తి మొదలైన లోకోత్తర ధోరణిలో జీవించసాగేడు. ఆయన 1897లో మద్రాసు క్రిష్టియన్ కాలేజీలో వ్రవేశించిన రోజుల్లో, ఈ బాహ్య జగత్తులోని బంధనలన్నిటి నుండి బయటపడాలని, ఇంద్రియ గ్రాహ్య జగత్తు ఇవ్వజాలని ఒక శాశ్వతానందాన్ని అతీంద్రియ జగత్తులో పొందాలనీ రామలింగారెడ్డి లేత హృదయం ఆరాటపడసాగింది.

అటువంటి అస్థిరావస్థలో ఆయన డా॥ అనిబిసెంట్ రచనలను చదవటము, ఆమె చేసే వ్రేరణాత్మక వ్రసంగాలను వినటం జరగసాగినది. వ్రత్యేకించి ఆమె రచించిన తన ఆత్మకథ రెడ్డిని లోతుగా వ్రభావింవజేసింది. అంతటితో ఆయన

ఆమెకు ఒకవిధముగ భక్తునిలాగా అయిపోయాడు. అన్నిటికంటేమించి ఆమె వ్యక్తిత్వం ఆయన సున్నిత హృదయం మీద లోతైన ముద్రవేసింది. ఆమె సాహిత్యంమీద ఆమె జీవితం మీద ఆయనకు అపారమైన ఆకర్షణ. ఆమెను గురించి ఆయన అంటారు: But the personality of Mrs, Anne Besant was to me far more than her philosophies a ray of light from a transcendent beyond'. ఆమె తాత్విక విషయాలకంటే ఆమె వ్యక్తిత్వం తనకు చాలా గొప్పదిగా వుండేదట. లోకోత్తర లోకం నుండి ప్రకాశించే ఒక కాంతి కిరణం ఆమె అంటారు రామలింగా రెడ్డి అనిబిసెంటును గురించి.

ఆ చిన్న వయసులోపే ఆమెతో ఆయన ఉత్తర ప్రత్యుత్తరాలను సాగించి ఒకనాడు ఆమె అనుమతిపై అడయారులోని ఆమె నివాసంలో ఆమెను కలుసు కోవటం, ఆమె మాతృవాత్సల్యంతో ఆ నవ యువకుని ఆదరించటం మొదలైన అభిరుచిగల ఉదంతాలు రామలింగారెడ్డి ఈ పుస్తకములోని ఆమె జీవితంలో పేర్కొ న్నారు. ఆయితే, క్రమేణా ఆయనలో హేతువాదం మేల్కొనసాగటం ప్రారంభమై నప్పటినుండి అటువంటి లోకోత్తర ధోరణి సన్నగిలసాగింది.

"Some Great Lives" అనే ఈ పుస్తకంలోని పదిహేను ఘనుల జీవితాలు వైవిధ్యాలు కలిగివుండి పాఠకులకు ఎంతో ఆనందాన్ని, పరిజ్ఞానాన్ని ప్రసాదిస్తాయి. ఈ పుస్తకం ఈ విషయంలో మొదటిభాగం మాత్రమే ఆంధ్ర విశ్వవిద్యాలయపు వైస్‌ఛాన్సలర్ శ్రీ ఆవుల సాంబశివరావు, శ్రీ బి. ముత్తుస్వామి, శ్రీ బంగోరె మొద లైనవారి అవిరామకృషివల్ల మిగతా భాగాలుకూడ త్వరలో వెలుగును చూస్తాయని ఆకాంక్ష.

★

సాహితీ విప్లవ జోదులకు పెట్టని కోట

పండిత గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

రెడ్డిగారు మైసూరు విద్యాశాఖాధికారిగా వున్నప్పుడు ప్రతి గ్రామములోను పాఠశాలలను పెట్టించి గ్రామీణులలో విద్యాభివృద్ధికి ఎక్కువగా కృషిజేశారు. అంటరాని వారిని, అణగద్రొక్కబడిన వారిని తొలుదొల్త పాఠశాలలో ప్రవేశింపజేసిన హరిజనోద్ధారకుడు రామలింగారెడ్డి.

మైసూరు రాష్ట్రములో రామలింగారెడ్డి భాస్కరువివలె ప్రకాశించి అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలాడు. కనుకనే యీనాటికిని ఆంధ్రులకంటెనూ అధికముగ మైసూరు ప్రజలు ఆయనను కొనియాడుతుంటారు.

రెడ్డి ప్రబోధం ప్రశంసనీయం. 1920వ సంవత్సరం నాటికి ఆయనకు ప్రజాదృష్టి ఏర్పడటం గమనించదగ్గ విషయం. ఇంతవరకు ఈ దృక్పథముతో మాటలాడినవారు లేరు.

"పరిపాలనలో బుద్ధిమంతులు పాల్గొనడానికి నిరాకరించిన యెడల వారు దుష్ట పరిపాలన క్రింద జీవితమంతా శిక్ష అనుభవించవలసి వుంటుంది" అని ప్లేటో ఏనాడో ప్రవచించాడు.

తన్నుగురించి ఒక ప్రముఖుడు "రాజకీయాలలోచేరి పతనమయ్యాడు మహర్షి గాంధి" అనగా "అలాకాదు. నేను రాజకీయ వేత్తను. మహర్షిని కావటానికే కృషి చేస్తున్నాను. అంతే," అన్నాడు గాంధీజీ. ఇంతేకాదు 'రాజకీయాలతో సంబంధం లేని మతము మతమే కాదు' అన్నాడు. జీవితములో ప్రధానమయినవి రాజకీయాలే. మన ఉనికీ, అభ్యుదయమూ, మన ఉన్నతీ వాటిమీదవే. పూర్వం మన సంపదకూ దారిద్ర్యానికి భగవంతుడే కారణమన్నారు. వీటన్నిటికీ కారణము ప్రభుత్వమనే భావన యీనాడు కలిగినది.

మనరెడ్డి శాసనసభారంగంలో అతిరథ మహారథుల నెందరినో వాదనలో వల్టీలుకొట్టించటం జగద్విదితం. జ్ఞాపకశక్తి, సద్యస్ఫురణా ఆయనను అంతటివాణ్ణి చేసివాయి. ఆయన వరులను రాళ్ళతో కాదు, పువ్వులతోనే కొట్టిడివాడు. 'పోట్లాడినా బుక్కావాడితోవే పోట్లాడాలి' అని తెలుగులో సామెత వున్నది.

భారతదేశంలో ప్రప్రథమాన మంత్రులపై విశ్వాసరాహిత్య తీర్మానము ప్రతిపాదించిన ఘనత మన రెడ్డికి దక్కినది.

అప్పటి మద్రాను ముఖ్యమంత్రి పానగల్ రాజా ఆయన ధాటికి తట్టుకోలేక ఆంధ్ర విశ్వవిద్యాలయము ఆయనకు అంటగట్టాడు. దానిని పెంచి పోషించింది ఆయవే. ఈనాడు ప్రజాస్వామ్య పరిపాలనలో వున్నాము. 'The organised life of a nation is politics' రాజకీయాలంటే జాతి క్రమబద్ధ జీవితం అన్నమాటకు అర్థమిదే. సంఘ వ్యవస్థ బాగువడనిదే రాజ్యాంగ వ్యవస్థ బాగువడదు. A nation gets the Government that it deserves. ప్రజా పరిపాలవలో ప్రజాస్థాయినిబట్టి పరిపాలన ముంటుంది. ప్రజలలో చైతన్యముంటే ప్రజాస్వామ్యముంటుంది. లేదా మూకరాజ్య మవుతుంది. "ప్రజాస్వామ్య"మనగా ఒక విధమైన జీవిత విధానమని గ్రహించాలి. ప్రజలకు హక్కులూ బాధ్యతలూ వున్నవి. బాధ్యతలను విస్మరించి హక్కులకే పోరాడటం అనుచితం.

రెడ్డి ఒక పర్యాయము ఇట్లా అన్నాడు-"ఆంధ్రదేశములో ముగ్గురు ప్రతిభావంతులున్నారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ప్రథమ శ్రేణి ప్రతిభావంతుడు. కాని ఆయన జీవితములో తృతీయ శ్రేణిలో విజయం పొందాడు.

నేను ద్వితీయ శ్రేణి ప్రతిభావంతుణ్ణి. అందువల్ల నా జీవితము సగము జయము సగము అపజయము.

రాధాకృష్ణన్ తృతీయ శ్రేణి ప్రతిభావంతుడు. అందువల్లనే ఆయన జీవితంలో ప్రథమ శ్రేణిలో విజయం గాంచాడు.

మన స్వాతంత్ర్యాన్ని, పారతంత్ర్యాన్ని ఆయన ఇట్లా ప్రకటించాడు-

'We have always enjoyed liberty of thought, but never of action,'

రామలింగారెడ్డి ప్రజల వడుమ నుండే స్వభావం గలవాడు కాడు. అయినప్పటికీ ప్రజల మేలుకోసం పాటువడ్డవాడే. ఆయన ఈనాటి రాజకీయాలకు తగని మనిషి.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య మనగా రాజీ. ఇచ్చి పుచ్చుకోవటం, ఇతరులతో కలసి మెలసి పనిచేయటం, పార్టీ కార్యక్రమాలను అనుసరించి ప్రజలతో సన్నిహిత తత్వం కలిగించుకొనటం కాను సర్వస్వతంత్రుడు, ప్రతిభావంతుడు, కావే యీ లోకము అనుకునేవాడు, Individualist రాజకీయాలలో చెల్లలేడు. అట్టి వ్యక్తి ప్రతిపక్షములో మాత్రం కొంతవరకు రాణించగలడు.

'ఏవరైనా రాజకీయాలలో నెగ్గాలంటే తన ఉన్నతాశయాలను ప్రజలకు అందజేయటమేకాక, ప్రజల ఆశయాలనుకూడా కొంతవరకు స్వీకరించవలసిందే. అంతే కాదు-తన చుట్టూవున్న జనంయొక్క మనఃస్థితిని త్వరితముగ మారిపోయే మనఃస్థితిని ఈప్సితాన్ని సరిగా వ్యాఖ్యానించటంకూడా కావాలి' అని లాయిడ్ జార్జికి ఆయన మేనమామ సలహా ఇచ్చాడు. ఆ ప్రకారమే ప్రవర్తించి రాణించాడు ఆయన.

మన రామలింగారెడ్డి అభిరుచులలో, అలవాటులలో Individualist. అందువల్ల సాధారణముగ ప్రజలకూ ఆయనకూ వడుమ అఖాతమేర్పడింది. కనుక ఆయన ప్రజానాయకుడు గాక వేరు ప్రపంచానికి చెందినవాడైనాడు. ఆయన విద్యావేత్త. అధికముగ రాణించింది ఆ రంగములోవే.

రామలింగారెడ్డి మనుమడు పద్మప్రభాస భవనమును అమ్మివేసినందుకు మనము అగ్రహపడనక్కరలేదు. వీరేశలింగం భవనాన్నే హితకారిణి సమాజమువారు

అడ్డెకు యిచ్చినారు. ఆది మన మనస్తత్వం. మహాపురుషులు నివసించిన గృహాలను, వారుపయోగించిన వస్తువులను గౌరవముతో భద్రపరచాలని ప్రజలకు లేదు. ఇది మన సంస్కార విహీనత.

సత్సాంప్రదాయాలలో ఆంగ్లేయుల వరకు పోనక్కరలేదు. మనకు పొరుగు వారైన తమిళ సోదరుల నుంచి మనం నేర్చుకొనవచ్చును. వారి జాతీయ కవియైన 'భారతి' ఉత్సవం ఏటేటా ఆయన స్వగ్రామంలో చేయటం, ఆయన గృహాన్ని భద్రపరచటం చూస్తూవే వున్నాము. 'వారు కంబకవి' ఉత్సవం ఏటేటా చేస్తారు. 'త్యాగరాజు' జన్మస్థలమయిన తిరువాయూరులో త్యాగరాజు ఆరాధన ప్రతి సంవత్సరం ఎంతో భక్తిశ్రద్ధలతో చేస్తారు. ఆ వాగ్గేయకారుణ్ణి ఆరాధించి గాయకులందరూ ధన్యులవుతున్నారు.

మన దేశభక్తులకుగాని, దేశోద్ధారకులకుగాని, చివరకు మన కనులుతెరిపించిన కందుకూరి వీరేశలింగంగారికి గాని వర్ధంతులు జరుపుతున్నామా? ఆత్మ విమర్శ అవసరము. మహాపురుషులను విస్మరించి మనము అభ్యుదయం పొందలేము.

కవిత్వతత్త్వ విచారము :

మన ప్రాచీన సాహిత్యము సంస్కృతాచ్ఛాయల ననుసరించి నడచినది. సంస్కృతభాషలో అలంకార శాస్త్రము బహుముఖాలుగా విస్తరిల్లింది. దానిలో కావ్య హేతువులు, కావ్యభేదాలు, రసమీమాంస, కావ్యరచనాధికారము, అలంకారములు శబ్దార్థ దోషాలు చక్కగా నిరూపించబడ్డాయి. ఇవి కావ్యరచనకుపకరించేవే అయినా కావ్య విమర్శకు కూడా కొంత తోడ్పడ్డవే.

సంస్కృత భాషలో వ్యాఖ్యాతలు అనేకులు ఉద్భవించినారు. వారిలో మల్లినాథ సూరి అన్నివిధాల ప్రసిద్ధుడు. వ్యాఖ్యానాలు కావ్యభావాన్ని సుబోధకం చెయ్యటానికి ఏర్పడ్డవి. వ్యాఖ్యాత కవిని పోషిస్తాడుగాని విమర్శించడు. విమర్శకుడు కవిని పోషించడు, ప్రోత్సహిస్తాడు. కావ్యంలోవే గుణదోషాలు విరూపణ చేస్తాడు. ఇది ఆంగ్ల సాహిత్యంద్వారా మనకు కలిగిన మేలు.

మన ఆంధ్ర సాహిత్యంలో అధికముగ కవులకు, అలంకారికులకు మధ్య అనురాగమున్నట్లు కనవడదు. ఒక అలంకారికుడు తన గ్రంథానికి 'కవి నర్వ గారుడము' అని పేరు పెట్టినాడు. "కవికాభ్రష్టో విమర్శక శ్రేష్ఠ" అని కవి విమర్శకుణ్ణి నిరాకరించినాడు. ఒకరు 'కవి కంఠాభరణము' అనే పేర అలంకార శాస్త్ర గ్రంథము నొక దానిని వ్రాయగా "విరంకుశాఃకవయః" అన్నారు కవులు. ఇలా ఎవ్వడూ కవులకూ అంలకారికులకూ పొత్తుకుదిరేది కాదు. ఈ ఉభయవర్గాలలోను వారికంటే మేమే అధికులమను భావము పుష్కలంగా వుండేది.

కొంతమంది కవులు కూడ ఈ అలంకార శాస్త్రాన్నే బ్రహ్మాస్త్రంగా చేపట్టి తోటి కవులమీద మాత్సర్యం చేత వాగ్యుద్ధాలు సాగించారు. కొక్కొండ వెంకట రత్నమూ, కందుకూరి వీరేశలింగమూ యీ ధోరణిలోనే కొంతకాలము పోట్లాడుకున్నారు. ఒకరి నొకరు విమర్శించుకున్నారు. అలాగే తిరువతి వెంకట కవులూ, కొప్పరపు కవులూ సాహిత్య సంగ్రామం జరిపినారు. ఇంతేకాదు, ప్రతి కవీ మరి ఒక కవి రచనలోని దోషాలనే ఎత్తిచూపి ఎగతాళి చేయుటకు యత్నించాడే కాని గుణాలను గ్రహించడానికి పూనుకోలేదు. ఏ కొద్దిమంది కవులో ఇందుకు అపవాదంగా వుండవచ్చును. కాని వారి సంఖ్య వ్రేళ్ళమీద లెక్కింప దగినదిగానే వుండేది. వేయేల? కావ్య సుందరి శరీరాన్ని శతధాఖండించి శస్త్రపరీక్ష జేసినట్లే విమర్శలు సాగాయిగాని కావ్యాత్మను గమనించే ప్రయత్నంలేదు. నేటికిని యిట్టి విమర్శలు వెలువడుతుండటం శోచనీయం. ఇవి సాహిత్యలతకు జలసేచ నాదికమైన దోహద క్రియలు నిర్వర్తించేవిగాక గొడ్డలిపెట్టే పెట్టేవి మాత్రమే. విమర్శకులు ఈ రహస్యాన్ని గుర్తించిననాడుగాని యదార్థమయిన విమర్శ జరుగదు. అలా జరగనంత వరకు వారివలన లోకానికి అవకారమే గాని ఉపకారంలేదు. మరియొక చిత్ర మేమనగా ఒకరు సాధువన్నదానినే మరియొకరు అసాధువనటం తమ వాదములో బలం లేదని తెలిసికూడా 'తాను వట్టిన కుందేటికి మూడే కాళ్ళు' అన్నట్లు వాదాన్ని సాగదీయటం. ఇందుచేతనే మన సాహిత్యములో విమర్శనమనగా రంధ్రాన్వేషణ మన్నట రూఢి అయిపోయింది.

అలంకార శాస్త్ర నియమముల ప్రకారం వ్రాసినదే కావ్యమని ప్రాచీన విమర్శకుల నిర్ణయము. ఆంగ్ల సాహిత్య ప్రభావమువల్ల మనలో కొందరు యువకులు

ప్రాచీనాలంకారికుల నియమాలను ఉల్లంఘించి రచనలను చేసినారు. మన రామలింగా రెడ్డి యీ సాహిత్య విప్లవకారులకు పెట్టనికోటగా నిలిచినాడు. నిలుచుటేకాదు; అలంకార శాస్త్రమును ఆవలకు నెట్టి ఆంగ్ల సాహిత్య సంప్రదాయానుగుణ్యముగా సాహిత్య విమర్శ ప్రారంభించి కావ్యాత్మకు గౌరవము యిచ్చిన ఘనత ఆయనకే దక్కినది. ఆయన రచనలలో గొప్పది కవిత్వతత్త్వ విచారము.

డా॥ సి. ఆర్. రెడ్డి వంటి ప్రతిభావంతులు మరొకరు జన్మించవచ్చును. వేమ అధిక శ్రమపడి వ్రాసిన గ్రంథం రెడ్డిది. అందులో అనేక విషయాలు ముఖ్యంగా హాస్యరసంతో కూడిన అనేక విషయాలు పొందుపరచాను. దీనిలో మనము నేర్చుకొని అభివృద్ధి పొందుటకు అవకాశం కలదు. వీటి అన్నిటి దృష్ట్యా డా॥ సి. ఆర్. రెడ్డి చరిత్ర అన్నిటికంటె గొప్పదిగా భావిస్తున్నాను.

రెడ్డిగారి సూక్తులు :

అసాధారణత మన్నసకు జన్మహేతువు.

ఇహవరములు పరస్పర సంబంధములు; సహూర్ణాహంకృతి నిరహంకృతులు గర్వ్యములు.

పౌరుషము గౌరవము కలది.

విశ్రాంతి యనగా కార్యాంతర గమనము.

పశ్చిమ ఖండవాసులకు వ్యాపార వాణిజ్యాదులే జీవనదులు: కృషి యువ నదితో సమానము.

వర్తమానంబు భూతంబునకు ఫలంబును భవిష్యత్తునకు బీజంబువైయుండు.

అచలత్వము జడధర్మంబు; చైతన్యధర్మంబు చలనంబు; తృప్తి సుప్తి.

దేశాభివృద్ధికి యంత్రకళా ప్రాబల్యము ఏడుగడ.

యంత్రములను యంత్రములతోనే ఎదిరింపవలెను.

శ్రమ లేనిది ఇంద్రభోగము కొనసాగు కోరిక కాదు.

వ్యక్తి దృష్టినుండి సాంఘిక దృష్టి అలవడవలెను.

ధర్మమునకు నాశ్రయము సంఘము, దేశీయ శోభనకు పరమ పుణ్యంబు, సంఘ ధర్మము ఇతర ధర్మములకెల్ల శ్రేష్ఠతమము.

కడకలేక కార్యము లడరవు.

పౌరుష ప్రకటనమే ముమ్మాటికి సర్వసమ్మానావహంబు.

పుట్టుక కన్నను, తలవాఁత కన్నను, శిక్ష, తరబీతు అధిక శక్తిమంతము.

సంఘము, శరీరము, ప్రజలందులోని యవయవములు. వచ్చుటకు బోవుటకు సులభముగా నున్నచో వాణిజ్యము వఱలును.

ఆర్థిక స్థితిగతు లాచారములకు మూలములు.

వేదాంత ప్రశసంలకన్న ఆర్థిక పరిస్థితులు నడవడి తీర్చుటలో గరీయంబులు.

స్వతంత్రయు, స్పర్ధయు వేకవమ్మూతములు. ఇవి లేనిచో గొఱ్ఱెలకువలెఁ దలనంచుకొని గుడ్డి మార్గములఁ జనుట విధిలేని శీలము.

నిర్వైరత నిర్వైర్యత.

ఏకవృత్తినుండు రాజ్యమును, ఏకపుత్రుఁ గలిగిన కుటుంబమును సమానములు.

భూతగ్రస్తులైయుండుట బుద్ధిలేని మతము.

కామముతో వాత్సల్యమును గలిసియుండును.

నీడలేని వస్తువులు లేనట్లు లోపములు లేని పరిపూర్ణత లెట్టి పట్టుపట్ట వెదకినను దొరకదు.

నేఁడు తరహా యనిపించుకొనునది రేపు ఎరహాకైనఁ బోవని దగును.

విమర్శనము లేనిది వివేకోదయ ముండదు.

ఎటుచూచినకు అర్థార్జనం బవశ్య కర్తవ్యంబు.

ధర్మాధర్మంబులు వరస్పర హేతువులు.

ఇంద్రియోన్మూలముకన్న విండ్రియోవ్మేషమే మంచిది.

నవ్యత అభివృద్ధి దాయకము.

అర్థార్జవంబునకు శ్రమ ఆధారభూతంబు.

కామాతురునకు(గష్టంబులు గన(బడవు.

అందరాని వండ్ల కట్టులు చాచుట వరునకు(వైజగుణంబు గాదు.

దీవతయే దివ్యధర్మంబనువారి(దీర్ప నెవరితరము.

కోటిమంది బ్రహ్మన్నలలో ఒక భీమసేను(డుండి మాత్రము ఏమి వ్రయోజనము.

అందఱు ఆంధులయిన రంభలుకాని రమణులుందురే ?

గొప్పవారికి వ్రతమే సుఖము ; తుచ్ఛులకు సుఖమే వ్రతము.

వాగరికత ఎక్కువ యగుకొల(ది బ్రదుకుపాటుల స్థితిగతులింకను జిక్కులను దాల్చును.

రక్షించుటకు శక్తిలేనిచో సృష్టించుట మహాపాతకము.

మనఃకృషియు, హస్తకృషియుం గలియకయున్న వేర్పడునది 'కళ' గాదు; కళంకము.

విలక్షణ విద్వాంసుడు విదగ్ధ వాఙ్మయ విమర్శకుడు

ప్రొఫెసర్ యస్వీ జోగారావు

ఆంధ్ర విశ్వకళా పరిషద్విధాత, ఆశేష శేముషీ ధురంధరుడు, సుప్రసిద్ధ విద్యావేత్త, మహావాగ్మి విదగ్ధ వాఙ్మయ విమర్శకుడు, రసిక శేఖరుడు, హాస్యచతుర్యుడు అయిన శ్రీ సి. ఆర్ రెడ్డిగారి పేరు వినని విద్యావంతులు భారతదేశంలో మిక్కిలి అరుదు. ఆంధ్రదేశంలో అసలుండరేమో!

రెడ్డిగారు పెద్ద పెద్ద చదువులు చదివి గొప్ప గొప్ప పదవులెన్ని నిర్వహించినా ఆయన జీవిత మంతటిని ఆవరించి, అతని అంతస్సారానికి సాక్షిభూతమై అతని జన్మను చరితార్థంచేసి చిరకాల మతని ప్రతిష్టకు స్థిరత్వం కలిగించేది ఒకే ఒక సన్నివేశం. అదే ఆంధ్ర విశ్వవిద్యాలయ వ్యవస్థాపకత్వం, తమ ఉపాధ్యక్ష పదవీ నిర్వహణం. భారతీయ విశ్వవిద్యాలయలం చరిత్రలో అసుతోష్ ముఖర్జీ, మదనమోహన మాలవ్యాల కెట్టి విశిష్ట స్థానమో, సి. ఆర్. రెడ్డిగారి స్థానమట్టిది. ఆధునిక యుగ భారతీయ మేధావులలో "సి. ఆర్. త్రయం" అంటే చిత్తరంజన దాను, చక్రవర్తి రాజగోపాలాచార్యులతో చేర్చబడి అతి విశిష్టుడుగా ఎన్నిక గన్న వాడాయన. అనేక విధాల భారతీయ జాతులలో ప్రత్యేకతగల ఆంధ్ర జాతికి ప్రత్యేకంగా ఒక విశ్వవిద్యాలయం వుండవలసిన ఆవశ్యకత మొదటగా గుర్తించిన

వాడాయన. దాని ప్రాదుర్భావం కోసం ఆనాటి ప్రభుత్వంతో హోరాహోరి పోరాడి తన పదవిని కూడా అలక్ష్యం చేసి అలవోకగా త్యజించిన మహనీయుడతడు. ఆయనకు విద్యారంగంలో ఎంత ప్రావీణ్యం వుందో, రాజకీయ విషయాల్లో కూడా అంత చొరవా, వేర్పు వున్నాయి. అప్పట్లో ఆయనకు రాజకీయాలమీద మోజు ప్రబలి ఆయనే గాని ఆ రంగంలోకి నడుం కట్టి దూకివుంటే ఒక్క పర్యాయమైనా స్వతంత్ర భారత ప్రధానమంత్రి పదవి గూడా అలంకరించి వుండేవారేమో ననిపిస్తుంది. అంత తీవ్రమైనది అతని ప్రతిభ. ఆయనకు పదవీ వ్యామోహము లేదుకాని, ఆఅధికారపు హుందాను పకడ్బంద్‌గా చలాయించేవారు. పెద్ద పెద్ద ప్రొఫెసర్లు గూడా ఆయన ప్రతిభకు జోహారు లర్పించేవారు. ఆయన ఉక్తి చమత్కృతిని మెచ్చుకొనేవారు. అతని స్వతంత్ర వివేచనకు, మతినైశిత్యానికీ, దూరదృష్టికి విస్తుపోయేవారు. విశ్వ విద్యాలయ రాజకీయాలకూ ఆనాడు బ్రిటిషు పరిపాలన చివరి రోజుల్లో అల్లకల్లోలంగా వున్న మన దేశపు రాజకీయాలకూ సంబంధించిన సమస్యలనేకం. మిర్యాదరామన్న తీర్పుల్లాంటి తీర్పులతో, సోలమన్ పరిష్కారాల్లాంటి పరిష్కారాలతో అవతీలగా తెమల్చివేస్తూ వుండేవారు. ఆ పరిష్కార మార్గాలలో ఆయన సమయస్ఫూర్తి, విశాలమైన సంస్కారదృష్టి విస్పష్టంగా కనిపిస్తూ వుండేది. ఆయన అధికారపు వాలకం చూస్తే అందులో ఆడంబరత ఏమీ గోచరించదు కాని ఆయనను చాలమంది చండశాసనుడంటారు. బహిరంగంగా ఎంత చండశాసనుడో, అంతరంగికంగా అంత సౌమ్యుడనేవారు కూడ లేకపోలేదు. కవిత్వాది లలిత కళల యెడ అతనికున్న ప్రియం భావుకత్వమే ఆ విషయాన్ని బుజువు చేస్తుంది. ఆయన ఆజన్మాంత బ్రహ్మ చర్యాశ్రమావలంబి. అలాగని అర్థంపర్థంలేని అనవసరమైన అరసికమైన వట్టి జీలుగు బెండు. బ్రహ్మచారి జీవితంకాదాయనిది. కాంతా సమ్మితమైన కావ్యాన్ని ఆస్వాదించడంలో ఉత్తమాధికారియై పాటకుడిలో రసికత్వం ఇనుమడించిన కొద్దీ అది యెంత రక్తి కడుతుందో అంత రక్తినీ సిద్ధిపొందించుకొన్నదా రసికత్వం. ఆయన రసికత్వం ఒక్క విషయానికి మాత్రమే పరిమితమైనదికాదు. అది బహుముఖమైనది. ఆయన సంభాషణంలో, సాహిత్యాశయాలలో, విద్యా విషయ కాభివృద్ధి సూచనలలో అది వ్యక్తమవుతూ వుండేది - ఇలాంటి అనేక విశిష్ట లక్షణముల కాష్ఠాపమైన ఆయన పరిపాలన సాగించిన కాలం ఆంధ్ర విశ్వకళా వరిషచ్ఛరిత్రలో ఒక మహోజ్వల యుగంగా గడిచిపోయింది. దాని వృద్ధికి ఆయన సాయశక్తులా పాటువడ్డారు. జీవితం అంకితం చేశారు. అవ్వటికున్నదాంతో నర్వతోముకమైన

కృషిచేశారు. కళలు, శాస్త్రాలు వివిధ విజ్ఞానములలో విపులమైన పరిశోధన జరగ వలసిన ఆవశ్యకత గుర్తించారు. మనదేశంలో ఇతర ప్రాంతాల నుంచి గూడా ఆయా శాఖల్లో ఆరితేరిన పండితులను రావించి విశ్వకళా పరిషత్తు వారి ఆధ్వర్యం క్రింద పరిశోధనకు చాల ప్రోత్సాహం కలగజేసారు.

ఆయన విద్యా వ్యాసంగం ఎక్కువగా విద్యా విషయక సంస్కరణలకు, రాజకీయార్థిక శాస్త్రాలకు, ఆంధ్ర సాహిత్య విమర్శ పరిశోధనలకు సంబంధించినది. విశ్వ విద్యాలయ సంస్కరణలు, రాజకీయార్థిక సమస్యలు మొదలగు వాటికి సంబంధించిన ఆయన ఉపన్యాసాలు ప్రచురితమయ్యాయి. సాహిత్య విషయంలో మన రామాయణ, భారతాలంటే ఆయనకు మిక్కిలి ప్రీతి. ఆమహతి హాస్యాల్లోని కొన్ని కొన్ని ముఖ్య విషయాలను గురించి ఆయన వ్యాసాలు కూడా వ్రాశారు. ఆంధ్ర వాఙ్మయ విషయంలోకూడా ఆయన చేసిన కృషి గణనీయమైనది. తంజావూరు సరస్వతీ మహలులో అముద్రితాలుగా వున్న ఆంధ్ర గ్రంథాలను పత్రికలు తయారు చేయించి వాటిని ఆంధ్ర విశ్వకళా పరిషద్గ్రంథాలయంలో భద్రపరిపించి, వాటికొక గ్రంథ విపరణిక గూడా ప్రకటితమయ్యే ఏర్పాటులు చేయించారు. ఆయనకు ద్వివద కావ్యాలంటే మంచి మోజు. రంగనాథ రామయణాన్ని. ద్వివద భారతాన్ని సవరిష్కృతాలుగా ప్రకటించడానికి పూనుకొన్నారు. ఆంధ్ర కవులలో ఆయనకు వేమన, తిక్కన, పింగళి, సూరవలంటే ఎక్కువ గౌరవం. ఆ మహాకవుల కవితా మార్గాలను విమర్శిస్తూ అసలాంధ్రంలోనే ప్రప్రథముగా నరిక్రొత్త పద్ధతుల్లో సక్రమ విమర్శకెత్తిన బావుటాగా కవిత్వతత్త్వ విచారమనే గ్రంథ రాజాన్ని వెలయించారు. ఆయన కాంధ్ర ప్రబంధాల్లో సూరనగారి కళా పూర్ణోదయమంటే వల్లమాలిన మక్కువ. ఈనాడు ఆంధ్రలో కళాపూర్ణోదయానికింత ప్రతిష్ట కలిగిందంటే దానికాయన విమర్శే కారణం. విదగ్ధుడైన విమర్శకుని యెరపిడింబడిగదా కావ్యాలకు రాణింపు. ఆయన వందొమ్మిది ఏండ్ల యీడప్పుడే కళా పూర్ణోదయం మీద ఒక విమర్శాత్మకమైన వ్యాసం వ్రాశారు. అది వివిధ సభల్లో చదువబడి ప్రసిద్ధ పండితుల ఆమోదం పొందింది. ఆయన ఇంగ్లండులో వున్నప్పుడుగూడా కళాపూర్ణోదయ వ్యాసంగం మానలేదు. అట్టిది ఆయన సాహిత్యాభి నివేశం. ఆంధ్రంలో అన్ని ప్రబంధాలుండగా ఆయన దృష్టిని కళాపూర్ణోదయమే ఎందుకు ఆకర్షించాలి అంటే ఆంధ్ర ప్రబంధ కర్తలలో నూరన చూపెంత విలక్షణమైనదో ఆంధ్ర వాఙ్మయ విమర్శకులలో శ్రీ రెడ్డిగారి తత్త్వం

కూడా అంత విలక్షణమైనదవి తేటతెల్లం అవుతుంది. అయన ఇతర సాహిత్య విమర్శనాత్మక వ్యాసాలు సంపుటీకరింపబడి వ్యాస మంజరి, వంచమి అను పేరుతో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వారిచే ప్రకటించబడ్డాయి. అయిన విశ్వకళా పరిషత్తుకి సంబంధించిన ఇతర పండితులను గూడా విశేషంగా ఆదరించారు. కొందరి గ్రంథాలను విశ్వకళా పరిషత్తు తరపున ప్రకటింపజేశారు. కొందరిని కళా ప్రపూర్ణాది బిరుదులతో సత్కరింపజేశారు. ఆయన సాహిత్య విషయంలో విమర్శన వ్యాసంగం కూడా చేశారు. "యామినీ పూర్ణ తిలక", "ముసలమ్మ మరణము" అనే కావ్యాలు వ్రాశారు. ఆ కావ్య రచనలో గూడా వారి శైలి, భావన విలక్షణమైనది, విశిష్టమైనవి. ఆయన అనేకాధునిక గ్రంథాలకు ముఖబంధాలు సంతరించారు. ఆయన అభిప్రాయమంటే శంఖంలో పోసిన తీర్థంగా పరిగణిస్తూ వుంటే వారాయా గ్రంథ కర్తలు, ఆంధ్ర విశ్వవిద్యాలయ చరిత్రలో నిజంగా ఆయన ప్రాతఃస్మరణీయుడే.

డా॥ రెడ్డిగారి సారస్వత ప్రతిభ

ప్రొఫెసర్ : దివాకర్ల వేంకటావధాని

ప్రపంచమున ప్రతిభాశాలు లెందఱో యుందురు. కాని సర్వతో ముఖమయిన ప్రతిభ గలవారు మిక్కిలి యరుదుగా కన్పింతురు. అట్టివారిలో కీర్తిశేములు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి గారొకరు. చిత్తూరు మండలమునకు చెందిన కట్టమంచిలో జన్మించి, చిత్తూరు నందలి యున్నత పాఠశాల యందును, మద్రాసు క్రైస్తవ కళాశాల యందును, కేంబ్రిడ్జి విద్యాలయమునందును విద్యాభ్యాసము కావించి, ఆర్థిక, రాజకీయ వేత్తయై, కళాశాలా ధ్యక్షుడై, ఆచార్యవర్యుడై, విద్యాశాఖాధికారియై, శాసన సభ్యుడై విశ్వవిద్యాలయోపాధ్యక్షుడై, వాగ్మీవతంసుడై, కవిపుంగవుడై, ఆంధ్ర దేశమునందేగాక యావద్భారతము నందును అఖండ ప్రఖ్యాతి నార్జించిన అపూర్వ మేధానిధి డా॥ కట్టమంచి రామలింగారెడ్డి.

రెడ్డిగారి వాగ్మిత్వ వైభవ మనన్య సాధారణమయినది. ఆంగ్ల దేశమున విద్య నభ్యసించుటతఱి, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘమున నుపాధ్యక్షులుగా నెన్నుకొనబడుట, వారి నాయకత్వ సంపదనే కాక, ఆంగ్లభాషపై వారికిగల అధికారమును కూడ చాటుచున్నది. ఎడనెడ హాస్య చమత్కారముల వలపోకగా గుమ్మరించుచు, వక్తవ్య విషయమును విశద మనోహరముగా విస్తరించుచు, ప్రతి వక్తులకు నాకట్టుకట్టుచు, రాంధ్రాంగ్లభాషలయందు వీనుల విందుగా నుపన్యసించు చుండ వినువారానంద పారవశ్యము పొందెడివారు. వారుపన్యాసములు విషయ వైశద్యమునకును, వాగ్ధాటికిని, భాషా పాటవమునకును, వక్రోక్తి వైభవమునకును

నిలయములై విరాజిల్లుచుండెడివి. నాడు భారతదేశమున వానికెక్కిన మేధావులలోనే కాక, మహావక్తలలో గూడ వారగ్రగణ్యులై పేరుగాంచిరి. ఆంగ్ల ప్రభుత్వము రెడ్డిగారి సర్వతోముఖ ప్రతిభా పాటవము గుర్తించి వారిని నర్ బిరుదముతో గౌరవించినది. ఆంధ్ర విశ్వవిద్యాలయము వారికి డాక్టర్ బిరుదము నొసంగి, తన కృతజ్ఞత తాను వెల్లడించుకొనినది. రెడ్డిగారు జాతీయ వాదులు కాకపోయినా వర ప్రభుత్వము నిరంకుశత్వమును నిరసించి, దేశభక్తిని ప్రకటించిన నన్నివేశములెన్నో యున్నవి.

కవియైవి మర్మకుడై వ్యాసకర్తయై రామలింగారెడ్డిగారాంధ్రసరస్వతి కర్పించిన యుపాయనము లమూల్యములయినవి. 1889లో శ్రీ సమర్థి రంగయ్య శ్రేష్టిగారు క్రైస్తవ కళాశాలయందలి ఆంధ్ర భాషారంజనీ సమాజము వక్షమున కావ్యరచనను ప్రోత్సహించుటకై ఒక పోటీ పరీక్షను ఏర్పరచిరి. రెడ్డిగా రాపోటికి "ముసలమ్మ మరణ"మను కావ్యమును వ్రాసి బహుమానమును సంపాదించిరి. ఇది 1889లో రచింపబడినను 1900లో ప్రచురింపబడినది. రెడ్డిగారు ఇందలి కథను బ్రౌనుదొర గారిచే ప్రకటింపబడిన అనంతపుర చరిత్ర యను గ్రంథము మండి గైకొని రసాధిక్యము నకై కొన్ని నూతన కల్పనలు కావించిరి. అనంతపురమునకు సమీపమున బుక్క రాయ సముద్రము అను గ్రామము కలదు. ఆ వూరి చెరువు కట్టను వేటికిని ముసలమ్మ కట్టయని విలుచుచుందురు. ఆ చెరువు నందలి నీరు పొంగి గట్టు తెగిపోయినపుడు గ్రామ ప్రజలు గ్రామ దేవతయైన పోలేరమ్మను ప్రార్థించిరి. ఆ గ్రామమునందలి ముసలమ్మ యనెడివనిత బలియైనచో ఆపద నివారింపబడునని ఆకాశవాణి చెప్పినది. సతీలలామయు త్యాగశీలయునైన ముసలమ్మ భర్తను, అత్తమామలను, బంధువులను వీడి నీటబడి మునిగి మరణించి గ్రామమును రక్షించినది. ఈ విధముగ నిది మరణాంతమయిన కావ్యము. ఈ మరణాంతము మూలమునందున్నదే గాని కవి కల్పించినది కాదు. సాంఘిక వస్తువును గ్రహించి కావ్యమును రచించుట క్రొత్త ప్రయోగమే అని చెప్పవచ్చు. కాని పద ప్రయోగములో, ఛందస్సులో, వర్ణనలో, పలుకుబడులలో పద్యరచనలో రెడ్డిగారు తిక్కనాది పూర్వకవులను ప్రబంధకవులనే అనుకరించి యుండిరి. అచ్చటచ్చట "ఇలియడ్" వంటి పాశ్చాత్య కావ్యముల పోలికలున్నను ఇందు సంప్రదాయానుసరణమే హెచ్చు. కావ్యము కటుమంచీపుర ధాముడయున కామాక్షీ సహితుని స్తుతితో గూడిన శ్రీకారాదియైన పద్యముతో నారంభింపబడినది. తరువాతి పద్యము త్రిమూర్తి స్తోత్రము. పిమ్మట ప్రబంధ

కవులు పురములు వర్ణింపగా రెడ్డిగారు గ్రామమును వర్ణించిరి. పూర్వకవులు నాయికా నాయకులను రాజవంశముల నుండి గ్రహింపగా రెడ్డిగారు సామాన్య కుటుంబము నుండి గ్రహించిరి. ఇది ఒక నవ్య కవితా లక్షణమే. ఈ విధముగా నీ కావ్యము క్రొత్త ప్రాతల మేలు కలయికతో గూడి ఒక విమర్శకుడన్నట్లు ఇరువదవ శతాబ్ది యుదయింపనున్న వేగుచుక్కలో నాంధ్ర సారస్వతాకాశమున ఒక నక్షత్రమువలె నూత్నకాంతులతో నావిర్భవించినది. వీరి తరువాత లాయప్రోలు వారును, గురజాడ వారును, సమగ్ర లక్షణ సంపన్నమయిన నూతన కావ్యములను సంతరించి నవ యుగమునకు వైతాళికులు కాజాలిరి.

ఆంగ్ల భాషావిశారదులయ్యు నాంధ్ర పారవ్యతము నందలి మాధుర్యముపై మక్కువ విడలేని రసజ్ఞులలో రెడ్డిగారు ప్రథమ గణ్యులు. వారాంధ్రాంగ్ల భాషలు రెండింట అధికమయిన పరిచయము గలవారు. ఆంధ్రమున నంతగాలేక ఆంగ్లమున విస్తృతముగానున్న వాఙ్మయ శాఖలలో విమర్శ యొక్కటి. శ్రీ రెడ్డిగారిది గ్రహించి ఆంగ్లభాషా సంప్రదాయములన్నిటిని అవలోడించినవారు గాన వాని ననుసరించి కవిత్వతత్త్వ విచారమను నుత్తమ గ్రంథమును రచించిరి. ఆంధ్ర వాఙ్మయమున ప్రబంధ యుగమునకును, ప్రబంధయుగము నందలి కవులలో పింగళి సూరనకును ఒక వైశిష్ట్యమున్నది. అప్పటి సంప్రదాయమున కెదురీది నిపరుమాన సౌందర్య కల్పనా విశేషమునకు నిధానమయిన కళా పూర్ణోదయమును మహాకావ్యమును రచించి అతడు పలువురు విమర్శకుల, ముఖ్యముగా ఆంధ్రభాషా విశారదులయిన విమర్శకుల మన్ననలు పొందియుండెను. ఆ కావ్యము రెడ్డిగారి నాకర్షించినది. అందలి శిల్ప చాతుర్యమును ప్రదర్శించుచు, వారి కవిత్వతత్వ విచారము ఆంధ్ర విమర్శవాఙ్మయ మున క్రొత్త మార్గమును చూపినది. సూరన్న అపార ప్రతిభ కది శాశ్వతమయిన కీర్తి ధ్వజము. ప్రబంధ కవులు పద్యరచన యందును పాండిత్య ప్రకటనమున యందును చేసిన ప్రయత్నము కథాకల్పమునందు చేసియుండలేదు. సూరన్న పాండి త్యమునకు శిల్ప గరిమను జోడించి తన కావ్యమును అనన్య సామాన్యము కావించి నాడు. రెడ్డిగారును తక్కిన సువర్ణమును పాశ్చాత్య విమర్శ పద్ధతియను నికషోపలముపై నొరసి, అది విశుద్ధమని లోకమునకు చాటి తమ యుభయ సారవ్యత పారంగ తత్వమును ప్రకటించుకొని యుండిరి.

సూరిన్న శిల్ప వైభవమును గొండాడుచు రెడ్డిగారితర ప్రబంధ కవులను కొంత నిరసించినను, కవిత్రయము వారి ప్రతిభను విస్మరించి యుండలేదు. వారు బాల్యమునందే తండ్రిగారి నోట భారత పద్యములెన్నియో వినియు, ప్రౌఢ వయస్సున తమంత తాము చదివియు త్రిమూర్తులను పోలిన యా కవిశేఖరుల పాండిత్యమును శిల్ప నైపుణ్యమును గ్రహించి యానందించి యుండిరి. వారి రచనలలో ఆంధ్ర మహాభారత ముద్ర పెక్కుచోట్ల కన్పించును. రాజరాజ నరేంద్ర వర్ధంతి సమయమున అధ్యక్ష పీఠమలకంరించి రెడ్డిగారు అనతి విస్తృతములయ్యు, పరమార్థ ప్రతిపాదకములైన పల్కులలో ఆ కవుల రచనా వర్ధతులను శిల్ప చమత్కారములను, తమకు సహజమయిన సుపమర్శ దృష్టితో పరీక్షించి, ప్రపంచించియుండిరి. విద్యాభ్యాసము నకై విదేశముల కేగిన రెడ్డిగారికి అనుదినము తెల్లుతనమును జ్ఞాపకము చేసియున్నది సూరన్న తిక్కనాది మహాకవుల కవిత్వమే.

రెడ్డిగారు ఆంధ్ర విశ్వవిద్యాలయోపాధ్యక్షులుగా నుండినపుడు రంగనాధ రామాయణమును ప్రచురింపించి, దాని కర్తృత్వము రంగనాధునిది కాక, గోనబుద్ధా రెడ్డిదే యని నిరూపించియుండిరి. ఆ కాలము నందలి వలువురు రచయితల రచనలకు వారు వ్రాసిన పీఠికలు వానికలంకారములై ప్రవేశకములవలె నుండుటయేకాక, విషయ సారముచేతను, విజ్ఞాన బాహుళ్యము చేతను, ఉత్తమ సాహిత్య భాగములుగా కూడ గోచరించును. వీరు రచించిన పీఠికలన్నియు ఆంధ్ర విశ్వకళా పరిషత్పక్షమున గ్రంథ రూపమున ప్రకటించబడినవి. ఆంధ్రభాషలో భావనాత్మకములయిన వ్యాసములు లేవను కొరతను, ఈ గ్రంథము తీర్చివైచినవి. దీనియందలి శైలి, స్పష్టమై, భావ గంభీరమై విలసిల్లుచుండును. ఆంగ్లభాషా నిష్ణాతుల ఆంధ్ర శైలికిని, కేవలాంధ్ర పండితుల శైలికిని కొంత తారతమ్యముండును. మొదటిది భావప్రధానము, రెండవది శబ్ద ప్రధానము. ఈ రెడ్డిగారి శైలి మొదటి దానికి సంపూర్ణమైన విదర్శనము.

రెడ్డిగారు అర్థశాస్త్రమును సలక్షణమయిన భాషలో రచించి, శాస్త్ర గ్రంథములు తెలుగులో లేవను లోటును తీర్చియుండిరి. ఆంగ్లభాషలో గిబ్బన్ మహాశయుడు రచించిన రోమ్ దేశ చరిత్ర చరిత్ర గ్రంథమయ్యి సారస్వత సౌరభముతో గుబాళించు చుండునని విమర్శకు లనుచుందురు. తెలుగులో దానికి సాటియై నిలువగల గ్రంథము రెడ్డిగారి అర్థశాస్త్రము. అది శాస్త్ర సారస్వతముల వేకమూర్తిలో జోడించిన యుత్తమ గ్రంథము. రెడ్డిగారాగ్రంథమును తమ ప్రేమకు పాత్రురాలయిన ఒక యువతికి

అంకితము కావించిరి. ఆమె పేరు తెలియదు. ఆమె కంకితము కావించుచు, ఆ గ్రంథ ముఖమున వ్రాసిన పద్యరత్నము లల్ప సంఖ్యాకములయ్యు రసబంధురము లగుటచే నొక చిన్న ఖండకావ్యమని చెప్పదగియున్నవి. ఆ పద్యములలో ప్రేమయు రచనా ప్రౌఢిమయు సమానముగా నున్నవి. ముసలమ్మ మరణమునే కాక, రెడ్డిగారు కొన్ని ఇతర కావ్యములను గూడ రచించియుండిరి. అవి సమగ్రములు కాలేదను కొందును. ఆ యున్న పద్యములలోనే రెడ్డిగారి రచనా సౌందర్యము పదప్రయోగ విధానము సుస్పష్ట మగుచుండును.

ఈ విధముగా శ్రీ రెడ్డిగారు పలు సారస్వత శాఖలలో కృతహస్తులై అపార మయిన కళా ప్రతిభలను ప్రకటించి, ఆంధ్రభాషకు అమేయమయిన యుపకారము కావించినవి. ఆయన రచించిన గ్రంథములు సంఖ్యలో నల్పములయ్యు ఆయా సారస్వత శాఖలకాదర్శప్రాయములు. ఆయన గొప్ప విమర్శకుడు, శాస్త్రవేత్త, వ్యాసకర్త, కవికృతివతి. అన్నిటికీ మించి సాటిలేని వక్త. ఆంధ్రమువైనను ఆంగ్లము వైనను సమానమయిన శక్తితో, భాషా పాటవముతో, చాకచక్యముతో, విరర్గళముగా మాటలాడగల వ్యక్తి. శ్రీ రెడ్డిగారు ఆంధ్ర దేశమున అపార మేధావంతుడుగా పేరు పొందిన ప్రతిభాశాలులలో ఆయన దగినవారు.

కట్టమంచి వారి హాస్య ధోరణి

డాక్టర్ కె. వాసుదేవరావు

ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన వ్యక్తి తెలుగు భాషలోను, ఆంగ్ల భాషలోను అపూర్వమైన ప్రతిభావంతుడుగా రూపొందడం ఎంతో అరుదైన విషయం. కవిగా, విమర్శకుడిగా రెడ్డిగారు తెలుగులో పలు గ్రంథాలు రచించి యున్నారు. "కవిత్వతత్వ విచారము" వంటి గ్రంథాన్ని పోలినది మరొకటి లేదు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలోను, తదుపరి అమెరికాలోను విద్యాభ్యాసము గావించి భారతదేశం తిరిగి వచ్చిన తదుపరి బరోడాలోను, మైసూరులోను, వాల్తేరులోను గొప్ప పదవులు నిర్వహించి రెడ్డిగారుఒకఅర్ధ శతాబ్దంపాటు దేశంలో ఒక ప్రత్యేకంగా స్థానాన్ని సముపార్జించుకొన్నారు. విద్యారంగంతోను, రాజకీయ రంగంతోను రెడ్డిగారికి సన్నిహిత సంబంధం ఉండడంతో వారి ప్రతిభ పలుదిక్కుల ప్రసరించింది. రచయితగా, ఉపన్యాస కేసరిగా, చమత్కార చక్రవర్తిగా రెడ్డిగారిది అద్వితీయ స్థానం. వారి వలుకులలోని వేడిని, వాడిని ఈనాటికీ మనం స్మరించుకుంటున్నామంటే వారు జాతిని ఎంతగా ప్రభావితం గావించారో తెలుస్తుంది. హాస్యం ఆయన స్థిరాస్థి దాన్ని ఆయన లోకానికి వంచియిచ్చాడు. సమయస్ఫూర్తికి ముందు ఆయననే పేర్కొనాలి. నవారు అల్లినట్లుగా మాటలను అల్లి సందర్భానికి తగిన వ్యాఖ్యగావించడమో లేదా ఒక వ్యక్తికి చురక అంటించడమో, అయన చేస్తుండేవాడు. అందువల్లనే రెడ్డిగారి చలోక్తులకు దక్షిణ భారతదేశంలో ఎక్కువ ప్రాచుర్యం వుంది. ఇవ్వాడు కొన్ని ఉదాహరణలు ఇక్కడ పొందువరిస్తే సమంజసంగా వుంటుంది.

రామలింగారెడ్డిగారి తాతగారైన వీరరాఘవరెడ్డిగారి కుటుంబం ఆస్తిని వంచుకొని వేరువేరు భాగాలుగా విడిపోవడం జరిగింది. దీనిని ప్రస్తావిస్తూ రామలింగారెడ్డిగారు "అవ్వాడు ప్రతిజ్ఞాతికి లభించినది కొంచెము నేలయు,నెక్కువ యహంభావమును" అని అంటారు.

వీరి వంశ చరిత్రను ఒక క్లుప్త గ్రంథంగా రాశారు రామలింగారెడ్డిగారు. వారి తండ్రిగారి ప్రతిభను, ఆయన చాందస ధోరణులను, న్యాయవాదిగా ఆయన కున్న పేరు ప్రతిష్టలను చక్కటి శైలిలో వివరించారు.

శ్లేషలో ప్రసంగించడం రెడ్డిగారి ప్రత్యేక గుణం. శ్లేషలో ఆయన వినిరిన వినురులు, గిలిగింతలు పెట్టే వలుకులు కోకొల్లలు. ప్రకాశం పంతులుగారికి ఆయనకు మంచి మైత్రి వుండేది. దానిని పురస్కరించుకొని ఒకసారి రెడ్డిగారు "మన ఆంధ్ర కేసరి ఆంధ్రకే సరి" అని అన్నారు. నెల్లూరు గోడలమీద "వేడి తేనీరు" అని వ్రాసి వుండడం గమనించి చలోక్తిగ "ఏమయ్యా వెడితే తప్ప నీరు యివ్వరా?" అని అన్నారు. గాంధీజీతో ఒకసారి "సత్యం మీ దగ్గర వున్నది, ఆగ్రహం మీ శిష్యుల వద్ద వున్నది" అని సత్యాగ్రహం అనే పదానికి అర్థం చెప్పారు. "జస్టిస్ పార్టీ నాయకులు యిబ్బందులలో వున్నప్పుడు కోయంబత్తూరు వెళ్ళి కుంభకోణం చేస్తారు" అని వారికి కొరడాదెబ్బ తగిలించారు. 1924లో ఎగ్మూర్‌లో వారు ప్రసంగిస్తున్నప్పుడు కొంతమంది తుంటరులు రాళ్ళు విసరటం జరిగింది. అప్పుడు కూడా మంచి హాస్యం ప్రదర్శిస్తూ "రాజకీయాలలో రాతియుగాన్ని ప్రవేశపెట్టిన ఘనత జస్టిస్ పార్టీ వారిదే" అని చురక అంటించారు. బి. వి. నారాయణరెడ్డిగారు రామలింగారెడ్డిగారికి దగ్గర బంధువు. నారాయణరెడ్డిగారు బ్యాంక్ ఆఫ్ మైసూరులో పెద్ద ఉద్యోగి. ఆయన హెూదాకు తగినట్లుగా ఆ బ్యాంక్ వారు ఆయనకు అన్నీ వున్న ఒక భవనాన్ని నివాసంగా యిచ్చారు. ఆ యింటికి మొట్టమొదటి అతిథి రామలింగారెడ్డిగారు. ఆయన అక్కడకు వెళ్ళినపుడు నవ్వుతూ ఒక ప్రశ్న వేశారు. "ఏవయ్యా నారాయణరెడ్డి, నీకు భార్యను కూడా బ్యాంక్ వారు యిచ్చారా?"అప్పుడు నారాయణరెడ్డిగారు "మా మేనకోడలిని నాకు అంటగట్టారు కనుక బ్యాంకు వారిని భార్య కోసం అర్థించవలసిన పనిలేదు" అని అన్నారు.

పి. కమలమ్మ అనే సెనేటు సభ్యురాలు వివాహం చేసుకొని బి. కమలమ్మగా నామాంతరం చెందింది. దీనిమీద వ్యాఖ్యానిస్తూ రెడ్డిగారు "వరుషములు సరళము లైనవన్న మాట" అన్నారు. ఇంత సునిసితంగా వుండేది వారి హాస్యం.

అవతలి మనిషి ఎంత పెద్దవాడైనా, ఎంత ప్రముఖుడైనా రెడ్డిగారు జంకే వాడు కాదు. 1921లో గాంధీగారు ఒక మాట అన్నారు. "వచ్చే సంవత్సరం సెప్టెంబరు 1వ తేదీకి దేశానికి స్వతంత్రం వస్తుంది" అని. దాని మీదట రెడ్డిగారు "మహాత్ములు పొరపడి వుంటారు, ఆయన అనదల్చుకున్నది ఏప్రిల్ 1వ తేదీ అయి వుంటుంది" అని దేశ ప్రజలకు ఒకరకమైన చక్కిలిగిలి పెట్టారు.

"సతీమణి" అనే పదం ఎవరన్నా ప్రయోగిస్తే రెడ్డిగారికి నచ్చేదికాదు. సతీమణి అనగా సతులలో మణి వంటిది అని ఆయన అర్థం. ఈ మాటను ఎవరయినా ప్రయోగిస్తే ఆయన అడిగేవారు "వీరికి ఎందరో భార్యలు" అని. "అందరమూ ఒక గనిలోని మణులమే కదా సోదర సోదరీమణులు అని అనడం ఎందుకు?" అవేవారు.

రామలింగారెడ్డిగారు ప్రోఛాన్సలరుగా వున్నపుడు ఒక బంగళాలో వుండేవారు. ఆబంగళాలో అంతకుముందు సుల్తాన్ మొహిద్దీన్ అనే ఆయన వుండేవాడు. రెడ్డిగారు ఆ భవంతిలోనే వున్నప్పుడు టెలిఫోను ఎప్పుడు మ్రోగినా ఆయనే రిసీవరు ఎత్తి మాట్లాడేవారు. ఒక రోజున అలాగే ఫోను మ్రోగింది. రెడ్డిగారు కొంచెం విసుగ్గా ఫోను ఎత్తి "హలో" అన్నారు. "సుల్తాన్ మొహిద్దీనేనా మాట్లాడేది" అని అవతలి కంఠం ప్రశ్నించింది. కోపంలో కూడా రెడ్డిగారు అద్భుతమైన హాస్యాన్ని ప్రదర్శించారు. "నేను సుల్తాన్‌నే కానీ మొహిద్దీన్ గాడిని మాత్రం కాదు."

స్వరాజ్యం రాకముందు జాతీయ ప్రభుత్వంలో మౌలానా అబ్దుల్ కలామ్ అజాద్ విద్యాశాఖ మంత్రిగా వుండేవారు. ఆ శాఖలో కార్యదర్శి పదవిని స్వీకరించమని ఆయన రామలింగారెడ్డిగారిని ఆహ్వానించడం జరిగింది. ఆ ఆహ్వానానికి జవాబుగా రెడ్డిగారు "యిద్దరు విద్యాశాఖా మాత్యులు వుండతగునా" అని ఆయన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ ఆహ్వానాన్ని తిరస్కరించారు.

బెజవాడను బ్లేజ్‌వాడ అన్నది కూడ రెడ్డిగారే. కొత్త పదాలు ప్రయోగించడంలో రెడ్డిగారు దిట్ట. 'ఖద్దర్ కాన్‌స్టిట్యూషన్', "వెర్నాక్యులర్ డయిట్", సిద్ధి లేని ప్రసిద్ధి మొదలగునవి ఎన్నో వున్నాయి.

• రెడ్డిగారు ప్రవచించిన కొన్ని సూక్తులు :

రక్షించుటకు శక్తిలేనిచో సృష్టించుట మహాపాతకం.

• వామనావతారము సైతము విష్ణువే. రసాత్మకమైనది ఒక వాక్యమైనను గావ్యమే. బింబములకు ప్రతిబింబముల సుక్కాదించుట కవి చేయవలసిన వనికాదు. మఱి ఫోటో గ్రాపరుది.

అందరూ అందులైన రంభలుకాని రమణులుందురే !

విషయము ప్రధానమైనది గద్యము, రసప్రధానమైనది పద్యము.

నీడలేని వస్తువులేనట్లు లోపములులేని పరిపూర్ణలెట్టి పట్టు బట్టి వెతికినను దొరకరు.

• ఒక వ్యక్తి మరణించిన తరువాత కొంతకాలమునకు కాని వాని జీవిత చరిత్ర వ్రాయడం మంచిది కాదు.

అతి క్లుప్తమైన ప్రసంగమే అతి గంభీరోపన్యాస మౌతుంది.

•

సంకల్పం కార్యరూపం దాల్చని ఎడల అది నూనెలేని దీవమే అవుతుంది.

కాంతి తక్కువ, మసి మెండు.

ఒకసారి మిశ్రమ మంత్రి వర్గాన్ని ఏర్పరిస్తే బాగా వుంటుందని ఆయన రాజాజీకి సలహా యిచ్చారు. దానిమీదట "మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసి నాలుగు వెలలే గదా అయింది. యింతలో మార్పు ఎందుకు ?" అని రాజాజీ అన్నారు. దానికి రెడ్డిగారు నవ్వుతూ "స్వామి వేను గణిత శాస్త్రం గురించి కాదు మాట్లాడేది. రాజకీయశాస్త్రం గురించి" అన్నారు.

నాగపూర్‌లోని మహిళా కళాశాలను దర్శించినప్పుడు విద్యార్థినుల వసతి గృహంలో ఎలుకల బాధ ఎక్కువగా నున్నదని ఒకరు రెడ్డిగారితో చెప్పారు. దానికి రెడ్డిగారు "యిదేమి చోద్యం పిల్లులు ఎక్కువుగా నున్నవి గదా మీకు ఎలుకల బాధ ఎలా వుంటుంది" అన్నారు.

ఒకాయన ఒకసారి రెడ్డిగారిని ప్రశ్నించాడు, 'ఏమండీ! హోమ్‌సైన్సు, హోమ్‌సైన్సు అంటున్నారు. అసలీ హోమ్‌సైన్సు అనేది ఏమిటి ?" అని.

దానికి తడుముకోకుండా రెడ్డిగారు, "ఏమీ లేదండీ, చీపురు కట్టను వేల మీద తక్కువ సార్లు, భర్త మీద ఎక్కువసార్లు ప్రయోగించటమే హౌస్ట్రైన్స్ అవుతుంది" అన్నారు.

అసెంబ్లీలో ఎప్పుడూ నోరు మెదపని శాపన సభ్యులను ఆయన చక్కటి ధోరణిలో వర్ణించారు. "వీరు ముద్ద మింగుటకును, ఆవలించుటకును మాత్రమే నోరు తెరిచెదరు" అని. సాహితీ సంవదలోను, హాస్య సంవదలోను రెడ్డిగారు మనకు చిరకాలం గుర్తుంటారు. విన్స్టన్ చర్చిల్‌ని ఉదహరించినట్లు, బెర్నార్డ్‌షాని ఉదహరించినట్లు, అనేక సందర్భాలలో రెడ్డిగారి సూక్తులను, హాస్యోదంతాలను సంస్కారులైనవారు, విద్యాధికులు ఉదహరిస్తూ వుంటారు. యిటువంటి కీర్తి భారతదేశంలో మరియొకరికి లేదని చెప్పవచ్చు.

రెడ్డిగారి ఛలోక్తులు ఎన్నో ప్రచారంలో వున్నాయి. ఉన్నతశ్రేణి వ్యంగ్యం, మాటకు మాట అంటించే కుశలబుద్ధి రెడ్డిగారి సొత్తు. విద్యార్థులపైన, ఉపాధ్యాయుల పైన, విశ్వవిద్యాలయాలపైన, ప్రభుత్వముపైన, సాహిత్య ధోరణులపైన, ఒకటేమిటి సర్వ విషయముల మీద రెడ్డిగారు గావించిన వ్యాఖ్యలమ ఒక బృహద్గ్రంధముగా ప్రచురించవచ్చు. "మన పూర్వీకులు నిజముగా గొప్పవారైన యెడల వారి వారసులు యింత చచ్చుగా ఉన్నారేం" అని అనడం రెడ్డిగారికే చెల్లింది. ఆయన వ్యాసాలనుండి, ఉపన్యాసాలనుండి, లేఖలనుండి ఆయన చమత్కార ధోరణి మనం బాగా అర్థం చేసుకోవచ్చు. రామలింగారెడ్డిగారి హాస్య సంవద ఒక తరగని గని. ఈ సంవదను వెలుగులోకితీసుకువచ్చి అందరికీ అందివ్వడానికి ప్రభుత్వము, అకాడమీలు విశ్వవిద్యాలయాలు కృషి చేస్తే బాగుంటుంది.

కట్టమంచి వారి వేమన పరిష్కృతి

శ్రీ సోమసుందర్

శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి ఆంధ్ర జాతీయ పునరుజ్జీవనములో నిస్సందేహంగా నిర్మాతలలో ఒకరు. ఈ శతాబ్దారంభం నాటికే మునలమ్మ మరణం అనే లఘు కావ్యాన్ని జాతికిచ్చారు. ఖండకావ్య ఆవిర్భావానికీ నవ్యకవితా రీతికీ ప్రథమ దోహద కారులయ్యారు. గతానుగతి ప్రబంధక ధోరణులకు తిలోదకాలిచ్చారు. అష్టాదశ వర్ణనల కష్టదశల గబ్బుకు అంత్యక్రియలు జరిపారు.

మేధావిగా, విద్యావేత్తగా, ఆంధ్రభాషా పాండితీ వల్లభునిగా బహుముఖ ప్రజ్ఞా ధురీణులై అమరత్వం సాధించారు కట్టమంచి. ఆధునిక కవిత్వానికి 1910లో నవోదయం కలిగితే, ఆధునిక విమర్శనారీతికి 1914లో కట్టమంచి ప్రారంభకులయ్యారు.

పునరుజ్జీవన దశలో అవతారం దాల్చిన మహనీయులందరికీ ఆత్మవైరుధ్యాలు తప్పలేదు. కట్టమంచికీ తప్పలేదు. శ్రీ రమణారెడ్డి చెప్పినట్లు కట్టమంచికి రెండు రకాల ముఖాలూ తప్పలేదు. వైదిక మతాచారంలోని బ్రాహ్మణాధిక్యతను వైదొలగించుకొనేందుకు ఆనాటి మేధావులంతా ప్రయత్నించారు. బ్రహ్మణేతర మేధావులలో సనాతనాచార వ్యతిరేకత స్వజాతి అభిమానంగా రూపొందలేకపోలేదు. దానితోపాటు నీడలా బ్రాహ్మణ జాతి ద్వేషం సైతం విజృంభించడం మానలేదు.

బ్రాహ్మణీకాన్ని ద్వేషించడం వేరు, బ్రాహ్మణులను ద్వేషించడం వేరు అవే స్పష్టమైన వింగడింపు లోపించింది. బ్రిటిమ ప్రభువులకు జోహుకుందారులుగా వుండటం జాతీయ స్వాతంత్ర్య పోరాట ఫటిమను వెన్నుపోటు పొడవడమే అవే విజ్ఞత సైతం లోపించి జస్టిస్ పార్టీకి బ్రాహ్మణేతర మేథావులంతా దోహదం చేయడమూ జరిగింది. ఆ పొరబాటుకు మహామేథావి కట్టమంచి సైతం మినహాయింపు కాలేక పోవడం శోచనీయమే!

స్వజాతి అభిమానంతోనే రంగనాదరామాయణం గోనబుద్ధారెడ్డి కృతమేనని ఆచార్య పింగళి వారిచేత ఉద్ఘాటింపచేశాడు కట్టమంచి. వేమన ప్రాథమికంగా రెడ్డి కులజుడు కనుకనే అతనిపట్ల ప్రత్యేకాభిమానం వెరిపాడు. రాళ్ళపల్లి వారివి ఉత్తమ వ్యాఖ్యాతగా ఎన్నుకొన్నాడు. వీరిరువురినీ తన చెప్పుచేతల్లో వడుచుకోకా వెంచాలుగా ఉపయోగించుకున్నారని, నేవథ్య భూమిక కట్టమంచిదేననీ బ్రాహ్మణ పండితులీ దేశంలో చిరకాలంగా గుసగుసలాడుతున్నదే!

వేమన యోగి కులపు కట్టువేగాక, భవబంధాలను సైతం త్రెంచుకొని విశ్వ రూప మెత్తిన మహనీయుడు. బ్రాహ్మణీకంలో పాతుకుపోయిన దురాచారాలను తీవ్రంగా అభిశంసించాడు. కుల బ్రాహ్మణులను ఆ నేరం వల్ల ద్వేషించలేదు. తన సొంత కులం కనక రెడ్డి కులాన్ని ఎక్కడా వెత్తికెత్తుకోనూలేదు. వేమన ప్రధానంగా కారణ విమర్శకు సింహాసన స్థితి కలిగించిన ఆద్యుడు. సామాన్య ప్రజలలో వివేచన కలిగించిన ప్రవక్త! ఐతే దురదృష్టవశాత్తు ఏ మహాప్రవక్త అవతరిణ వల్లనూ జాతి శాశ్వత పురోగమనం సాధించదు. తక్కాలంలో మూడడుగులు ముందుకు వేసినట్లే వేసి అంతకన్న వేగంగా తర్వాత వది అడుగులు వెనక్కిపోతూ వుండడమే కనిపిస్తుంది.

బౌద్ధ జైన మతాచార్యులు క్రీస్తుకు పూర్వంనుంచీ మనదేశంలో కారణ విమర్శ వెంతో ప్రభావితం చేశారు. చార్వాకుల వాదం ఈ దేశ జీవవ స్రవంతిపై తక్కువ ప్రభావమేమీ కలిగించలేదు. వదకొండో శతాబ్దికి చెందిన వీరబసవేశ్వర మహారాజు దక్షిణ వథంలో కారణ విమర్శకు దోహదం చేశాడు. వర్ణాశ్రమ ధర్మాల కుటిల నీతిని తుత్తునియలు చేశాడు. వెంకటాద్రి ఆస్థానపదకర్త అన్నమాచార్యులు వధ్నాలుగో శతాబ్దికి చెందినవాడు. ఆయన సైతం పదావళిలో ఎంతో సమాజ వాస్తవికతను

ప్రతిబింబించాడు. వివేకబద్ధమైన యుక్తివాదాల నెన్నిటికో ప్రాతినిధ్యం కల్పించాడు. ఆవిధంగా చూస్తే హేతుబద్ధమైన విమర్శకూ, దురాచారఖండనకూ, కులతత్వ నిర్మూలనకూ వేమనయోగి ప్రవృద్ధముడు కాకపోవచ్చు. కాని సామాన్య ప్రజానీకాన్ని కదిల్చి, వారి తలలో నాలుకలా రూపొందిన ప్రథమ ప్రవక్త మాత్రం వేమన అనడం నిస్సంశయం!

సమకాలికుల నుంచి తరతరాలుగా పశ్చాద్భ్రుక్కులైన పండితులు వేమనను అంతగా తిరస్కరించడానికి కారణం అదే! కాని సామాన్యులు మాత్రం వేమన పద్యాలను తమ మార్గదర్శక సూత్రాలుగా భావించి హృదయాలలో దాచుకున్నారు. తరం నుంచి తరానికి అందించారు. మహనీయుడు బ్రౌను వేమన పద్యాల విశిష్ట పాత్రను సముద్ధరించడానికి నిరాడంబరంగా సహాయభూతులైన వారు సామాన్య ప్రజలే!

ఈ శతాబ్ది ప్రథమ పాదం నాటికే కట్టమంచి వారిపై వేమన ప్రభావ రశ్మి సోకింది. కుల బ్రాహ్మణులు ఇతర కులాలపై ఏలుబడి సాగిస్తున్నారని, సర్వవిధాలా అణగద్రొక్కుతున్నారని కట్టమంచి అదినుంచీ భావిస్తూవచ్చారు. ఈ భావ ప్రేరణతోనే ఆయన రెడ్డి కులోద్ధరణకు కృషి సల్పారు. రెడ్డి జన మహాసభలు జరిపించారు. రెడ్డి హాస్టల్స్‌కు దోహదం చేశారు. ఇదే భావం ఆయన్ని చివరికి రాజకీయ ప్రవేశం కావించింది. జస్టిస్ పార్టీలో చేర్చింది. రాజకీయ కార్యకలాపాలకి పూనుకొని, విద్యావేత్తగా మేధావిగా రచయితగా చేయవలసిన కృషికి గ్రహణం పట్టించింది. మంత్రాంగంలోని కెగబడాలన్న వెలచారు కోరికకు సైతం అర్రులు సాచేట్లు చేసింది. ఈదశ కట్టమంచి జీవితంలో నిజంగా కారు మేఘాలు క్రమ్మిన దుర్దశగా పరిణమించింది.

అభిమానం ఆరోగ్యకరమైనదైతే, దురాభిమానం జాడ్యంగా రూపొందక మానదు. అది సకల కాంతుల్ని మింగివేస్తుంది కట్టమంచి జీవితంలో జస్టిస్ పార్టీ ప్రవేశం అదే ఫలితానిచ్చింది.

ఈ మహామేధావి ఆధ్వర్యంలో నెలకొన్న ఆంధ్ర విశ్వకళా పరిషత్ వాసిరెడ్డి శ్రీకృష్ణ వరకూ అమోఘ వారసత్వాన్ని ప్రోదిచేస్తూ పురోగమించింది. ఆ తర్వాత కాలంలో పేరిగాడి దర్బారుగా మారిపోయింది. విశ్వకళా పరిషత్ అధికార లాంఛ

నావికే కాక, అక్షరాలా నాగసర్పాల పాలనకు యూనివర్శిటీయే గురయింది. దీర్ఘ రోగానికీ ఆకరమయింది. "మేకలు వెళ్ళాయి ఆవులు వచ్చాయి" అని ప్రజలలో వ్యాపించిన నానుడిని (ఏవైతేవేం ఉత్త సాధు మృగాలేనవి ప్రజల వ్యంగ్యం) శ్రీ సాంబశివరావు పరాస్తం జేయగలరనే ఆశ అప్మదాదులకుంది. ఆయన స్వయంగా మేధావీ హేతువాదీ కావడం ఉపాధ్యక్ష పదవికే భూషణంగా ఆశించడంలో వేరాశ లేదు. దానికి ప్రతిబింబంగానే ఈ పరిశోధన పత్రంవంటి గ్రంథాలు వెలువడుతున్నాయేమో! విశ్వవిద్యాలయం వారి ప్రచురణలు ముఖపత్రం మొదలుకొని ఒకే మూసగా చప్పిడి పిండి దావతుగా వెలువడుతూండేవి. కట్టమంచివారి పుస్తకాలూ అదే వైఖరి. ముఖ్యంగా ముట్టుకుంటే విరిగి ముక్కలురాలే అట్ట కట్టమంచి పంచమి గ్రంథానికి ఎక్కడలభించిందో విశ్వవిద్యాలయ ప్రచురణశాఖకే తెలియాలి. అలాంటిదీ గ్రంథ ప్రచురణ ఎంతో హుందాగా సాగింది. ముఖ పత్రాలంకరణ శ్రీ అబ్బూరి గోపాలకృష్ణ ధర్మమా అని ఎంతో ఆధునికతను సంతరించుకొంది. ఐతే గ్రంథశీర్షిక అక్షరమాల కూర్పు అక్షరాలతో ప్రత్యక్షంకావడం దీటుగాలేదు. వేమన, కట్టమంచిల రేఖాచిత్రాలు ఖాళీలలో పొందువరిస్తే మరింత హృద్యంగా వుండేది. ఏమైనా ఈ గ్రంథం యూనివర్సిటీ ప్రచురణలలో వినూత్న సంప్రదాయం నెలకొల్పింది. బంగోరె సాధించిన ఆధునిక పరిశోధనా రీతికి అద్దం పట్టింది.

ఈ గ్రంథానికి పన్నెండు పుటల విపులపీఠికలో వేమనోపన్యాసాల నేపథ్యాన్ని సాధికారికంగా వివరించాడు బంగోరె. సి. ఆర్. రెడ్డిని నడిపించిన చారిత్రకశక్తులు అవే మరో ఎనిమిది పుటల వ్యాసం ఎంతో ప్రధానమైంది. ఇది ఈ గ్రంథానికి ప్రాణం వంటింది. శ్రీ బంగోరె ఎంత వీరవ్యావహారిక వాది అయినా 'శృతి శెలవు' వంటి విక్రుతాక్షరి (Spelling mistakes) సంధించడం శోచనీయం కాకపోదు.

వేమనోపన్యాసాల నేపథ్యంలో సర్వశ్రీ ఆరుద్ర, నార్ల, రమణారెడ్డి ప్రభృతులు విమర్శల నుంచి కొన్ని వాక్యాలు ఉల్లేఖించి వ్యాఖ్యానించారు. "ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారు యింకా కొంతయౌదార్యము వహించి వ్రాతప్రతులను సేకరించి నంప్రతించి, సవిర్శముగా వేమన పద్యముల నూతన ముద్రణ మొకటి చేసి పుణ్యము కట్టుకొందురు గాక!" అంటూ రాళ్ళపల్లి వారు చేసిన ఆక్రోశం - రెడ్డిగారి కాలం నుంచి వేటి వరకూ అరణ్య రోదనంగానే మిగిలిపోయింది. శ్రీ ఆవులవారి యాజమాన్యంలోనైనా ఆ సత్కార్యం జరగాలని బంగోరె న్యాయంగానే ఆశించారు.

'విద్య ప్రణాళికగా వేమన పద్య అవస్థలు: సి. ఆ . రెడ్డిని నడిపించిన చారిత్రక శక్తులు' అనే వ్యాసం ఎన్నో అంశాలతో హృద్యం ర్ సాగింది. న్యాయం సమృద్ధంగా తనరారింది. పుట 41 అథోజ్ఞాపికలో "రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో యేర్పడి, ముడ్నాళ్ళ ముచ్చటగా బ్రతికిన యోగివేమన తెలుగు విజ్ఞాన కేంద్రం" గురించి బంగోరె ప్రస్తావించే వరకూ అతీగతీ లేకుండా అది రాలిపోయిందవే సంగతి తెలియదు. చెన్నారెడ్డి ప్రభుత్వం కొన్ని లక్షల నిధి కేటాయించి, బ్రహ్మాండమైన భవన నిర్మాణాది కార్యక్రమాలకు ప్రణాళిక సిద్ధపరచింది. అలాంటి యోగివేమన తెలుగు విజ్ఞాన కేంద్రం ఎందువల్ల మూడ్నాళ్ళ ముచ్చటగా మారిపోయింది ? తర్వాత అధికారంలోకి వచ్చిన పేరయ్య మహారాజువంటి అంజయ్య ప్రభుత్వం ఆ నిధులను ఎలా బుట్టదాఖలు చేయగలిగింది? మధ్యలో ఏ ఛాయాగ్రహా లడ్డువడి గుటకాయస్వాహా చేశాయి? ఇంతటి దుర్మార్గ చరిత్రను బంగోరె కన్న సాధికారికంగా వెల్లడించగలవారు మరొకరు లేరు! ఆపని బంగోరె చేయలేదు.

అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు, బ్రాహ్మణేతరాభిమానులు వీరేశలింగాన్ని చిన్న సైజు జస్టిస్ పార్టీయుణ్ణిగా మార్చి ఉగ్గడిస్తున్న సందర్భంలో ఒక Religious and Philosophical Turn యిచ్చి మాట్లాడిన ఉపన్యాసంలో "వేమన యోగి చేసిన బోధలకంటె బ్రహ్మసమాజము వినిపించిన నూతన మత సందేశము లేదు' అనడం అవిచార పూరితమే: వేమనయోగి కాని, బసవేశ్వరుడు కాని ఆయా చారిత్రక కలావధులకు లోబడిన ప్రవక్తలు, స్త్రీని కట్టు బానిసగా మార్చుకొన్న హ్యూడలిస్టు వ్యవస్థలో ఉద్భవించి, స్త్రీ జాతి వల్లనే పురుషుని పతనం ఏర్పడుతున్నదని నమ్మినవారు. వారి ప్రవచనాలలో స్త్రీ పట్ల తూష్ణీభావమే పెచ్చరిల్లింది. జాతి పునరుజ్జీవనాకాంక్షలను వెదుకుతూ ఉద్భవించిన బ్రహ్మసమాజము స్త్రీ, పురుషుల సమానధర్మాన్ని ప్రచించింది. స్త్రీ జనోద్ధరణకు కంకణం కట్టుకొన్నది. ఆధునిక కాలానుగుణంగా భారతజాతిని సముద్ధరించ పూనుకొన్నది. ఇది చారిత్రకమైన విభేదం. రెండింటా వున్న కారణ విమర్శకు వ్యామోహపడి అక్కిరాజు చారిత్రక పరిశీలనా దృష్టిని లోపింపచేసుకున్నాడు. ఆదోషాన్ని గుణంగా భావించి బంగోరె ఉల్లేఖించడం ప్రమాదం. ఆధునికుడైన బంగోరె ఎందువల్లనో సదాన్వీక్ష్య అందించలేకపోయాడు.

రాజమండ్రి ట్రెయినింగు కాలేజి కెమిస్ట్రీ లెక్చరర్ వేమూరి విశ్వనాథశర్మ గారు ఆంధ్ర దినపత్రికలో సీరియల్‌గా, వంగూరి వారి పుస్తకం పై ప్రచురించిన సమీక్షా వ్యాసాలు కట్టమంచిని అంతగా ఆకర్షించాయంటే అవి ఎంతో శాస్త్రీయ విమర్శతో సాగినవని అర్థమవుతుంది. వేమూరి, రాళ్ళవల్లికి రాసిన లేఖాంశాలు దొరికినంత వరకూ సేకరించి ప్రచురించారు. వేమూరి వారు వేమన పద్యాలకు ఒక వినూత్న దృక్పథాన్ని అందించారు. తులనాత్మకంగా ధ్రువపరిచారు. ఆ అంశాలను బట్టి చూస్తే కట్టమంచి ప్రభృతులు భావించినట్లు వేమన పామరుడు కాదని తెల్లమవుతుంది. వేమన శాస్త్రీయ విద్యా పారంగతుడు. శుద్ధాద్వైతి శాక్తేయ సాంఖ్యాది శాస్త్ర పరాయణుడు. ఆట వెలది అయితేన్నం వద్యనిర్మాణ దక్షతలో ఎంతో సాధనాభ్యాసాలతో గణనకెక్కినవాడు. తరువాతి కాలం వారు తమ ఉబలాటం కొద్ది కొన్ని నమూనా పద్యాలను వేమన పద్యాలుగా చెలామణి చేశారు. కనుకనే వేమూ వారంటున్న నూటికి 90 వరకూ వేమన పద్యాలలో ప్రక్షిప్తాలున్నాయన్న మాట విచారణీయమే. వేమూరి ఒక అపూర్వ కాంతిరేఖ ప్రసరించారు. ఆ సమీక్షావ్యాసాలను ఆంధ్ర దినపత్రికల నుంచి పునరుద్ధరించి ప్రచురించడం అవసరం. ఆ వ్యాసాలను ఈ గ్రంథాను బంధంగానే ప్రచురించాలన్న కర్తవ్యాన్ని బంగోరె ఎందుకు విస్మరించారో అర్థంకాదు!

ఈ గ్రంథాను బంధంగా చేర్చిన సి. ఆర్. రెడ్డి లేఖలలో ఎన్నో అపురూప విషయాలున్నాయి. వేటికాలపు సాహిత్యాభిమానులు నిత్యం మననం చేసుకోవలసిన వాక్యాలూ వున్నాయి; ముఖ్యంగా 8-5-28 నాటి లేఖలు ఇలా అంటారు. "We being mostly the illegitimate children of VYASA, who never had any legitimate issue." అవే వాక్యం ఆలోచిస్తే ఎంతో సత్యసమ్మతంగా భాసిస్తుంది. వ్యాసువి అక్రమ సంతానమే భారత జాతికి మూలపురుషులు. వ్యాసుడొక అస్పృశ్య వనితస్త్రీ, కుమారుడు. ఈ సత్యం మరచి లేనిపోని డంబాచారాలతో భారతజాతి కులాల కృతక కుడ్యాలు నిర్మించుకొని తన్ను తాను మోసం చేసుకుంటూ వచ్చింది. వర్ణాశ్రమ ధర్మాల మెట్లతో కుతంత్రం జరిపింది. ఇంత ఆలోచనని ఆ వాక్యం ప్రోదిచేస్తోంది. అదే లేఖలో కట్టమంచి మరో మంచి మాట అన్నారు. "Hindu society like a deceased organ converts even wholesome food into the substance of its own malady" (పు. 64) అని తరతరాలుగా

భారతజాతి తన సంకుచిత దృష్టితో సాధించిన మహా విజయం చివరికి ఇంతకన్న వేరొకటుందా?

తామ "వ్యాస వ్యతిరేకిన'ని కట్టమంచి ఎంతగా ఉద్ఘాటించుకొన్నా కాల దోషాల ఫలితంగా ప్రచలితమైన సనాతన ధోరణులను పూర్తిగా విసర్జించుకోలేక పోయాడు! తిరోగమన తమస్సులుగా స్థిరపడిన వాటిని సైతం కొన్నిటిని వైదొలగించుకోలేకపోయాడు. ఐనా వ్యక్తిగతంగా ఆయన ప్రేమాభిమానాలు కులాతీతంగా మతాతీతంగా కేంద్రీకృతమయ్యాయనడానికి ఏన్నో దాఖలాలు దొరుకుతాయి. ఉదాహరణకు :

675 పుటలలో రాళ్ళపల్లి వారికి రాసిన ఆంగ్ల లేఖలు ఒక ఉదంతంవుంది. కట్టమంచి మైసూరులో విద్యాధికారిగా ఉద్యోగం చేస్తున్న జులలో ఒక గుర్రం బగ్గీ వుండేది. దాని సారధి ఒక ముస్లిం. అతనీ లేఖా కాలానికి ఎక్కడున్నాడో అసలున్నాడో లేదో తెలియదు. కాని అతని చిరునామా సంపాదించి తనరాక నతనికి తెలుపుచు చేయమని రాళ్ళపల్లిని కోరుతాడు. అతని భార్య కట్టమంచివారి కుమార్తెకు ఎంతో యిష్టమైన వ్యక్తి అని, ఆమెని చూడాలని పదే పదే కోరుతున్నదనీ, తనతో తన కుమార్తెకూడా బెంగుళూరు రాగలదనీ తెల్పారు. ఆయన ప్రేమాభిమానాలకు యింతకన్న వేరే మచ్చుతునక ఎందుకు?

"అంటరాని వారుగా అణగ ద్రొక్కబడిన హరిజనులకు తొలుదొల్త పాఠశాల ప్రవేశమునకు అవకాశం కలిగించిన హరిజన బంధువు"గా కట్టమంచిని శ్రీగొర్రెపాటి వెంకట సుబ్బయ్య (పుట 53) కీర్తించిన వాక్యాన్ని బంగోరె ఉల్లేఖించారు. కట్టమంచి మైసూరు ప్రభుత్వ విద్యాధికారిగా ఉన్నది ఈ శతాబ్దపు రెండు మూడు దశాబ్దాల లోనని మనం మరువకూడదు. అనాడు హరిజనోద్ధరణకు పూనుకోవడం నిజంగా అసిధారావ్రతమే! అలాంటి అసంఖ్యాక సాహసకృత్యాలకు పూనుకొన్న కట్టమంచి మహత్తర శేముషీధురీణుడు. అలాంటి కట్టమంచిని వేమనయోగి ఆకర్షించడంలో అబ్బురంలేదు. సంకుచిత భాషా వ్యామోహాలతోనూ, వ్యాకరణ శృంఖలాలతోనూ వేమన యోగిని వెలకట్టి తిరస్కరించి వుంటేనే ఆశ్చర్యకరంగా చెప్పుకోవలసిన సంగతి!

★

ముసలమ్మ మరణము

శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు

అది 1899వ సంవత్సరము. మద్రాసు నందలి క్రైస్తవ కళాశాల. ఈ కళాశాలలో "ఆంధ్రభాషాభి రంజని"యను సమాజము కలదు. దీని పోషకులు శ్రీ సమర్థి రంగయ్యసెట్టి. వీరుత్తమ కావ్యరచనములను ప్రోత్సహించుటకు బహుమాన కావ్య వర్ధతి వెలకొల్పిరి. ఈ కావ్యరచనా వరీక్షలో చిత్తూరికి సమీపమున నున్న కట్టమంచి యను గ్రామము నుండి వచ్చి, క్రైస్తవ కళాశాలలో జదువుచున్న యొక విద్యార్థి నెగ్గెను. అవ్వటికీ విద్యార్థి పందొమ్మిదేండ్ల యీడు వాడు. ఇతడు రచించిన "ముసలమ్మ మరణము" అను లఘు కధా కావ్యము రచనా వరీక్షలో బహుమాన యోగ్య మయినది. ఆవాటి కవి పండితుల పొగడ్తలు పొందినది. దీనిని రచించిన యువకవి యెవ్వడో కాడు. తదనంతర కాలమున నవీనాంధ్ర సాహిత్య విమర్శ పితామహుడుగా, ఆంధ్ర విశ్వవిద్యాలయ సంవర్ధనాచార్యుడుగా, విద్యావేత్తగా, రాజనీతి కోవిదుడుగా అఖండ యశస్సు నార్జించిన కట్టమంచి రామలింగారెడ్డియే.

పందొమ్మిదేండ్ల యీడు నందే రామలింగారెడ్డిగారు బహుమాన పాత్రమయిన కావ్యమును రచించి, ప్రఖ్యాత కవి పండితుల ప్రశంసలు పొందుట వింతగాదు. వీరి తండ్రి కట్టమంచి సుబ్రహ్మణ్యరెడ్డి. ఈ తండ్రి యాబిడ్డనికి జన్మమునే కాదు శిష్టసాహిత్యాభిరుచిని సైతము ప్రసాదించెను. విశేషించి యాంధ్ర మహాభారతము పట్ల శ్రీ రామలింగారెడ్డి కేర్పడిన మక్కువకు సుబ్రమణ్యరెడ్డిగారే కారణము. నిరంతర భారత సమారాధనము వీరియింట గొనసాగె ననుట యత్యుక్తి గాదు.

దీనికి ఫలమే సుబ్రహ్మణ్యరెడ్డిగారు సంధానించిన "భారతసార రత్నావళి" అసలు రామలింగారెడ్డిగారి సాహితీ వ్యాసంగ మంతయు సుబ్రహ్మణ్య రెడ్డిగారు "ఆతతగతి నాటిన విద్యాతతుల ఫలంబు" ()

"ముసలమ్మ మరణము" కథా రంగము బుక్కరాయ సముద్రము. ఇది యనంతపురమునకు సమీపమున నున్న గ్రామము. చిక్కప్ప ఒడయ రనువాడు అనంతపురమును, బుక్కరాయ సముద్రమును నిర్మించె నట! ఇతడీ రెండు గ్రామముల నడుమ నొక పెద్ద చెఱువు త్రవ్వించి దానికి సముద్ర మను పేరు పెట్టె నట!

చెఱువులకు సముద్రమను పేరు పెట్టుట ప్రాచీన కాలము నాటి యాచారమే. గణపతి దేవ చక్రవర్తి సేవానులలో చౌండ సేనావతి యొకడు. ఇతడొక తటాకమును నిర్మించెను. దీని పేరు చౌండ నముద్రము(1) ఈ కాలమునసే యెఱుక సానమ్మ యెఱుక సముద్రమును, లక్ష్మీ సముద్రమును నిర్మించెను(2). గణపతిదేవ చక్రవర్తి సోదరి కుందమాంబ. ఈమె కుందసముద్రమను తటాకము త్రవ్వించెను(3) పెదకోమటి వేమారెడ్డి భార్య సూరమాంబ యొక తటాకమును నిర్మించెను. దీనిపేరు సంతాన సాగరము. శ్రీనాథుడు దీనిని ప్రౌఢముగా వర్ణించెను(4).

పూర్వకాలమున గ్రామములు నిర్మించి, వాని సమీపమున జలాశయములు నిర్మించుట సదాచార మయినది. ఈ గ్రామములకు జలాశయములకు నామధేయ మొకటిగా మండెడిది. చౌండచమూపతి చౌండపురమును, చౌండ సముద్రమును నిర్మించెను. ఎఱుకసానమ్మ యెఱుక పురమును, ఎఱుక సముద్రమును గావించెను. కుందమాంబ కుందవరమును, కుంద సముద్రమును నిర్మించెను. ఈ యాచారము ననుసరించియే చిక్కప్ప ఒడయరు బుక్కరాయ సముద్రమను పేరుగల గ్రామమును, జలాశయమును నిర్మించెను.

() చూడు. కవిత్వతత్త్వ విచారము పీఠిక.

1) కొండవర్తి శాసనము
2) పిల్లల మఱ్ఱి శాసనము
3) కుందవర శాసనము
4) పిరంగిపుర శాసనము

చిక్కవ్వ ఒడయర్ ప్రవ్వించిన చెఱువుక కొక ప్రక్క బుక్కరాయ సముద్రము మఱియొక ప్రక్క అవంతపురము కలవు. ఈ యినంతపురమే తరువాత జిల్లా ముఖ్య పట్టణమైనది. బుక్కరాయ సముద్రము వైపు చెఱువు కట్టకు "ముసలమ్మ కట్ట"యని పేరు() ఇట ముసలమ్మ శిలా విగ్రహము కలదు. ప్రజలు నిత్యము నా విగ్రహమును బూజింతురు. ఏటేట పొంగళ్ళు పెట్టుదురు. ఊరబోనాలయిన పిదప చెఱువు తూము లెత్తి సేద్యమున కుపక్రమింతురు. ఈ విధముగా ముసలమ్మ ప్రజా పూజలు పొందుట కామె చూపిన త్యాగవీరమే కారణము. ఆ కథ యిట్లున్నది.

బుక్కరాయ సముద్రములో బసిరెడ్డి యను నొక కాపు గలడు. ఇతని కడగొట్టు కోడలు ముసలమ్మ. ఒకసారి మింటికి తూటు పడినట్లు కుంభ వృష్టి కురిసెను. చెఱువు నిండి తబకలాడుచుండెను. వాన వెలువ లేదు. చెఱువు కట్టకు గండివడెను. ప్రజలు అరచేతిలో ప్రాణములు పెట్టుకొని విలవిలలాడు చుండిరి. ఈ సమయమున గంగాభవాని యొక వనితను బూని నరబలి కావలెననీ కోరెమ. ప్రజలకు ముల్లు దీసి కొఱ్ఱు కొట్టి నట్లయ్యెను. వారొకరి మొగ మొకరు చూచుకొనిరి. ఎవరు ఒలి యగుదురు? ఎవరు ముందునకు వచ్చి యీపనికి సాహసింతురు? దైవ ప్రేరణచే ముసలమ్మ యూరికి వచ్చిన యాయుపద్రవమును నివారింప నిశ్చయించు కొనెను. ఆమె యత్తమామల యనుజ్ఞ పొంది. ప్రాణేశ్వరుని పాదపద్మములకు మ్రొక్కి కుల దేవతలను గొలిచి, మేళతాళములతో వెళ్ళి, గండివడిన చోటఁ గూర్చుండెను. తనపై మన్ను కప్పఁడని ప్రజలకుఁ జెప్పెను. గ్రామ వాసులును ముసలమ్మ మాట మీఁద మన్ను గప్పి గండి పూడ్చిరి. దీనితో వాన వెలిసెను. చెఱువు నీరు నిలిచెను.

() 1981వ సం॥లో జనవరి బుక్కరాయ సముద్ర గ్రామమును బుక్కరాయసముద్ర తటాకమును సందర్శించితిని. తటాకమునకు వడమటి వైపున, రోడ్డున కానుకొని వేప మ్రాన్నగు చెట్ల క్రింద వేదిక మీఁద వేమో కొన్ని శిలా విగ్రహములు కలవు. వీనికే నేఁడు పూజలు జరుగుచున్నవి. వీనిలో ముసలమ్మ విగ్రహమును గుర్తింపలే నయితిని. అక్కడివారి నడిగితిని. ఎవ్వరును జెప్పలేదు. ఇప్పుడా చోటిని ముసలమ్మ కట్ట యనుచున్నారు. ఇట్లని వాము ఫలకము వ్రేలాడుదీసిరి.

బుక్కరాయ సముద్రమున కేర్పడిన త్రుళ్ళు తొలగిపోయెను. ముసలమ్మ కూచ్చున్న చోట(బ్రజలు చెఱువున కొక కట్ట పోసిరి. ఇదియే ముసలమ్మ కట్ట (1)

ఈ కథకు రూపాంతరము కలదు. 1923వ సం।లో "పినాకిని" వత్రిక జులై వెల పదునాల్గవ సంచికలో రాళ్ళవల్లి అనంత కృష్ణశర్మగారి యగ్రజులయిన రాళ్ళవల్లి గోపాలకృష్ణ శర్మగారు ముసలమ్మ కథ నిట్లు వివరించిరి (2)

అనంతపురము చెఱువ :

ఇది విజయనగర బుక్కరాయని కాలమున ననగా పదునాల్గవ శతాబ్ది మధ్యమున గట్టబడినది. ఈ తటాక మెన్నిమార్లు కట్టివను కట్ట నిలువక తెగిపోవుచుండెనట! గంగాభవాని యొకానొక స్త్రీ దేహమున నావేశమై యొక గర్భిణి యగు సుమంగళిని కట్టలో నిమిడ్చి కట్టినచో నాకట్ట నిలుచు నని వలికెనట! బుక్కరాయ సముద్ర గ్రామమున నుండిన బసిరెడ్డి యను నతని కడవటి కోడలు ముసలమ్మ యను నామె పూర్ణ గర్భవతిగ నుండి, తా సీవనికి పూనుకొందునని తనవారి వెల్ల సమ్మతి వఱచి, గండిలో ప్రవేసించెను. ఆమెపై నాచోట కట్ట కట్ట(బడినది. నాటి నుండి నేటిదాక చెఱువు యధాస్థితిలో నున్నది. ఆచోట ముసలమ్మ కట్ట యను నరగున నేటికిని ముసలమ్మకు పూజలు జరుపుచున్నారు."

ఈ కథ యే కాలమున జరిగెనో నికరముగా(జెప్పలేము. ఇంత వరకు నే చారిత్రిక సాక్ష్యము లభింవలేదు. ఇక ముందు లభించునేమో చెప్ప(జాలము. ఆంధ్ర ప్రభుత్వము వారు పునఃపరిష్కృతముగా(బ్రకటించిన యనంతపుర మండలము గెజిటీర్ (1970వ సంవత్సరము)లో సైతము నీకథ సంగ్రహముగా వెడవెడ(బ్రస్తావిత మయ్యెను. దీనిని బట్టి బుక్కరాయు సముద్ర తటాకమునకు, నివ్వటి యనంతపుర పట్టణమునకు అనంత సాగరమను నామధేయ మున్నట్టు తెలియుచున్నది. అనంత సాగర తటాకము వలననే యునంతపురమున కనంతసాగర మను పేరు వచ్చినట్టు తెలియుచున్నది. చిక్కప్ప ఒడయర్ అనంతరస చిక్కప్ప ఒడయర్ అను పెద్దపేరు

---

(1)రెండు దశాబ్దాల నాడు"ఆంధ్రప్రభ"దినవత్రికలో కళాసాహిత్య విజ్ఞాన వేదిక శ్రీ అవ్వారి ఆదినారాయణ వ్రాసిన వ్యాసము చూడుడు.

(2)జానపదం. మార్చి 1982, సంపుటి 3, సంచిక 1

కలవాఁడఁట! కావునవే తటాకమునకు, గ్రామమువకు అవంతసాగరమును పేరువచ్చి యుండవచ్చువఁట! ఇతని యేలిక బుక్కరాయలు గాన నతఁడు కట్టిన రెండవవల్లెకు బుక్కరాయ సముద్ర మనువ్యవదేశము కల్గుట యింతగాదు. బుక్కరాయ సముద్ర తటాకమునకు వండెమేరు వరవగా నున్నది. ఈ చెఱువు క్రింది ఆయకట్టు 2511 యెకరములు. ఇందు సగము పాలు బుక్కరాయ సముద్ర గ్రామమువకే చెందును. ఈ యాయకట్టున వరి పుష్కలముగాఁ బండును. ()

బుక్కరాయ సముద్ర తటాకము కనుచూపు మేరదాఁక వ్యాపించి యుండును. ప్రొద్దు పొడుచు చున్నవ్వుడు చెఱువుగట్టుపై నిలిచి నలువైపులు చూచిన నొకప్రక్క దేవర కొండ యింకొకవైపు వచ్చవాటిన వరి పొలములు, మఱియొక ప్రక్క శిథిలదుర్గము కనుపించు చేయుచుండును.. ఇది యనుభవైక వేద్యము.

లోక కళ్యాణార్థము ఆత్మార్పణము గావించిన వీరవనితయగు ముసలమ్మకథ జరిగినట్టు ప్రజలు తరతరముల నుండి చెప్పుకొనిన మాట నిజము. పాతివ్రత్యము, త్యాగము మున్నగు కళ్యాణ గుణములు కలిగి యేదో యొక సత్కార్యము కొఱకసువు లర్పించిన మానవతు లీతెలుఁగు మాగాణమున నుండిరి. వారు మరణాంతరము పేరంటాండ్రుగా వెలసి, శుభములు కల్గింతురను నమ్మిక గలవారి మ్రొక్కులు, ముడుపులు పొందుచుండిరి. పొందుచున్నారు. వీరి కథలు బౌద్ధ వాఙ్మయము నందలి యవదాన కథలను బోలియుండును. అవదాన కథలు లోక కళ్యాణ కారకము లయిన నన్నివేశములతో నిండియుండును.

శ్రీ రామలింగారెడ్డి ముసలమ్మ త్యాగమయ గాథను 'ముసలమ్మ మరణము' అను లఘు చింతా కావ్యముగాఁ దిద్ది తీర్చిరి. వారు "ముఖపత్రము"లో ''ఒకానొక త్రిలింగ దేశీయునిచే వ్రాయఁబడి బ్రౌన్ దొరగారిచేఁ ప్రకటింపఁబడిన 'అనంతపుర చరిత్రము"అను గ్రంథము నుండి యిందలి కథం గైకొంటిని. అయినను గొన్నియెడల రసాధిక్యమువకై.నూతన కల్పనలు చేసినాఁడ"నని వ్రాసిరి. వారు మూఁడు ముఖ్యము లగు కల్పనములు చేసిరి. మూల కథలో గంగాభవాని యొక స్త్రీని బూని యపాయ

( ) Andhra Pradesh District Gezetteers, Anantapur (Revised edition) 1970—Pages 1, 13, 176, 822, 831

నివారణమువకు మార్గము నిర్దేశించినట్లు కలదు. శ్రీ రామలింగారెడ్డి యివ్వట్టిన వాక్కాశవాణిని ప్రవేశపెట్టెను. ఇది పురాణేతిహాసముల వాసన వలన వచ్చిన మార్పు. ముసలమ్మకు సంబంధించిన కథలలో నొకదాని యందామె పూర్ణగర్భిణి. మఱొకదాని యందు గొడ్రాలు. కాని శ్రీ రామలింగారెడ్డి యామె పుత్రవతి యయినట్లు మార్పు చేసెను. ఇది మనోహరమైన కల్పనము. బిడ్డతల్లి యగు ముసలమ్మ యాత్మ బలి దానము చేసినట్లు వర్ణించిన యెడల కరుణరసము నిశితత్వమును బొందును. ముసలమ్మ గండి పడిన చోట గూర్చుండగా జను లామె మాటబట్టి మన్ను కప్పి గండి పూడ్చినట్లు మూలకథలో నున్నది. జలోపప్లవము పాలగుచున్న ప్రజలు దేవతా మూర్తియగు ముసలమ్మ మాట మీరదనే యీ సజీవ ఖననమును గావించినప్పటికి, నిది వారియిక్కట్లు సమసిపోవలయునని మనసార గోరుకొను నెట్టి సహృదయుని కయినను భావ వైముఖ్యమును గల్గించితీరును. ఏయూహతో నయిన నేమి? శ్రీరామలింగారెడ్డి ముసలమ్మ కేవలము జలప్రవేశము చేసినట్లు కల్పించెను. జలదేవతకు బలియై జలోపద్రవమును దొలగించుట సమంజస మని భావించిరి కాబోలు.

ఈ కల్పనములతో నొకానొక మహాప్రయోజనము నాకాంక్షించియే శ్రీరామలింగారెడ్డి యీ కావ్యమును రచించెను. సాహిత్య శాస్త్రకారులు కావ్య ప్రయోజనము లొకకొన్ని చెప్పిరి. అవి యశస్సు, ధనము, వ్యవహార జ్ఞానము, అశుభపరిహారము ఉపదేశము, అలౌకికానందమును. వీనిలో కొన్ని కవికి, మరికొన్ని పాఠకునకు జెందును. శ్రీ రామలింగారెడ్డి వీనిలో నుపదేశమును మాత్రమే యీ కావ్యమునకు బరమ ప్రయోజనముగా సంభావించెను. వారు "ముఖపత్రము"లో "ఈ చిన్న పొత్తము ముఖ్యముగా స్త్రీల కొరకు జేయబడినది. వారి కుపయుక్తముగా నొప్పిన యెడల నాప్రయాస సఫలత నొందినట్టే" యని వక్కాణించిరి.

మానవజాతిని మహోపద్రవముల నుండి సంరక్షించి, తరింపజేయు శక్తి స్వరూపిణి స్త్రీమూర్తియే యని ముసలమ్మ కథ చాటుచున్నది. త్యాగమయి అగు నారీమణి ప్రకృతి చోదితమైన కర్తవ్యమును విస్మరింపలేదు. మఱి పురుషపుంగవుల బాధ్యత లేదా? యను ప్రశ్న ముండవే యున్నది. ఏది యేమయిన మహిళ మానవ జాతి చరిత్ర యందలి ప్రధాన ఘట్టములకు ప్రత్యక్షముగనో, పరోక్షముగనో నియంత్రి యగుచున్నది. ఆమె త్యాగమును త్యజించినాడు మానవజాతి చరిత్ర

స్తంభించిపోవును. శంకర భగవత్పాదులు ''సౌందర్యలహరి''లో "శివుడు సైతము శక్తి సంయుక్తుడయినప్పుడే జగన్నిర్మాణము కొఱకు సమర్థుడగు చున్నాడు. శక్తి రహితుడయిన వాడు కదలలేడు" (1) డనియు, "ఓ పర్వత కన్యా! నీసయన నిమేషోన్మేషముల వలన లోకము ప్రళయోదయములు పొందుచున్న" (2) దనియు బలికిన పలుకులు స్త్రీ శక్తితత్త్వమునకు భాష్యములే. శ్రీ రామలింగారెడ్డి ముసలమ్మ కథా మూలతత్త్వమును ముట్టి స్త్రీ శక్తిని విరూపించుచు, స్త్రీ జనోపయోగార్థము కావ్యము రచించిరి.

సాంఘిక ప్రయోజనము నుద్దేశించి ''ముసలమ్మ మరణము" రచిత మయినట్లు శ్రీ రామలింగారెడ్డి పలుకుల వలనఁ దెలియుచున్నది. ఒక విధముగా నీకావ్య వస్తువు ప్రఖ్యాతమయిన సాంఘిక కథ యని చెప్పనొప్పును. ముసలమ్మ జల ప్రవేశముతో ముగియుచున్నది. కాన యీకావ్యము విషాదాంతము. "ముసలమ్మ మరణము" అను పేరే కావ్యాంత లక్షణమును వెల్లడించుచున్నది. ఇది పాఠకుల వక్షమునుండి స్థూల దృష్టికో పవెడి మాట. కాని తెలిసి తెలిసి త్యాగము చేయుటకు ముందునకు వచ్చిన ముసలమ్మ వైపు నుండియు, ఆ త్యాగము వలనఁ గల్యాణములు పొందిన సంఘము దిక్కు నుండియు, పరిశీలించిన యెడల నీకావ్యము విషాదాంతము గాదనిమే చెప్ప వలయును. ముసలమ్మకు చావు మూడుట కీతరు లెవ్వరును కారకులు గారు. అది యాకస్మిక పరిణామముగాదు. అతర్కితోప పన్నమును గాదు. సేవాబుద్ధి గలయామే పరిశుద్ధ హృదయముతో స్వయము మరణము నిశ్చించినది. కాన ముసలమ్మ జీవితము విషాదాంత మవరాదు. ఇక నా మహాత్యాగ మూర్తి వలన సంఘము మంగళమయమైనది. ప్రాణికోటికి భద్రములు ప్రసాదించిన ముసలమ్మ త్యాగము విషాదాంత మమట యెట్లు? అగు ననినచో అంతమున మానవజాతికి అత్యంత సుఖాపాదులయిన సంక్షోభములను, విప్లవములసు, క్షైత్రయాత్రలను విషాదాంతములని తీర్పు చెప్పవలయును గదా!

---

(1) శ్లో॥ 1. శివశక్త్యా యుక్తోయది భవతి శక్తః ప్రభవితుం
న చే దేవం దేవో నఖలు కుశలః స్పన్దితు మపి.

(2) శ్లో॥ 55. నిమేషోన్మేషాభ్యాం ప్రళయ ముదయం యాతి జగతీ

"ముసలమ్మ మరణము" అను నామధేయమే యీ కావ్యము స్త్రీ పాత్ర ప్రధానమని ప్రకటించుచున్నది. స్త్రీ జనోపయోగమునకై యవతరించిన కావ్యము నందు స్త్రీ మూర్తి ప్రధాన మగుట సమంజసమే కదా! మిగిలిన పాత్రము లన్నియు నా ప్రధాన పాత్రమునకు పన్నెవెట్టుట కుపయోగపడినట్టి వైనవి. ఈ కళాదృష్టితోడనే సార్థక నామధేయ మగునట్లుగా శ్రీ రామలింగారెడ్డి యీ కావ్యమును రచించెను.

కథ, దానియందలి పాత్రములు, దాని ప్రయోజనము నను మూడంశములను బట్టి "ముసలమ్మ మరణము" నూతన కావ్యమనినొక్కి వక్కాణింపవచ్చును. ప్రాచీన వాఙ్మయమున నిట్టి కావ్యములు మృగ్యములు. వెనుకటి కావ్యములలో నొక కొన్నిటి యందు సాంఘిక కథలు కలవు. కాని వాని లక్షణము వేరు, ప్రయోజనము వేఱు. ఆ కావ్యములకు, ఈ కావ్యమునకు నేరూపముగా జూచినను పంబంధము లేదు.

''ముసలమ్మ మరణము,' రచనా వద్ధతి సైతము విలక్షణముగవే యున్నది. ఈ కావ్యము శ్రీకారముతో ప్రారంభ మయినది. ప్రారంభ పద్యమున గట్టమంచి గ్రామమున వేంచేసిన బాల్యేశుని స్తుతి కలదు. రెండవపద్యమున ముగ్గురు మూర్తులకు మూలమయిన తేజము వర్ణిత మయ్యెను. తరువాతి మూడు పద్యములు శివస్తుతి పరములు. వీనిలో మూడవ పద్యమున శివుడకించినుడయినప్పటికి దనచర్యల చేత దాను సర్వ సంవన్నుడయినట్లు ప్రకటించుచున్నాడని శ్రీ రామలింగారెడ్డి వర్ణించెను. ఇట్టి భావమే మాళవికాగ్ని మిత్రము నాందిలో నున్నది. ఇందు కాళిదాసు "పరమేశ్వరుడు ప్రణమిల్లిన వ్వారికి బహుఫలముల నిచ్చు నద్వితీయ మయిన యైశ్వర్యము కలవాడే. కాని తాను మాత్రము చర్మాంబరధారి యయ్యెను" () అని వర్ణించెను. చూపులకు గృత్తివాసుడయినప్పటికి, చర్య లద్వితీయ సంవత్ప్ర కాశకము లని యర్థము.

ఈమూడు పద్యముల తరువాత నొకానొకప్పుడచ్చ తెనుగుగా సంభావింప బడిన కృత్రిమాంధ్ర భాషలో ముగురమ్మల మూలపుటమ్మ స్తుతి కలదు. సూర్యస్తుతి యీకావ్యమువ నుండుట యొక విశేషము. వాన ప్రస్థులగు తపస్వులను శ్రీరామలింగా రెడ్డి స్తుతించెను. ప్రాచీన కవులలో తిక్కన సూరన వేమన్నలు మాత్రమే వీరి

() ఏకైశ్వర్యే స్థితోఽపి ప్రణత బహుఫలేయ: న్వయం కృత్తివాసాः

పొగడ్తలకుయోగ్యులయిరి. తిక్కన కవికులబ్రహ్మ. సూరన భావసౌందర్యముకలవాడు. వేమన సహరి విద్యా మయాత్ముడు. ఈ ముగ్గురు కవుల కవితా లక్షణముల నింత సంగ్రహముగా, సత్యబద్ధముగా నీ యువకవి వెల్లడించుట విశిష్టముగా నున్నది. తదనంతర కాలమున శ్రీరామలింగారెడ్డి పండితాదీన సాహితీ పంస్కారము కల వాడయినప్పుడును, ఈ మువ్వురు కవులే వారి విమర్శ పరీక్షకు విలిచిరి.

అనంతరము కావ్యరచనా హేతువు లుగ్గడింపబడెను. పిదప శ్రీరామలింగా రెడ్డి పితృస్తుతి చేసెను. తుదకు నంకిత పద్యములున్నవి. షష్ట్యంత వద్యలక్షణములు పుణికి పుచ్చుకొన్న యొకపద్య మీయంకిత వద్యములలో నున్నది.

ఈ విధముగా నీ యువక్రమణిక యందలి వద్యములలో నిష్టదేవతాస్తుతి సుకవిజన బహూకారము, పితృప్రశంస, కృతిపతి గుణ ప్రస్తుతి కలవు. ఈ భాగమున మొత్తము మీద సంక్షిప్తముగా నయినను ప్రాచీన కావ్యాకారికల లక్షణము లొక కొన్ని కలవు. అట్లవి యిది వానికి నకలుగా లేదు. కవి భావన నవీనముగా మున్నది.

కథా ప్రారంభము కూడ శ్రీకార యుక్తమే. బుక్కరాయ సముద్రము భూసతీల లాట తిలకము వలె నున్నదట! భావము ప్రాతవడి నట్టిదే! ప్రబంధముల యెత్తు గడతో గూడినవ్వటికి, బుక్కరాయ సముద్రము వరిసరములు మాత్రము స్వభావో క్తి సుందరముగా వర్ణితము లయ్యెను.

"చెఱుకు దోటల జొచ్చి కొఱికి పాడొనరించి
దొర లట్ల పోవు వందుల గణంబు"

అను వద్యమును జూడుడు. కట్టమంచి గ్రామ సౌభాగ్యమును బుక్కరాయ సముద్రమునకు శ్రీ రామలింగారెడ్డి యతిదేశించెను. ఈరెండు గ్రామములను జూచినవారు దీనిని గుర్తింపగలరు. తరువాత తటాకవర్ణన మున్నది. "చల దుత్తుంగ తరంగ మహోగ్ర భంగ పటలీ సంఘట్టనారావ" మిత్యాదిగా నది సాగినది. ఈ పద్యము ప్రబంధకవి యొకడు వ్రాసిన విధముగా నున్నది.

ఇక నిక్కడ నుండి కథ వేగముగా నడుచును. వానలు వంగిన తీరు తెలుగు నుడికారమునకు నెలవు. నీరు నిండిన చెఱువు రక్కసునివలె నున్నదట!

ఆకాశవాణి భాషించి నప్పటినుండి ముసలమ్మ ముఖ్యపాత్రయై ముందునకు వచ్చెను. కండపట్టు అనఁదగిన కథ యిక్కడ నుండియే మొదలగును.

ముసలమ్మ స్వభావము రెండు విధములుగా వెల్లడిమయ్యెను. వానికి ఆత్మ వ్యక్తీకరణము, వరవ్యక్తీకరణము నని పేర్లు పెట్టవచ్చును. జల ప్రదేశము చేయు వరకు ముసలమ్మ పలికిన పలుకులు, నడచిన నడక యామె శీలమును ప్రకటించు చున్నవి. ఇది యాత్మ వ్యక్తీకరణము. గ్రామస్థులు, నిర్నామధేయుఁడయిన భర్త యత్తమామలు ముసలమ్మను గూర్చి మాటాడిన మాట లామె స్వరూప స్వభావములను జాటుచున్నది. ఇది వరవ్యక్తీ కరణము. ఈరెండు పద్ధతుల వలనఁ గథానాయిక వృత్తాంతమును జన్మము నుండి మరణము దాఁక శ్రీరామలింగారెడ్డి చిత్రించెను. ఇది గడుసరి పోకడ. కవి యొక్కడను వర్ణన పద్ధతి నాశ్రయించి తనకుఁ దానుగాఁ బాత్రమును జూపలేదు. వానలు పడినప్పటి నుండి కథ నాటకీయ పద్ధతికి నెల వయినది.

ముసలమ్మ మాటలను బట్టి యామె తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోఁగా అత్తమామ లామెను దగ్గరకుఁ దీసికొని పెంచినట్లు తెలియుచున్నది. వా రీమెను బెద్ద చేసి, కన్న కొడుకునకిచ్చి పెండ్లి చేసిరి. ముదిమి ముసరి చీకుచే చికాకు పడుచున్న వారికి ముసలమ్మ యూఁతీకొలగా, కన్నుగా నయినది. ఆ యత్తమామలకుఁ సీమెయే కొడుకుల కంటె నెక్కువ కూర్చును. కుంతికి ద్రౌపది యిట్లే యయ్యెను. () ముసలమ్మ లేనియిల్లు ఇల్లుగాదు. నట్టడవియే. ఊరి వారి మాటలను బట్టి ముసలమ్మ సౌందర్యము, జీవకారుణ్యము, బంధుప్రీతి, ప్రియానురాగము నిత్యాది గుణములు వెల్లడి యగుచున్నవి. ఆమె మగని మాటల వలన వారి యతిమానుష ప్రణయము ప్రకాశిత మగుచున్నది. కవి యయిన యాభర్త యామె నొక దివ్యమూర్తిగా నెంచి యామె యున్నట్టుండి యెప్పుడో యొకప్పుడు పార్థివ సంచారము పరిత్యజించి యూర్ధ్వ లోకములకుఁ దరలిపోవునని యూహించెను. ఆయన యనుకొన్నట్లే యయినది. ముసలమ్మ కారణ జన్మ.

() "కొడుకుల కంటె నయ్యనుఁగుఁ గోడలి కెక్కుడు గూర్తుఁ; గోడలుం గొడుకులు సేయు భక్తి కట కోటి మడుంగులు భక్తి నాకు నెప్పుడుఁ దగఁ జేయుచుండుఁ; నది పుణ్యచరిత్ర, కులాగ్రగణ్య...." కుంతి కృష్ణునితో నీమాట లనును, చూడు. ఉద్యోగ పర్వము ఆశ్వా 3, పద్య 187

ఈ కావ్యమునందు ముసలమ్మ ముఖ్యపాత్రము. మిగిలిన పాత్రము లెల్ల బంగారము వంటి యామె బ్రదుకునకు నొఅగల్లాటు మాత్రమే. ఆత్మార్పణము గావింప నిశ్చయించిన ముసలమ్మ మగని, యత్తమామల యనుమతి తీసికొను సన్ని వేశం మీ కావ్యలక్ష్మికి హృదయము. ⚓ రామలింగారెడ్డి చిత్ర విజ్ఞాన విరూపణ వైపుణ్యము, వాక్ వాక్య రచనా చాతుర్యము పుష్కలముగా గోచరించు ఘట్ట మిది.

ముసలమ్మ ప్రాణేశ్వరుని పజ్జకు వచ్చి పాంచభౌతిక జగత్తులో మీకుఁ దెలియని విశేషము లేవియు లేవనియు, నానోటి వెంట వినఁగా మీకు వేడుక పుట్టెనా యనియు, "సతుల మాటలన్ వినఁగఁ గోరుట భర్తల రీతియే కదా!" యనియు ప్రస్తావన నడిపి, యాకాశవాణి వాక్యములను, జనోపద్రవమును, ఆత్మ నిర్ణయమును "వినయతత్వరమతియై" యతనికిఁ జెప్పెను. ఎత్తుగడలోనే ముసలమ్మ ముందటి కాళ్ళకు బంధములు వైచినది. ఆమె భర్తయు సామాన్యుఁడు గాఁడు. అతఁడు "ఎంత మంచి మాటలు పల్కి" తని వ్యంగ్యముగా మాటాడి, తన వలపును వెల్లడించి, యూరు పిడిచి వెళ్ళుదమని యుపాయము చెప్పి, యాజ్ఞ మొసఁగనని ఖరా ఖండిగాఁ బలికెను.

ఈ మాటలకు "బాలసూర్యోదయమ్మున విఱుగు నంచువోలె" నిజమనో నిశ్చయము నడలి కరఁగి పోవుట ముసలమ్మ కనిపెట్టినది. ధీర గావున఼ బట్టువిడువక "శుకవాణియై తిన్ననియెలుం గేర్పడ నించుక కఠినంబుగా" మీరు నామాటలకు సంతసించితిరవి యెదురుదెబ్బ గొట్టి, యిక్కటుల పాలయిన వాడకట్టువారి నెల్ల వదలి, కట్టుకొన్న పెండ్లముతో నూరు కదలిపోవుట గర్హితకము కాదా? యని ధర్మ నిర్ణయము చేసి, మీరే యిట్లు వలికిన వేమి చెప్పఁగల నని పెద్దతిక మిచ్చి, మీకున్ గోపము వచ్చినచో వాకట్టుకొందు నని బెదించినది.

భర్త యొకమెట్టు క్రిందికి దిగి నిష్ఠానాఁడయిన వారించితినా? యని యవెను. అంత నామె యిండ్లు వాకిండ్లు విడిచి వెళ్ళిన నెదురగు నిడుములు వివరించి, దిక్కు దివాణము లేని యీ ప్రజలను జూతురా? భూమికి బరువయిన నన్ను విడనాడుదురా? యని విధి నిషేధ పూర్వకముగా గర్హ్యోపదేశము చేసి, పరోపకారము చేయని మానవుడు పుట్టనేల? గిట్టనేల? యని పతి గచించిన పద్యములతనికే యప్పగించినది.

పసుపు కుంకుమలతో(బరేత నగుట భాగ్యము గాదా? యని పతివ్రతా వాంఛను బ్రకటించినది.

ముసలమ్మ భర్తయు(దక్కువ తిన్నవాడు గాడుగదా! అయిన వారిని విడుచుట తగవు కానియవ్వాడు ధర్మపత్నిని విడుచుట తగ వగునా? యని యెదురాడి ముసలమ్మ మాటలలోని విప్రతిపత్తిని వెల్లడించెను. ఈ యుల్లనపు మాటలతో నూర కుండక యతడు వేను నీకు(దగిసవాడను గానని నాకు(దెలియు ననియు, నీ వెవ్వాడో యొకవ్వాడు మమ్ము మోసపుత్తువని యవ్వాడప్పుడు వే వసుకొందు ననియు(దన దివ్యదృష్టిని జూపెను.

ముసలమ్మ యేమి మాటాడ(గలదు? భర్త వియోగమునకు(జింతించియు మనసు తాయిచేసికొన్నద(ట! ఆమె మొగమున(గోవము మెఱు(గు(దీ(గువలె వచ్చుచు(బోవుచు నున్నద(ట! చిరునవ్వు చెంగలింప నామె" చిన్నప్పటి నుండియు మిమ్ము సేవించుటతప్ప నోరుతెరిచి యొకటియైన వేనాడు నే నడుగలేదు. అడుగ వని మీ రలుక గొనెడివారు గదా! ఇప్పుడడుగు చున్నదానను గదా! ఒవ్వకొన రేమి?" యని ప్రణయ నిర్బంధము చేసి, యాతనికరము నెత్తి తన పెదవుల కడ(జేర్చి "యిన్ని మాటలేల? పోయివత్తు" నని ధీరముగా మాటలు త్రుంచివేసి, చర్చకు స్థానము లేకుండ(జేసి, బిగి సడలని వట్టుదలను వ్యంగ్యముగా(జాటి, వల్లెత్తుమాట అయిన నవలేదు. అనకపోవుటయే అంగీకారముగా ముసలమ్మ భావించినది.

ముసలమ్మ వయసు మీటి నట్టిది గాదు. పడుచు(దనము గడవ నట్టిది. అయినవ్వటికి నామె మాటలలో నసాధారణ మయిన లోకానుభవము కొట్టవచ్చినట్టు కన(బడుచున్నది. అత్తమామల యనుజ్ఞ నందునపుడు గూడ నిదియే న్పటిక స్పష్టముగా సాక్షాత్కరించినది.

ఆలుమగలు మాటడుకొనునపు డచ్చటికి వచ్చిన యత్తమామలు వారిమాటలు వినుచు విగ్రహములవలె నిలిచిరి. ముసలమ్మ వారికి మ్రొక్కి, "మీకుమారుని వచ నంబులు వింటిరి గాదె! మీచేత నమజ్ఞాతవై పోయిరావలయు" నన్నది. ఇది గడుసరి మాటలు, మీరు వలదని వారింపరాదను భావమును గూఢముగా వ్యక్తీక రించుచు, భక్తి భావమునకు భంగము కల్గింపగా వారిని వలకట్టుకొను వలుకు లివి

అత్తమామలు దైవమును వింది౦చిరి. ముసలమ్మ లేనివా(డు తమబ్రదుకులు విన్నచ్చు రములవిరి.

భర్తతో భాషి౦చువవ్వటి మాదిరిగా ముసలమ్మ వట్టు ఒక కొ౦చెము సడలినది కాని వెంటవే తన్ను(దాను నిలువరి౦చుకొన్నది. తన చేయ(దల(చిన త్యాగము అన్యులకే కాక యత్తమామలకును మేలు చేకూర్చును. అట్టిచో కేవలము కాను అత్తమామల కొఱకే శరీరధారణము చేయుట తగునా? ఈరీతిగా ముసలమ్మ స్వ ధర్మము వసుధైక కుటుంబ లక్షణ లక్షితము గావలెనని నిర్ణయించుకొని, అత్త మామలతో "మీకొడుకు లెల్లరు శ్రీరామచంద్రులు కోడం డ్రందఱు సీతాదేవులు. మీకేమి తక్కువ?" అని వారి నూఱడించినట. "కర్మ విపాకత వేర్పువేళ వీమేను పరోపకారార్థమువయుక్తము కావలయు నని మీరే యంటిరి గదా?" అని వారి మాటలు వారికి గుర్తుచేసినది. అంతట మామయోటమి నొప్పుకొని నీ యిచ్చ వచ్చి నట్టు చేయుమనెను. అత్త అల్లన ముద్దుపెట్టు కొని పోయి రమ్మనెను.

ముసలమ్మ మంచి మాటనేర్పరి. తన చేయువనికి నొప్పుకొనిన వారుగూడ(జివరకు నో రెత్త కుండ(దన వైపుననే తిరుగు నట్టు చేయ(గల గడుసు(దనము గలది. ఆత్మ విజ్ఞానముతో(గూడిన ధర్మబలము, నిశ్చయాత్మక మయిన తార్కిక బుద్ధి యామె మాటకారి తనమునకు మూలము.

శ్రీ రామలింగారెడ్డి ముసలమ్మ కొక కుమారు(డున్నట్టు కల్పనము చేసెను గదా! ఇది కరుణరసము పుటపాకప్రతీకాశమగుటకు సహాయ కారి యయినది. ముసలమ్మ కన్న కొడుకును "కన్నుల నొక క్రొత్త ప్రభ సెలంగ(జంక నిడికొని, ముద్దాడి, జాలిదో(వ"

అన్న పోర; నీకు నమ్మ యెక్కడి దింక?
తండ్రిగారి(గూడి తవరు మయ్య;
నన్ను(దల(చి కల(చి నాయవా! యదలంగ
వలదు; పోయి వత్తు(బంపు తండ్రి!

యని యన్నది. ఈ పలుకులు విన్నవ్వాడు భవభూతి యుత్తర రామచరితమున లక్ష్మ ణుని నోట(జెప్పించిన "శిలయయిన శోకించును. వజ్ర గర్భమయిన భేదిల్లును () "అను మాటలు గుర్తునకు రాక మానవు. ముసలమ్మ వజ్రతుల్య మయిన హృదయము గలది యని యీఘట్టము రుజువు చేయును.

ఇంటివారి అనుమతి సాధించిన ముసలమ్మ యూరి వారి సెలవు గైకొన కుందునా? ఆమె "మర్యాద తో(వ(గొంత దవ్వుల నున్న జన సంఘమ్ము మువల ఫించి" "నన్ను మీరు కన్నబిడ్డవలె గారాబముగా(జూచితిరి. మీ ఋణము దీర్చు కొందు"నని యనెను. మఱి యక్కడ(జేరిన యూరి వారిలో నొక(డయిన నీసాహన త్యాగము వలదని నివారించు మాట యనలేకపోయెనా? శ్రీ రామలింగారెడ్డి యివ్వట్టున వేమియు వ్రాయలేదు. వ్రాయక పోవుట గుణమే అయినది. ఆయూరివారు స్వార్థపరులై ముసలమ్మను నివారింపక లేకపోయిరని యూహించుట దోషము. ముసలమ్మ మగనితో అత్తమామలతో(గన్నబిడ్డతో మాటాడిన తీరు వారు చెవులార వినిరి. ఆమె వరోప కారబుద్ధి యెంత బలీయమో కమలార(జూచిరి. తుదకు వింజ మా(కిడి నట్టయిరి. ముసలమ్మ తమతో మాటాడుచున్న దన్న స్మృతి లేనియంతగా వారు మంత్ర ముగ్ధు లయిరి. ఇట్టిచో వారి నోటివెంట నొకచిన్న మాటయు వెలువడునా? వెలువడినట్టు వ్రాయక యుండుటయే శ్రీ రామలింగారెడ్డి కావ్యకళావేత్త అని చాటుచున్నది. ఆయన జనజాత మౌనము ముఖమున ముసలమ్మ త్యాగబుద్ధి, వాత్మ స్థైర్యము గాఢములని గూఢముగా వెల్లడించెను.

ముసలమ్మ వాక్కులలో వేదాంత వాసన కలదు. ఇది యామె కాజానజము శరీరము వశ్వరము దేహి కిహలోక వాసనలు తగవు. మానవు(డు వరోపకారము నొక పురుషార్థముగా గణింపవలయును. శరీర వ్రయోజన మిదే.

ముసలమ్మ శుచిస్నాన మాచరించెను. ఆమెకు తన శరీరముతో పాటు బ్రహ్మాండములో నేదియు(గంటెకి(గన(బడలేదు. కేవలము జలన్వయూవ మయిన శివసాయుజ్యమే తో(చెను. శ్రీ రామలింగారెడ్డి

() ఉత్తర రామచరితము ప్రథమాంకము. శ్లో 21

కవ్వొల్లి వాలిన ఖరకరోదయ కాల
మల్లన మ్రింగు జాబిల్లి యనఁగ
జ్వలదగ్ని శిఖలపై వెలనవ్వులోఁ బోవు
ధాత్రీ మహాదేవి తనయ యనఁగఁ
గెందామరల బారు సుందర మగులీల
పల్లనల్లనఁ జొచ్చు నంచయనఁగ
గాల మహా స్వర్ణకారకుం డగ్నిలోఁ
గరఁగించు బంగారు కణిక యనఁగఁ

బ్రళయ కాలాదల ప్రభా భాసురోగ్ర
రంగ దుత్తుంగ భంగ సంఘాతములకుఁ
గలఁక నొందక, దరహాస మలర, మంద
మందగతిఁ బోయి, చొచ్చె నమ్మగువ వీట.

అను సీస పద్యమున మునలమ్మ జలావతరణమును వర్ణించెను. ఉత్ప్రేక్షామయ మయిన యీపద్యము ప్రబంధ కవిత్వమునకుఁ బ్రథమోదాహరణము.

మునలమ్మ యాంధ్రభాషాభిరంజనిని దయచూచుఁగాక అనియు త్రిమూర్త్యాతీత మయిన తత్త్వము మమ్ము శోభిల్లఁజేయును గాక యనియు శ్రీ రామలింగారెడ్డి యీ కావ్యమునకు భరత వాక్యము పాడెను. "ఇది కట్మంచిని వాసుఁ డన్న పద్యము ప్రాచీన కావ్యముల యందలి యాశ్వాసాంత గద్యవంటిది.

ఈ కావ్యములో నొకకొన్ని వర్ణములు ప్రబంధ కవితా మార్గము వట్టిన నవ్వటికి, నవీన మయిన వర్ణనములును లేకపోలేదు. ముసలమ్మ "లే నగవును, గన్నీళ్ళును" మగని యెదుట విలిచెను. అప్పుడామె "వానయు వెండయుఁగల పెడుచో నొప్పెడు నభ" మనునట్లు లున్నదఁట! ఓలగందముతో శుచిస్నాన మాచరించిన యామె "తలమోఁది చెట్లు కురిసిన లలిత సుమ పరాగమున వెలయు లతిక వలె నున్నదఁట! స్నానానంతరము ముసలమ్మ కట్టుకొనిన వసుపువచ్చని చీర సంధ్యా కాల కాంతిగా నొప్పెనఁట! ఆనందమయ మయిన యామె వదనము శోణకాంతి వహించి సూర్యప్రభను బోలినదఁట. శోకవశ లయిన జనులు విహంగముల వలె

మొఅవెట్టి రఁట; ముసలమ్మను సాంధ్యలక్ష్మిగా వర్ణించుట శ్రీ రామలింగారెడ్డికే చెల్లివది.

ముసలమ్మ కన్నబిడ్డమ మగని కవ్వగించునపుడు, చెఱువ దగ్గరకు వెళ్ళునపుడు శ్రీ రామలింగారెడ్డి పెూమరు కావ్యముల నుండి భావములు స్వీకరించి వరనములు చేసిరి.

శ్రీ రామలింగారెడ్డి యభిప్రాయము ప్రకారము తిక్కన కారణజన్ముఁడు. కవికా ప్రవంచరవి. ఆ కవిబ్రహ్మ కవికా లక్షణములు 107 పద్యములు గల యీ కావ్యమున సూక్ష్మరూపమున వెలకొన్నవి. తిక్కన మాదిరిగా సీయువ కవియు ముఖ్య ఘట్టములమ నాటక సంవిధానముతో నడిపెను. ఇంతేకాదు, మనస్సంక్షోభము వలనఁ గలుగు డైహిక పరిణామములను-అను భావములను రమ్యముగా వర్ణించెను.

మునలమ్మ తన దృఢనిశ్చయమును వెల్లడించినపు డామెభర్త తలక్రిందు లయ్యెను. అతఁడు మాటాడ మొదలిడి నప్పటిస్థితిని శ్రీరామలింగారెడ్డి యద్భుతముగా వర్ణించెను.

"———ఆయోషామణి భాషణంబుల చేఁదన మనంబు కామరపాకు నందలి జలబిందువుంబలె నల్లలనాడ, నుల్లంబు జల్లన, మూర్చపోయి, కళదేఱి, అన్నింటికి నీశ్వరుండు గలండని ధృతి వహించి, దీర్ఘ నిశ్వాస పూరిత ముఖుం డయ్యను, జలింపని యెలుంగేర్పడ———"

ఆ ప్రణయజీవి భాషింప నుపక్రమించె నఁట!

పాత్రముల స్వర విపర్యాసమును సైతము తిక్కనవలెవే శ్రీ రామలింగారెడ్డి వర్ణించెను. మగఁడనుమతింప నని యవ్వప్పుడు "శుకవాణి" యగు ముసలమ్మ "తిన్నని యెలుంగేర్పడ నించుక కఠినంబుగా" "మందలించె"నఁట! అత్తమామలతో సైతము ముసలమ్మ "తివ్వని యెలుంగు"తో మాటాడును. తిక్కన వలెవే శ్రీరామలింగా రెడ్డియు వివిధ సందర్భముల యందలి పాత్రముల నవ్వులను వర్ణించును. "నిన్నేనా డయివ నివారించితినా?"అని వలికిన పతితో ముసలమ్మ "———ప్రత్యుత్తరంబున కొక లేనవ్వుఁ బ్రచురించి———" మాటలాడ మొదలిడిన దఁట!

శ్రీ రామలింగారెడ్డి భాషాప్రయోగము కూడ వర్ణనముల వలెనే ప్రాచీన నవీన మార్గముల ననుసరించినది. యువకవి రచించు నాదిమ కవిత్వమున నొక కొంత భాషాడంబర ముండుట వింతగాదు. 'ముసలమ్మ మరణము''లో తెనుఁగు నుడికారము, పాటువలు, జాతీయములు మున్నగు వానికోపాటు ప్రౌఢ సంస్కృత పదబంధ మున్నది. ఉదాహరణమున కాకాశవాణి వాక్యములు విని గ్రామస్థులు పురపురం బొక్కిన ఘట్టమును జూడవచ్చును.

శ్రీ రామలింగారెడ్డి స్వీకరించిన వస్తువు సాంఘికము. ఒక విద్యార్థి యిట్టి యతి వృత్తముతోఁ గావ్యరచనమునకు శ్రీకారము చుట్టుట 1899వ సంవత్సరము నాఁటికి నవీన పద్ధతియే యని చెప్పవలయును. కాని యువకవి యగు శ్రీ రామలింగా రెడ్డి ప్రబల ప్రాచీన సాహితీ సంస్కారము గలవాఁడు. కావుననే 'ముసలమ్మ మరణము"లో భావన వివిధ రూపములలోఁ బ్రాచీన నవీన లక్షణములతో గోచ రించును. ఉదాహరణముగా భావకవుల, జాషువా రామిరెడ్డి వంటి కవుల కవితలోఁ బ్రత్యక్షమగు భావవాశక్తితోఁ గూడిన యీక్రింది పద్యమును జూపవచ్చును.

అరుణోదయచ్ఛాయ లాకాశ పథమున
నంభోధరముల వేటాడు వేళ
మార్తాండ చండాతపార్తికి ననిలముల్
పొదరింట్ల గుసగునల్ పోవువేళ
సాయాహ్నలక్ష్మి కసూయి కలుగ భూమి
తళుకు విరుల చీరఁ దాల్చువేళఁ
బండువెన్నెల తేఁడు కొండపై జలజల
మని పాఱునదిఁ దాన మాడువేళఁ

గల మనోహరాకృతు లెల్లఁ గాంచి, నీవు
చొక్కి మ్రొక్కి నిక్కిం గాంచి "యొక్కనాఁడు
మమ్ము మోసవుత్తు" వటంచు నీదికి నవ్వు
డపుడు దోఁచు; నయ్యది విజ మయ్యె నేఁడు.

ఇది ముసలమ్మ ప్రాణేశ్వరుఁడు పలికిన పద్యము. పంచభూతముల సౌందర్యమును జూచి భక్తి భావముతోఁ బరవశించి ముసలమ్మ మ్రొక్కి లర్పించును. పాంచభౌతిక

ధరించిన యామె యిట్టి చేష్టలు చేయుట వింతగాదు. ఆమె ముందు చభూతములలో నొకటి యగు జలమునకు బలియగుట యాశ్చర్యముగాదు వాదినుండి యంతముదాక శ్రీ రామలింగారెడ్డి ముసలమ్మ యందలి లీలగా వ్యజింవజేసెను.

ముసలమ్మ మరణము" ను గూర్చి "న వీ న" సాహిత్య మీమాంసకులు విచారరమణీయము లయిన వ్రాతలు వ్రాసిరి. ఈ కావ్యతత్త్వమును మహనీయులు శ్రీ రామలింగారెడ్డి భవిష్యత్కవితా మార్గముల జాడ పోయెనని యేమేమో వాక్రుచ్చిరి. ఆయన సంప్రదాయ కవితాభిమాని రిహారములేని పాపముగా వర్ణించిరి. వారి ఈ వ్రాతలను దెలుగువారు పట్టించుకొనక మంచిపని చేసిరి. ఆదికవుల వాక్యములలో నసంతర గ్రహింపదగిన కవితా పద్ధతులు సూక్ష్మముగా నుండుట సర్వసాహిత్య సాక్షాత్కరించు లక్షణమే. ఈ లక్షణమును బట్టియే కదా నవీన విమర్శ ఎదఱు అనేక కారణములను బట్టి గోరంతలు కొండతలు చేయుచు దమ న కవులను ధృవతారలుగనో శుక్రతారలుగనో చూపినది. యువకవి యగు లింగారెడ్డిని అతిశయోక్తి తో అకాశమున కెత్తవలసిన పనిలేదు. వక్క వట్టి పాతాళమునకు బడదొక్కవలసిన యక్కఅలేదు.

"ముసలమ్మ మరణము" ప్రాచీన నవీన కవితా సంప్రదాయ సంగమ . శ్రీ రామలింగారెడ్డి నవీన పద్యసాహిత్యమున లఘుకథా కావ్యరచనకు నుబట్టి, గుణమునుబట్టి యాదికవి.

B CF

B C

NRRBO1B178

	మవసు ఫౌండేషన్ **పుస్తకాల పరిశీలనాపట్టిక**

పుస్తకం సంఖ్య	NRRB01B178
పుస్తకం పేరు	చుట్టుకట్టిమంచి
తారీఖు	8-10-24
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	233
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	7,50A,224
లేవి పేజీలు	No
తయారు చేసినవది	Habeeba
పేజీలు విడదీసినవది	Aswini
స్కాన్ చేసినవది	Aswini
పరీక్ష చేసినవది	SANDHYA
పేజీలు సరిచూసినవది	
బైండింగు చేసినవది	
ప్యాకింగు చేసినవది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	
పరిస్థితి	Good